# సాయంకాలమైంది

నవల

- గొల్లపూడి మారుతీరావు



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 229

కౌముది మాసపత్రికలో

ఏప్రిల్ 2019 సంచిక నుంచి డిసెంబర్ 2020 సంచిక వరకూ

వచ్చిన నవల

"సాయంకాలమైంది" నవల మొదటి నుంచీ మంచి పుణ్యం చేసుకుంది. ఆంధ్రప్రభలో సీరియల్‌గా వస్తున్నప్పటి నుంచీ వందల్లో అభిమానుల్ని, చాలామంది భక్తుల్నీ పోగుచేసుకుంది. ఈ పదేళ్ళలో ఓ వందమందైనా ఈ నవల గురించి ప్రస్తావించినప్పుడు విశ్వనాథ సత్యనారాయణగారి "వేయిపడగల" ప్రసక్తి, పోలిక తెస్తూ వచ్చారు. అందరికీ చెప్పే అవకాశంలేదు కనుక - యిక్కడ చేతులు కట్టుకు చెప్పే నిజం ఒకటుంది. నేను "వేయిపడగలు" అప్పటికీ, యిప్పటికీ చదవలేదు. అయితే అంతటి మహారచయిత రచనను నా నవల గుర్తు చేయగలిగినందుకే నాకు ఎంతో ఆనందం. కాస్తపాటి గర్వం.

శ్రీ వైష్ణవ సత్సంప్రదాయ వైభవాన్ని సవివరంగా నాకు తెలియచెప్పిన పూజ్యులు శ్రీ శ్రీ భాష్యం అప్పలాచార్యుల వారికీ, శ్రీ పోతులూరి గోపాలకృష్ణమాచార్యుల వారికీ నా ధన్యవాదాలు. ఆంధ్రప్రభలో ఈ నవల రాయడానికి కారకులు మిత్రులు, అప్పటి వారపత్రిక సంపాదకులు వల్లూరి రాఘవరావుగారు. మొదటి అధ్యాయం స్వయంగా చదివి ఆయన చేతిలో పెట్టినప్పుడు పులకించి పాదాభివందనం చేసి అందుకున్నారు. వారి సంస్కారమది.

సరే! మాజీ ప్రధాని పి.వి.నరసింహారావుగారి దగ్గర్నుంచి ఎందరో సాహితీపరులు, పాఠకులు ఈ నవలకు అభిమానులయ్యారు. చాలా మంది భక్తులయ్యారు. చదివి భోరున కన్నీరు కార్చి నాతో గంటలకొద్దీ మాట్లాడిన మహిళలున్నారు. 2001లో ఈ నవల ప్రచురితమయింది. సరిగ్గా ఏడు సంవత్సరాల తర్వాత గుంటూరు నుంచి రవికృష్ణ అనే ఓ తెలుగు పండితులు నవల చదివి, ఆనందించి - సవివరంగా ఇందులో కనిపించిన లొసుగుల్ని ఎత్తిచూపుతూ ఎనిమిది పేజీల ఉత్తరం రాశారు. "నా అజ్ఞానం కొద్దీ నెరుసులు అనుకుంటున్నానేమో నేను పానకంలో పుడకలు అనుకుంటున్న వాటిని బాల్య చాపల్యం కొద్దీ మీ దృష్టికి తీసుకువస్తున్నాను" అని సవినయంగా రాశారు. ఈ ఒక్క ఉత్తరాన్నే యిలా ముందుమాటలో ఉటంకించదలిచాను.

వాటిలో అన్నీ లేదా చాలా అంశాలు సహేతుకంగా, సబబుగా వున్నాయి. రెండో ప్రచురణ సందర్భంలో ఆయనకి ఫోన్ చేసి, ఆ సవరణలను మరొక్కసారి తెలియజేయమన్నాను. తెలియజేశారు. వారికి కృతజ్ఞతలు.

కొన్ని రచనలకు పుట్టిన వేళా విశేషముంటుందేమో. బెర్నార్డ్ షా తన రచనలన్నింటిలో "సెంట్ జోన్"ని ఎక్కడో ఎంపిక చేసి చూపిన గుర్తు. కాలచక్రం ఒరిపిడిలో ముందు తరాలకు నా రచనల్లో ఈ "సాయంకాలమైంది" నవల, "కళ్ళు" నాటిక, "రాగరాగిణి" నాటకం, "జుజుమురా" కథ, "కళ్యాణి" రేడియో నాటిక - యిలా నిలవగలిగితే అది నాకు దక్కిన అదృష్టమేననుకుంటాను.

- గొల్లపూడి మారుతీరావు

మీరు సృష్టించినపాత్రలన్నీ సజీవంగానూ, ఔచిత్యపూరితంగానూ వున్నాయి. కానీ ఎవ్వరూ ఊహించలేనిదీ, ఆపేక్షించలేనిదీ, వాస్తవంలో ముఖ్య కథలో అంత ప్రాసంగికం కానిదీ, అసాధారణ కౌశలం గల రచయిత మాత్రమే నిర్మించగలిగింది ఒక పాత్ర ఈ నవలలో కొద్ది పుటలలోనే మెరుపుతీగలాగా వచ్చి మాయమయింది. వాస్తవంలో భారతీయ పరిపక్వ మనస్తర్వానికీ, సమాజ జ్ఞానానికీ, ప్రాతినిధ్యం వహించే పాత్ర. అది బత్తిన రేచకుడి పాత్ర - ఈ ఒక్క పాత్రలోని ఉత్తమ శిల్పం కొరకైనా ఈ నవల చదువదగింది.

- పి.వి. నరసింహారావు, మాజీ భారత ప్రధాని

*విప్లవం అంటే - గతంలో ఆయుధాలతో అడవుల్లో తిరిగేవారు చేసే పని - అని ఒక అభిప్రాయం ఉండేది నాకు. మీరు మీమీ ఆయుధాలతో సమాజాన్ని కొత్తగానయినా చక్కటి బాటలో నడిపిస్తున్నారు. అందుకు గురువుగారైన మీకు - మీ అనుమతి లేకుండానే - మీ శిష్యుడిగా ప్రకటించుకుంటున్నాను.*

*జె. శ్రీనివాసరెడ్డి అనే మొద్దు శీను, ఖైదీ నంబరు 405, మహానది బ్లాక్, చర్లపల్లి*

# (ప్రారంభం)

**ఆ రోజు పద్మనాభం** ఊరు ఊరంతా ఆ ఇంటిముందే ఉంది. పెన్మత్స వీర నరసింహ రాజుగారు తెల్లారకుండానే గోస్తనీ నదిలో పాలేళ్ళచేత కుంకుళ్ళతో తలస్నానం చేయించుకుని ఆ ఇంటిముందు కుర్చీ వేయించుకుని కూర్చున్నారు. అయ్యవారి మీద ఎండ పడకుండా సాతాని గురయ్య గొడుగు పట్టుకు నిలబడ్డాడు.

సుభద్రాచార్యులుగారు పోయారని తెలిసి విశాఖపట్నం నుంచి నవనీతం కారులో వచ్చింది. అందరికంటే దూరంలో బాడుగ చెట్టునీడలో నిలుచుంది. డ్రైవరు కుర్చీ తెచ్చి వేస్తానన్నాడు. ఆ ఊళ్ళో ఎవరి ముందూ నవనీతం ఎప్పుడూ కూర్చుని ఎరగదు. వద్దంది.

సపిండీకరణం నిన్ననే జరిగింది. 36 గంటల కిందటే సుభద్రాచార్యులుగారి ఏకైక పుత్రుడు చినతిరుమలాచార్యులవారు సంక్షిప్తంగా అమెరికా భాషలో మిస్టర్ చిన్‌గారు డెట్రాయిట్ నుంచి వచ్చారు. దాదాపు నాలుగున్నర దశాబ్దాల తర్వాత చిన్నగారు పంచెకట్టారు. నిజానికి ఊళ్ళో పురోహితుడు కట్టించాడు ఏనాడో తీసేసిన యజ్ఞోపవీతాన్ని వేయించి, కర్మకాండనంతా జరిపించారు. సపిండీకరణం చేయించారు.

ఇవాళ తిరువధ్యయనం.

ఊరు ఊరంతా ఇంటిముందే ఉంది. కానీ పురోహితుడు అనంతాచార్యులు, భోక్తలు వినా పిట్ట మనిషి కూడా గుమ్మం దాటి లోనికి అడుగుపెట్టలేదు. చాలా సంవత్సరాలుగా ఆ ఇల్లు మూతపడివుంది. సుభద్రాచార్యులుగారు తీసుకు తీసుకు పోయాక, పద్మనాభంలో గోస్తనీ నదీ తీరంలో ఆయన అంత్యక్రియలు జరగాలన్న ఆయన ఆఖరి కోరికని మన్నించి మళ్ళీ ఆ ఇంటి తలుపులు తెరిపించారు నరసింహరాజుగారు. చిన్నగారికి అమెరికా కబురు వెళ్ళింది. ఆయన వచ్చేదాకా విశాఖపట్నం ఆసుపత్రిలో మార్చురీలో ఉంది ఆచార్యులగారి దేహం. అలా రెండు రోజులదాకా తన అంత్యక్రియలు ఆలస్యమవుతాయని ఆచార్యులుగారు జీవితంలో ఊహించి ఉండరు. హంస లేచిపోయాక సూర్యోదయంలోగా ఈ కట్టె పంచభూతాల్లో కలిసిపోవాలి. అయితే ఆచార్యులగారి జీవితం చాలా విపర్యయాలను చూసింది. ఇక ఏదీ ఆ మనస్సుని నిర్వీర్యం చెయ్యదనుకునే సమయుందాకా ఆ పంజరంలో పక్షి గిలగిలలాడింది. నిజానికి చివరి క్షణాలు ఆయనకు తెలీదు.

ఆ చుట్టుపక్కల గ్రామాలకు కూడా ఆచార్యులుగారికి తెలుసును. పాంచరాత్ర సంప్రదయానికి వారి జీవితం ఎంత అఖండమయిన అద్దాన్ని పట్టిందో తరాలుగా విన్నారు ఆ చుట్టుపక్కల ప్రజలు. వారిని బాగా తెలిసినవారు ఇంత ఆలస్యంగా ముక్తిని ప్రసాదించావా భగవంతుడా అని మనస్సులో పెరుమాళ్ళుకి కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

ద్వాదశోర్ధ్వపుండ్రాలు పెట్టుకుని కేశవదమర్ ప్రబంధంలో శ్లోకాలను ఉచ్చరిస్తూ గోస్తనీ నదీ తీరంలో స్నానం చేసి తడిబట్టల్తో నడిచి వచ్చే సుభద్రాచార్యులుగారి దర్శనంతో ఆ ఊళ్ళో చాలా మందికి తెల్లవారేది. ద్వయమంత్రం మననం చేసుకుంటూ ఆచార్యులవారు నడిచినంతమేరా ఆ వూరు పవిత్రమయినట్టు భావించేవారు.

చిరుచీకటిలో పవిత్రంగా ఆ పల్లెని తట్టిలేపేవారు ఆచార్యులుగారు. భగవత్సన్నిధిలో శరణాగతిని చేసిన ప్రవృత్తి నిష్ఠులాయన. పద్మనాభానికి ఆ రోజుల్లో ఆచార్యులగారి వల్ల పేరు.

బయట జనం మనస్సులో ఆనాటి జ్ఞాపకాలు సుడులు తిరుగుతున్నాయి. నిష్కారణంగా అక్కడెవ్వరికీ ఆ ఇంట్లో అడుగుపెట్టే అర్హత లేకపోవచ్చు. రెండున్నర దశాబ్దాలు పైగా విదేశాల్లో వుండి వచ్చిన కొడుక్కి మాత్రం ఆ అర్హత ఎలా వచ్చింది? ఆ ప్రశ్న ఎవరూ వేసుకోలేదు. కొడుకు పితృరుణం తీర్చుకోవాలి. తండ్రికి అది యోగం. కొడుక్కి అది హక్కు. ఆ కర్మ ప్రస్తుతం జరుగుతోంది. ఆ మాటకి వస్తే ఆచార్యులవారి జీవితంలో ఎని విడ్డూరాలున్నాయి?

మరొక వ్యక్తి రెండు రోజులుగా పొద్దుటే వచ్చి సాయంకాలందాకా ఇంటి బయటే వుండి చీకటిపడ్డాక వెళ్ళిపోతోంది. ఆ వ్యక్తి ఆండాళ్ళు. ఆ పిల్ల 45 ఏళ్ళ క్రితం ఆచార్యులవారి గుండెలమీద తులసిమాల, నళినాక్షమాలలతో ఆటలాడుకోవడం అందరికీ తెలుసు. ఆ ఇంట్లో ఆ అమ్మ పసితనమంతా పరిచివుంది. చిన్నతనంలోనే తల్లి వరదమ్మ తిరుమడి పెట్టె తెరిచి ఆచార్యులగారి తిరువారాధన పూర్తయ్యేలోగా తిలకం దిద్దేది ఆండాళ్ళుకి. అమ్మని చూసి ఆ వయస్సులోనే గోచీ తిప్పి చీర కట్టుకుని ఆరిందాలాగా వంటగదిలో తిరిగేది. పచ్చిపుల్లల పొగ కళ్ళుమండి నీళ్ళు తిరిగినా అమ్మ చేతిలో తయారయ్యే వేడివేడి పొంగళ్ ధనుర్మాసమంతా ఆమె బెల్ళించి బెల్ళించి తినేది. నాన్న తనవంతు కైంకర్యం కూడా ఆమె తామరాకులో రాల్చిపోయేవారు చూసీ చూడనట్టు.

"పెరుమాళ్ళుకి ఇవాళ ఏం కైంకర్యం చెయ్యమన్నారు?" అనేది వరదమ్మ. రోజూ తినే భోజనం కూడా పెరుమాళ్ళుకి కైంకర్యమే. 'కరి అముదు' అంటారు.

చిన్నతనం ఆండాళ్ళు కళ్ళముందు తెరలు తెరలుగా దిగుతోంది. ఒక్కసారి ఇల్లంతా కలియతిరగాలని మనస్సు ఆరాటపడింది. కానీ బ్రతికున్న రోజుల్లోనే ఆచార్యులవారు ఆండాళ్ళుకి అనుమతి ఇవ్వలేదు. తండ్రిపోయినా ఆయన ఆత్మని నొప్పించడం ఆండాళ్ళుకి ఇష్టంలేదు.

ఆచార్యులుగారు పోయారని తెలిసినప్పటినుంచీ భార్య కళ్ళు పత్తిగింజలయిపోవడం కనిపెట్టాడు కూర్మయ్య. ఆ పరిస్థితుల్లో ఆమెకు తానేమీ సహాయం చెయ్యలేకపోయినందుకు విలవిలలాడిపోయాడు. ఇన్ని సంవత్సరాల సాహచర్యంలో మొదటిసారిగా ఆమెకి అన్యాయం చేసినట్టు అనిపించింది. మర్నాడు ఉదయమే తిరుమల అమెరికానుంచి దిగుతున్నాడని విన్నాడు. ఉదయమే కారు గుమ్మం ముందు ఉంచి పెళ్ళాన్ని కారెక్కమన్నాడు.

ఎక్కడికంది.

"మీ అన్నయ్య అమెరికా నుంచి వస్తున్నాడు. రేపు ఆచార్యులగారికి కర్మ జరిపిస్తారట."

"మనం వెళ్ళి ఏం ప్రయోజనం? నలుగురూ తిట్టుకోడానికి కాకపోతే" అంది ఆండాళ్ళు.

"నువ్వు వెళ్ళాల్సింది నలుగురికోసం కాదు నీ కోసం. ఆచార్యులుగారు లేని ఊరుని నేను చూస్తాను. ఆచార్యులుగారు లేని ఇంటిని బయటినుంచే నువ్వు చూసి.."

భోరుమంది.

తన మానాన తనని వదిలేస్తే ఆ బచ్చెనబొమ్మ ఏ యోగ్యుడి భార్య అయ్యేదో? మొదటిసారిగా భార్య గురించి కూర్మయ్యకి కళ్ళనీళ్ళు తిరిగాయి. కారు కదిలింది.

ఊరిలో ఆండాళ్ళుకున్నన్ని జ్ఞాపకాలు తనకీ ఉన్నాయి. గోస్తనీ నది పక్క సరుగుడుతోపు పక్క పాకముందు మట్టితొక్కి నాన్న కుండలు చేసేవాడు. నాన్న చేతిలో ఎంత అందంగా శ్రీకృష్ణుడు రూపుదిద్దుకునేవాడో. జన్మతః శ్రీకృష్ణుడు అంటరానివాడు. గుడిలో కెళ్ళాక తాను అంటరానంత దూరమయిపోయేవాడు. కూర్మయ్యకి ఆ పసితనంలో ఇవన్నీ తెలీవు. తన చెయ్యిదాటాక మట్టిబొమ్మ దేవుడయిపోతాడు అని తండ్రి చెప్పడం గుర్తుంది.

కారు వీధిమొగలోనే ఆపాడు. "ఏ పరిస్థితిలోనూ ఇంట్లో అడుగుపెట్టకు. ఈ సమయంలో ఊరందరి మనస్సులూ ఆచార్యులగారి పవిత్రత గురించే ఆలోచిస్తూంటాయి. నువ్వు తప్పటడుగు వేస్తే వాళ్ళ మనస్సుల్లో గాయం రేగుతుంది."

ఇంత కష్టంలోనూ వెయ్యోసారి అంత సంస్కారిని పెళ్ళి చేసుకున్నందుకు ఆర్ద్రమైన ఆ మనస్సులో ఏదో మూల చిన్న తృప్తి అలలాగా కదిలింది. కారు దిగింది.

ఊళ్ళో ఆండాళ్ళు ఎవరికి తెలీదు? ఆమెని చూసి ఆచార్యులవారి ప్రారబ్దానికి జాలిపడిన వాళ్ళూ ఉన్నారు. ఆమె ప్రవర్తనని తెగిడినవాళ్ళూ ఉన్నారు. కానీ ఆమెకి ఒక్కటి తెలుసు. ఎవరు ఏమనుకున్నా, తనని అర్ధం చేసుకున్న వ్యక్తి ఒకరున్నారని. తన అన్న తిరుమల. అయితే ఏం లాభం? తను ఇక్కడ ఉండి తండ్రికి ఏమీ చెయ్యలేకపోయింది. అన్నీ చెయ్యగలిగీ దేశంలో లేక అన్న ఏమీ ఉపయోగపడలేకపోయాడు. ఇద్దరు అసమర్థుల మధ్య ఆ జీవితం పెనుగులాడి ఇన్నాళ్ళకి సెలవు తీసుకుంది.

చెల్లలంటే తగని ప్రేమ తిరుమలకి. "అమ్మా" అని ముందుకి రాబోయాడు చెల్లెల్ని వీధిలో చూసి. అనంతాచార్యులు ఆపారు. వాళ్ళ ప్రపంచంలో అభిమానానికీ, ఆచారానికీ చుక్కెదురు. ఆ విషయం ఆండాళ్ళకీ తెలుసు. తిరుమలకి కొత్త.

"వాట్ నాన్సెన్స్? కమిన్" అన్నాడు చెల్లెల్ని.

"ఆ మాట పాతికేళ్ళ కిందట నాన్న అనాల్సింది అన్నయ్యా! నీకా హక్కులేదు. అన్నా, వచ్చే అదృష్టం నాకు లేదు. వచ్చినా ఆ తృప్తీ లేదు" అంది ఆండాళ్ళు.

"కూర్మయ్య ఎక్కడ?"

"నలుగురూ బాధపడతారని చీకటి ఉండగానే నన్నిక్కడ వదిలి వెళ్ళిపోయాడు. నిన్ను విశాఖ ఎయిర్‌పోర్టులో కలుస్తానన్నాడు" అంది.

"నాన్న చివరి రోజుల్లో" అడగబోయి దుఃఖపు తెర తీసుకొచ్చి ఆగిపోయాడు.

"అమెరికాలో ఉండి నీకెంత తెలుసో, నాకూ అంతే తెలుసు. నీకూ, నాన్నకీ దూరం నీ వృత్తి. నాకూ, నాన్నకీ దూరం నా పెళ్ళి.

చాలా సంవత్సరాల తర్వాత తనకి కన్నీళ్ళు వచ్చినందుకు ఆశ్చర్యపోయాడు తిరుమల. కన్నీళ్ళు బలహీనతకు నిదర్శనమనే ప్రపంచంలో నాలుగు దశాబ్దాలు గడిపాడతను. కన్నీళ్ళు ఆర్ద్రతకీ, అభిమానానికీ, క్షమాఫణకీ, పశ్చాత్తాపానికి, ప్రేమకీ, ఆవేశానికీ అన్నిటికీ నిదర్శనమనే సంస్కృతిని చాలా చిన్నతనంలో నష్టపోయిన దురదృష్టవంతుడతను. వాటిలో ఏ ఒక్కటి కారణమైనా పెల్లుబికే సంస్కృతిలో తలమునకలయిన ఇల్లాలు ఆండాళ్ళు. ఇవాళ ఆమె కళ్ళు ఆమె చెప్పిన మాట వినడంలేదు.

జరుగుతున్న తతంగం ఏమిటో తిరుమలకి అంతుబట్టడంలేదు. సవ్యం, అపసవ్యం, అనుమతే మన్యస్వాహా, లౌకికాగ్ని ఇవన్నీ బొత్తిగా అర్ధంలేని మాటల్లాగా తోచాయి. తండ్రి పోయాడని డెట్రాయిట్‌లో అతి ముఖ్యమైన కాన్ఫరెన్స్‌లో ఉండగా సెక్రటరీ రీగియాటోరేస్ చెప్పింది. ఇంకా సెంటిమెంట్‌కి దూరం కాని 22 ఏళ్ళ నల్లపిల్ల. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి కానీ తిరుమలకి ఏడుపు

రాలేదు. కళ్ళనీళ్ళు పెట్టుకోవలసినంత బాంధవ్యం కాలం మరుగున పడిపోయింది. ఒక్కసారి గతుక్కుమన్నాడు. గతంతో ఉన్న ఆఖరి లంకె ఆ క్షణంలో తెగిపోయినట్టనిపించింది. ఎందుకనో మనస్సు తేలికపడింది. తండ్రిమీద జాలేసింది కాన్ఫరెన్స్ ఆగడానికి వీలులేదు. మరో క్షణంలో ఆ ఆలోచన ఆగిపోయింది కనీసం ఆ సమయానికి.

వెంటనే కర్మకాండ జరిపించడానికి రావాలని ఫోన్. నరసింహరాజుగారెవరో గుర్తులేదు. కర్మకాండ ఏమిటో తెలీదు. తనే ఎందుకు చెయ్యాలి? ఆ విషయం చెప్పినప్పుడు జనరల్ ఎలక్ట్రిక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు జేమ్స్ ఓబ్రియన్ అన్నాడు. నవ్వొచ్చింది. భారతదేశం అందునా వైష్ణవ సంప్రదాయాన్ని గురించి ఓబ్రియన్‌కి ఎంత తెలుసో తనకి అంతే తెలుసు. కానీ వెళ్ళాలి. తప్పదు. బాధకన్నా బాధ్యత అటు మొగ్గింది. "నీకు కరెక్టుగా రెండురోజులు టైము. వైజాగు నుంచి మద్రాసు వచ్చి, సింగపూర్ మీదుగా క్యోటో చేరాలి. అగ్రిమెంటు మీద సంతకాల అవసరం ఎంతో నీకు నేను చెప్పనక్కరలేదు. మరో ఆరునెలల్లో నువ్వే నా కుర్చీలో కూర్చోబోతున్నావు" అన్నాడు ఓబ్రియన్.

తలూపి విమానం ఎక్కాడు తిరుమల.

డెట్రాయిట్ నుంచి అర్ధరాత్రి నాలుగుసార్లు ఓబ్రియన్ ఫోన్ చేశాడని విశాఖపట్నంనుంచి కారేసుకువచ్చి మరీ చెప్పాడు శోభనాద్రిరావు. మరో రెండు గంటల్లో విశాఖనుంచి విమానం బయలుదేరుతుంది. వారానికి రెండురోజులే సర్వీసు. ఆ విమానం వెళ్ళిపోతే? ఆలోచించడానికే భయమేసింది తిరుమలకి.

ఒంటిమీద తడిపంచె వణికిస్తోంది. అలవాటులేని ఉత్తరీయం మాటిమాటికీ జారిపోతోంది.

వ్యవహారం త్వరగా ముగించమని చెపితే బాధపడతారేమో? గోడకి తన చిన్నతనంలో ఎవరో తీసిన సెపియా గ్రూపు ఫోటో మరీ ఎర్రగా మాసిపోయి ఉంది. కానీ సుభద్రచార్యులు, వరదమ్మగారి పవిత్రత అన్ని సంవత్సరాలయినా ఫోటోలోంచి అగ్నిహోత్రంలా మెరుస్తోంది.

అంతటి మహానుభావుడికి ఈ కర్మ జరపడానికి తనకి అర్హత ఏమిటి? కేవలం ఆయన కడుపున పుట్టడం వలనా! అదెంత గొప్ప అదృష్టమో మరిచిపోయి చాలా సంవత్సరాలయింది. వీధిలో బెంజికారుని ఆనుకుని డ్రైవరు దిక్కులు చూస్తున్నాడు. శోభనాద్రిరావు కాలుకాలిన పిల్లిలాగా రోడ్డుమీద పచార్లు చేస్తున్నారు.

భోక్తల భోజనాలు ముగిశాయి. మళ్ళీ ఆపోశన పట్టమన్నాడు అనంతాచార్యులు. చిన్న అరటి ఆకుమీద అపసవ్యం చేసుకుని వాయసపిండం పెట్టించాడు. పరిశౌచన చేసి భోక్తలు లేచారు.

ఇంకెంతసేపు?

"ఈ వాయుపిండాన్ని మీ నాన్నగారు భోజనం చేశాక, తమరా ప్రసాదం తిని తిలోదకాలు.."

"మా నాన్నగారా?"

"వాయస రూపంలో... అంటే కాకి రూపంలో"

తిరుమలకి విసుగేసింది. పరమ నిష్ఠాగరిష్టులయిన సుభద్రాచార్యులుగారు కాకి రూపంలో ఏమిటీ నాన్సెన్స్?

పెరట్లో కుంకుడు చెట్టుకింద వాయసపిండాన్ని ఉంచారు. ఇంకా 50 నిముషాలు.

అంతా నిశ్శబ్దంగా నిలబడ్డారు. ఏరీ సుభద్రాచార్యులవారు?

పోయిన వ్యక్తి మనస్సులో ఏ బాధ, ఏ అసంతృప్తి మిగిలినా కాకి వాయసపిండాన్ని ముట్టుకోదు. జీవుని ఆత్మ ప్రశాంతంగా పోవాలి. పోయిందని మిగతా ప్రాణుల తృప్తికి ఇది సంకేతమా? కొన్ని సంప్రదాయాల్ని మాటల్లోకి తర్జుమా చేస్తే చాలా విపరీతంగా కనిపిస్తాయి.

"అయ్యా! తమ సుపుత్రుడు సముద్రాలు దాటి వచ్చి తమకి అపరకర్మను జరిపించాడు. తప్పులుంటే మన్నించండి. వారు మళ్ళీ దూరప్రాంతాలకి వెళ్ళాలి. వారినను గ్రహించండి" అని ఆకాశాన్ని చూస్తున్నాడు అనంతాచార్యులు.

నిముషాలు గడుస్తున్నాయి. వాతావరణమంతా నిశ్శబ్దమైపోయింది. అందరి కళ్ళల్లో ఆత్రం. సదాచారాన్ని నమ్మనివాళ్ళు కూడా ఊపిరి బిగపట్టి చూస్తున్నారు.

సుభద్రాచార్యులుగారెక్కడ?

"ఎలా వుంటుంది వారికి మనశ్శాంతి? బ్రతికుండగా ఆయన ఏ ఆనందాన్ని చవిచూశారు గనుక?"

వాయసపిండాన్ని కాకిముట్టుకోక, వేళమించిపోయి, తిరుమలకి విమానం తప్పిపోతే?

"నాయనగారికి దండం పెట్టుకోండి బాబూ తెలియని అపరాధాలు ఏమైనా చేస్తే క్షమించమని లెంపలు వేసుకోండి. వారికి మీ ఆర్తిని చెప్పుకోడానికి ఇది ఆఖరి అవకాశం." అన్నాడు భోక్త.

ఎందుకో తెలియదు. తిరుమలకి చివ్వున కళ్ళనీళ్ళు తిరిగాయి. తండ్రి పోయిన వార్తవిన్న తర్వాత ఇప్పటికి భోరుమన్నాడు అనంతాచార్యుల భుజం మీద తల ఆనించి.

అందరూ ఒక్క క్షణం నివ్వెరపోయారు. అందరి కళ్ళల్లోనూ నీళ్ళు తిరిగాయి.

ఆకాశంవైపు దీనంగా చూసి, రెండు చేతులూ ఎత్తి "నాన్నా!" అన్నాడు తిరుమల. మాట గుండెల్లోనుంచే వచ్చింది. అంతకు మించి ఏం అనాలో, ఏం చెప్పాలో తెలీలేదు.

అయినా ఆకాశం నిర్లిప్తంగా ఉంది. పక్షి జాడలేదు. ఊరంతా నివ్వెరపోయింది. పోయాకయినా తండ్రి బిడ్డని క్షమించడా? ఎంత విపరీతం?

అక్కడికి దూరంగా వీరనరసింహరాజుగారికి ఛత్రం పడుతున్న సాతాని గురయ్య కదిలాడు.

పెరటి గోడ ఏనాడో కూలిపోయింది. గోడంచు దగ్గరికి వచ్చి ఎవరికీ కనిపించకుండా నిలబడ్డాడు.

ఆచార్యులుగారిని చివరంటా సాకినవాడు. అయినవాళ్ళు వచ్చేవరకూ ఆయన శవానికి సేవలు చేసినవాడు. ఇన్నేళ్ళ తర్వాత ఆచార్యులుగారు పోయాక ఎం చెయ్యాలో తెలీనివాడు. ఆచార్యులుగారు పోయినప్పట్నుంచీ రహస్యంగా ఏడుస్తున్నవాడు.

రెండు చేతులూ జోడించి ఆకాశంవైపు చూస్తూ "సామీ! పెద్దయ్య పెద్దమనసు సేసుకుని తమకింత సేశాడు. ఆరి పనిమీద పైదేశాలెల్లిపోవాల. మనసులో తేడాలున్నా మరిసిపోయి తమరు ఆరిని సల్లగా దీవించాల. అలిగితే ఎలా బాబూ? తొరగా వచ్చి ఆ అన్నం పిడచ తీసుకెల్లండి, సామీ ఈ బుద్దిలేనోడి మాట యినుకోండి సామీ" అని భక్తిగా మొక్కుకున్నాడు.

ఎక్కడనుంచి వచ్చిందో అందరూ నిశ్చేష్టులయి చూస్తుండగా ఓ కాకి వాయసపిండాన్ని ఆప్యాయంగా ఊరించి ఊరించి తిని ఎగిరిపోయింది.

అందరి ముఖాలూ తృప్తితో వెలిగాయి.

పెద్దాయన కరుణించారు.

ఆచార్లుగారు అమృతమూర్తి.

"తండ్రి దీవెన నీకు లభించిందయ్యా! ధన్యుడివి" అన్నారు అనంతాచార్యులు.

పెరటి గోడవెనుక సాతాని గురయ్య కళ్ళనీళ్ళతో ఆచార్లుగారికి దండాలెట్టుకున్నాడు. మరో పది పదిహేను నిమిషాల్లో బెంజికారు విశాఖపట్నంవైపు దూసుకుపోయింది.

*2*

**సుభద్రాచార్యులవారి** తండ్రిగారు పెద్ద తిరుమలాచార్యులవారిది తెనాలికి ఆరు కిలోమీటర్ల దూరంలో సర్పవరం అగ్రహారం. ఆ కుటుంబం తరతరాలుగా భావనారాయణస్వామికి సేవలు చేస్తూ తరించింది.

భావమాత్రం చేత ప్రత్యక్షమయిన నారాయుణుడి ఆలయం అది. మూలవిరాట్టు స్వయంభువు అని చెప్తారు. సర్పాలలో శ్రేష్ఠుడైన ఆదిశేషుడు నారాయుణుడి కోసం తపస్సు చేస్తే తరింపజేసిన క్షేత్రమని స్కాందపురాణంలో కథ. వారి పూర్వులంతా వైష్ణవ సంప్రదాయాన్ని ధర్మ, జ్యోతిష్య, శాస్త్రాలని కాచి వడబోసిన నిష్ణాతులు. ఏనాడూ వూరు కాదు కదా, దాదాపు పేట విడిచి బయటికి వచ్చినవారుకాదు. పెద తిరుమలాచార్యులవారి తండ్రిగారు కుంతీనాథాచార్యులవారి గురించి ఓ కథ ప్రసిద్ధిలో ఉన్నదా కుటుంబంలో. చతుర్మాసదీక్షను పూని ఒకే ఒక్కసారి ఊరిపొలిమేరలకు వచ్చారట. అప్పుడు వారు ఏనుగుని చూడటం తటస్థించింది. ఆయన గ్రంథాల్లోనే ఏనుగు గురించి చదువుకున్నారు. గజేంద్రమోక్షం పుక్కిట పట్టినవారు. అయినా ఇంటికి వచ్చి "ఈ రోజు ఒక విచిత్రమయిన గేదెను చూశాను. వెనుక ఒక తోక, ముందొక తోక" అన్నారట. అది విన్నవారంతా పగలబడి నవ్వుకున్నారు. రెండు తరాలపాటు ఆ కథ రచ్చబండ దగ్గర అందరినీ కితకితలు పెట్టేది. కుంతీనాథాచార్యులుగారు మహా పండితులు. 'సాహిత్యకల్పలతిక' అనే ఉద్గ్రంథాన్ని వ్రాశారు. అయితే అది మరొక ప్రపంచం.

కుంతీనాథాచార్యులవారికి లౌకిక జ్ఞానం ఇసుమంత తక్కువే కావచ్చు. కానీ పట్టుదలలో పరుశురాముడంతటివారు. రోజూ నాలుగు గంటలకి లేచి, విష్ణు సరోవరంలో స్నానం చేసి, తడిబట్టలతోనే తిరుమాళ్లై వల్లెవేసుకుంటూ గృహోన్ముఖులు కావడం వారి దైనందిన చర్య. అలా వస్తున్న ఒక తెల్లవారు ఝామున ఒక పంచముడు ఆయనకి ఎదురుపడ్డాడు. అంతే. ఆయన ఆపాదమస్తకం వణికిపోయారు. ఆ రోజూ, మరో నాలుగు రోజులూ మంచినీళ్ళు ముట్టలేదు. ఊరు వూరంతా అట్టుడికిపోయింది. ఆ పంచముడు తల నేలకేసి కొట్టుకుని ఏడ్చాడు. ఊరివారు బ్రతిమిలాడారు. కానీ ఆచార్యులవారు సర్దుకోలేకపోయారు. అయిదో రోజున పెద తిరుమలాచార్యులని పిలిచి ఆ ఊరు వదిలిపోవాలని సూచించారు. కాదు, శాసించారు. పెద తిరుమలాచార్యులవారు దిమ్మరపోయారు. ఊరు వదిలి ఎక్కడికి పోవాలి? సమయం దాటిపోతోంది. కుంతీనాథాచార్యులవారి నాడి చెయ్యి దాటిపోతోందని హెచ్చరించాడు ఆయుర్వేదవైద్యుడు ముడుంబై నరసింహాచార్యులు. విషయం తెలిసి హుటాహుటిన వచ్చారు పెద తిరుమలాచార్యుల మామగారు. వారిది విశాఖ సమీపాన పద్మనాభం కుంతీనాథాచార్యువారిని పద్మనాభంలో కుంతీపద్మనాభస్వామి ఆలయానికి ఆహ్వానించారు సాదరంగా. అర్చకత్వం కుంతీనాథాచార్యులకి కొత్త. అయినా ఈ ఆహ్వానం తనకి సర్పవరం నుంచి విముక్తి. వెంటనే అంగీకరించారు. కుటుంబం కట్టుబట్టలతో రెండు ఎడ్లబళ్ళమీద సామాన్లతో వూరునుంచి తరలిపోవడాన్ని వూరు వూరంతా కన్నీరు కారుస్తూ ఏటికట్టదాకా నడిచివచ్చి గమనించారు.

పెద తిరుమలాచార్యులుగారి పదమూడో యేట ఈ సంఘటన జరిగింది. అప్పటికి కుంతీనాథాచార్యులుగారికి ఏభై రెండు. పద్మనాభం వచ్చిన పదోరోజునే కుంతీనాథాచార్యులుగారి ఒక్కగానొక్క కుమార్తె పెళ్ళికాకుండానే మరణించింది. పుత్రికాశోకంతో ఆయన

మంచంపట్టి, నలభై ఐదు సంవత్సరాలు తీసుకుని, తొంభై ఏడవయేట కాలం చాలించేశారు. కుంతీ పద్మనాభస్వామి ఆలయంలో మూలవర్లు పక్కన నిలబడిన పద్నాలుగేళ్ళ పెద తిరుమలాచార్యులుగారు ఉళహాళంద పెరుమాళ్ అంటే భూమిని కొలిచిన దేవుడు. కుంతీనాథాచార్యులుగారిలో నిష్ఠ, తల్లి తరఫున సాధుత్వం, సరళత్వం కలబోసిన మూర్తి ఆయన.

ఎనిమిదో యేటనే కుంతీనాథాచార్యులవారు పుత్రుడికి పంచ సంస్కారాలు చేయించారు. శ్రీ వైష్ణవునికి జ్ఞానజన్మ నిజమైన జన్మ. తాపము, పుండ్రము, నామము, మంత్రము, యాగము - అవీ పంచసంస్కారాలు. ఆయన సద్గురువు తండ్రే నుదిటిన స్వరూపం (బొట్టుని) దీపకళికలాగా ప్రకాశిస్తుండగా తండ్రి వెనక నడిచే వటువు ఘనని ఆనుకుని ప్రవహించే జటలాగా అనిపించేది సర్వవరం ప్రజలకి. తెల్లవారు ఝామున నాలుగున్నరనించి అయిదున్నర వరకు కేవలం ఆ తల్లిదండ్రులు మాత్రమే వీధిలో మెసిలేవారు. విష్ణుసూక్తం కర్ణపుటాలకు పలచనయి దూరమయాక దొడ్లోంచి పశువుల్ని తోలుకుని రైతులు బయటకు వచ్చేవారు. ఇది ఎవరూ నిబద్ధీకరించిన శాసనం కాదు. వారు ఆచార్యులవారిపట్ల చూపే ఆదరభావం. నెలకి మూడు వర్షాలు పడి, రెండు పంటలు సంక్రమణానికి ఇళ్ళు చేరే బంగారు రోజులవి.

చెల్లెలు పోయిన ఘటన ప్రారబ్ధమని పెద తిరుమలాచార్యులవారనుకున్నా, కుంతీనాథాచార్యులు అనుకోలేకపోయారు. మనిషి నిలువునా క్రుంగిపోయారు. ఆ రోజుల్లోనే ఎడమభాగానికి స్వల్పంగా పక్షవాతం వచ్చింది. అనారోగ్యంకంటే ఆచారం సరిగా జరగడం లేదన్న బాధ ఆయనను మరింత క్రుంగదీసింది. మంచం మీద నిస్సహాయంగా ఉన్న తండ్రిని గమనిస్తూ ఆ కుటుంబంలో సదాచారానికి ఏమీ లోటు జరగడం లేదని వారికి తెలియచెప్పాలని మరింత నిష్ఠగా పెరుమాళ్ళకి తిరువారాధన సాగించేవారు పెద తిరుమలాచార్యుల వారు. ఊర్ధ్వపుండ్రాలు ధరించి, శ్రద్ధగా సుదర్శన, పాంచజన్యాలను దిద్దుకుని - తిరువడిగళ్ - గురువుగారి పాదములు అద్దిన వస్త్రాన్ని శిరస్సు మీదుంచుకుని, తీర్థతటితో రెండుమార్లు తీర్థాన్ని స్వీకరించి భగవదారాధనకి యోగ్యతను సంపాదించుకుని ఆరాధన సాగించేవారు. భగవద్గీతలో 18వ అధ్యాయంలో 66వ శ్లోకం "సర్వ ధర్మాన్ పరిత్యజ్య" వారి జీవితాన్ని నడిపే ఒరవడి. కొడుకు నిష్ఠా, భక్తి ప్రపత్తులూ గమనిస్తూ మంచం మీద కుంతీనాథాచార్యుల కనుకొలకులు వర్షాన్ని కురిసేవి. అలా ఎన్నాళ్ళు? నలభై ఐదు సంవత్సరాలు. జ్ఞానం తెలిసి, సదాచారాన్ని నెరిపిన దానికంటే అశక్తతతో, భ్రష్టతతో బ్రతుకుతున్నాననే జ్ఞానం ఎక్కువ రోజులు గడిపారు.

"స్వామీ! ఇది ఏ జన్మ పాపం?" అని దురపిల్లేవారు.

పెద తిరుమలాచార్యులవారి సతీమణి రుక్మిణమ్మ తన మామగారు నేలమీద నిలబడి వుండగా ఏనాడూ చూడలేదు. పెళ్ళిపీటలమీద గోదాదేవిలాగా మీదకి ముడివేసి, మల్లెపువ్వులు చుట్టి, గోచీపోసి పట్టుచీర కట్టుకున్న కోడల్ని చూసి పొంగిపోయారు కుంతీనాథాచార్యులవారు. నూతన వధూవరులు తనకి దండం పెట్టేనాటికి చిన్నగా మాట్లాడగలుగుతున్నారు.

"నాకు ఇవాళ చాలా ఆనందంగా ఉంది. నా కర్మని నిష్ఠగా జరపడానికి నా కొడుక్కి యోగ్యతనీ, అర్హతనీ ఇచ్చే కోడలు దొరికింది" అన్నారు.

మృత్యువుని ఆ రోజుల్లోనే ఆహ్వానించారు ఆచార్యులవారు. ఆ మాటలు విన్న కొత్తకోడలు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి కానీ, మృత్యువుకి ఆయన మరో నలభై అయిదు సంవత్సరాలు చెల్లించారు. తనకీ ఏభై సంవత్సరాలు పైబడేదాకా మామగారికి సేవలు చేసుకుంది రుక్మిణమ్మ. అత్తగారు మాత్రం (ఆవిడ పేరు వకుళ) ఆఖరి రోజు వరకు పెరుమాళ్ళముందు వెలిగించిన కర్పూరశిఖలాగా కణకణమంటూ బ్రతికారు. ఆఖరి రోజున కూడా కొడుకు కైంకర్యానికి దద్దోజనం వండి, ఎదురు గోడకి మడి కట్టుకునే జారగిలబడి, కొడుకు తీర్థం ఇచ్చే సమయానికి అలానే గోడకి ఆనుకునే తనువు చాలించారు.

పెద తిరుమలాచార్యులుగారు సహజంగా లోకాన్ని ఎరిగిన మనిషి. తండ్రి పంచముడిని చూసినంత మాత్రాన ఇంటినీ, ఊరునీ వదిలి రావడం ఆయన్ని బాధపెట్టింది. కాగా, తండ్రి తిరుమళై దివ్య ప్రబంధాన్ని చదవడమే సంప్రదాయం చేసుకున్న వ్యక్తి. ఆ ప్రబంధకర్త విప్రనారాయణుడు దేవదేవి ప్రభావంలో పడినా భగవంతుని దివ్యసన్నిధికి దూరంకానీ ఓ మహాభక్తుడి జీవితం. జీవనాన్ని గురించి ఆలోచించే తరం పెద తిరుమలాచార్యులుగారిది.

ఆయన గోస్తనీ నదిలో స్నానం చేశాక ఆలయప్రాంగణంలో సభ తీర్చి తిరుప్పళ్ళి ఎళుచ్చి చదువుతూంటే తరతమ భేదం లేకుండా, కులమత వ్యత్యాసం లేకుండా గుడిబయట వీధిలో కూడా చాలమంది కూర్చునేవారు. మొదట శర్తముర్రై, తరువాత తిరుప్పావై గానం చేసేవారు. అందరికీ రుక్మిణమ్మ పొంగల్ స్వయంగా పెట్టేది. ఆమె చేతి ప్రసాదం తినడం కోసమే బాదం ఆకుల్ని కోసుకుని వూరంతా వరస తీర్చేది. ఆ ఊళ్ళో కొందరికి ఆచార్యులవారి తిరుప్పావై వీనులవిందు చేస్తే, అమ్మగారి పొంగల్ అందరికీ విందయ్యేది.

పద్మనాభం ఊరిలో మొఖాసాదారులందరూ క్షత్రియులు. వితరణకీ, బ్రాహ్మణాదరణకీ, ఔదార్యానికీ పెట్టింది పేరు. కాగా, ఏ పరిస్థితిలో పెద తిరుమలాచార్యులవారు తమ వూరు వచ్చారో వారందరికీ తెలుసు. అదొక అదృష్టంగా భావించిన తరం ఇంకా బ్రతికే ఉంది. సర్పవరంలో జరిగిన పరాభవం ఇక్కడ జరగకుండా ముందే కట్టడి చేశారు. కుటుంబం నడవడానికి ఆలయానికి పెద్ద ఆదాయం లేదు. అందుకని మూడెకరాల శ్రేష్ఠమయిన మాగాణిని ఆచార్యులవారికి సొంతం చేశారు. అంతేకాదు, సేద్యానికి జీతగాళ్ళని పురమాయించి, పంటని ఇంటికి తోలించే ఏర్పాటు చేశారు. కొండమీద ఆలయానికి పెద తిరుమలాచార్యులవారు వెళ్ళివచ్చేవారు. కొండపాదాల దగ్గర ఉన్న ఆలయంలోనే ఆ కాసినిరోజులూ కుంతీనాథాచార్యులవారు స్వామిని సేవించారు.

ఆ రోజుల్లోనే పెన్మెత్స వీరనరసింహరాజుగారి మాతామహులు పూసపాటి ఆనందగజపతిరాజులుంగారి వైద్యం కోసమే అహోరాత్రాలు చరకసంహిత చదివి, ఆయుర్వేదాన్ని ప్రత్యేకంగా రాజుగారి చికిత్సకోసమే ఆపోశనపట్టి, వారికోసం మండల దీక్షపూని ఎక్కడెక్కడివో మూలికలు తెచ్చి, అనుపానులు చేసి రాజుగారి రాచకురుపుని నయం చేశారు. అప్పటికి వీరనరసింహరాజుగారి వయస్సు ఆరు సంవత్సరాలు. పెద తిరుమలాచార్యులుగారి సుపుత్రుడు సుభద్రాచార్యులవారి జీవితం విచిత్రంగా పెద్ద మలుపు తిరిగింది. రాజుగారి చికిత్స గురించి కథలు కథలుగా చెప్పుకున్నవారంతా పొరుగు వూళ్ళనుంచీ వైద్యానికి ఆచార్యులవారి దగ్గరకు రాసాగారు. ఇది ఆచార్యులవారికీ, తండ్రిగారికీ మధ్య పెద్ద ఘర్షణని లేవదీసింది. సంప్రదాయం కుంతీనాథాచార్యులని అందరికీ దూరం చేసి మడి కట్టించింది. వైద్యం ఆర్తులని పెద తిరుమలాచార్యుల వారికి దగ్గర చేసి అందరినీ ఏకం చేసింది. అప్పుడే తరాల అంతరం ఇద్దరిమధ్యా కనిపిస్తోంది. తన జీవితకాలంలోనే ఆలోచనల్లో మార్పులు ఆచరణలో చోటు చేసుకోవడం మంచం మీదనుంచే మౌనంగా, నిస్సహాయంగా గమనించారు కుంతీనాథాచార్యులవారు.

అయితే పక్షవాతంతో మంచం ఎక్కినప్పుడు ఇంట్లో సదాచారాన్ని తండ్రి సమక్షంలో ఎలా కాపాడారో, ఆయుర్వేదం కారణం కొడుకు చెయ్యరాని పనులు చేస్తున్నాడన్న తండ్రి మనస్తాపాన్ని పోగొట్టడానికి ఆయన సమక్షంలో తన కొడుకు సుభద్రని కడిగిన ముత్యంలాగా పెంచారు పెద తిరుమలాచార్యులుగారు. మనవడిని చూసి మరో తరానికి సంప్రదాయం సజావుగా అందినందుకు నిట్టూర్చారు కుంతీనాథాచార్యులవారు. సుభద్రాచార్యులుగారికి తాతగారి అమాయకత్వం, సారళ్యం నూటికి నూరుపాళ్ళూ అబ్బింది. కాగా, తనకి పంచ సంస్కారాలు జరిగిన నాటి జ్ఞాపకాల్ని తలచుకుని మనవడిని వటువుగా చూసి బ్రహ్మానందభరితులయిపోయారు కుంతీనాథాచార్యులవారు.

వణికే చేత్తో తనే స్వయంగా మనవడి నుదుటి మీద స్వరూపాన్ని దిద్దేవారు దగ్గర కూర్చోపెట్టుకుని. తడి కావి కుచ్చిళ్ళనుంచీ నీళ్ళు కారుతూండగా, మనవడిచేత తిరుమాళై చదివించుకునేవారు. ఆచార్యులవారి ఆఖరిరోజులు సంప్రదాయానికి 'రేపు' భద్రంగా ఉన్నదనే విశ్వాసంతో గడిచాయి.

ఇంకా ఉత్తరాయణానికి పదకొండు రోజులుందనగా, మనవడి చెవులో చెప్పేశారు తానింక శెలవు తీసుకుంటానని. సుభద్రాచార్యులు పసివాడిలాగా వలవలా ఏడ్చాడు. పెద తిరుమలాచార్యులవారు పదిమందిని పిలిపించి ద్వయమంత్రాన్ని అహోరాత్రాలు మననం చేయించారు.

మకరరాశిలో సూర్యుడు ప్రవేశించేసరికి కుంతీనాథాచార్యులవారి పడకగది 'శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే' అనే ఘోషతో పవిత్రమయిన దేవాలయం అయిపోయింది. పుష్య కృష్ణవిదియనాటి సూర్యోదయాన్ని ఆచార్యులవారు చూడలేదు. ప్రాతఃకాలానికి ఇంకా రెండు ఘడియలు వుండగానే హంస లేచిపోయింది.

## 3

'చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః' అన్న గీతకారుడి ఉవాచని నూటికి నూరుపాళ్ళూ అర్థం చేసుకున్నవారు పెద తిరుమలాచార్యులవారు. పద్మనాభం ఆ రోజుల్లో చిన్న వూరు. అంతా కలిపి నూట అరవై గడపే. నాలుగయిదు వైష్ణవ కుటుంబాలుగాక, ఎక్కువమంది క్షత్రియులు. అందరికీ తోటల్లో పెద్ద పెద్ద లోగిళ్ళు. మిగతావారంతా నాగవంశం వారు. అదొక కులం. వారంతా రైతులు. ఉదయం అయిదు దాటితే వూళ్ళో ఎవరూ కనిపించరు. ఆడా, ముసలీ తప్ప.

మూడు గంటలకి లేచి ఆలయం ఒరుసుకుపారే గోస్తనీ నదిలో స్నానం ముగించుకుని, స్వామికి నివేదన ముగిసాక 1923లో విజయనగరం ఆస్థాన దివాన్ బహదూర్ పెన్మత్స నరసింహ రాజుగారు నిర్మింపచేసిన పెద్ద అరుగుల ఆలయ ఆవరణలో తిష్టవేసేవారు ఆచార్యులు. ఆ చుట్టుపక్కల వూళ్ళోవాళ్ళందరికీ గర్భాలయంలో దేవుడుకంటే ఆచార్యులవారే ఎక్కువ. వైద్యానికి వచ్చేవారు. స్వామి ఆరాధనకి కైంకర్యం చేశాక, రుక్మిణమ్మ వైద్యానికి కావలసిన అనుపానులన్నీ సిద్ధం చేసేది. ఆచార్యులవారి వైద్యం ఆ చుట్టుపక్కల ఓ ఉద్యమం అయిపోయింది. వారి చికిత్సలో భక్తిపాలు ఎక్కువ. రోగుల మనస్సుల్లో విశ్వాసంపాలు ఎక్కువ. చాలామందికి మందు పనిచేసేది. పనిచెయ్యని ఆ ఒకరిద్దరు తమ ప్రారబ్ధం క్రింద సరిపెట్టుకునేవారు.

అసలు ఆచార్యులవారి చికిత్సకు మూలసూత్రం అదే రోగిని రోగ లక్షణాలు అడగడంతోపాటు, ఆయన జన్మచక్రం వేసేవారు. రాబోయేకాలంలో అతనికి రోగం తగ్గడానికి కర్మపరిపాకం ఎంత? ఆ తర్వాతనే వైద్యం. అయితే రైతులూ, మాములు కూలీ జనానికి జన్మ నక్షత్రాలూ, ఘడియలూ, విఘడియలూ ఏం తెలుస్తాయి? అందుకని సాముద్రికమూ సాధన చేశారు. అదొక విచిత్రమయిన చికిత్సా విధానం. వైద్యుడికీ, రోగికీ మధ్య మూడింట పొంతన కావాలి. ఒకటి: మందు, రెండు: విశ్వాసం, మూడు: శ్రద్ధ. ఈ మూడూ రోగులకి పుష్కలంగా ఉన్నాయి. ఆ చుట్టుపక్కల ఆచార్యులవారి వైద్యం వల్ల కుంతీమాధవస్వామి ఆలయానికి పరపతి పెరిగింది.

ఆ రోజుల్లో పానదేవపురం, ఒమ్మి, కొవ్వాడ, గృధవరం వెళ్ళాలంటే తాటిదూలాలు దాటి వెళ్ళాలి. నాగవంశం రైతులు కేవలం ఆచార్యులవారి సమక్షానికి వెళ్ళడానికే పది తాటి చెట్లు నరికించి నదికి అడ్డంగా పరుచుకున్నారు.

విశాలమయిన ఆలయప్రాంగణమంతా పరుగులు తీస్తూ, సుభద్రాచార్యులుగారూ, బుల్లిరాజుగారూ (వీర నరసింహరాజుగారి ముద్దుపేరు) ఆడుకునేవారు. ఏదో ఓ సమయానికి రుక్మిణమ్మ అరిటాకుల్లో చక్రపొంగలి, దద్దోజనం ఇస్తే, ఇద్దరూ మఠం వేసుకు

కూర్చుని బుద్ధిగా ఆరగించేవారు. ఆచార్యులవారిది చిన్న అంగవస్త్రం, బుల్లిరాజుగారిది చిన్న పట్టుపంచె. ఇద్దరూ కృష్ణార్జునుల్లాగా ఉండేవారు.

ఏ అపరాహ్ణానికో పెద తిరుమలాచార్యులవారికి రోగుల రాక తగ్గేది. అప్పుడు స్నానం చేసి, మధ్యాహ్న అనుష్ఠానం పూర్తిచేసుకుని స్వామి కైంకర్యాన్ని ఆరంగించేవారు.

సాయంకాలం వచ్చిన భక్తులకి తీర్థప్రసాదాలు సమర్పిస్తూ, సుభద్రకి తిరుప్పావై, తిరుప్పళియెళుచ్చి వల్లెవేయించేవారు.

కుంతీమాధవస్వామివారికి సంవత్సరానికి మూడు ఉత్సవాలూ, రెండు తీర్థాలూ, భాద్రపద శుద్ధ చతుర్దశి అనంత జయంతి. కొండమీద స్వామివారు అనంతపద్మనాభ స్వామిగా వెలిసిన రోజు. కుంతీమాధవస్వామి ఆలయంలో ఉత్సవర్లని కొండమీదకి ఉత్సవంగా తోడ్కొనిపోయి పంచామృతాభిషేకం, విష్ణుసహస్రనామార్చన జరుపుతారు. కొండమీద మెట్లపొడుగునా దీపాలు వెలుగుతాయి. ఆ రోజు పెద తిరుమలాచార్యులవారు సాక్షాత్తూ అగ్నిహోత్రుడులాగా వెలిగిపోతారు.

కుంతీమాధవస్వామికి చిన్న కథ ఉంది. ఎక్కడా కుంతీ పేరు జతపడిన గోపాల స్వామిని చూడం. కానీ పాండవులు వనవాసానికీ, అజ్ఞాతవాసానికీ వెళ్ళినప్పుడు బిడ్డల అగచాటలు మనస్తాపంతో కుంతీదేవి యాత్రలకు వెళ్ళింది. తమవంశ రక్షకుడు, ఆర్తత్రాణ పరాయణుడు, మేనల్లుడు గోపాలస్వామి. వెళ్ళిన చోటల్లా స్వామిని స్మరిస్తూ విగ్రహాలను ప్రతిష్ఠింపజేసింది. అలా కాశీలో వేణుమాధవస్వామి, ప్రయాగలో బిందుమాధవస్వామి, గయలో సేతు మాధ్వస్వామి, పీఠికాపురంలో సుందరమాధ్వస్వామి. గోస్తనీ నదీతీరానికి వచ్చి స్వామిని ప్రతిష్ఠించే సమయానికి ఆమెకి చిన్న 'అహంకారం' అడ్డుపడింది. ఎక్కడా స్థాపించిన ఆలయమూర్తులకు తన పేరులేదు. ఇక్కడయినా తనపేరు కలుపుకుంటానని మేనల్లుడిని ప్రార్థించిందట. ఎందరి భక్తుల కోరికల్ని స్వామి తీర్చలేదు. మేనత్త కోరికను సరేనన్నాడు. ఆ విధంగా ఇక్కడయినా తన పేరు కలుపుకుంటానని మేనల్లుడిని ప్రార్థించిందట. ఎందరి భక్తుల కోరికల్ని స్వామి తీర్చలేదు? మేనత్త కోరికను సరేనన్నాడు. ఆ విధంగా ఇక్కడ మూలవర్లు కుంతీమాధవులయ్యారు.

ఆలయానికి ఎడమవైపున విశాలమయిన భోజనశాల. పక్కనే రెండు గదుల్లో ఆచార్యులవారి నివాసం. ఆచార్యులవారి సంపదల్లా గోడకి చేత్తో గీసిన తమ పుర్వుల చిత్రాలు, మంత్రాన్ని తనదాకా చేర్చిన గురువుల పరంపర. ఆచార్య రత్నహారమది. సర్పవరం నుంచి కుంతీనాథాచార్యులవారు వెంటబెట్టుకు వచ్చిన అతి తక్కువ ఆస్తిలో అతి విలువయిన ఆస్తి అదే

ఓ రాత్రి ఎవరో స్త్రీ గోడు గోడున ఏడుస్తూంటే తుళ్ళిపడి లేచింది రుక్మిణమ్మ. ద్రవిడ ప్రబంధానికి ఓ రాత్రివరకు వివరణ వ్రాస్తూ అలసి నిద్రపోయారు ఆచార్యులవారు. భర్తని లేపింది. లాంతరు వెలిగించి, ఇద్దరూ ఆలయం పక్క ద్వారం దగ్గరకి వచ్చారు. నాలుగు వెదురు కర్రలు చేర్చి కట్టి, దానిమీద బరువయిన శరీరాన్ని పడుకోబెట్టి ఆరుగురు మోసుకువచ్చారు. రాత్రి ఎనిమిది గంటలనుంచీ ప్రయాణం చేస్తున్నారట. రెండో ఝామకి ఇక్కడికి చేరారు. పక్కనే ఏడుస్తున్న స్త్రీ. ఏమయిందన్నారు ఆచార్యులవారు. బోని నుంచి వస్తున్నారట అంతా. వెదురు బద్దీల మీద ఉన్న రైతు నాగవంశం మనిషి. పేరు పైడిబాబు. ఏడుస్తున్నది భార్య. సాయంకాలం పొలం నుంచి వస్తూండగా పాము కరిచింది. అతన్ని మోసుకొచ్చారు. పైడిబాబు శరీరం అచేతనంగా ఉంది. నాడి చూశారు. ఎక్కడ అందలేదు. శరీరం మంచులాగా అయిపోయి చాలాసేపయింది. గ్రామస్తులకి తెలుసు పైడిబాబు మీద ఆశలేదని. కానీ ఆచార్యులవారి మీద ఎనలేని విశ్వాసం వాళ్ళకి. ఆఖరిమాట ఆయన నోటంట వినాలని సగందారి నుంచే సమాధానం తెలిసినా మోసుకొచ్చారు. భార్య పేరు? కైకవశి. ఆమె మూగది. అంత బాధలోనూ నిర్ఘాంతపోయారు ఆచార్యులవారు. నాగవంశం మాములు నేలబారు కులం కాదు. వారికో వారసత్వం, ప్రత్యేకత ఉన్నది. అది తరతరాలుగా వస్తున్న వైవిధ్యం. కానీ ఈవిడ పేరు మరీ దిగ్భ్రాంతుల్ని చేసింది. లాంతరు వెలుగులో

శోకమూర్తిలాగా ఉన్న ఆమె ముఖం సౌందర్యంతో వెలిగిపోతోంది. నల్లకలువలాగా ఉంది ముఖం అంతకుమించి పేరు కైకవశి. ఆ పేరు డెబ్భై రెండు మేళకర్త రాగాలలో ఒకటి. అపురూప రాగం. త్యాగరాజస్వామివారు భగవంతుడిని "వాచా మగోచరమే" అంటారు కైకవశిలో, ఎవరో సంగీత జ్ఞానమున్న మహనీయుడు ఆమెకు పేరు పెట్టి ఉంటారు. లేక, ఆ వంశంలో ఎక్కడో అర్థంకాని సంస్కారమేదయినా ఉందా?

వెదురు పల్లకీని భుజాలకెత్తుతూంటే, కైకవశిని చూసి ఆచార్యులవారు అసంకల్పితంగా అడిగారు.

"ఈమెకెవరయినా ఉన్నారా?" అని.

లేరన్నారు తోడొచ్చిన గ్రామస్తులు.

"భర్తకి సంస్కారాలన్నీ పూర్తయ్యాక, ఆ అమ్మాయినిక్కడికి పంపించండి. ఆలయంలో పనిచేస్తుంది" అన్నారు.

గ్రామస్థులు ఆశ్చర్యపోయారు. అంత దుఃఖంలోనూ కైకవశి కూడా ఆశ్చర్యపోయి, అసంకల్పితంగా ఆచార్యులవారి పాదాలు ముట్టుకుని నమస్కారం చేసింది.

"నారాయణ, నారాయణ" అనుకుని చెవులు మూసుకుని లోనికి వచ్చి స్నానం చేశారు ఆచార్యులవారు. యజ్ఞోపవీతం మార్చుకునేవరకు పచ్చిమంచినీళ్ళు ముట్టరు. సూర్యోదయానంతరమే నూతన యజ్ఞోపవీతధారణ జరగాలి. ఆ రాత్రి చాప పరుచుకుని దూరంగా విశ్రమించారు.

ఎందుకు తన నోటివెంట ఆ మాట వచ్చింది? వారికే ఆశ్చర్యం కలిగింది.

సుభద్రాచార్యులవారి తిరువధ్యయనానికి విశాఖనుంచి వచ్చిన నవనీతం అమ్మ కైకవశి. ఆమె భర్తకి వేసిన పాముకాటు ఆ గ్రామం, ఓ రెండో తరానికి నాటబోతోందని ఆ రోజున ఆచార్యులవారికి తెలీదు. అది ఆ వూరి కర్మ పరిపాకం.

**మరొక ఆరునెలల్లో** ఆ ఊరి చరిత్రే మారిపోనున్నదని ఎవరూ వూహించలేదు.

కార్తీక బహుళ అమావాస్య అనంత పద్మనాభస్వామి వారి దీపోత్సవం. చుట్టుపక్కల వూళ్ళల్లో భక్తులు యథాశక్తిగా స్వామివారి దీపారాధనకు నూనె గుమ్మరించి పోతారు. మరికొందరు భక్తులు ప్రమిదలు, వొత్తులూ సిద్ధం చేస్తారు. ఆనాటి అమావాస్య రాత్రి పద్మనాభంలోని ఆ పర్వతం దాదాపు పదిపదిహేను కిలోమీటర్ల దూరం నుంచి అగ్నిశిఖలాగా వెలిగిపోతుంది.

దీపోత్సవం జరుగుతుండగా సుభద్రాచార్యులవారి అంగవస్త్రానికి నిప్పంటుకుంది. బుల్లిరాజుగారు, మరి నలుగురయిదుగురు పిల్లలూ వస్త్రాన్ని ఉన్నపాటునే లాగివేశారు. బుల్లిరాజుగారు దిగంబరులయిన మిత్రుడి చుట్టూ తన చిన్ని ఉత్తరీయాన్ని కప్పారు. ఒక్కసారి వూరంతా గగ్గోలు అయింది. సుభద్ర బెదిరిపోయారు. అంతకుమించి రుక్మిణమ్మ బావురుమంది. ఆచార్యులవారు మాత్రం కిమ్మనలేదు. నిప్పంటుకోవడానికి బాధపడడం కాదు, బిడ్డ బతికినందుకు ఆనందించాలన్నారు.

మర్నాటికి సుభద్రాచార్యులవారికి ఒళ్ళు మరిగిపోయే జ్వరం. నాలుగు రోజులు తనకు తెలిసిన వైద్యం వేశారు. జ్వరం ఒకచోట నిలిచిపోయింది. అయిదోనాటికి ఆచార్యులవారి శరీరం మీద అమ్మవారు కనిపించింది. వెంటనే పెద తిరుమలాచార్యులవారు ఆలయం విడిచిపెట్టి, రాజుగారు ఏర్పాటు చేసిన బసకి మారిపోయారు. ఆ రోజుల్లో ఇళ్ళన్నీ డొప్పపెంకు, వెదురుచాప, సరంబీతో చల్లగా చలివేంద్రాల్లాగా ఉండేవి. ఆచార్యులవారున్నది చిన్న వసారా లోగిలి.

రాను రాను సుభద్రాచార్యులవారికి అమ్మవారు ముదిరిపోయింది. ఊళ్ళోవారికి పెద తిరుమలాచార్యులవారి వైద్యం నిలిచిపోయింది. ఓ శ్రీ వైష్ణవులు కుర్రాడు ఆలయంలో కుంతీ మాధవస్వామికి దీపాలు మాత్రం వెలిగిస్తున్నాడు. పూజలు

నిలిచిపోయాయి. రుక్మిణమ్మ భయభ్రాంతురాలయిపోయింది. అహర్నిశలూ బిడ్డ సమక్షానే ఉండిపోయి, పచ్చి మంచితీర్థం తప్ప ఏమీ ముట్టుకోవడంలేదు.

సుభద్ర శరీరమంతా పుళ్ళు నిలిచిపోయాయి. ఎక్కడా ఇసుమంతయినా జాగ లేకుండా శరీరమంతా వ్యాపించిపోయింది. పదిరోజులపాటు జ్వరం విడవకుండా పీల్చేసింది. కళ్ళల్లో కూడా పువ్వులు వెలిశాయి. ఈ లెక్కన కళ్ళు పోతాయేమో అనుకున్నారు. రోజులు గడిచిన కొద్దీ ప్రాణానికే ముప్పు వచ్చే సందిగ్ధం ఏర్పడింది.

రోజురోజుకీ పెద తిరుమలాచార్యులవారు స్థాణువయిపోయారు. ఓ రోజు ఉదయాన్నే కొండమీదకి వెళ్ళిపోయారు. నాలుగురోజులవరకూ దిగిరాలేదు. ఊరిప్రజలు ఆచార్యులవారి గురించి హడలిపోయారు. చుట్టుపక్కల వూళ్ళకి ఈ వార్త వ్యాపించిపోయింది. ఆచార్యులవారి హస్తవాసితో అంతో ఇంతో మేలుపొందినవారంతా బళ్ళు కట్టుకుని వచ్చేశారు. కొందరు గోస్తనీ తీరంలో వంటలు చేసుకుని ఉండిపోయారు.

పెదరాజుగారు విశాఖపట్నం నుంచి డాక్టర్ని పిలిపించారు. డాక్టరు వచ్చేలోగానే కొండమీదనుంచి పెద తిరుమలాచార్యులవారు దిగి వచ్చారు. ఆయన్ని చూసి ఊరువూరంతా భయభ్రాంతమయిపోయింది. ఆచార్యులవారి కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి. ఈ నాలుగు రోజులూ నిద్రాహారాలు లేక ఏకదీక్షతో అనంతపద్మనాభస్వామితో ఏం మాట్లాడివచ్చారో తెలీదు. ఆచార్యులవారిని చూస్తూనే పెదరాజుగారు భోరుమన్నారు. రుక్మిణమ్మ నిలువునా నీరయిపోయింది. పెదతిరుమలాచార్యులవారు ఎవరివైపూ చూడలేదు. ఎవరినీ పలకరించలేదు. ఒక్క మాటయినా అనలేదు. మంచానికంటుకుపోయి ఉన్న కొడుకుని దుప్పటితో సహా భుజానికి ఎత్తుకున్నారు. ఊరంతా హోరుమంది. ఆ బిడ్డ శరీరంలో ప్రాణమున్నట్టులేదు. ఆ కదలికకీ బాధపడలేదు. నోరు తెరవలేదు. తండ్రి భుజం మీద అపస్మారకంలో శరీరం ఒరిగిపోయింది. బిడ్డని గదిలోకి ఎత్తుకువెళ్ళి తన వెనుక తలుపు మూసుకున్నారు ఆచార్యులవారు. అప్పటికి సూర్యాస్తమయింది.

రాత్రంతా పద్మనాభం ఊరు ఊరంతా ఆ ఇంటిముందు జాగరణ చేసింది. ఎవరూ మంచినీళ్ళు ముట్టలేదు. ఎవరినోటివెంటా మాటరాలేదు. ఆడవాళ్ళు నిస్సహాయంగా ఏడవటం తెలుస్తోంది. అక్కడక్కడా దీపాలు మిణుకుమంటున్నాయి. ఏమవుతోంది లోపల? తండ్రీ కొడుకులు ఏం చేస్తున్నారు? రెండు ప్రాణాలకీ ముప్పు వాటిల్లబోతోందా? బిడ్డ ఖేదాన్ని భరించలేక ఆచార్యులుగారు ప్రాయోపవేశం చేస్తారా? రేపు ఎలా తెల్లవారబోతోంది? ఇవే ప్రశ్నలు అందరి మనస్సుల్లోనూ సుడులు తిరుగుతున్నాయి.

సూర్యోదయానికి నాలుగయిదు క్షణాలుండనగా లోపలి గదిలోంచి "అమ్మా!" అన్న ఏడుపు వినిపించింది. ఆ గొంతు బుల్లిరాజు గుర్తుపట్టాడు. "సుభద్రా!" అని తలుపు మీద తలపెట్టి బావురుమన్నాడు. విచిత్రంగా తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి. ఊరంతా దిగ్గున లేచింది. అందరూ ఒకేసారి హాహాకారాలు చేశారు. అందరూ నిర్ఘాంతపోయిన దృశ్యం. వారాలుగా అమ్మవారి పూతతో శిథిలమయి పోయిన శరీరంతో చావుబతుకుల్లో ఉన్న సుభద్రాచార్యులు మిడిగుడ్లతో అందరినీ గమనిస్తున్నాడు. తెల్లటి శరీరం నవనీతం పూసినట్టు మెరుస్తోంది. అతని శరీరాన్ని పట్టి పీడించిన మశూచి ఎక్కడ? ఆ మహమ్మారి ఏమయింది? ఏమిటీ విడ్డూరం?

ఊరి ప్రజలకి ఆ ప్రశ్నకి సమాధానం వెదుక్కోడానికి ఎక్కువ శ్రమ అక్కరలేకపోయింది. పక్కనే చాపమీద పెదతిరుమలాచార్యులవారు కూలిపోయి ఉన్నారు. ఆయన శరీరమంతా బీటలు వారిపోయింది. శరీరం రక్తం చిమ్ముతోంది. ఎక్కడా ఒక్క నూలుగింజనయినా ఖాళీలేకుండా అమ్మవారు ఆక్రమించుకుంది. ఆయన ముఖంలో బిడ్డని చూస్తున్న చిన్న ప్రశాంతత.

అంతులేని వేదనని అలవోకగా శరీరం ఆహ్వానించిన ధారణ తెలుస్తోంది.

రుక్మిణమ్మ భోరుమంది. ఊరంతా ఘొల్లుమన్నారు.

"బిడ్డని కాపాడుకోడానికి నిన్ను పణంగా దేవుడికిచ్చుకున్నావా సామీ" అన్నారు పెదరాజుగారు.

పెదతిరుమలాచార్యులవారి కనుకొలుకులు వర్షిస్తున్నాయి. రుక్మిణమ్మ పొదివి పట్టుకున్న సుభద్రని చూసుకున్నారు. మరో గంటసేపు ఆ శరీరం ప్రాణాన్ని నిలుపుకోగలిగింది.

రెండురోజులపాటు ఆచార్యులవారి శవాన్ని తాకడానికి కూడా అందరూ హడలిపోయారు.

4

***భరించరాని దుఃఖం మనిషిని ఆవరించినప్పుడు రెండు జరుగుతాయి. వేదనగల మనిషి పిచ్చివాడయినా అవుతాడు. నిర్మలమయిన అంతఃకరణగల వ్యక్తి, ఊహించని మలుపులో ఏకోన్ముఖుడవుతాడు. అంటే, దిక్కుతోచని దశలో బలమైన దిక్కువైపు మనస్సుని మళ్ళించుకుంటాడు. అది అతని కర్మపరిపాకం సంస్కారం. అంతకన్నా కారణం మరొకటి ఉండదు. అంతులేని దుఃఖంలో తాగుబోతులయినవారూ ఉన్నారు. అద్భుతమయిన కావ్యాన్ని సృష్టించినవారూ ఉన్నారు. రెంటికీ ప్రాతిపదిక వేదనే.***

ఊరి శివార్లలో ఉండే సాతాని జియ్యర్ దగ్గర వయొలిన్ అభ్యాసం ప్రారంభించారు సుభద్రాచార్యులు. ఏ మధ్యాహ్నమో ప్రారంభమయ్యే పాఠం ఆలయంలో ప్రదోషకాలం పూజవరకూ సాగేది. నిజానికి జియ్యర్‌కి వయొలిన్ రాదు. ఏక్‌తారా తీగల్ని మీటడం వచ్చు. చాలా తక్కువసార్లు వయొలిన్‌ని పట్టుకున్నాడు. ఆ తక్కువసార్లు అనుభవాన్నే ఆచార్యులవారికి బదిలీ చేశాడు. జియ్యర్ సాధనకి లక్ష్యం ఉపాధి. ఆచార్లుగారి సాధనకి లక్ష్యం ఉపశమనం. ఛిన్నాభిన్నమయిన అంతరంగాన్ని ఏకీకృతం చేసేది కళే. అంత ఆలోచించలేదు ఆచార్లుగారు. తెలియనంత మాత్రాన ప్రకృతిలో 'లయ' గతి తప్పదు. ఆచార్లుగారి సాధన అద్భుతమయిన నాదాన్ని వాయులీనం మీద పలికించింది. కొండమెట్లమీద కూర్చుని "మోక్షము గలదా, భువిలో జీవన్ముక్తులు గాని వారలకు" అని సుభద్ర సారమతిని తీగెలమీద నినదిస్తూ ఉంటే, పద్మనాభం పరవశించిపోయేది. రుక్మిణమ్మ నిర్లిప్తంగా కన్నీరు కార్చేది. ప్రవృత్తి నిష్ఠ కళని పరాకాష్ఠకు చేరుస్తుంది.

ఇరవైరెండేళ్ళ వయస్సులోనే ఉత్తరీయం నడుం చుట్టూ తిప్పి మాధవస్వామికి నీరాజనం ఇచ్చే సుభద్రాచార్యుల్ని చూస్తూ చాలా తక్కువకాలంలో తనకంటే పెద్దరికం ఆయన మీద పడిందని ఖిన్నులయ్యేవారు బుల్లిరాజుగారు. పెదతిరుమలాచార్యుల వారి నిష్క్రమణం తమ స్నేహంలో ఓ గొప్ప దశకి తెరవేసింది.

ఇంట్లో పెద్ద ప్రాణం లేచిపోతే మూడోనెల తిరగకుండానే ఆడపిల్ల వుంటే కన్యాదానం చేస్తారు. ఆ పుణ్యం గతించిన పుణ్యాత్ముడికి చేరుతుందని. మగపిల్లాడికి సంవత్సరం తిరగందే ఏమీ చెయ్యడానికి లేదు. కాగా, ఏ కర్మ నిర్వర్తించడానికయినా గృహస్థాశ్రమం ఓ అర్హత. సుభద్రాచార్యులకి పితృకర్మ జరిపే అదృష్టం దక్కలేదు. చేసేవాళ్ళూ ఎవరూ లేరు. అందుకని పురోహితులే సుభద్రాచార్యుల కర్తృత్వాన్నీ వహిస్తూ, పదహారు మాసికాలూ జరిపించారు. శ్రీపాద తీర్థం కృప చెయ్యడానికి వచ్చిన భోక్తలు కూడా పితృకర్మ పుణ్యం సుభద్రాచార్యులవారికి దక్కాలని ఆశీర్వదించి వెళ్ళేవారు. పితృకర్మ ఒక యోగం. అది బిడ్డకి దక్కనందుకు విలవిలలాడిపోయింది రుక్మిణమ్మ.

అప్పటికే ఆలయ నిర్వహణకు విజయనగరం మహారాజావారు ఇచ్చిన 2500 ఎకరా చేతులు మారిపోయాయి. వేర్వేరు రైతులు పొలం సాగుచేసి ఆలయానికి శిస్తుగా చెల్లించేవారు కొన్నాళ్ళు. కళ్ళాలలోనే ధాన్యం సొమ్ముచేసి నగదు ఆలయానికి చేర్చేవారు. మరి కొన్నాళ్ళకి వాళ్ళే స్వయంగా నగదు చెల్లించేవారు. అవి దేవుడి మాన్యాలు. అడిగే వాళ్ళెవరు? దైవభక్తి పోయి భుక్తిమీద దృష్టి ఎక్కువయిన రోజులు. క్రమేపీ ఆ డబ్బు కూడా ఇవ్వడం మానుకున్నారు. ప్రస్తుతం ఊరికి సమీపంలో అర్చకుని పాలెం మామిడితోట మాధవస్వామికి ఎంతో కొంత ఆదాయాన్నిస్తోంది. అదీగాక, రెండు తీర్థాలకీ, మూడు ఉత్సవాలకీ, అడపాతడపా వచ్చిపోయే భక్తుల ముడుపులతో ఆలయం గడుస్తోంది.

సుభద్రాచార్యులవారి ఉపాధికి ఏ లోటూ లేదు. అంతకుమించి అవసరమూ లేదు. కాగా, సరళమయిన జీవితానికి తరతరాలుగా అలవాటు పడిన సంస్కారం ఒకటుంది. బ్రాహ్మణ్యానికి పేదరికం పెట్టనికోట. ఉపవాసం ఉపశమనం. 'రేపు' గురించి ఆలోచించక పోవడం అహంకారం. రేపు నీదని నీకేం తెలుసు? అవసరానికి పోగు చేసుకోవడం పిరికితనం. ఆ అవసరాన్ని తీర్చడానికి పెరుమాళ్ళు ఎలా అనుగ్రహిస్తాడో మనకేం తెలుసు? ఆ రోజుల్లో బాంకుల అవసరం ఎవరికీ లేదు. మానవజీవితం అవసరాల్ని కుదించుకునే దశనుంచి అవసరాల్ని గుణించుకునే దశకి విశ్వరూపం దాల్చింది.

ఓ చిన్నవూరు, పద్మనాభం ఆలయప్రాంగణంలో తన ప్రపంచాన్ని ఓ వ్యక్తి నిక్షిప్తం చేసుకున్న అందమయిన రోజులవి. ఇవాళ మనిషి జీవితానికి ప్రపంచం చాలడంలేదు. అంతరిక్షం కావాలి. ఆలోచన మాట కాదు, ఆత్మ సంయమనం మాట.

రుక్మిణమ్మ ఆ సంవత్సరమంతా ప్రతీక్షణాన్నీ లెక్కపెట్టింది. కారణం ఆ కుటుంబంలో, ముఖ్యంగా సుభద్ర జీవితంలో భర్త ఉండగా భర్తీ చెయ్యలేని లోటుని వెంటనే భర్తీ చెయ్యాలని.

ఎక్కడో శ్రీ కూర్మంలో నరసింహాచార్యులువారి కుమార్తె ఉన్నదని ఆ నోటా ఈ నోటా విని, బస్సులో బయలుదేరి వెళ్ళింది. కూర్మనాథుడి ఆలయంలో పోటు జవాబుదారీ నరసింహాచార్యులది. ఆలయం విశాలమయినదయినా, పెద్ద ఆదాయం ఉన్న స్వామి కాదు. క్షేత్రంలో విశేషం ఉంది. నరసింహాచార్యులవారిది చాలా చిన్న కుటుంబం. ఒకే సంతానం. కుటుంబం పేదదయినా సంప్రదాయంలో సంపన్నమయినది. వరదమ్మ ఒంటిమీద ఎర్రపూసల దండ, మట్టిగాజులూ తప్ప మరేమీ లేదు. అమ్మాయిని చూడడానికి ఫలానా ఆవిడ వస్తున్నారని తెలిసి ఆలయ ప్రాంగణంలోనే బొగడపూలు ఏరుకుని సిగలో తురుముకుంది. త్రాచుపాములాగా పిరుదులు దాకా జారే జడ.

"జుత్తు నవ్వే దువ్వుకుంటావా, అమ్మడూ?" అంది రుక్మిణమ్మ వరదమ్మని దగ్గర కూర్చోపెట్టుకుని ఆప్యాయంగా తల నిమురుతూ.

ఆ ఆర్ద్రతకి వరదమ్మకి కళ్ళనీళ్ళు తిరిగాయి.

"వాళ్ళ నాన్నతోపాటు ప్రతిరోజూ కుండంలో మునిగి, పోటులో స్వామి కైంకర్యం సిద్ధం చెయ్యడానికి చెయ్యి కలుపుతుంది. నేను వెనక పరుగెత్తి జుత్తు పిడప కడతాను" అంది తల్లి.

ఈ బిడ్డ కడుపున తన వంశాంకురం కలగడాన్ని ఊహించుకు మురిసిపోయింది రుక్మిణమ్మ. శ్రీవైష్ణవుల ఇంటికి ఎవరు వెళ్ళినా, స్వామి కైంకర్యమే లభిస్తుంది. కమ్మగా మిరియాలు గుమ్మరించి చేసిన దద్దోజనం వేడివేడిగా బాదం ఆకులో వడ్డించింది పేరిందేవమ్మ.

పాల్గుణ శుద్ధ ఏకాదశినాడు పద్మనాభంలో కుంతీమాధవస్వామి వారికి అయిదురోజులు బ్రహ్మాండంగా కళ్యాణోత్సవాలు జరుగుతాయి. మొదటిరోజు విశ్వక్సేన పూజ, అంకురారోపణ, ధ్వజపటం ఎగురవేయడం, ఎదురుసన్నాహం, ఆ పైన కళ్యాణం. రెండోరోజు విశేషహోమం, మూడోరోజు స్థాలీపాకహోమం, నాలుగవరోజు స్వామి తన దేవేరితో కలిసి ఊరంతా ఊరేగుతారు. రథయాత్ర. అయిదోరోజు సాయంత్రం ఏడుగంటలకి డోలామండపంలో వినోదోత్సవం, పుష్పాంజలి.

స్వామివారి కళ్యాణంతోపాటు సుభద్రాచార్యులవారి కళ్యాణం కూడా జరిపించింది రుక్మిణమ్మ. దాదాపు స్వామివారికి జరిగిన వైభవాలన్నీ సుభద్రాచార్యులవారికీ జరిగాయి. ఆ సంవత్సరం ఆలయంలో రెండు కళ్యాణాలు. బతికుంటే పెద తిరుమలాచార్యులవారు పందిరిలోనే నిలబడేవారు. కానీ ఆ అయిదురోజులూ వందలూ, వేలూ జ్ఞాపకాలయి అందరి మనస్సులూ ఆక్రమించారు. ఆ కుటుంబానికి జరిగిన నష్టం ఇప్పటికి తీరినట్టు ఊరు ఊరంతా ఆనందించారు.

సుభద్రాచార్యులవారి కంఠాన్ని పూలమాలని అలంకరింపజేస్తున్న వరదమ్మ, సాక్షాత్తూ గోదాదేవిలాగే సాక్షాత్కరించింది ఆ ఊరి ప్రజలకి. ఓ చిన్ని గృహస్థు నరసింహాచార్యులు, పేరిందేవమ్మ జీవితాల్లో ఇది గజారోహణ యోగంలాంటిది. రంగనాథుడే స్వయంగా దిగివచ్చి తన బిడ్డని చేపట్టినంత ఆనందంతో తన్మయులయిపోయారు ఆ పేద దంపతులు.

రెండు భద్రాద్రి రాముడి బంగారు మాడలు, రెండే రెండు నేతచీరలు, ఓ సవరం, పదికుంచాల పేలాలతో కాపరానికి వచ్చింది వరదమ్మ. కోడలు పుట్టింటి నుంచి తీసుకొచ్చేది ముఖ్యంకాదు. ఈ వంశాన్ని ఉద్ధరించడానికి వచ్చిన కోడలే ముఖ్యం. ఆ రోజునే పేలాలు, చలిమిడీ, పంచదార చిలకలూ, పళ్ళూ ఊరందరినీ పిలిచి కోడలి చేతులమీదుగా పంచి పెట్టించింది రుక్మిణమ్మ. ఆడంగులంతా ఆమె జడని తడిమి తడిమి మరీ అబ్బురంగా చూశారు. మగవాళ్ళంతా ఆమెలో సుభద్రాచార్యుల భాగ్యాన్ని వెదికారు.

మిత్రుడి వివాహాన్ని చూశాక తనకీ వెంటనే పెళ్ళి జరగాలని భీష్మించుకు కూర్చున్నారు బుల్లిరాజుగారు. తండ్రిగారు నవ్వుకున్నారు. రాజుగారు తలుచుకుంటే పెళ్ళికేం కొదవ. రెండు మూడు మేనరికాలు ఉండనే ఉన్నాయి. ముగ్గురు మేనమామలూ ఒకేరోజు దిగి కాబోయే అల్లుడి కట్నాన్ని వేలం పాడారు. పెదరాజుగారు మామిడిచెట్టు నీడలో మీసాలు మెలివేస్తూ జీతగాళ్ళు కాళ్ళు పిసుకుతూండగా, సాయంకాలానికి పెద్దబేరాన్ని తెగ్గొట్టేశారు. ఆ లెక్కన కొడుక్కి సాలూరు దగ్గర మూడువేల ఎకరాల మాగాణీ, సబ్బవరం దగ్గర మరో వెయ్యీ అరవై ఎకరాల సరుగుడు, శ్రీకాకుళం దగ్గర్లో ఎనిమిది వందల ఎకరాల జీడిమామిడి తోటా కిట్టుబాటయ్యాయి. పెళ్ళి పాండ్రంగి రోడ్డు మొగిలో మూడురోడ్లూ కలిసేచోట ఆరువూళ్ళని కలిపేసి పెద్ద పందిరి వేయించారు. నాలుగయిదు ఏనుగులూ, పది గుర్రాలూ, నూతన వధూవరులు ఊరేగడానికి చెమ్కీ దండల అలంకరణలతో గుర్రబ్బగ్గీ. చెంచువలసనుంచి రెండు సానిమేళాలూ, చెక్కభజనల బృందాలూ వచ్చాయి. వారం పదిరోజులు ఆ చుట్టుపక్కల ఎవరికీ నిద్రలేదు. ఎవరింట్లోనూ వంటలేదు.

తీరా కన్యాదానం చేసి, వరుడు తాళికట్టే సమయానికి పీటలమీదే నురుగులు కక్కుతూ కొత్తపెళ్ళికూతురు విరుచుకు పడిపోయింది. అప్పటికి బుల్లిరాజుగారు మూడుముళ్ళూ వేసేశారు. నాలుగయిదు బస్తాల అక్షింతలు పందిరంతా పరుచుకున్నాయి.

"లమ్డీకొడుకుల్లారా! నన్ను కన్నుగప్పి మోసం చేస్తారా?" అని కత్తిపట్టుకుని పెదరాజుగారు లేచిపోయారు.

నలుగురయిదుగురు వియ్యంకుడిమీద కమ్మేసి రాత్రికి రాత్రి ఆయన్ని గజపతినగరం తోలుకుపోయారు. మరో సంవత్సరంపాటు ఆ ఊళ్ళన్నీ బుల్లిరాజుగారి పెళ్ళిగురించి కథలుగా చెప్పుకున్నాయి.

పెళ్ళిహడావుడి సద్దుమణిగాక, బుల్లిరాజుగారిని ఓదార్చడానికి సుభద్రాచార్యులు వచ్చారు. ఇద్దరూ అనంతపద్మనాభస్వామి మెట్లమీదకి పారిపోయారు.

"రాజా! ఇలా జరుగుతుందని.." సుభద్ర నోరెప్పేలోపునే,

"మంచిపాట వాయించు ఆచార్లూ విని చాలా రోజులయింది" అన్నారు బుల్లిరాజుగారు.

ఆందోళిక ఆలాపన చేసి, "నీ దయ రాదా?" అన్న త్యాగరాజ కీర్తన పల్లవి వాయించారు ఆచార్లుగారు. అంతే ఆయన ఒడిలో తలపెట్టుకుని భోరుమన్నారు బుల్లిరాజుగారు.

ఆ రోజుల్లోనే పెదరాజుగారికి గుండెపోటు వచ్చింది. విజయనగరం నుంచి వైద్యుల్ని రప్పించి బంగారం పుటం పెట్టించి మందులు నూరించారు కానీ, తర్వాత పెదరాజుగారు కోలుకోలేకపోయారు. పోటు గుండెకు కాదు, మనస్సుకి తగిలిందన్నారు వైద్యులు. నిజం కూడా అదే

బుల్లిరాజుగారి సంఘటనకి ఎక్కువ చలించిపోయిన వ్యక్తి సుభద్రాచార్యులు. ఊరంతా పెదరాజుగారు మోసపోయారన్నారు. కొందరు బుల్లిరాజుగారికి అన్యాయం జరిగిందన్నారు. కానీ ఒక్క వ్యక్తి గురించి ఎవరూ ఆలోచించలేదు. ఇంత సంరంభంలో, ఇన్ని

వాగ్వాదాల్లో ఒంటరిగా జరిగిన అనర్థానికి దుష్ఫలితాన్ని అనుభవిస్తున్న వ్యక్తి ఒకరున్నారు. అది పెళ్ళికూతురు బుచ్చియ్యమ్మ ఆమెకి 'మూర్ఛ' జబ్బు ఉండటం ఆమె తప్పుకాదు. ఆ నిజం పెదరాజుగారికి తెలియజేయకపోవడమూ ఆమె తప్పుకాదు. కానీ ఇంత ఘనంగా పెళ్ళిచేసి ఆమె అవలక్షణాన్ని ఇంత ముమ్మరంగా నలుగురికీ ప్రచారం చేసినట్టయింది. అందుకు ఆమె ఎంత కుమిలిపోతున్నదీ ఎవరూ పట్టించుకున్నట్టు లేదు. పెళ్ళి జరిగిన నాటినుంచీ ఆమె తండ్రి ఇంతవరకూ ఎత్తిన గ్లాసు దించకుండా తాగుతున్నాడు. తిట్టిన బూతుతిట్టకుండా పెదరాజుగారిని తిడుతున్నాడు. బుచ్చియ్యమ్మని ఓదార్చాలని కాని సముదాయించాలని కానీ ఎవరూ పూనుకోలేదు.

ఒక్క సుభద్రాచార్యులుగారు ఆమె మొరని వినకపోయినా అర్థంచేసుకున్నారు. జరిగిన అనర్థంలో ఆమె నేరం లేదని, ఎవరు ఏ తప్పు చేసినా ఫలితం ఆమె ఒక్కతే అనుభవించబోతున్నదనీ, ఆమెకి న్యాయం చెయ్యగలిగిన వ్యక్తి బుల్లిరాజుగారొక్కరేనని, అనంతపద్మనాభస్వామి ఆలయం మెట్లమీద అనేక విధాల నూరిపోశారు మిత్రునికి. క్రమంగా బుల్లిరాజుగారికి విషయం అర్థమయింది.

"నన్నేం చెయ్యమంటావు ఆచార్లూ?" అన్నారు.

ఏం చెయ్యాలో సుభద్రాచార్యులుగారు చెప్పారు. ధనుర్మాసం గడిచిన మూడోరోజున అంటే మాఘ శుద్ధవిదియ ఉషోదయకాలంలో ఎవరికీ చెప్పకుండా మాయమయిపోయారు బుల్లిరాజుగారు. ఊరు భగ్గుమంది. మంచం మీద పెదరాజుగరు చ్రరుమన్నారు. బుల్లిరాజుగార్ని వెదకడానికి మనుషులు అన్నిదిక్కులకీ బయలుదేరారు.

రథసప్తమి ఉదయాన సూర్యుడికంటే ముందుగా బుచ్చియ్యమ్మతో కలిసి కుంతీమాధవస్వామి ఆలయ ప్రవేశం చేశారు బుల్లిరాజుగారు. ఫలపుష్పాలతో నూతన వధూవరులను ఆహ్వానించారు సుభద్రాచార్యులవారు, వరదమ్మ. బుచ్చియమ్మ పాదాలకి పసుపురాసి, ఒడిలో ధాన్యం పోసి, పెరుమాళ్ళ గుడిలోకి కుడికాలు పెట్టించింది వరదమ్మ. కుంతీమాధవుడే రాజుగారి కుటుంబానికి ఇలవేల్పు. ఆయన ఆలయప్రవేశం, తమ గృహప్రవేశమే.

తెల్లవారేసరికి వార్త గుప్పుమంది. అప్పటికి ఇద్దరిచేతా స్వామివారికి సహస్రనామార్చన చేయించారు సుభద్రాచార్యులవారు. పెదరాజుగారి మనుషులు వచ్చారు గుడికి, అయ్యవారు బుల్లిరాజుగారిని రమ్మంటున్నారని. "ఇద్దరినీ రమ్మంటేనే వస్తాను" అన్నారు బుల్లిరాజుగారు. గొంతు ఆయనది కానీ, తిరుగుబాటు ఆచార్లువారిది.

అపరాహ్ణానికి పెదరాజుగారింటినుంచి అనుమతి వచ్చింది. పొరపాటు కొడుకునీ, కోడల్నీ ఇంటికి తీసుకువెళ్ళడానికి పదిమందీ తోడురాగా, గుర్రబ్బగ్గీ వచ్చింది.

సరిగ్గా అయిదునెలలకి వరదమ్మ వంటచేస్తూ ఉన్నట్టుండి వాంతి చేసుకుంది. అదే సమయానికి తోటలో బుచ్చియ్యమ్మ కూడా అదే పనిచేస్తోంది. వైద్యుడు ఇద్దరినీ పరీక్షించి ఇద్దరికీ మందులు అవసరం లేదని తేల్చాడు.

పుట్టబోయేది చిన్నదొరగారు. అక్కడ వీరరాఘవరాజుగారు. ఇద్దరూ తల్లుల్ని కదిపి కుదిపేశారు. రాబోయే 'రేపు' 'నేటి'ని అతలాకుతలం చెయ్యడం ఆశ్చర్యంకాదు.

ఇద్దరూ పురిటికి పుట్టిళ్ళకు బయలుదేరేనాటికి కొండమీద స్వామివారికి కొండంత వైభవంతో తీర్థం జరుగుతోంది.

***అవినీతికి** సాకు కావాలి. అభిరుచికి అవకాశం కావాలి మందు తాగేవాడు మనస్తాపం నుంచి ఆటవిడుపు కావాలంటాడు. సిగరెట్టు కాల్చేవాడు చికాకుల ముడులు విప్పుకుంటున్నానంటాడు. మహా సంగీత విద్వాంసుడు కావలసిన వాడికి మంచి గురువు అవకాసం. ఉత్తమ ప్రవర్తనకి మహాత్ముడి దర్శనం అవకాశం.*

భార్య పురిటికి వెళ్ళిన రోజుల్లోనే బుల్లిరాజుగారు కైకవశితో ఎంగిలిపడ్డాడు. ఇందులో బుల్లిరాజుగారిది అవినీతి. కైకవశికి అవకాశం. తీరిక వేళల్లో విశాలమయిన ఆలయం చావిడి మీద స్తంభానికి ఆనుకుని మడిగా సుభద్రాచార్యులు కూర్చుంటే, చిన్న కేన్వాసు మడత కుర్చీవేయించుకుని బుల్లిరాజుగారు కూర్చునేవారు. ఆలయాన్ని శుభ్రం చేస్తూనో, ముంగిట్లో ముగ్గులు వేస్తూనో కైకవశి మెరుపులా మెరిసిపోయేది. ఆచార్యులుగారింట్లో ఎవరూ కాఫీ తాగరు. కానీ రాజుగారికోసం వరదమ్మ ఫిల్టరు కాఫీ చెయ్యడం నేర్చుకుంది. వేడి కాఫీ గ్లాసు చీర మడతల్లో పట్టుకుని కైకవశి రాజుగారికి కాఫీ అందించేది. కాఫీ గ్లాసు అందుకొన్నప్పుడల్ల శరీరం మీద కురచనయిన భాగం రాజుగారి కళ్ళల్లో మంటలు రేపేది. ఆ శరీరాన్ని చూడడానికే మరీ మరీ అడిగి కాఫీ చేయించుకునేవారు. కైకవశిది పిటపిటలాడే యవ్వనం. కాగా మనిషి రక్తం మరిగిన పులి కైకవశి. రాజుగారి పరిస్థితి ప్రస్తుతం అదే

అయితే కైకవశికి బొత్తిగా ఆ ఆలోచనలేదు. కాగా, సుభద్రాచర్యులవారంటే ఆమెకి సోదర భావం. పెద తిరుమలాచార్యులవారు తన ప్రాణాలు అడ్డం వేసి కొడుకుని బ్రతికించడం స్వయానా చూసింది. ఆ రోజు తండ్రిని పోగొట్టుకున్నంతగా ఏడ్చింది. సుభద్ర పనులన్నీ స్వయంగా చేస్తుంది. ప్రపంచంలో అతి బలమయిన మాధ్యమం నిశ్శబ్దం. అది కైకవశి సొత్తు. *'అమ్మా' అంటే ఒక్క అనుభూతే కలుగుతుంది. 'అమ్మో!' అంటే మరొకటి. నిశ్శబ్దంలో మన సంస్కారం మేరకు ఏ అనుభూతయినా అన్వయమవుతుంది.* అదీ కైకవశిలో నిక్షిప్తమయిన శక్తి.

రాజుగారి కోరిక కైకవశి మనస్సుదాకా చేరడానికి ఎక్కువకాలం పట్టలేదు. కైకవశి ఏమనుకుంది? ఈ ప్రశ్నకు సమాధానం కష్టం.

అర్చకునిపాలెం మామిడితోటలో కాయని స్వయంగా దింపించడానికి వచ్చారు బుల్లిరాజుగారు. రాజుగారే స్వయంగా నిలిస్తే ఒక్క కాయ వృథాపోదు సరికదా, ఆదాయంలో ఒక్క రూపాయీ తగ్గదు. ఆ సాయంకాలం అక్కడే ఉన్న పర్ణశాలలో బసచేసి, కైకవశి ద్వారా సుభద్రాచార్యుల ఇంటినుంచి పులిహోర, పాలూ తెప్పించుకున్నారు. అరిటాకు కోసి భక్తిగా వడ్డించే కైకవశి నడుం చుట్టూ చెయ్యివేశారు. ఆమె కళ్ళు తామరపుష్పాలయ్యాయి. నడుం వణికింది.

వ్యాసుని సమక్షంలో విదురుని తల్లిలాగా, భక్తిగా రాజుగారి చేతుల్లో వొదిగిపోయింది.

రాజుగారి మనస్సులో మాత్రం కోరిక వెయ్యి గుర్రాలయి పగ్గాలు తెంచుకుంది. భక్తితో కూడిన సంస్కారాన్ని తలమునకలయిన కోరిక ఆవరించుకుంటే ఏమవుతుంది?

నవనీతం అవుతుంది.

పేదవాడు అవినీతిపని చేస్తే కులం 'తప్పు' వేస్తుంది. జరిమానా కట్టమంటుంది. మధ్య తరగతివాడు తప్పు చేస్తే, అతి విలువయినది పోతుంది. దానిపేరు 'పరువు'. దాని అవసరం మధ్యతరగతి మనిషికి ఎంతయినా ఉంది. గొప్పవాడు తప్పు చేస్తే దానికి 'వినోదం' అని ముద్దుపేరు పెడుతుంది సమాజం.

పద్మనాభంలో అందరికీ కైకవశి కడుపులో పెరిగే శిశువు ఎవరిదో తెలుసు. అయితే ఎవరూ నోరు విప్పి మాట్లాడలేదు. అది ఊరందరికీ తెలిసిన రహస్యం. కైకవశి నీళ్ళు పోసుకున్నాక ఆలయంలో ఉండలేదు. మాడావీధిని ఆనుకునే చిన్న పెంకుటిల్లుని బేరం చేసి ఇచ్చారు బుల్లిరాజుగారు. అయినా ఆలయం పని మానలేదు. కైకవశి కడుపులో పడిన నవనీతం పద్మానాభాన్ని ఏమీ స్పందింపచెయ్యలేదు. కానీ భూమిమీద పడిన నవనీతం ఆ ఊరులో భూకంపం లేపింది.

దాదాపు ఆరేడు నెలల తేడాలో ముగ్గురు పుట్టారు. సుభద్రాచార్యులవారు కొడుక్కి తండ్రిపేరు పెట్టారు చినతిరుమలాచార్యులు. బుల్లిరాజుగారు కొడుక్కి వేటలో పులిపంజాతో చచ్చిపోయిన చిన్నాన్న వీరభూపతిరాజుగారి పేరు పెట్టారు. కైకవశికి పుట్టిన బిడ్డలో కెంపుల్లాగా మెరిసే రెండు పెదాలు తప్ప ఏమీ కనిపించేది కాదు. శరీరం మంచి గంధంలాగా లేత పసుపు. పిల్ల అందగత్తె అని ఎవరూ చెప్పనక్కరలేకుండానే పుట్టగానే అర్థమయిపోయింది. 'నవనీతం' అని సుభద్రాచార్యులే నామకరణం చేశారు.

ముగ్గురివీ మూడు విభిన్నమయిన స్వభావాలు. మూడు ధోరణులు. గర్భాష్టమాన కొడుక్కి పంచసంస్కారాలూ చేయించి శిఖ, యజ్ఞోపవీతం ధరింపజేశారు సుభద్రాచార్యులుగారు. తనతో కూర్చోపెట్టి మూడుపూటలా నిష్ఠగా సంధ్యావందనం చేయించారు. నాలుగోయేటికే పదహారు పాశురాలు అనర్గళంగా చదివేవాడు తిరుమల.

భగవద్గీత రెండో అధ్యాయంలో మొదటి పది శ్లోకాలూ, ఎటునుంచి ఎటు చదవమన్నా అక్షరం పొల్లుపోకుండా చదివేవాడు. ఊళ్ళో అందరికీ పెద తిరుమలాచార్యులవారు మళ్ళీ తమ ఊరికి వేంచేశారని పొంగిపోయారు.

"ఆచార్యులకి వైద్యం నేర్పించు సామీ! పెద్దాయన పోయాక మాకు దిక్కులేకుండా పోయింది" అనేవారు వూరివాళ్ళు.

కానీ సుభద్రాచార్యులవారికి ఆలోచనలే వేరు. కొడుకుని కూతురులాగా పెంచారు. ఉదయం లేచినప్పటినుంచీ తండ్రిని అంటిపెట్టుకునే వుండేవాడు. నెలకు రెండుమార్లు తండ్రితోపాటు నున్నగా క్షవర సంస్కారం చేయించుకునేవాడు గోస్తనీ స్నానం ముగిసి ఇంటికి రాగనే ద్వాదశ పుండ్రాలు దిద్దుకునేవాడు.

గుడిలో అనునిత్యం పెరుమాళ్ళుకి ఆరాధన, అయిదు విధులు, ధృవ, కౌతుక, స్నపన, బలి, శయన. కొన్ని విధులు, కొన్ని ఆచారాలు. అయితే అన్నీ నిత్యకృత్యాలు.

ముందురోజు నిర్మాల్యాన్ని స్వయంగా పక్కకి తీసేవాడు తిరుమల. కైకవశి అంతే భక్తిగా దానిని బయటకి చేర్చేది. తనూ, నవనీతం కలిసి కూర్చిన మాలల్ని స్వామికి సమర్పించుకునేది. గర్భగుడిలో మూలవిరాట్టు కుంతీమాధవస్వామి. రెండుపక్కలా శ్రీదేవి, భూదేవి. కాస్త దూరంగా స్వామికి చామరం పడుతు గంధర్వులు. పాదాల దగ్గర గరుడాళ్వారు, ఆంజనేయస్వామి. ఎడమచేత్తో మాధవస్వామి అబయం ఇవ్వడం ఇక్కడి విశేషం. కుడివైపు చక్రత్తాళ్వార్ ఎడమవైపు వేణుగోపాలస్వామి, రుక్మిణీ, సత్యాభామా విగ్రహాలు. సత్యనారాయణమూర్తి విగ్రహం. గర్భగుడి పైన కళ్యాణమూర్తులు. ఆలయంలో అష్టదిక్పాలకులకీ ప్రతిరోజూ బలిహరణ ఉంటుంది. కళ్యాణోత్సవాల సమయంలో గ్రామ బలిహరణకు చక్రత్తాళ్వార్ తరలి వెళ్తారు. అన్ని మూర్తులకీ వస్త్రాలు అలంకరించి స్వయంగా తోమాలసేవ చేసుకునేవాడు చినతిరుమలాచార్యులు. రుక్మిణమ్మకూ, వరదమ్మకూ గర్భగుడిలో చినతిరుమలాచార్యులు విప్రనారాయణుడిలాగా కనిపించేవాడు.

ఆరాధనకి స్వయంగా పాత్రల్ని నెత్తిన పెట్టుకుని భోజనశాలనుంచి తెచ్చి తండ్రిగారి ముందుంచేవాడు. మంగళాశాసనమయ్యాక తీర్థగోష్టి ఎల్లరకూ ఆలయంలోనే.

రాత్రి స్వామికి పవ్వళింపుసేవ అయ్యాకనే కైంకర్యం. అతి పవిత్రంగా, అతి సరళంగా, అవ్యక్తమధురంగా కాలం ప్రవహించిపోతున్నది, సుభద్రాచార్యులవారికి సంబంధించినంతవరకూ. ఆయన జీవితంలో అదొక మధురమయిన దశ.

మరి వీరభూపతిరాజుగారి సంగతి? తెలివితేటల్లో తిరుమలాచార్యులవారికేమీ తీసిపోడు. కాకపోతే ఆ తెలివితేటలు అవలంబించిన దారి వేరు తండ్రి హుక్కాని తండ్రికి అనుమానమయినా రాకుండా పీల్చడం అతి చిన్న వయస్సులోనే ప్రాక్టీసు చేశాడు. గంజాయిలో చిన్న

చిన్న నల్లమందుపాలు ఉన్నదని తెలీదు. అధికారం, అహంకారం తమ జన్మహక్కు అన్న ఆలోచన ఆ రోజుల్లోనే భూపతిరాజుగారికి నరనరాల్లోనూ పట్టేసింది.

వయస్సు ఇంకా కొసరుతున్నట్టూ పదేళ్ళకే పచ్చని దబ్బపండులాంటి శరీర ఛాయతో మెరుపు తీగెలాగా తయారయింది నవనీతం. రాజుగారి అహంకారం, కైకవశి వినయశీలం కలబోస్తే ఏమవుతుంది?

"నువ్వేనా, మా నాన్న ఉంపుడు కత్తె కూతురువి?" అని నిలదీశాడు భూపతిరాజు ఓసారి రోడ్డుమీద అడ్డంపడి.

అందరూ చూస్తుండగా చెంపచెళ్ళుమనిపించేలాగా కొట్టింది నవనీతం. ఊరి నడిబొడ్డున ఆ దెబ్బ తుపాకీలాగా పేలింది. వెంటనే పగలబడి నవ్విన నవ్వు వినిపించింది. వెనకనే బుల్లిరాజుగారు బండి దిగారు. ఆ మాట ఆయనకి వినిపించిందని ఎవరూ గుర్తించలేదు.

"ఇప్పటికయినా అది మీ నాన్న కూతురని అర్థమయిందిరా, లంజాకొడకా" అన్నారు బుల్లిరాజుగారు, ముఖంలో మర్యాదని పోనివ్వకుండా కొడుకు చెవిదగ్గర ముఖం పెట్టి "ఇకముందు ఆ పిల్లజోలికి వచ్చావా, తోటలో జీతగాళ్ళని పెట్టి తోలు వొలిపిస్తా" అని హుంకరించాడు.

"రానివ్వండి, ఆ పని నేనే చేసిపెడతా" అని ఇద్దరి చెవిదగ్గరా ముద్దుగా అని నడచి వెళ్ళిపోయింది నవనీతం. కితకితలు పెట్టినట్టు నవ్వుకున్నారు బుల్లిరాజుగారు. ఏకాంతంగా ఇంట్లో జరగాల్సిన ముచ్చట రోడ్డుమీద జరిగినందుకు విస్తుపోతూ, అదేమీ తమకు అర్థంగానట్టు ఊరిలో మనుషులు ఎవరి పనుల్లోకి వాళ్ళు తిరిగి పోయారు. రాజుగారి రహస్యం రోడ్డున పడినా అంతఃపురంలో ఉన్నట్టే.

కానీ ఆ రోజునుంచీ భూపతిరాజుగారు నవనీతం మీద పగపట్టారు. రాజుగారి పౌరుషం తాచుపాములాగా బుసలుకొట్టింది. ఆ రాత్రి రాజుగారి ఖాతాలో విస్కీ తాగుతూ, "సెప్పండి, బాబూ! ఆ లంజని లేవదీసుకొచ్చి తనముందు బట్టలిప్పి నిలబెట్టమంటారా?" అన్నాడు కత్తి గవర్రాజు మీసాలు దువ్వుతూ. ఎందుకనో చటుక్కున లేచి గవ్వర్రాజు మూతిమీద తన్నాడు భూపతిరాజు. భూపతిరాజు వయస్సు పన్నెండు. గవర్రాజు వయస్సు ముప్పై అయిదు. నవనీతాన్ని తనముందు మరొకరు 'లంజ' అంటే ఎందుకని కోపం వచ్చింది? ఆమె మీద పగబడితే తను పట్టాలి. దెబ్బతీస్తే తను తీయాలి. గవర్రాజు ఎవడు?

సుభద్రాచార్యులవారికీ, బుల్లిరాజుగారికీ కలిసినట్టు చినతిరుమలాచార్యులకీ, భూపతిరాజుగారికీ కలవలేదు. కానీ కైకవశికి ఆ కుటుంబం మీద ఉన్న భక్తీ, మమకారమంతా నవనీతానికి పూసుకొచ్చింది. ఆమె రక్తంలో పుణికిపుచ్చుకున్న సంస్కారంలో రెండు ముఖాలున్నాయి. ఒకటి ఆలయంలో తల్లికి నీడయి ప్రవర్తించేది. రెండు రొడ్డుమీద భూపతిరాజుగారి మీద విరుచుకుపడేది. సృష్టిలో ఎక్కడో ఏదో విచిత్రమయిన 'లయ' ఉంది. అర్థం చేసుకున్నవాళ్ళకి దాని సౌందర్యం కనిపిస్తూనే ఉంటుంది.

ఉన్నట్టుండి బుచ్చియ్యమ్మని కాపరానికి తీసుకువెళ్ళడానికి అల్లుడు వచ్చినప్పుడే బిత్తరపోయారు మామ రఘుపతిరాజుగారు. ఆ పరిణామాన్ని ఆయన ఊహించలేదు. అన్నవరం కొండమీదకి తడిబట్టల్తో ఎక్కి ఆ రోజునుంచే మందుముట్టనని దేవునిముందు ప్రమాణం చేశారు.

బుచ్చియ్యమ్మకి బిడ్డ పుట్టగానే పురిటిలోంచే మూర్ఛ రావడం నిలిచిపోయింది. రఘుపతిరాజుగారు పసివాడిలాగా ఏడ్చేశారు. భార్యతో కలిసి తీర్థయాత్రలన్నీ చేసుకువచ్చారు. భూపతిరాజు భూమి మీద పడి తాతగారిని గొప్ప దైవభక్తుడిని చేసేశాడు.

ఆ దరిమిలాను రాజుగారింట్లో పూజలూ, పునస్కారాలూ దైనందిన చర్యలుగా మారిపోయాయి. రఘుపతిరాజుగారి మనస్సులో ఓ కోరిక ఉంది కానీ అది కార్యరూపం దాల్చడానికి దాదాపు పన్నెండు పదమూడు సంవత్సరాలు పట్టింది. గజపతినగరం దగ్గర వేగిలో వంద ఎకరాల శ్రేష్ఠమయిన మాగాణీని బేరం పెట్టి, ఆ డబ్బుతో తమ ఊళ్ళో గుడి కట్టించాలని పూనుకున్నారు రఘుపతిరాజుగారు. ఆ

నోటా ఈ నోటా విన్నారు బుచ్చియ్యమ్మ జీవితం బాగుపడడానికి పరోక్షంగా కారకులు సుబ్రద్రాచార్యులుగారని. మరొకరెవరయినా బుల్లిరాజుగారి మనస్సు మళ్ళించలేరు. ఆ రుణం తీర్చుకోవాలనే ఆత్రం కూడా వారి మనస్సులో నిలిచిపోయింది.

అందుకని అల్లుడిని వెంటబెట్టుకుని ఓ మంచిరోజు చూసుకుని పట్టుపీతాంబరాలతో సుభద్రాచార్యులవారి దగ్గరకి వచ్చారు రఘుపతిరాజుగారు.

పట్టువస్త్రాలనీ, కానుకలనీ చూసి, "స్వామి కళ్యాణానికి చదివిద్దురుగాని, ఇంకా నాలుగు నెలలే ఉంది" అన్నారు ఆచార్యులుగారు.

రఘుపతిరాజుగారు నవ్వి "ఇవి మీకోసం, ఆచార్లుగారూ! తమని ఓ కోరిక కోరడానికి వచ్చాను" అన్నారు.

అర్థంగాక బుల్లిరాజుగారి వంక చూశారు సుభద్రాచార్యులు.

"నాతో నాలుగేళ్ళబట్టి పోరుతున్నాడు ఆచార్లు! ఊళ్ళో గుడికట్టించడానికి అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాడు. నిన్ను సకుటుంబంగా రమ్మనడానికి ధైర్యం చాలలేదు. ఆ మాటంటే నేను అడ్డంపడి నరుకుతాను. నీ కభ్యంతరం లేకపోతే" తను చెప్పలేక మామని పొడిచాడు బుల్లిరాజు.

"మీ అబ్బాయిని మా ఊరు పంపించండి. స్వామిని సేవించడానికి మీరు అంగీకరిస్తేనే స్వామి ప్రతిష్ఠ. కాదనకూడదు" అని చేతులు పట్టుకున్నాడు రఘుపతిరాజుగారు.

తలుపుచాటు నుంచి రెండు కాఫీ గ్లాసులు వచ్చాయి. రుక్మిణమ్మ, వరదమ్మ ఆ మాటలు వింటున్నారు వరదమ్మ ఆచార్లుగారిని లోపలికి పిలిచింది. కాసేపటికి నవ్వుతూ బయటకి వచ్చారు ఆచార్లుగారు. ఆయన ప్రసన్నత చూసి బుల్లిరాజుగారి ముఖం ఇంతయింది. రఘుపతిరాజుగారయితే కుర్చీలోంచి దూకేశారు.

"అంగీకరించినట్టేనా?" అన్నారు.

"పెళ్ళయ్యాక మా ఆవిడ ఏనాడూ నన్ను ఏ కోరికా కోరలేదు రాజుగారూ. ఆవిడకేం కావాలో, కావాల్సింది ఇవ్వగలిగే స్తోమత నాకు ఉందో లేదో నేనెప్పుడూ ఆలోచించలేదు. ఎప్పుడయినా ఏ చిన్న కోరికయినా కోరకూడదా? అని ఆశపడేవాడిని పెళ్ళయిన పదిహేను సంవత్సరాలకి మీ కారణంగా ఆ కోరిక కోరింది" అన్నారు.

రఘుపతిరాజుగారు గర్వంగా అన్నారు" చెప్పండి, ఆచార్లుగారూ అదెంత గొప్పదయినా తీరుస్తాను చెప్పండమ్మా" అన్నారు.

తలుపు వెనుక గాజులు గలగలమన్నాయి.

సుభద్రాచార్యులుగారు నవ్వుకున్నారు. "నా కొడుకుని నా నుంచి దూరం చెయ్యకండి అంది, రాజుగారూ" అన్నారు.

రఘుపతి రాజుగారు అంత మనిషీ కుర్చీలో కూలబడిపోయారు.

"వరదమ్మ అమాయకురాలు. అంతకోరిక ప్రయత్నించి అడగక్కరలేదు. ఎందుకంటే ప్రయత్నించినా నేనా పని చెయ్యలేను కనుక. తిరుమల నాకు మా నాన్న. మా నాన్న ఉంటే నాజీవితంలో ఏం జరిగేవో, అవన్నీ తిరుమల నష్టపోకూడదని నా కోరిక. వారసత్వం సంప్రదాయం ఇచ్చిన వరం. ఈ చిన్న గుడి మా జీవితాలకి చాలు" అన్నారు.

బుల్లిరాజుగారు సుభద్రాచార్యులని చూసి ఉప్పొంగిపోయారు. ఒక్కసారి కావలించుకున్నారు. "క్షమించు, ఆచార్లూ ఇంకెప్పుడూ అలాంటి కోరిక నీదాకా రానివ్వను" అని మామగారిని లేవదీశారు.

రుక్మిణమ్మకీ, వరదమ్మకీ సుభద్రాచార్యులు గాలిగోపురమంత ఉన్నతంగా కనిపించారు. వారిద్దరి కళ్ళూ గోస్తనీ తరంగాలయిపోయాయి.

కానీ, మరో పదిరోజుల్లో వాళ్ళ జీవితాల్ని సమూలంగా మార్చే పరిణామం రాబోతోందని వారెవరికీ తెలీదు.

ఆ పరిణామం పేరు వెంకటాచలం.

6

వెంకటాచలం పరిచయం చాలా విచిత్రంగా, విచిత్రమయిన పరిస్థితుల్లో జరిగింది. అది ఎంత దైవికమో, మరో పదేళ్ళ తర్వాత వెనక్కి తిరిగి చూసుకుంటే సుభద్రాచార్యుల వారికి అర్థమయింది.

ఓ ఉదయం రుక్మిణమ్మ ఆలస్యంగా స్నానం ముగించుకుని వంటగదిలోకి వచ్చేసరికి, అప్పటికే స్వామి కైంకర్యాన్ని ఆరాధనకి అందించి, ఇంటి పనిలో మునిగిన వరదమ్మ గదికి అడ్డంగా విరుచుకుపడిపోయి ఉంది. పొయ్యిమీద పాలు పొంగి, కాగి, నురుగులయి గిన్నెచుట్టూ జారింది.

ఒక్క క్షణం నివ్వెరపోయి, కెవ్వున కేకవేసింది రుక్మిణమ్మ. సుభద్రాచార్యులు, కైకవశి. దూరాన సూర్యనమస్కారాలు చేస్తున్న తిరుమల అంతా పరుగున వచ్చారు. భార్యని ఆ స్థితిలో చూసి సుభద్రాచార్యులకి నోట మాట రాలేదు. కైకవశి మరో ఆలోచన లేకుండా వరదమ్మని ఒడిసిపట్టుకుని భుజాన వేసుకుంది. వసారాలో ఉన్న నులకమంచం మీద పడుకోబెట్టింది.

మరో అరగంటలో ఊరంతా గుడిముందు ఉంది. కబురు వెళ్ళగానే బుల్లిరాజు హుటాహుటిన పరుగెత్తుకు వచ్చారు. ఆ రోజుల్లో ఊళ్ళోకి ఒకే బస్సు వచ్చేది భీమిలీ నుంచి. పట్నం వెళ్ళాలంటే తగరపు వలస దగ్గర బస్సు మారాలి. రేవిడి, కురుదేవపల్లి రోడ్లన్నీ బురదమయం. తగరపు వలసదాకా పన్నెండు మైళ్ళు ప్రయాణం చెయ్యడం పెద్ద గగనం. అయినా మరో గత్యంతరంలేదు. వరదమ్మని ఓ బండిలో పడుకోబెట్టి కైకవశిని ఎక్కించారు. అప్పటికప్పుడు బుల్లిరాజుగారూ, సుభద్రాచార్యులుగారూ మరో బండి ఎక్కారు.

కేవలం నాలుగయిదు గంటల తర్వాత విశాఖపట్నం చేర్చారు వరదమ్మని. సీతారామస్వామి కోవెలకి ఎదురుగ్గా ఒక ఆసుపత్రి. విక్టోరియా స్త్రీల, పిల్లల ఆసుపత్రి. ఘోషా ఆసుపత్రి. అక్కడికి మోసుకొచ్చారు. మట్టి కొట్టుకుపోయిన మనుషులూ, హడావుడి పడుతున్న జీతగాళ్ళూ, బుర్రమీసాల రాజుగారూ, కేవలం చెంగావి ఉత్తరీయం, పుండ్రాలతో శ్రోత్రియ బ్రాహ్మణుడూ. అంతా విడ్డూరమయిన దృశ్యంలాగా ఉంది. ఓ పేషెంటుని ఆసుపత్రిలో చేర్చడానికి పట్నంలో అంతా హడావుడి అక్కరలేదు. బయట ఆసుపత్రి వరండాలో కూర్చున్న ఓ పెద్దమనిషి ఈ తతంగాన్ని గమనిస్తున్నాడు. నల్లగా, స్ఫోటకం మచ్చలతో, బరువుగా ఉన్నాడు. మట్టిరంగు జోథ్‌పూర్ సూటులో ఉన్నాడు. తలమీద నల్లటిపూలు టోపీ. టోపీకింద జుత్తు మచ్చుకయినా లేదని అర్థమవుతోంది. మాట్లాడితే తెలంగాణా యాస కొట్టొచ్చినట్టు తెలుస్తోంది.

"ఆవిడకేమయింది?" అని బుల్లిరాజుగారిని అడిగాడు.

"ఏమయితే నీకెందుకయ్యా మగడా" అన్నారు బుల్లిరాజుగారు.

"ఆ వెనకనున్న నామాలాయన్ని నేనెక్కడో చూసిన జ్ఞాపకం, అందుకని అడిగాను పెళ్ళామా!" అన్నాడు నల్లటి వూలుటోపీ.

అలా వాళ్ళిద్దరికీ పరిచయం ప్రారంభమయింది. బుల్లిరాజుగారు ఘొల్లుమని నవ్వారు. ఆసుపత్రి ఒక్కసారి తుళ్ళిపడింది.

"మా ఆవిడనీ అలాగే తీసుకొచ్చాను" అన్నారు వూలుటోపీ. పేరు వెంకటచెలం.

"ఆవిడ మా ఆవిడ కాదు" అన్నారు రాజుగారు.

"నేను తీసుకొచ్చిందీ మా ఆవిడని కాదు" అని రాజుగారి కడుపులో పొడిచాడు వెంకటాచలం. ఇలా చొరవతీసుకుని మాట్లాడేవాళ్ళు రాజుగారికి కొత్త. ఆయనకి కోపం రాలేదు. వింతగా ఉంది.

"ఆవిడకేమయింది?" అన్నారు రాజుగారు.

"రాత్రి విస్కీ తాగమంటే విరుచుకు పడిపోయింది" అని పగలబడి నవ్వాడు వెంకటాచలం. ఆ నవ్వుకి ఆసుపత్రిలో ఒక్క వార్డు కూడా తుళ్ళిపడలేదు. వెంకటాచలం గొంతు ఆడపిల్ల గొంతులాగా ఉంటుంది. నవ్వు నూతిలో చేదలాగా కిచకిచమంటుంది.

రాజుగారు షాక్ అయిపోయారు. "ఆడపిల్లకి విస్కీ ఇచ్చావా? ఏం మనిషివయ్యా?"

"మొదట బ్రాందీ అడిగాను, గురూ" అన్నాడు వెంకటాచలం. పలకరించినప్పటికంటే మాటమాటకీ మరీ దగ్గరకి వచ్చేస్తున్నాడు.

వెంకటాచలం దక్కన్ రేడియోలో ఆఫీసరుగా పద్దెనిమిది సంవత్సరాలు పనిచేశాడు. మూడేళ్ళ క్రిందట తెలంగాణా ఆంధ్రదేశంలో భాగమయ్యాక కొన్ని గవర్నమెంటు ఆఫీసులూ ఆంధ్రదేశంలో భాగమయిపోయాయి. ఆ విధంగా ఇన్ఫర్మేషన్ డిపార్టుమెంటులో డిప్యూటీ డైరెక్టరయ్యాడు. తనతో పనిచేస్తున్న సూపరిండెంట్ జయవాణితో విశాఖపట్నం కాంపుకి వచ్చాడు. గెస్ట్‌హౌస్‌లో మధ్యాహ్నం ఇద్దరూ కలిసి భోజనం చేశారు. రాత్రి ఇద్దరూ కలిసి కబుర్లాడారు. అప్పుడే వాళ్ళ పరిచయం విస్కీ దాకా వచ్చింది. ఆ సందర్భంలోనే ఉన్నట్టుండి కుర్చీలోనే పడిపోయింది. మెసానిక్ లాడ్జి దగ్గర గెస్ట్ హౌస్ నుంచి ఓ రిక్షాలో ఆసుపత్రికి చేర్చాడు. అది నిన్నటి రాత్రి కథ.

మళ్ళీ మొదటికొచ్చాడు వెంకటాచలం. "ఈ నామాలాయన ఎవరు?"

ఈసారి రాజుగారు తిరగబడలేదు. "మగడా?" అనబోయి ఆగి, "చూడు బాబూ నామాలున్న పెద్దమనుషులందరూ ఎక్కడ చూసినా ఒకలాగే ఉంటారు" అన్నారు.

"మరి నేనలాగ లేనెందుకు?" అనడిగాడు వెంకటాచలం.

రాజుగారు ఆశ్చర్యపోయారు. "అంటే నువ్వు?"

"**పక్కా** శ్రీ వైష్ణవుడినయ్యా, భయ్యా! తురక నౌఖరీలో పడి నామాలు చెరిగిపోయాయి. విశాఖపట్నం కనక ఇలా వచ్చాను. హైదరాబాదులో షర్వా, పాన్ కూడా వేస్తా. మాది మీర్ ఉస్మాన్ అలీఖాన్ జమానా!" అన్నాడు జేబులోంచి పాన్ తీస్తూ.

మరొక గంటసేపు మాట్లాడాక వెంకటాచలం తేల్చిన విషయం ఏమిటంటే, సుభద్రాచార్యులవారి అత్తవారివైపు దూరపు బంధుత్వం ఉన్నదని. ఎన్నో తరాల కిందట తమ పూర్వులు ఈ ప్రాంతంనుంచే తెలంగాణా తరలివెళ్ళారట.

సుభద్రాచార్యులవారు బయటికి వచ్చేసరికి "అమ్మాయి ఎలా ఉంది?" అని ఆయనకి ఎదురొచ్చాడు వెంకటాచలం.

ఏ అమ్మాయో అర్థంకాక తెల్లమొహం వేశారు సుభద్రాచార్యులు. రాజుగారు నవ్వుతూ వెంకటాచలం వీపు చరిచారు. ఆ శబ్దానికి ఆసుపత్రి ప్రతిధ్వనించింది. వెంకటాచలానికి దాదాపు కళ్ళు తిరిగాయి.

"ఈయన అమ్మగారికి దూరపు బంధువులవుతారట వెంకటాచలం. హైదరాబాదులో ఉద్యోగం చేస్తున్నారు" అని పరిచయం చేశారు.

వెంకటాచలం సుభద్రాచార్యులవారికి పాదాభివందనం చేశాడు.

"అమ్మగారు ఎలా ఉన్నారు?" అని అడిగాడు బుల్లిరాజుగారు.

వెనకనుంచి వచ్చిన డాక్టరు యతిరాజమ్మ సమాధానం చెప్పింది. "ఫస్ట్‌క్లాస్‌గా ఉన్నారు. ఆవిడకి రెండో నెల. పద్నాలుగేళ్ళ తర్వాత కాన్పు కనక, శరీరం కాస్త ఎదురు తిరిగింది. ఆవిడకేం భయంలేదు. మీరు ఇంటికి తీసుకెళ్ళవచ్చు" అంది.

"మరి మా జయవాణి కేమయింది?" అడిగాడు వెంకటాచలం.

"ఫుడ్ పాయిజన్ అయింది. షి ఈజ్ ఎనిమిక్. మీరేనా భర్త?"

"ఆమెకి భర్తలేడు. నేను ఆఫీసర్ని" అన్నాడు వెంకటాచలం.

"సాయంకాలం ఆమెని డిశ్చార్జ్ చేస్తాను. టానిక్ రాసిచ్చాను" అంది యతిరాజమ్మ.

"బండి మాట్లాడివస్తాను, ఆచార్లుగారూ" అన్నారు రాజుగారు.

"మా సిస్టర్ని నేను దింపుతానయ్యా, మహారాజా బయట కారుంది" అన్నాడు వెంకటాచలం.

ఈ విధంగా కారులో సుభద్రాచార్యులవారు భార్యతో సహా పద్మనాభం తిరిగి వచ్చారు. ఎంత బంధుత్వం కలిసినా, క్రాపింగు పెట్టుకున్నవాళ్ళకి ఇంట్లో వడ్డన చెయ్యరు. వెంకటాచలానికి ఇబ్బందులేమీ లేవు. బుల్లిరాజుగారింట్లో వేటమాంసంతో సుష్టుగా భోజనం చేశాడు. పందిరి పట్టెమంచంమీద మధ్యాహ్నం కునుకు తీసి, మళ్ళీ ఆలయానికి వచ్చాడు. అదిగో, అప్పుడు చిన తిరుమలాచార్యుల్ని గమనించాడు వెంకటాచలం.

ఊర్ధ్వపుండ్రాలూ, గుండూ, శిఖా, అంగవస్త్రం, ఉత్తరీయంతో ఉన్న వటువుని చూసి ఆశ్చర్యపోయాడు.

"అదేంటి బాబూ! నిక్షేపంలాంటి కుర్రాడివి ఇలా అయిపోయావు?" అన్నాడు నిజమైన పశ్చాత్తాపంతో.

సమాధానం వెనకనుంచి వచ్చింది. "ఆ కుర్రాడినేమయినా చేశావంటే నేను కత్తితో పొడుస్తాను" అన్నారు బుల్లిరాజుగారు.

"ఈ కుర్రాడిని ఏదో ఒకటి చెయ్యకుండా వదలను. ఆ పైన కత్తి నేనే కొనిస్తాను" అన్నాడు వెంకటాచలం.

తిరుమల ఎంత అఖండమయిన తెలివితేటలు గలవాడో వివరించారు బుల్లిరాజుగారు. తిరుప్పావై, తిరుమాళై దివ్య ప్రబంధంలో శ్లోకాలని చదివించారు. ఆ కుర్రాడి తేజస్సు. స్పష్టమయిన ఉచ్చారణ, ధారణకి నిర్ఘాంతపోయాడు వెంకటాచలం. రాజుగారి మాటకి సమాధానం కోసం పట్టుదలగా అన్నాడే గానీ, నిజానికి ఈ కుర్రాడు ఇక్కడ ఉండవలసినవాడు కాదనుకున్నాడు. మరి ఎక్కడ ఉండాలి? ఏమో? అది దైవ ఘటన. ముందు తను చేసే పని తాను చేస్తాడు.

జేబులో చిన్న నోట్‌బుక్ తీసి, ఇంగ్లీషు నాలుగుబడులూ రాసి అక్కడికక్కడే అక్షరాభ్యాసం చేశాడు. డ్రైవర్ని పిలిచి కుర్రాడికి చూపించి, "ఈ డ్రైవరు రేపు నీకు రెండు పుస్తకాలిస్తాడు. అవి చదివి, మళ్ళీ నాకు నాలుగురోజుల్లో ఇచ్చెయ్యాలి" అన్నాడు. రాజుగారు ఇదంతా కుర్రాడికి పెట్టే పరీక్షలాగా చూస్తున్నారు. సుభద్రాచార్యులుగారికిదంతా తెలీదు.

మర్నాడు ఇంగ్లీషు పుస్తకాలు వచ్చాయి. మూడోరోజు ఉదయం తిరుమల జీవితంలో మొదటిసారిగా తండ్రితో గోస్తనీ నదికి వెళ్ళలేదు. నదికి చేరాకగానీ ఈ విషయం సుభద్రాచార్యులకి అర్థంకాలేదు. నిర్ఘాంతపోయారు. ఇంటికి వచ్చాక పడకగదిలో ఓ మూల ముతక ఖద్దరు దుప్పటి తలదాకా కప్పుకుని ఇంగ్లీషు మాటలు కూడబలుక్కుంటున్న తిరుమల కనిపించాడు.

వరదమ్మ నవ్వుతూ కారణం చెప్పింది. అప్పుడు తెలిసింది సుభద్రాచార్యులవారికి, మూడు రోజుల కిందట వచ్చిన వెంకటాచలం చేసిన పని.

సుభద్రాచార్యులు విసుక్కున్నారు. వరదమ్మ సర్దిచెప్పింది. "కుర్రాడికి పొగాకు, గంజాయి అలవాటు చెయ్యలేదు కదా! కొత్త చదువు. వద్దనడం ఎందుకు? నా కొడుకు ఇంగ్లీషు చదువుతూంటే నాకు గర్వంగా ఉంది"

"శ్రీమన్నారాయణా" అనుకున్నారు.

కొత్త ఆకర్షణలు అలవాటయి, అవసరమయి, వ్యసనమయి, వదులుకోలేని లంపటమయి తర్వాత?

తర్వాత వెంకటాచలం తరచు విశాఖపట్నం వస్తూనే ఉన్నాడు. కారణం జయవాణితో చిన్న ఇల్లు చిన్నం వారి వీధిలో సెటప్ చేశాడు. వచ్చినప్పుడల్లా దానిమ్మ పళ్ళు, అనాబ్‌షాహీ ద్రాక్ష, కమలాలు పట్టుకుని, తన చెల్లెల్ని చూడటానికి పద్మనాభం వస్తున్నాడు. అలా

వచ్చినప్పుడు కొత్త పుస్తకాలు, పెన్సిళ్ళు, చిన్న చిన్న వ్రాతపుస్తకాలూ, రంగురంగుల అట్టలున్న బైండుబుక్కులూ తెచ్చి తిరుమలకి ఇస్తున్నాడు.

మేధస్సు అగ్నిశిఖలాంటిది. దాని ఆకర్షణకి లోనయిన ఏ పదార్థాన్నయినా అది జీర్ణం చేసుకుంటుంది. తిరుమల బాలమేధావి. ఆ విషయాన్ని ఎవరూ గుర్తించలేదు. ప్రతి శక్తికీ చిన్న తరిఫీదు కావాలి. చిన్న ఛాలెంజ్ కావాలి. చిన్న ఊతం కావాలి.

వెంకటాచలం ఆ ఊతం అయ్యాడు. తెలియకుండానే రాజుగారికి మంచి మిత్రుడయిపోయాడు వెంకటాచలం. బుల్లిరాజుగారు అమితంగా గౌరవించే పవిత్రమయిన స్నేహితుడు సుభద్రాచార్యులు. ఆయనతో సరసన కూర్చుని, విస్కీ తాగి, వేటమాంసం తిని, భుజం భుజం రాసుకుని కబుర్లు చెప్పే మిత్రుడు వెంకటాచలం.

ఆకులూ, అలమలూ, దుమ్ము, దూసరా పరుచుకున్న అయస్కాంతాన్ని వెతికి బయటికి తీసినట్టయింది తిరుమలకి. పుట్టి బుద్దెరిగాక ఎన్నడూ చూడని, వినని ఈ కొత్త చదువు, కొత్త విజ్ఞానం అతని మనస్సుని పూర్తిగా ఆవరించుకుంది.

ఆండాళ్ళు పురిటికి వరదమ్మ శ్రీకూర్మానికి వెళ్ళింది. తిరుమల వెళ్ళనన్నాడు. నాయనమ్మ రుక్మిణమ్మ దగ్గరే ఉండిపోయాడు. ఆండాళ్ళు పుట్టేసరికి నాలుగేళ్ళ కొత్త చదువుని ఆరేడు నెలల్లో ఔపోశనం పట్టేశాడు తిరుమల.

వెంకటాచలానికి తిరుమల మట్టిలో వదిలేసి మరిచిపోయిన మాణిక్యం. దాని విలువ తెలియనిచోట అది మురిగిపోతోందని అతని ఉద్దేశం. దాని విలువ వాళ్ళకీ తెలిసేటట్టు చెయ్యాలి. తను కూడా ఊహించలేనంతగా తిరుమలలో వచ్చే మార్పుని ఆశ్చర్యంతో గమనించాడు వెంకటాచలం. ఎవరో కుర్రాడి గురించి ఎందుకింత శ్రమ?

ఆ మాటే అడిగాడు బుల్లిరాజు మామిడితోటలో ఆరో పెగ్గు విస్కీగ్లాసు దించాక.

"ఓ నిజం చెప్పనా మహారాజా!" అన్నాడు వెంకటాచలం చెట్టుకింద పరిచిన తివాచీమీద వెల్లకిలా పడుకుని. "వరదమ్మ నా చెల్లెలూ కాదు, నేను అన్ననీ కాదు. అసలా శ్రీకూర్మం ఎక్కడుందో నాకు తెలీదు"

"అమ్మ తప్పుడు నా కొడకా! ఎంత లుచ్ఛాపని చేశావురా?" అన్నాడు బుల్లిరాజు తన మామూలు ధోరణిలో జీతగాళ్ళని అన్నట్టు. అనేసి నాలిక కొరుక్కున్నాడు. "తప్పుడు నా కొడుకా" మాట రెట్టించి మరీ మరీ అని ఆడనవ్వు పగలబడి నవ్వాడు వెంకటాచలం.

"తొందరపడ్డాను మగడా" అన్నాడు బుల్లిరాజు.

"మా అమ్మా, నాన్నా నలభై అయిదేళ్ళకిందటే తొందరపడ్డారు మహారాజా! అందుకే నేను పుట్టాను. నన్ను మెదక్ చర్చి వరండాలో పారేసి పోయారు. ఓ వైష్ణవుడు తీసుకెళ్ళి నామం పెట్టాడు కనుక శ్రీవైష్ణవుడినయ్యాను. మరో జంగం దేవర విభూది పెడితే 'శివయ్య' నయ్యేవాడినేమో! నాక్కావలసింది చదువుకోలేదు. వాళ్ళకి సాధ్యమయింది చదువుకున్నాను. నాకేం కావాలని ఎవరూ అడగలేదు. వాళ్ళకేం ఉందో అది పెట్టారు. బంధుత్వం పుట్టుకతో కాదు రాజా సంస్కారంతో వస్తాయి. గాంధీకీ మనకీ ఏం బంధుత్వం? రామానుజులకీ, జాతికీ ఏం బంధుత్వం? పొట్టి శ్రీరాములుకీ, తెలుగువాడికీ ఏం బంధుత్వం? కష్టంలో ఉన్న సుభద్రాచార్యులవారితో పద్మనాభం దగ్గర్నుంచి విశాఖపట్నం వచ్చావు. ఏం బంధుత్వం? అక్కడో కొత్త బంధువు ఎదురు చూస్తున్నాడంటే ఆచార్లుగారికెంత ధైర్యం? ఆ పని నేను చేశాను."

బుల్లిరాజుగారు నివ్వెరపోయి చూశాడు. వెంకటాచలానికీ కాస్త మందు దిగిపోయింది. తివాచీ మీద లేచి కూర్చున్నాడు. "చదువు మీద బొత్తిగా ఆసక్తిలేని కుర్రాడిని - వెంకట్రామ్‌ని టిక్కెట్టు కొని బస్సు ఎక్కించి అతను భగవాన్ రమణమహర్షి కావడానికి మొదటి బీజం నాటిన ఆ పేరు తెలీని వ్యక్తికీ గొప్ప లక్ష్యస్ఫూర్తి ఉంది. గొప్ప తృప్తి ఉంది. చిన తిరుమలాచార్యులు ఇంకేదో కావాలి. అవుతాడు. చిన్న తాపీ ఒకటి పట్టుకుని, ఇసుకా, సున్నం కలిపి నేను మొదటి ఇటుకల్ని పేరుస్తున్నాను" అన్నాడు.

పంచ సంస్కారాలు జరిగాక ఉభయ వేదాంతాలూ నేర్పిన సుభద్రాచార్యుల చిత్తశుద్ధికీ, ఆ పసివాడి విజ్ఞానాన్ని ఉద్దీప్తం చెయ్యాలని తపనపడే ఈ విస్కీప్రియుడి చిత్తశుద్ధికీ, పెద్ద తేడా లేదనిపించింది బుల్లిరాజుగారికి.

వెంకటాచలం బయటికి కనిపించేంత భోళామనిషి కాదు. అయితే చినతిరుమలాచార్యులు మెదడులో జరుగుతున్న ఈ అనూహ్యమయిన పరిణామం మంచిదా, కాదా?

చెప్పడానికి తనెవరు? అయినా అప్పుడే ఏమయింది? అసలు కథ ముందుంది.

7

చిన తిరుమలాచార్యులు పదో తరగతి పరీక్ష వ్రాయడానికి పట్నం వెళ్ళాలి. ఆలయ ఆవరణలో పెద్ద యుద్ధమయిపోయింది. ప్రదోష కాలంలో ఆలయం బయట అరుగుమీద పెద్ద సభ తీర్చారు అంతా. సుభద్రాచార్యులుగారు స్థంభానికి చేరబడి కూర్చున్నారు. యథా ప్రకారంగా బుల్లిరాజుగారు మడత కుర్చీలో కూర్చున్నారు. దూరంగా రుక్మిణమ్మ, వరదమ్మ భోజనశాల గుమ్మానికి ఆనుకునిలబడ్డారు. ఇంకాస్త దూరంగా కైకవశి, ఆమె కొంగుకి వేలబడుతూ నవనీతం.

మొదటిసారి జయవాణిని వెంటబెట్టుకు వచ్చాడు వెంకటాచలం. జయవాణి నీలమేఘశ్యామ. అతి సుందరమయిన పోతపోసిన విగ్రహం. క్రిష్టియను. సగం కొప్పుమీద నైలాను చీర కప్పుకుని అతి వినయంగా, అతి దూరంగా నిలబడింది. సుభద్రాచార్యులవారి గురించీ, చినతిరుమలాచార్యులవారి గురించీ వెంకటాచలం చెప్పగా విన్నది. చిన తిరుమలాచార్యుల మేధాసంపత్తికి నిర్ఘాంతపోయింది. అంతకుమించి మారే ప్రపంచంతో ఏమీ నిమిత్తం లేకుండా తనదైన ప్రపంచాన్ని తన చుట్టూ ఏర్పరుచుకుని ప్రశాంతంగా జీవనం సాగిస్తున్న సుభద్రాచార్యులవారిని చూడాలని ఆమె ఆత్రం. అంతా విన్నాక, కుర్రాడికి ఇంగ్లీషు చదువు నేర్పించడాన్ని పూర్తిగా వ్యతిరేకించింది. అతన్ని అతని మానాన బ్రతకనివ్వమని వెంకటాచలాన్ని బ్రతిమాలింది. అలిగింది. వెంకటాచలం నవ్వాడు.

లూయీ పాశ్చర్‌ని పిచ్చివాడని ఊరినుంచి వెలివేశారు. పిచ్చికుక్కలు కరవగా వచ్చే 'రాబీస్'కి చికిత్స కనుక్కున్న వైద్యుడాయన. అతను వైద్యం చేసే పిచ్చికుక్కలకీ, అతనికీ తేడా లేదన్నారు. అతని వైద్యం ఉత్తపిచ్చి వదరుబోతు తనమని కాగితం మీద సంతకం చేయించారు. రాబీస్ రోగంతో బాధపడుతున్న తొమ్మిదేళ్ళ కుర్రాడిమీద తన ముందుని ప్రయోగించి చంపవద్దని భార్యకూడా బ్రతిమాలింది. ఈ మందు పుచ్చుకుంటున్న మొదటి రోగి ఈ కుర్రాడు. నిజానికి బ్రతుకుతాడో లేదో తెలీని విషమ స్థితి. ఆ మందుని తన బిడ్డమీద మొదటిసారి ప్రయోగించిన వైద్యుడూ ఇద్దరూ అపూర్వమయిన లక్ష్యానికి అంకితమయిన అపర దేవతామూర్తులు. ఆ క్షణం అనుభవైక వేద్యం.

వెంకటాచలంలో అలాంటి పట్టుదల ఏదో చోటు చేసుకుంది. ఆ లక్ష్యం జయవాణికి అర్థంకాదు. కానీ అర్థం చేసుకోవలసిన వ్యక్తి సుభద్రాచార్యులు. అర్థమయ్యేటట్టు చేయాల్సిన సందర్భం ఇది. ఆ రాత్రి పిచ్చికేకలు వేస్తున్న బిడ్డను ఒడిలో పెట్టుకున్న తల్లిని ఏం చెప్పి లూయీ పాశ్చరు ఒప్పించగలడు? ఆ స్ఫూర్తి ఆ తల్లికి కలగాలి.

సరిగ్గా ఈ కథే చెప్పాడు వెంకటాచలం. అతని చేతిలో పదో తరగతి పరీక్షకి హాల్ టిక్కెట్టు ఉంది.

"ఆచార్లుగారూ! జాతికి శ్రీమద్రామానుజులవారు గొప్ప ముక్తిమార్గాన్ని ప్రసాదించారు. కానీ శుశ్రుతుడు చెడిపోయిన శరీరభాగాన్ని కోసి ఆరోగ్యాన్ని ప్రసాదించే మార్గాన్ని బోధించాడు. ఈ సమాజానికి ఇద్దరి అవసరమూ ఉంది. ఆలోచించండి"

"ఆ రెండోది నా కొడుకే ఎందుకు కావాలి?"

"చాలా మందికి లేని గొప్ప మేధస్సుని మీ రక్తం ఆ కుర్రాడికిచ్చింది కనక. చాలామందికి సాధ్యంకాని సంస్కారం మీ వంశం అతనిలో నిక్షిప్తం చేసింది కనక. చాలామందికి దొరకని అవకాశాన్ని కల్పించే ఈ వెంకటాచలం ఆ కుర్రాడిని గుర్తుపట్టాడు కనక"

వరదమ్మ కళ్ళు ఆర్ద్రతతో వర్షించే మేఘాలయ్యాయి. స్వామివారికి ఎదురుగ్గా పశ్చిమ ప్రాంగణం గడప దగ్గర అంగవస్త్రాన్ని కట్టుకుని కూర్చున్నాడు చిన తిరుమలాచార్యులు.

"ఈ చదువులు నాకిష్టంలేదు. తిరుమలని ఎక్కడికీ పంపను. మీరు మళ్ళీ ఈవేపు రాకండి. నాకింకేం చెప్పడానికి ప్రయత్నించకండి. నన్ను కాదంటే గోస్తనీలో దిగి ప్రాయోపవేశం చేస్తాను" అన్నారు సుభద్రాచార్యులు.

"శ్రీమన్నారాయణా!" అని చెవి మూసుకుంది రుక్మిణమ్మ. వరదమ్మ భోరుమంది.

ఏదో మాట్లాడబోయిన వెంకటాచలాన్ని జయవాణి ఆపింది. బుల్లిరాజు కుర్చీలోంచి లేచాడు.

"ఆచార్లు గురించి నాకు తెలుసు, పదవయ్యా" అని సుభద్రాచార్యులు వేపు తిరిగి "కుర్రాడికి భవిష్యత్తు ఉంటుందని ఈ వెంకటాచలం నా చెవిలో నూరిపోస్తే కథ ఇంతవరకూ రానిచ్చాను. నిన్ను బాధపెట్టినందుకు క్షమించు ఆచార్లూ. ఇంక ఈ వెంకటాచలం మళ్ళీ ఈ ఊరు వస్తే కాళ్ళు విరగ్గొట్టింపచేస్తాను" అన్నారు.

కైకవశికి కళ్ళనీళ్ళు తిరిగాయి. మొదటిసారిగా తనకి నోరు లేనందుకు ఏడ్చేసింది. కానీ తల్లిని పట్టుకుని ఉన్న పదేళ్ళ నవనీతం ఆగలేకపోయింది.

"సదువు చెప్పించక, నీలాగా నామాలు పెట్టుకుని, గోచీ కట్టుకు బతకమంటారా పంతులుగారూ?" అంది.

అక్కడున్నవాళ్ళంతా ఆ మాటకి ఆపాదమస్తకం వణికిపోయారు. ఎలా వచ్చారో బుల్లిరాజు మూడు అంగల్లో ఆ పిల్లదగ్గరికి దూకి చాచి చెంపమీద కొట్టాడు. ఆ దెబ్బకి పదిగజాలు దొర్లుకు గాలిలో లేచిపోయింది నవనీతం. కైకవశి పిచ్చికేక పెట్టింది. వరదమ్మ, రుక్మిణమ్మ ఘొల్లుమన్నారు. నవనీతం ముక్కులోంచి రక్తం ధారకట్టింది. ఒక్కరే పరుగున వచ్చి ఆమెను పొదివిపట్టుకున్నది చిన తిరుమలాచార్యులు. తన భుజం మీద ఉన్న అంగవస్త్రంతో రక్తం తుడిచాడు. ఆమె తలని పొదివిపట్టుకున్నాడు.

జయవాణి సంజ్ఞని అర్థం చేసుకున్నాడు వెంకటాచలం. మరోక్షణంలో ఇద్దరూ ఆలయంనుంచీ, ఆ ఊరునుంచి మాయమయిపోయారు.

మరోగంటకి వెంకటాచలం కొనిచ్చిన, తను ఇంతకాలం చదివిన పుస్తకాలన్నీ ఆలయం దక్షిణ గోడ దగ్గర చింపి, పోగులు పెట్టి నిప్పంటించేశాడు చిన తిరుమలాచార్యులు.

సుభద్రాచార్యులవారు వయొలిన్ పట్టుకుని అనంతపద్మనాభ స్వామి ఆలయం మెట్లమీదకి తరలిపోయారు. ఆ రాత్రి ఎవరూ, ఎక్కడా భోజనం చెయ్యలేదు. విశాఖపట్నంలో వెంకటాచలం, జయవాణికూడా అన్నం ముట్టలేదు. ఓ గొప్ప వ్యక్తి కన్నుమూస్తే ఏమవుతుంది? ఓ గొప్ప సత్యం అబద్ధమని నిరూపణ అయితే ఎలావుంటుంది? ఆకాశంలో ఉండాల్సిన నక్షత్రం కూలిపోతే ఏమవుతుంది?

నవనీతం మీద ఎనలేని ప్రేమ తోసుకొచ్చింది కైకవశికి. తన బిడ్డని గుండెలకి హత్తుకుని తనివితీరా ముద్దులు పెట్టుకుంది. తన గొంతుని భగవంతుడు నవనీతం రూపంలో ఇచ్చాడనిపించింది. మొదటిసారిగా తను మూగదయినందుకు ఏ విచారమూ కలగని సందర్భం అది, "బాధగా వుందా?" అని కూతురు కళ్ళలో కళ్ళు పెట్టి మూగగా పృచ్ఛించింది. రాచరికపు రక్తం పంచుకుపుట్టిన పిల్ల నవనీతం. గొప్ప యుద్ధాన్ని జయించిన ఆనందం, గర్వం ఆమె ముఖంలో కనిపించింది. 'లేదని' ప్రశాంతంగా నవ్వింది.

ఓ రాత్రికి కొండమెట్లు దిగారు సుభద్రాచార్యులవారు. ఆయన ఇంట్లోకి రావడం వరదమ్మకి తెలుస్తోంది. భోజనం గురించి అంతా మరిచిపోయారు. దుప్పటికప్పుకు నిద్రపోతున్న తిరుమల చాపమీద కూర్చున్నారు సుభద్రాచార్యులు. కుర్రాడి తలమీద ఆర్ద్రంగా చెయ్యివేశారు. అంతే! వెంటనే తుళ్ళిపడ్డారు. కుర్రాడి శరీరం వేడిగా మరిగిపోతోంది. వెంటనే లాంతరు వత్తి పెద్దది చేసి దగ్గరకు వచ్చారు. వరదమ్మ, రుక్మిణమ్మ అప్పటికి లేచారు.

తిరుమలో నిద్రలో పలవరిస్తున్నాడు. ఒళ్ళు జ్వరంతో కాలిపోతోంది.

సుభద్రాచార్యులకి కళ్ళముందు తన చావు బ్రతుకుల సంఘటన కదిలింది. మరొక్కసారి అలాంటి విషమ పరిస్థితే రాబోతోందా? అలాంటి దుర్ఘటనే కుటుంబానికి శాపం కాబోతోందా? ఆలోచించడానికే ఆకులా వణికిపోయారు. మాటల్లో చెప్పలేక పోయినా ఆ ఆలోచనలన్నీ ఇద్దరి ఆడవాళ్ళ మనస్సుల్లోనూ కదలకపోలేదు. కానీ పరిష్కారం ఏమిటి? చికిత్స ఎలా జరగాలి? ఎక్కడ జరగాలి? పిల్లాడి మనస్సులో ఎలాంటి ఆలోచనలున్నాయో?

మూడోరోజుకి బొత్తిగా నీరసపడిపోయాడు తిరుమల. సుభద్రాచార్యులు బిడ్డపక్కనే కూర్చుని, "పరీక్ష రాయాలనుందా చిన్నా?" అనడిగారు. తిరుమల కళ్ళు ఎర్రగా చింత నిప్పుల్లాగా ఉన్నాయి. ఆ నిప్పుల నిండా నీరు నిండింది. "లేదు" అని తలూపాడు. తల నీరసంగా ఊగింది. ఆ 'లేదు' అనడంలో బలహీనత ఆరోగ్యానిదా, ఉద్దేశానిదా? స్పష్టంగా అర్థం చేసుకున్నారు సుభద్రాచార్యులవారు.

ఆ రోజునుంచీ వారం రోజులపాటు తిరుమలకి మందు వెయ్యలేదు. జ్వరం తగ్గలేదు. తమ వంశానికి మంత్రాన్ని వారసత్వంగా అందించిన ఆచార్య రత్నహారం ముందు నిష్ఠగా అష్టాక్షరీమంత్ర పారాయణ జరిపారు. పెద తిరుమలాచార్యులవారి చరమదశ రుక్మిణమ్మ కళ్ళముందు మెదులుతూనే ఉంది. ఆమె ఆకులా వణికిపోయింది.

"ఈ కుటుంబానికి మరొకసారి ఆ శాపం నీడ పడనివ్వకు స్వామీ" అని మొక్కుకుంది. బుల్లిరాజుగారు వచ్చిపోతున్నారు. సుభద్రాచార్యులవారిని గమనిస్తున్నారు. ఆయనా ఏమీ మాట్లాడలేకపోయారు. మొదటినుంచీ ధైర్యంగా ఉన్న కైకవశి కూడా డీలా పడిపోయింది. వాతావరణంలో అనూహ్యమైన స్తబ్దత ఏర్పడిపోయింది.

పద్మనాభం నుంచి వచ్చినప్పటినుంచీ వెంకటాచలం ముభావమయిపోయాడు. ఎప్పుడూ నవ్వుతూ. నవ్విస్తూ ఉండే మనిషిలో ఈ మార్పు ఆశ్చర్యకరంగానూ, బాధాకరంగానూ కనిపించింది జయవాణికి. ఈ వారం రోజులూ విస్కీ ముట్టలేదు.

ఎనిమిదోరోజున స్వయంగా విస్కీ గ్లాసులో పోసి తెచ్చింది జయవాణి. తలెత్తి ఆమె కళ్ళల్లోకి చూశాడు. వెంకటాచలం కళ్ళల్లో చెమ్మని చూసి నిర్ఘాంతపోయింది.

"మీరు ఏడుస్తున్నారా?"

"ప్రశాంతంగా ఉన్న కొలనులో రాయి విసిరినట్టు అనిపిస్తోంది జయా! పవిత్రంగా బతికే ఆ కుటుంబంలో అనవసరంగా అలజడి రేపేనేమో" అన్నాడు తనలో తాను అనుకుంటున్నట్టు.

"మార్పు కొందరిని భయపెడుతుంది. కొందరిని బాధ పెడుతుంది. అది మంచిదయితే ఆఖరికి అందరికీ మేలు చేస్తుంది. మీరు చేసిన మంచి పని ఈ ఎనిమిదిరోజులూ ఆ కుటుంబానికి దూరంగా ఉండటమే. కొన్నాళ్ళు అటువైపు వెళ్ళకండి" అంది. గ్లాసు అందుకున్నాడు. విస్కీ తలకెక్కిన కొద్దీ ఆలోచనలు సడలిపోయాయి. అర్ధరాత్రికి వెంకటాచలం మళ్ళీ మామూలు మనిషయిపోయాడు.

"మంచితనం కొందరి బలహీనత. సదాచారం మరికొందరి బలహీనత. జేబులు కొట్టమంటే మహాత్మాగాంధీకి జబ్బు చెయ్యొచ్చు. విష్ణుమూర్తిని తలుచుకుంటే హిరణ్యకశిపుడికి ఒళ్ళు మండినట్టు" తన జోక్‌కి తనకే నవ్వొచ్చి, ఆఖరి పెగ్గు గ్లాసునిండా వొంపుకుని జయవాణిని కావలించుకు పడుకున్నాడు "రేపు హైదరాబాదు పోదాం" అంటూ.

పవిత్రమయిన చందనం సువాసన తన మంచం మీద గుబాళిస్తే చటుక్కున తెలివొచ్చింది వెంకటాచలానికి. మంచం మీద కూర్చున్న సుభద్రాచార్యులని చూసి తుళ్ళిపడి లేచి కూర్చున్నాడు. పక్కనే బుల్లిరాజుగారు. జయవాణి గుమ్మం దగ్గర తెల్లబోయి వెర్రిచూపులు చూస్తోంది.

"ఆచార్లుగారూ" అన్నాడు.

"మా తిరుమల పరీక్ష రాస్తాడు. ఆ ఏర్పాటు చెయ్యి బాబూ" అన్నారు ఆచార్లుగారు.

వెంకటాచలానికి మతిపోయింది. కేలండరు చూశాడు. రేపే పరీక్ష. కుర్రాడు ఎక్కడ?

"బండిలో పడుకుని ఉన్నాడు. ఎనిమిది రోజులుగా జ్వరం. ఒంటిమీద స్పృహలేదు" బుల్లిరాజుగారన్నారు.

వెంకటాచలానికి పరిస్థితి అర్థంకాలేదు. జ్వరంతో తీసుకుంటున్న కుర్రాడు ఉన్నట్టుండి పరీక్ష ఎలా రాస్తాడు?

పుస్తకాలన్నీ ఆ రోజే మంటబెట్టేశాడని చెప్పారు రాజుగారు.

జయవాణి బలహీనంగా అంది "మొదట కుర్రాడిని ఆసుపత్రిలో చేర్చండి. ఆ తర్వాత"

"అందుకే వచ్చానమ్మా! ఆ కుర్రాడి ఆసుపత్రి పరీక్ష హాలు. ఆలస్యం చెయ్యకుబాబూ! పరీక్ష రాశాక అబ్బాయి ఏమయినా ఫరవాలేదు."

ఆ మాట అంటున్నప్పుడు సుభద్రాచార్యులవారి గొంతు వణికింది. అక్కడున్న అందరి గుండెలూ గుబగుబలాడాయి.

ముఖం మీద ఇన్ని నీళ్ళు గుమ్మరించుకుని బట్టలు వేసుకున్నాడు వెంకటాచలం. బయట బండిలో స్పృహ లేక పడుకున్న తిరుమలని చూసి ఏడుపొచ్చింది. కుర్రాడు కైకవశి ఒడిలో తల పెట్టుకున్నాడు. నవనీతం తడి గుడ్డని తిరుమల నుదుటిమీద పరుస్తోంది.

ఆ రోజంతా పిచ్చివాడిలాగా పరుగులు తీశాడు వెంకటాచలం. ఏవీయన్ కాలేజీకి వెళ్ళి ఫలానా విద్యార్థి పరీక్ష వ్రాస్తున్నట్టు భోగట్టా ఇచ్చాడు. మరోగంటలో తిరుమలని నర్సింగ్‌హోమ్‌లో చేర్చాడు. వెంటనే అతనికి సెలైన్ పెట్టారు. కానీ మర్నాటి పరీక్షకి చదువు? దానిగురించి ఎవరు ఆలోచించలేదు. సాయంకాలానికి బలహీనంగా కళ్ళు తెరిచాడు తిరుమల.

"రేపు ఇంగ్లీషు మొదటి పరీక్ష. చెప్పు ఈ ఎర్ర పెన్ను బాగుందా? నీలం పెన్నా? నీలం పెన్నులో ఇంకు చాలా పడుతుంది" అన్నాడు వెంకటాచలం తిరుమల చెవిదగ్గర నోరుపెట్టి. కళ్ళెత్తి నీలం పెన్నుని అందుకున్నాడు తిరుమల.

సుభద్రాచార్యులుగారు బుల్లిరాజుగారు వరదమ్మ కళ్ళు తుడుచుకున్నారు.

మర్నాడు తిరుమల సిగపాయి దువ్వి ముడివేసింది నవనీతం. వరదమ్మ నామం దిద్దింది. జ్వరం తగ్గింది. నీరసం బోలెడంత. కానీ, తిరుమల ముఖంలో ఎక్కడా లేని తేజస్సు.

ఆ రోజు కాలేజీలో పెద్ద ఆకర్షణ గోధుమ పంచె, ఉత్తరీయం వేసుకున్న కుర్రాడు. గుండు, శిఖతో పరీక్ష వ్రాయడానికి రావడం. అతని వెనక మరో నామాలాయన, మీసాలాయన, బట్టతలాయన, పెద్ద ఫ్లాస్కుతో పదేళ్ళమ్మాయి రావడం. టీచర్లు నవ్వుకున్నారు.

పరీక్ష బెల్లు కొట్టాకే బల్లముందు కుర్రాడిని కూర్చోపెట్టాడు వెంకటాచలం. పరీక్ష అయిపోగానే సరాసరి నర్సింగ్ హోమ్‌కి తీసుకెళ్ళాడు. ఏడు పరీక్షలూ అలాగే సాగాయి. నాలోగోపరీక్షకే జ్వరం నార్మల్‌కి వచ్చింది. ఏడోరోజు పరీక్ష గెంతుతూ వెళ్ళి రాశాడు

తిరుమల. ఏ రోజూ పుస్తకం విప్పి చదవలేదు. అయ్యో చదవలేదే అని ఎవరూ బాధపడలేదు. కుర్రాడి రోగానికి వైద్యం జరుగుతోంది. ఆ వైద్యానికి అంతరాయం కలగకూడదన్నదే వాళ్ళ లక్ష్యం.

మూడునెలల తరువాత పరీక్షల ఫలితాలు వచ్చాయి. చిన తిరుమలాచార్యులు రాష్ట్రంలో ఫస్టు వచ్చినట్టు, బంగారుపతకం సాధించినట్టు పేపర్లో అతని ఫోటో వేశారు.

8

**చెడిపోవడానికి,** మారడానికి తేడా ఉంది. మారడం కొండొకచో చెడిపోవడం కాదు. అయితే మార్పు 'చెడు'గా కొందరికి తోచవచ్చు. దరిమిలాను మార్పు చెడుగానూ పరిణమించవచ్చు.

పంచె వదిలి పాంటు వేసుకోవడం మార్పు. పాలు మాని విస్కీ తాగడం చెడిపోవడం. అయితే ఒకరికి విస్కీ మేలూ చేయవచ్చు. అలాగే పాంటు కీడూ చేయవచ్చు. అది ఆ క్షణాన అనిపించదు. కోటు ఇంగ్లీషువాడికి అవసరం. గోచీ భారతీయుడికి చాలు. అది పేదరికం కాదు.

గంభీరమయిన నియతి. ఇదే భగవాన్ రమణమహర్షి, మహాత్మాగాంధీ ఆచరణలో ఆదర్శంగా చేసి చూపారు.

ఆ రోజుల్లో ఏవియన్ కాలేజి ప్రిన్సిపాల్ పార్థసారధిగారు. ఆయన్ని కలిసి ఎలా ఒప్పించాడో వెంకటాచలం ప్రైవేటుగా ఇంటర్మీడియెట్ పరీక్షకు తిరుమలచేత వ్రాయించే ఏర్పాటు చేశాడు. లెక్కలు, ఫిజిక్స్, కెమిస్ట్రీ గ్రూపు. లాబొరేటరీ అవసరం ఉంది. ఆ అవసరాన్ని మాత్రం కాలేజీ తీర్చేటట్టు చేశాడు. ఆ విధంగా పద్మనాభంలో కుర్రాడు ఉన్న చోటనే ఉంటూ చదువుకునే అవకాశం కలిగింది.

చిన తిరుమలాచార్యులు గుండూ, పిలకా కాలేజీలో ఉన్న ఆ కాస్త సమయంలోనే ప్రచారంలోకి వచ్చింది. ఆ రోజుల్లోనే పట్నం వచ్చాక, తండ్రికి చెప్పకుండా మొదటిసారి షర్టు తొడుక్కున్నాడు. అచ్చమయిన పొందూరు ఖద్దరుతో ఫిల్టుపెట్టి పొడుగు చేతుల చొక్కాలు కుట్టించాడు వెంకటాచలం. గోధుమరంగు పంచె, గోధుమరంగు షర్టుతో పిలకా, నుదుటిన ధగధగా మెరిసే నామాలతో చిన తిరుమలాచార్యులు విద్యార్థిలాగా కాదు, వివేక చూడామణిలాగా కనిపించాడు. నలుగురూ ఆరు రోజుల్లో గ్రహించాల్సిన విషయాన్ని తిరుమల ఒక్కరోజులోనే గ్రహించేవాడు. పద్మనాభం నుంచి పట్నం రావడానికి తండ్రిగారి అయిష్టత, అయ్యే శ్రమ, తప్పనిసరిగా రావాల్సిన అగత్యం అన్నీ తిరుమల మేధస్సుని అవసరం మేరకి మరింత పదును చేశాయి.

ఆ రోజుల్లోనే తిరుమల కొచ్చిన్ కేఫ్‌లో రవ్వదోసె రుచిమరిగాడు. ఏసుప్రభువుకి నివేదిస్తున్నంత భక్తితో జయవాణి ప్లేటులో అందించే కేకుల రుచికి అలవాటుపడ్డాడు. ఆ రోజుల్లోనే వెంకటాచలంతో అక్కినేని 'దేవదాసు', రాడ్ స్టిగర్ 'ఎక్రాస్ ది బ్రిడ్జి', దిలీప్ కుమార్ 'మధుమతి' చూశాడు. పెద్దమనిషి అయిన నవనీతానికి పట్టుపరికిణీ కొని తెచ్చాడు. ఆండాళ్ళుకి వెండి పట్టీలు కొన్నాడు.

ఆరోజుల్లో తిరుమల మనస్సు ఎలా ఉంది? విద్యుత్తుతో పదునెక్కిన అయస్కాంతంలాగా ఉంది. అయిస్కాంతం తుప్పుపట్టిన ఇనుపముక్కనీ దగ్గరికి లాక్కుంటుంది. మెరుగు పెట్టిన ఇనుముని తనవైపు తిప్పుకుంటుంది. ప్రస్తుతం తుప్పుపట్టిన ఇనుపముక్కలేవీ ఈ అయిస్కాంతంవైపు రాలేదు. ఓ కొత్త ప్రపంచంవైపు అతని మనస్సు ఆవిష్కృతమయింది. ఆ ప్రపంచాన్ని బాగా పౌపోశన పట్టేస్తున్నాడు. పోగొట్టుకున్న వయస్సుని విషయ పరిజ్ఞానంతో భర్తీ చేసుకుంటున్నాడు. అతనికి వెంకటాచలం మార్గదర్శి. గాడ్‌ఫాదర్.

వెంకటాచలానికి చిన తిరుమల ప్రొఫెసర్ హిగ్గిన్స్‌కి దొరికిన ఎలిజా డూ లిటిల్‌లాంటివాడు. వెంకటాచలం జీవితంలో విచ్చలవిడితనం ఉంది, అవ్యవస్థ ఉంది, ఎవరికీ సంజాయిషీ చెప్పుకోనక్కరలేని వెర్రి స్వేచ్ఛ ఉంది. అవినీతి ఉంది. కానీ విచిత్రంగా చినతిరుమలాచార్యులు అతనికో గొప్ప లక్ష్యాన్నిచ్చాడు. ఒక విచిత్రమయిన ఛాలెంజ్ నిచ్చాడు. ఒకరి సమక్షంలో మరొకరు స్ఫూర్తిని పంచుకుంటున్నారు. జయవాణికి ఇప్పుడు వెంకటాచలం కొత్త గ్లామర్‌తో కనిపించాడు. చిన తిరుమల ఇంటర్మీడియట్ పరీక్షలు వ్రాసే సమయానికి జయవాణికి నెలతప్పింది.

సుభద్రాచార్యులవారు మాత్రం జీవితంలో ఓ అపశ్రుతిని అలవాటు చేసుకుంటున్నారు. కులధర్మానికీ, సనాతన సంప్రదాయానికీ తన తరంతో తెరపడబోతున్నదనే ఆలోచన ఆయన్ని అతలాకుతలం చేస్తున్నది. కొడుకు మనస్సులో పడే హింసని అర్థం చేసుకోగల వ్యక్తి రుక్మిణమ్మ ఒక్కరే. ఆమె రెండు తరాల వైభవాన్ని చూసిన ఇల్లాలు. కాగా, స్వధర్మ నిర్వహణ అనే ఆయుధంతో భర్త ఎలా ఆత్మార్పణ చేసి తన బిడ్డని బ్రతికించుకున్నదీ స్వయంగా చూసిన ఇల్లాలు. ఈ లోకంలో జరిగే ఏ అనర్థానికయినా మూలకారణం ఏమిటి? మనిషి స్వధర్మాన్ని మరిచిపోవడమే. తండ్రి కళ్ళముందే కొడుకు మరణిస్తే పాలించే రాజు ధర్మ నిర్వహణలో అపశ్రుతి ఉన్నదని నిలదీసిన సంస్కృతి ఇది. ఈ ఆలోచనలు ఇప్పుడు మౌఢ్యానికి ప్రతీకలని నిరసించే తెలివయిన తరం తోసుకువస్తోంది. తన కొడుకు ఆ తరానికి దత్తమయిపోతున్నాడే అని ఆచార్యులవారి మథన.

వరదమ్మకి మాత్రం కొడుకులో అతి త్వరితంగా తోసుకువస్తున్న విలక్షణమయిన పరిణామం ముచ్చటగా ఉంది. "మావాడు ఇంగ్లీషు మాట్లాడుతాడు"

"మావాడికి బంగారు పతకం ఇచ్చారు" అని చెప్పుకోవడం ఆ తల్లికి గర్వం. శ్రీకూర్మం అనే చిన్న నూతిలోనుంచి విశాలమయిన సరస్సులోకి దూకిన కప్పపిల్ల వరదమ్మ.

ఇది సదాచారానికి సాయంకాలం. సంస్కృతికి ఆటవిడుపు మనోవికాసం 'కొత్త'ని జుర్రుకోవాలని చూస్తోంది. సంప్రదాయం 'పాత'ని భద్రపరచాలని ఆరాటపడుతోంది.

ఇదే సందర్భంలో అదే ఊరు మొగిలో నిశ్శబ్దంగా మరో విప్లవం ప్రారంభమవుతోంది.

కుమ్మరి పని చేసుకు బతికే సానయ్య తొమ్మిదేళ్ళ కొడుకు కూర్మయ్య మనస్సులో కొత్త ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి.

నాన్న తీర్చిదిద్దే బొమ్మలకింద వంకరటింకరగా అక్షరాలు రాసేవాడు కూర్మయ్య బొమ్మని కాల్చి, ఆవంలోంచి తీశాక అందమయిన బొమ్మకింద అర్థంలేని గీతలు చూసి ఓ రోజు కుమ్మరి ఇరుసుచుట్టూ తరిమి తరిమి చింతకొమ్మతో చావబాదాడు సానయ్య కొడుకుని.

ఆ ఊళ్ళో చిన్న పోలీస్ స్టేషన్. దాని హెడ్డు పేరు కొడుకుల అవతారం. పెద్ద బొజ్జ, నుదిటిన చిన్నతనంలోనే వాతం నొప్పులకి కాల్చిన మచ్చ. కడుపు కిందకి జారిపోతున్న బెల్టూ, అవతారం కంటే ముందు అరఫర్లాంగు ప్రయాణం చేసి వచ్చే చుట్టకంపూ ఇదీ ఆ అవతారం. మాట ఖంగుమనేది. అయితే మాట అవసరమయిన దానికంటే సాగిపోయేది. మడతలు పడిపోయేది. విపరీతమయిన నత్తి. ఎప్పుడు నియమం తప్పక కాపుసారాయే తాగేవాడు అవతారం. ఆ ఊళ్ళో, చుట్టుపక్కలా అవతారానికి చాలామంచి పేరుంది. నిఖార్సయిన దైవభక్తుడు. విశాలమయిన నుదురుమీద ఎప్పుడూ విబూది నిలిచేది.

ఒకరోజు సానయ్య కొడుకుని వెంట తరుముతూండగా, సరుగుడు తోపు దాటి పరుగున వచ్చి అవతారం సైకిలు కింద పడిపోయాడు కూర్మయ్య. సైకిలాపి, దిగి కుర్రాడిని అమాంతం ఎత్తేసుకున్నాడు అవతారం. మరి సైకిలు కింద పడినందుకే ఆనందపడిపోయాడు కూర్మయ్య. ఆ విధంగా తండ్రి తాపులు తప్పినందుకు.

"ఎందుకురా, గుంటడ్ని బాదుతున్నావు లంజకొడకా" అని ముద్దుగా పలకరించాడు అవతారం.

"నాను కట్టపడి సేత్తున్న బొమ్మల్ని ఈ ఎదవ నంజికొడుకు చెడదొబ్బుతున్నాడు బాబూ" అన్నాడు సానయ్య.

ఆ విధంగా ఆవంలోకి దిగి, బొమ్మలమీద రాతల్ని చూశాడు అవతారం. చూసి నిర్ఘాంతపోయాడు. కృష్ణుడి బొమ్మకింద 'శ్రీ కిష్ణుడు' అన్న అక్షరాలు తెలుస్తున్నాయి. పార్వతి బొమ్మకింద 'దేవి' అని తెలుస్తోంది.

"అమ్మ నాకొడకా! ఎక్కడ పట్టావురా ఈ సదువు?" అన్నాడు అవతారం కితకితలు పెట్టినట్టు నవ్వుతూ.

ఏడుస్తూనే కూర్మయ్య గుడిసెలోకి పరుగెత్తి, చిరిగిపోయిన పాతకాలండరు తెచ్చాడు. కాలెండరు కాగితాలమీద బొమ్మలకింద అక్షరాల్ని చూసి ఆశ్చర్యపోయాడు అవతారం. సానయ్యా తెల్లబోయాడు.

"ఒరే సానయ్యా ఈ నంజికొడుకు సామాన్యుడు కాడురా! నువ్వు దేవుడు బొమ్మల్ని మనస్సులో ఊహించుకుని చేస్తున్నావు. ఈడి అక్షరాల్ని మనస్సులోకి ఎక్కించుకుంటున్నాడు. ఈ బొమ్మని నువ్వు చేశావు. ఆడు బొమ్మకి పేరెట్టాడు" అన్నాడు అవతారం.

ఈ మాటల్ని విన్న తల్లి, ముత్తు లబోదిబోమంటూ వచ్చింది "ఓర్నాయనో నా కొడుకుని సదువు సెప్పి ఎవరో సెడిపేత్తన్నారు" అంటూ.

పెళ్ళాన్ని పెఢీల్మని కొట్టాడు సానయ్య. ఆ దెబ్బకి ముత్తి సరాసరి మట్టిముద్దమీద పడి అతుక్కుపోయింది.

"ఏటి బాబూ! ఈ బుడతడికి సెప్పకుండానే సదువొచ్చిందా?" అన్నాడు.

"అవున్రా! ఈడు అక్షరాల్ని చూసి రాసేశాడు" అన్నాడు అవతారం.

చటుక్కున సానయ్య అవతారం కాళ్ళమీద పడిపోయాడు. "అయితే ఆడికి తమరు సదువులు సెప్పండి. బాబూ! తమకి ఏదిచ్చుకోమంటే అదిచ్చుకుంటాను" అన్నాడు.

ఈ మాటకి కూర్మయ్య ఆశ్చర్యపోయాడు. కొడుకుల అవతారమూ ఆశ్చర్యపోయాడు.

"రోజుకో సారాకాయి యిచ్చుకోరా, తొత్తుకొడకా" అని సైకిలు దిగాడు. కూర్మయ్యని పిలిచి, వాడి అయ్య చేసిన శివుడి బొమ్మకీ, కిష్టుడి బొమ్మకీ దండం పెట్టించాడు.

"నా కాళ్ళకి దండమెట్టరా పాకీ నా కొడకా! నేను నీ గురువుని" అన్నాడు.

చాలా భక్తిగా, మనఃపూర్వకంగా అవతారం పాదాలమీద తల ఆనించి నమస్కారం చేశాడు కూర్మయ్య. సానయ్య ముఖం విప్పపువ్వులాగా విచ్చుకుంది. మట్టిముద్ద సాపుచేసి, వేపపుల్ల అవతారం. "సాయంకాలానికి ఈ అరక్షరాలూ రాసి చూపించరా" అనేసి నవ్వుతూ సైకిలెక్కేశాడు.

మధ్యాహ్నం బీటు పూర్తి చేసుకుని వచ్చేసరికి పోలీస్ స్టేషన్ గేటు దగ్గర నిలబడి ఉన్నాడు కూర్మయ్య. వాడిని చూసి, "ఏరా ఇక్కడున్నావు? మళ్ళీ మీ అయ్య నిన్ను పీకాడా?" అన్నాడు.

"తమరోసారి ఆవం దగ్గరికి రావాలయ్యా" అన్నాడు కూర్మయ్య.

కంగారుగా కుర్రాడిని సైకిలెక్కించుకుని హడావుడిగా తొక్కాడు అవతారం. ఆవం దగ్గరకి వస్తూంటేనే కేకలూ, అరుపులూ వినిపిస్తున్నాయి. మధ్యాహ్నమే మందు కొట్టేశాడు సానయ్య. బంకమట్టిమీద కళ్ళం చుట్టూ తిరుగుతూ గెంతులేస్తున్నాడు.

"ఇయాల నీకేటయిందిరా, నంజికొడకా?" అని సైకిలు దిగాడు.

అవతారాన్ని చూస్తూనే కళ్ళంలోంచి దూకాడు సానయ్య. "బాబూ! ఇయాళ నా కులపెద్దలు సారగాని కెల్లిపోతారు. తమరు నా కొడుకుని గొప్పోన్ని సేసేశారు. ఇదిగోబాబూ, మీ సారాకాయ" అన్నాడు.

ముత్తి నవ్వుతోంది. ఇప్పుడు చూశాడు సానయ్య ఆనందానికి కారణం. సానయ్య కుమ్మరికొట్టంలో తడిసిన మట్టి కనిపించిన మేరకి ఓనమాలు నిండిపోయాయి. కుమ్మిన మట్టిలో ఓనమాలు నలిగిపోయాయి. సానయ్య కాళ్ళకి ఓనమాలు అతుక్కుని వేలాడుతున్నాయి. దూరంగా నిలబడిన కూర్మయ్య ముఖంలో తెలీని వెలుగు కనిపిస్తోంది. సగం రోజుకే ఓనమాలను దిద్ది అక్షరాలకి అలంకారం చేసేశాడు కూర్మయ్య.

అవతారం నిర్ఘాంతపోయాడు. చేతిలో సారాకాయ ఎత్తి గటగటా తాగేశాడు.

"అమ్మ నాకొడకా! నువ్వు మామూలు మడిసివి కాదురా! కలెక్టరయిపోతావు" అని కూర్మయ్య వీపు ఫెడీల్మని చరిచాడు.

సానయ్య ఆనందంతో, గర్వంతో ఊగిపోయాడు. ఆ తర్వాత ఆరు నెలల్లో పెద్ద బాలశిక్ష సుమతీ శతకానికి వచ్చేశాడు కూర్మయ్య. ఇంగ్లీషు నాలుగు బడులూ కేవలం నాలుగురోజుల్లో వొడిసి పట్టుకున్నాడు. పట్నం నుంచి పలకా, బలపం కొనితెచ్చాడు అవతారం.

మొదటిరోజు దండంపెట్టి శివుడూ, కిష్టుడూ అలా తెల్లబోయి చూస్తూనే ఉన్నారు. రోజూ భక్తిగా అవతారం కాళ్ళకి తలమోపి దండం పెడుతూనే ఉన్నాడు కూర్మయ్య.

మరో ఏడాదికి కుర్రాడికి చదువు చెప్పడానికి తను తడువుకోవలసిన పరిస్థితి వచ్చింది అవతారానికి.

పద్మనాభంలో రెండు విప్లవాలు జరుగుతున్నాయి. ఓ కొడుకు చదువు సంప్రదాయానికి దూరమవుతున్నాడని తండ్రిని కష్టపెడుతోంది. మరో కొడుకు చదువు మట్టిపిసుక్కునే స్థితినుంచి ముందుకు పోతున్నాడని తండ్రి గర్వపడేటట్టు చేస్తోంది.

తండ్రుల జీవితాల్లో సాయంకాలం ప్రారంభమవుతోందేమో. కానీ కొడుకుల జీవికలకు అది మిలమిలలాడే సూర్యోదయం.

## 9

రేవిడి ఫిర్కా రెవిన్యూ ఇన్స్పెక్టరు వడ్లమాని కామేశ్వరరావు. సన్నగా రివటలాగా ఉండేవాడు కదిపితే గడగడా మాట్లాడే స్వభావం. మొదట్నుంచీ తనేం చెయ్యాలో స్పష్టంగా మనస్సులో ఓ పథకం ఉన్న మనిషి. కాగా నాటకాలంటేనూ, సంగీతమంటేనూ తగని పిచ్చి. ఏ సమస్యకయినా తనదయిన అడ్డత్రోవని మనస్సులోనూ, జీవితంలోనూ సిద్ధం చేసుకున్న మనిషి.

ఓ రోజు కొడుకుల అవతారం తన సైకిలుని కామేశ్వరరావు సైకిలుకి అడ్డంపెట్టి కేరేజి మీద కూర్చున్న కూర్మయ్యని పరిచయం చేశాడు.

"ఈ నంజికొడుకు అసాధ్యుడులాగున్నాడు. నా దగ్గరున్న చదువంతా ఆరునెలలు తిరక్కుండా లాగేశాడు. ఇంక చెప్పలేనంటే నా పరువుపోతుంది. ఈడ్ని నా దగ్గర్నుంచి తప్పించేసి పుణ్యం కట్టుకో, మామా!" అన్నాడు.

కామేశ్వరరావు లౌక్యుడు. రెవిన్యూ మనిషి. నాగిన్ పాటని నాలుగురోజుల్లో బుల్ బుల్ మీద వాయించేసిన అసాధ్యుడు. మాట వినీ వినగానే సమస్యకి పరిష్కారం దొరికిపోయింది.

"ఒరే, అబ్బాయీ నా సైకిలు మీద కూర్చోరా" అన్నాడు వెంటనే. తన సైకిలు దిగపోయినందుకు గుండెలమీదనుంచి కుంపటి దిగిపోయినంత ఆనందించేశాడు అవతారం.

కామేశ్వరరావు కూర్మయ్యని కుంతీనాథస్వామి గుడి దక్షిణ గుమ్మం దగ్గర ఆపాడు స్వాతంత్ర్యదినోత్సవంనాటి నెహ్రూగారి ఉపన్యాసాన్ని భట్టీయం వేస్తున్నాడు చిన తిరుమల.

"ఒరే పంతులూ" అని మెల్లగా పిలిచాడు.

చిన తిరుమల ఆగాడు. "ఈ కుర్రాడు కుమ్మరి సానయ్య కొడుకు. చదువుమీద ఇంట్రస్టు చూపిస్తున్నాడు. వీడికి కొంచెం సాయం చెయ్యి" అని అప్పగించాడు.

కూర్మయ్యని చూశాడు. మట్టికొట్టుకుపోయిన లాగూ, చెవులకి వెండిపోగులూ తుప్పతలా అయినా వీటన్నిటి మధ్యా కొట్టొచ్చినట్టు కనిపించిన అంశం ఒకటుంది. ఆకలితో అన్నీ నమిలి మింగెయ్యాలని ఎదురుచూసే కళ్ళు. ఆ కళ్ళు తిరుమలకి తెలుసు. ఒకప్పుడు తన కళ్ళూ ఆ పనే చేశాయి. ఒకప్పుడు తనూ అలాంటి ఆత్రుతనే చూపించాడు. ఈ కుర్రాడు కొండని ఎక్కే మొదటి దశలో ఉన్నాడు. తను రెండో దశలో ఎగబ్రాగుతున్నాడు.

"నీ పేరేంటి?"

"కూర్మయ్య."

"కొండ ఇరవైమూడో మెట్టు పక్కన ముళ్ళపొద ఉంది. అక్కడికి పద, పదినిమిషాల్లో వస్తాను" అన్నాడు.

రెవిన్యూ డిపార్టుమెంటులో ఏ ఫైలు ఎక్కడికి చేరాలో అక్కడికి చేర్చడం కూడా బాధ్యతే కొత్త గురువుని కుర్రాడికి అప్పగించి తను తప్పుకున్నాడు కామేశ్వరరావు.

తన ముత్తాత ఎవరిని చూసి దాదాపు 50 ఏళ్ళ క్రితం ఊరొదిలిపోయాడో, అలాంటి మరొకడికి విద్యాదానం ప్రారంభించాడు మునిమనవడు. సంకెళ్ళు తెగిపోతున్నాయి. జీవితంలో చాలా ముడులు విడిపోతున్నాయి.

పద్మనాభానికి దాదాపు నాలుగైదు కిలోమీటర్ల దూరంలో రెడ్డిపల్లి. ఆ రోజుల్లో జైత్రయాత్ర సాగిస్తూ శ్రీకృష్ణదేవరాయలు పాతించిన ('పొట్నూరికి సమీపమున' అని రాయప్రోలు సుబ్బారావుగారు ఒక పద్యంలో ఉదహరించిన) దిగ్విజయస్థంభం ఇప్పటికి పెద్ద చెరువు పక్కన ఉంది. ప్రస్తుతం గేదెలు వీపు గోక్కోడానికి, కుర్రాళ్ళు కూర్చుని బీడీ కాల్చుకోడానికి, గవర్నమెంటు ఏడాదికోసారి పేపర్లో గొప్పలు చెప్పుకోడానికీ అది ఉపయోగిస్తోంది.

పద్మనాభం, రెడ్డిపల్లి దాదాపు కలిసే ఉన్న ఊళ్ళు. మధ్యలో రోడ్డుకి ఇటూఅటూ మామిడితోపులూ, నేలని ఒరుసుకుంటూ జీడిచెట్లూ. ఊరికి కాస్త దూరంగా రోడ్డుపక్క మేదరి చింతాలు పాక ఉండేది. వాడికి గొప్ప అనాకారి పెళ్ళాం, యౌవనం విరగబడేంతగా శరీరం వొంపులు తిరిగిన కూతురు చిత్తి. వెదురుబుట్టల్నీ, చేటల్నీ, జంగిడీలనీ ఊళ్ళోకి తెచ్చి అమ్మేది. దాని గొంతు కోకిల కూసినట్టుండేది. నల్లగా మెరిసే రంగు. చాలీచాలని జాకెట్టు, పొట్టిపరికిణీ, స్థనాలమధ్య కూరుకుపోయిన వల్లెవాటూ. దాని గొంతు వినగానే దాన్ని చూడడానికి ఆడంగులే వీధి గుమ్మంలోకి వచ్చేసేవారు.

మగాళ్ళయితే తడిక విసనకర్రల్నీ, చదరల్నీ అక్కరలేకపోయినా, అరగంట బేరం చేసికొనేవారు. ఆ రోజుల్లో ప్రతీ ఇంటినిండా నాలుగయిదు చేటలూ, కనీసం పది పన్నెండు విసనకర్రలూ ఉండేవి. చిత్తి రెండు వీధులు తిరిగేసరికే సరుకు అయిపోయేది. కానీ రెండు వీధులు తిరగడానికి రోజంతా సరిపోయేది. కారణం ఆ తర్వాత చిత్తిని ఎవడో మగాడు ఏదో తుప్పచాటుకి లాక్కుపోయేవాడు.

ఆ రోజుల్లోనే భూపతిరాజు ఉన్నట్టుండి బుద్ధిమంతుడయిపోయాడు. స్నేహితులకి దొరక్కుండా తిరిగాడు. కారణం చాలా రోజులవరకూ చాలామందికి అర్ధంకాలేదు. బుల్లిరాజుగారూ ఈ విషయం అంతగా పట్టించుకోలేదు. కానీ ఓ రోజు భార్య బుచ్చియ్యమ్మ భర్తదృష్టికి ఓ విచిత్రమయిన విషయాన్ని తీసుకొచ్చింది.

"కుర్రాడు నానాటికీ చిక్కిపోతున్నాడు, గుర్తుపట్టారా?" అంది.

"ఎందుకంటావు?"

"అది మీరు తెలుసుకోవాలి."

వెంటనే కత్తి గవర్రాజుని ఆ పనికి పురమాయించారు బుల్లిరాజుగారు.

భూపతిరాజు హయాంలో వారానికి నాలుగురోజులయినా దక్కే విస్కీ ఈ మధ్య దక్కడంలేదు గవర్రాజుకి. చిన్నరాజు మరీ నల్లపూసయిపోయాడు. తనకి కడుపు రగిలిపోతోంది. కానీ కస్సుమంటే రాజు మీదపడి కరిచేస్తాడు. మనుషుల్ని పెట్టి కొట్టించినా ఆశ్చర్యంలేదు. అందుకని కిక్కురుమనకుండా ఊరుకున్నాడు.

ఎప్పుడైతే బుల్లిరాజుగారి ఆజ్ఞ అయిందో, కత్తి గవర్రాజు పులి అయిపోయాడు. పాపం, భూపతిరాజుకి పౌరుషం, పొగరూ ఉన్నాయి కానీ, దాపరికం లౌక్యం బొత్తిగా లేవు. కాగా వయస్సులో మిసమిసలాడే చిన్నరాజుగారి తన తొడకింద తొక్కిపెట్టేసింది మేదరి చిత్తి. కడిమిశెట్టి పెద అప్పన్నదొర లారీ షెడ్డులో దానితో సరసం నెరపేవాడు భూపతిరాజు దాదాపు ప్రతిరోజూ.

విషయం తెలిసి బుసలు కొట్టాడు బుల్లిరాజుగారు. అనుమానం వచ్చి, ఎందుకయినా మంచిదని పట్నం డాక్టరుచేత పరీక్ష చేయించగా తేలిన విషయం భూపతిరాజుగారికి సుఖవ్యాధి స్థిరపడిందని. ఆ మధ్యాహ్నం ఎద్దుల మెడకి కట్టే గజ్జెలపట్టీతో ఇంటి ఆవరణంతా పరుగెత్తించి కొడుకుని చావబాదాడు బుల్లిరాజు. బుచ్చియ్యమ్మ భర్త ఉద్రేకాన్ని చూసి, బిడ్డ చచ్చిపోతాడేమోనై హడలెత్తిపోయింది. కత్తి గవర్రాజయితే భయపడిపోయి ఊళ్ళోంచి పారిపోయాడు.

సరిగ్గా ఆ సమయంలో శిస్తు వసూలుకి రాజుగారి బంగళాముందు సైకిలు స్టాండువేశాడు వడ్లమాని కామేశ్వరరావు. రెవిన్యూ ఇన్స్పెక్టరుగారంటే బుల్లిరాజుగారికి గౌరవం ఉంది. ఆ మర్యాద కామేశ్వరరావుకీ తెలుసు. ధైర్యం చేసి ఆయన రాజుగారికి అడ్డం పడ్డాడు. "సుఖపడటం తెలిసినవాడికి బాగుపడటం తెలీకపోదు. అబ్బాయిగారి సంగతి నాకొదిలెయ్యండి. తమరు నెమ్మది పడండి" అని చేతిలో పట్టీలాక్కున్నాడు.

బుల్లిరాజుగారికి ఏడుపొచ్చేసింది. గజ్జెలు గుచ్చుకుని భూపతిరాజుగారి వీపు రక్తం చిమ్ముతోంది. జీతగాళ్ళు కుర్రాడిని తప్పించేశారు.

"కుర్రాడి సంగతి నాకొదిలెయ్యండి. మూడేళ్ళు తిరక్కుండా చాకులాంటి మనిషిని మీ ముందు నిలబెడతాను" అన్నాడు.

అంత బాధలోనూ ఆశ్చర్యపడ్డారు బుల్లిరాజుగారు. "ఎలా?" ఆ ప్రశ్నకు సమాధానం కామేశ్వరరావు దగ్గరా లేదు. కానీ ప్రతి సమస్యకీ ఏదో పరిష్కారం ఉండక తప్పదని తెలుసు. చేసేది రేవిడి ఫిర్కా పనయినా ఆయన ఉండేది కోరుకొండ సైనిక స్కూలులో. అప్పట్లో సైనికస్కూలు ప్రిన్సిపాల్ హెచ్.ఎస్.నాగపాల్. నేపాలీ మనిషి, రాజ్‌పుటానా రైఫిల్స్ నుంచి వచ్చినవాడు. లావుగా పొట్టిగా, పెద్దమీసాలతో పిడుగులాగా ఉండేవాడు. అతనికి భూపతిరాజు పితూరీ గురించి చెప్పాడు. కథ వింటూనే పగలబడి నవ్వాడు నాగపాల్. అతనికి బాగా నచ్చిన విషయం ఓ మేదరి అమ్మాయి ఓ కుర్రాడిని లొంగదీయడం. ఆరోగ్యం బాగుపడ్డాక స్కూలులో చేర్చుకోడానికి అంగీకరించాడు ఆ విధంగా భూపతిరాజుగారి జీవితం ఈసారి చాలా అందమయిన మలుపు తిరిగింది.

ఏతావాతా, పద్మనాభంలో రెండు జీవితాలకి అపురూపమయిన మలుపు తిప్పాడు వడ్లమాని కామేశ్వరరావు. ఇది కేవలం మలుపు మాత్రమే. ఆ తర్వాత రాజమార్గంలో చాలా చెట్లు నాటాడు. ప్రయాణం చాలా సుగమం చేశాడు. అది తర్వాతి విషయం.

చిన తిరుమలాచార్యులు యూనివర్సిటీకి ఫస్టు రావడం ఎవరిమాట ఎలా ఉన్నా, వెంకటాచలాన్ని ఆశ్చర్యపరచలేదు. బాధ్యత లక్ష్యాన్ని భారం చేస్తుంది. ఆసక్తి లక్ష్యాన్ని పదును పెడుతుంది. తిరుమలకి చదువు బాధ్యత కాదు అవకాశం. అవసరం కాదు, అలంకారం. 'అనురాగము లేక సుజ్ఞానము రాదు' అన్నారు త్యాగరాజస్వామి. ఆ అనురాగాన్ని నూటికి నూరుపాళ్ళూ చదువుమీద పెంచుకున్నవాడు చినతిరుమలాచార్యులు.

ఇక తరువాతి కథ ఏమిటి? ఆ ఇంట్లో మన ప్రళయాన్ని సృష్టించడం వెంకటాచలానికి ఇష్టంలేదు. ఇక మీదట జరగాల్సిన చదువు ఇంతక్రితం జరిగిన చదువులాంటిదికాదు. ప్రైవేటుగా, పద్మనాభంలో ఉంటూ సాగించేదీకాదు. అయితే సులువుగా తన పట్టుని వదిలిపెట్టే రకం కాదు. వెంకటాచలం, జయవాణి ముందుగానే హెచ్చరిక కూడా చేసి, అతని పశ్చాత్తాపాన్ని గుర్తుచేసింది.

ఈతరానివాడు నీళ్ళల్లో పడితే తపతపా కొట్టుకుంటాడు. రెండోసారి నీళ్ళ గురించి ఆలోచించడు. ఈత గురించి ఆలోచిస్తాడు. ఈతని సాధించలేకపోతే నీళ్ళకి దూరంగా ఉంటాడు. ధీరుడయితే భర్తృహరి భాషలో విఘ్ననిహన్యమానుడవుతాడు.

మొదట ఓ ఫోటోగ్రాఫరు విశాఖపట్నం నుంచి సైకిలు మీద చినతిరుమలాచార్యుల్ని వెదుక్కుంటూ వచ్చాడు. యూనివర్సిటీ ఫస్టు వచ్చిన కుర్రాడి ఫోటో పేపర్లో వెయ్యాలి. వరదమ్మ గర్వపడిపోయింది. పెళ్ళిలో తన తండ్రి పెట్టిన జరీ పంచె, ఉత్తరీయం తీసి కొడుక్కి ఇచ్చింది.

పంచె, ఉత్తరీయం, ఊర్ధ్వపుండ్రాలూ, యజ్ఞోపవీతం, శిఖతో ఎదురుగ్గా నిలబడిన కుర్రాడిని చూసి ఇంకా కెమెరా సవరించుకుంటున్నాడు ఫోటోగ్రాఫరు. "ఈ గుడిలో పూజారివా, బాబూ?" అన్నాడు.

వరదమ్మ, రుక్మిణమ్మ నవ్వారు. "ఫస్టొచ్చిన కుర్రాడు నీకేమవుతాడు?" అనడిగాడు సరదాగా.

వరదమ్మ, రుక్మిణమ్మ నవ్వారు.

"నేనే ఆ కుర్రాడ్ని" అన్నాడు తిరుమల.

అంతే చేతిలో కెమెరా దాదాపు జారిపోయింది. కంగారుపడిపోయాడు ఫొటోగ్రాఫరు. ఏం చెప్పాలో, ఏం చెయ్యాలో తెలీక, ఏదో పని ఉన్నట్టు గుడి బయటకు నడిచి, ఫోటో తీయకుండానే పట్నం పారిపోయాడు.

సాయంకాలం వెంకటాచలంతో చెప్పి నవ్వుకున్నారు సుభద్రాచార్యులు.

"చదువయేది, కాకపోయేది గుండూ, పిలకా చేస్తే తీయడానికి వీల్లేదు తిరుమల" అన్నాడు వెంకటాచలం. ఆ క్షణంలోనే చదువయేది, కాకపోయేది పిలక తీసెయ్యాలని గట్టి నిర్ణయానికి వచ్చాడు తిరుమల. ఫోటోగ్రాఫరుకి ఆ సాయంకాలమే రెండు వందలు చదివించుకున్నాడు వెంకటాచలం.

మరో నెలరోజులకి జోథ్‌పూర్ సూటు వేసుకున్న మరొకాయన కుంతీపద్మనాభస్వామి ఆలయానికి వచ్చాడు. ఆలయం గురించి విని, స్వామి దర్శనానికి వచ్చానన్నాడు. దేవుడి దర్శనం అయిపోయినా, ఆలయం అరుగుమీద కూర్చున్నాడు. కొబ్బరికాయ పూర్తిగా తిను. తిరుమల గురించి వాకబు చేశాడు. చదువు విషయం తెలిసి, ఫిజిక్స్‌లో అతి సులువుగా సమాధానం చెప్పగల అయిదరు ప్రశ్నలు వేశాడు. అన్నిటికీ కుర్రాడు అద్భుతంగా సమాధానం చెప్పడాన్ని సుభద్రాచార్యులుగారు, వరదమ్మ, రుక్మిణమ్మ, కైకవశి గమనించారు.

నవనీతం అబ్బురంగా రఘోత్తమరావుగారి ముందు ఓ పెడ అరటిపళ్ళు ఉంచింది. తను మద్రాసు ఐ.ఐ.టి.లో ఫిజిక్స్ బోధిస్తున్నట్టు చెప్పాడు.

మరో గంటసేపు అక్కడ గడిపి "ఇంత తెలివయిన కుర్రాడు ఈ మారుమూల గ్రామంలో ఉండిపోవడం దురదృష్టం మీకు కాదు, చదువుకి" అనేసి వెళ్ళిపోయాడు.

అప్పుడే, ఎట్టి పరిస్థితుల్లోనూ తన బిడ్డ ఈ మారుమూల ఉండకూడదని వరదమ్మ మనసులో నిర్ణయించుకుంది. ఆ రాత్రి జానీవాకర్ స్కాచ్ విస్కీ పార్టీని సమర్పించుకున్నాడు డాక్టర్ రఘోత్తమరావుగారికి వెంకటాచలం.

పద్మనాభస్వామి ఇరవైమూడో మెట్టు దగ్గర విద్యాదానం సాగుతోంది కూర్మయ్యకి.

జయవాణి విక్టోరియాని ప్రసవించింది.

భూపతిరాజుని కోరుకొండ సైనిక్ స్కూలులో వదిలివచ్చాడు బుల్లిరాజుగారు. నాలుగు కుంచాల ధాన్యం. పన్నెండు రూపాయలూ చింతాలుకి ఇచ్చి రాత్రికి రాత్రి ఊరు ఖాళీ చేయించేశారు బుల్లిరాజుగారు. వాళ్ళు అటువెళ్ళగానే, చింతాలు గుడిసెకి నిప్పంటించేశారు. ఊళ్ళో అందరికీ తెలుసు చింతాలు ఎందుకు ఊరొదిలి వెళ్ళాల్సివచ్చిందో. అయినా అది రాజుగారి రహస్యం.

ఆ సంవత్సరం సెప్టెంబరు నెలలో వైష్ణవ శ్రీకృష్ణ జయంతి ఆదివారం పడింది. మూడు గంటలనుంచే మూలవరులకి పూజలు పూర్తిచేసి ద్వయమంత్రపారాయణం మొదలు పెట్టారు సుభద్రాచార్యులుగారు.

ఉన్నట్టుండి పద్మనాభం భళ్ళున మేల్కొంది. అరవైమంది కుర్రాళ్ళతో ఓ బస్సు పట్నం వైపునుంచి ఊళ్ళోకి మలుపు తిరిగింది. అందరూ ఘొల్లుమంటూ ఆలయంవైపు పరుగులు తీశారు. ఆ పాటికి ఊరంతా మేల్కొంది. సగం ఊరు కూడా కుర్రాళ్ళ వెనకే నడిచింది.

అందరూ గుడిలో జొరబడ్డారు.

"సుభద్రాచార్యులవారెక్కడ?" అని పిల్లల వెనక వచ్చిన ఆరుగురు టీచర్లూ కేకలు వేశారు. వెదకనక్కరలేదు, ఎదురుగ్గా సాక్షాత్తూ మూలవిరాట్టు నడిచివచ్చినట్టుగా ఆలయం బయటికి వచ్చారు స్వామి.

"మేం తమకోసం వచ్చాం" అన్నారు టీచర్లు సవినయంగా.

సుభద్రాచార్యులవారు నిర్ఘాంతపోయారు.

**"మరొక్కమాట సెలవియ్యండి.** తమరేనా చినతిరుమలాచార్యులవారి తండ్రిగారు?"

ఈసరికి చినతిరుమలాచార్యులు, గుడిముందు కళ్ళాపు జల్లుతున్న నవనీతం అంతా చోద్యం చూస్తూ నిలబడ్డారు.

ఊరంతా విడ్డూరం చూస్తోంది.

"మావాడే చినతిరుమల" అన్నారు సుభద్రాచార్యులవారు బలహీనంగా, కానీ ఆర్ద్రతతో వినమ్రమయిన గొంతుతో.

"మేం చిన తిరుమలాచార్యులవారికోసం రాలేదు. ఓ మాములు కుర్రాడిలో స్ఫూర్తిని కలిగించి - యూనివర్సిటీ గర్వపడే స్థాయిలో అతన్ని నిలిపి, మా ప్రాంతానికి గర్వకారణమయిన తల్లిదండ్రుల్ని - ఏరీ తమ శ్రీమతిగారు?"

వరదమ్మ పట్టుచీరలో గోచీ తిప్పి కట్టుకుని వంటశాలలో ఉంది. ఆమె వారిస్తున్నావినకుండా వందమంది అమ్మాయిలు ఆమెను గుడిముందుకి నడిపించుకువచ్చారు. వరదమ్మ సిగ్గుతో, భయంతో కుంచించుకుపోయింది. రుక్మిణమ్మా అదే స్థితిలో ఉంది.

ఊరు ఊరంతా చూస్తూండగా ఇద్దరు టీచర్లు బస్సు టాపు ఎక్కిపోయారు. ఈ రోజుల్లో ముందుతరం బాగుపడడానికి తల్లిదండ్రుల బాధ్యత ఎంత ఉందో, పద్మనాభంలో సుభద్రాచార్యులవారు, వరదమ్మలాంటి వారి దగ్గర్నుంచి ఈ తరం తల్లిదండ్రులు ఎంత నేర్చుకోవలసి ఉందో మధ్య మధ్య సుమతి, వేమన, భర్తృహరిని ఉదహరిస్తూ పావుగంట మాట్లాడారు. తర్వాత ఇద్దరూ కిందికి దిగి సుభద్రాచార్యులవారి చేతిలో పట్టువస్త్రాలూ, వరదమ్మకి చీర, రవికెల గుడ్డా ఉంచారు. అరవైమందీ దంపతులకి పాదాభివందనం చేశారు. ఆ పట్టులో ఊరిలో వారూ దంపతులకు పాదాభివందనం చేశారు. ఆ ఉదయం ఊరు ఊరంతా ఆచార్య దంపతుల పాదాలదగ్గర ఉంది.

సుభద్రాచార్యులయితే నీరయిపోయారు. ఆయన కళ్ళు ధారలు కట్టాయి. వరదమ్మ స్థాణువయిపోయింది.

వెళ్తూ వెళ్తూ టీచర్లు ఖంగుమనే గొంతుతో ఒక్కమాట చెప్పిపోయారు. "ఓ కుర్రాడి జీవితంలో తమరు చిన్న దీపాన్ని వెలిగించారు ఆ వెలుగు ఈ తరానికి కరదీపిక కానివ్వండి. మీ అబ్బాయి ఈ తరానికి మార్గదర్శకం కావాలి"

చాలా కష్టపడి ఈ రెండు వాక్యాల్నీ సిద్ధం చేశాడు వెంకటాచలం. టీచర్లచేత రిహార్సల్సు చేయించాడు. ఈ ఉద్యమానికి చాలా ఖర్చయింది. అయినా పరవాలేదు. ఓ తండ్రిలో పుత్రోత్సాహం ఇనుమడింపచెయ్యడానికి ఆ మాత్రం పెట్టుబడి కావాలి.

అతని లక్ష్యం ఆ క్షణాన సుసంపన్నం అయింది. తన కొడుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ఊళ్ళో ఇక ఉండబోవడంలేదన్న ఆలోచన సుభద్రాచార్యులవారి మనస్సులో ప్రోది చేసుకుంది.

## 10

చక్కగా క్షవరం చేయించుకుని, వెంకటాచెలం తెచ్చిన పాంటూ షర్టు తొడుక్కుని ఎదురుగ్గా నిలబడిన కొడుకుని చూసి పొంగిపోయింది వరదమ్మ.

ఓ గొప్ప సంప్రదాయం ఆ క్షణంలో చచ్చిపోయినందుకు, కొడుకుని పోగొట్టుకున్న తండ్రిలాగా మనస్సులోనే దురసిల్లారు సుభద్రాచార్యులు.

కొడుకు మనోవ్యథకు, కోడలి ఆనందానికి మధ్య కొట్టుమిట్టులాడింది రుక్మిణమ్మ.

కైకవశి మరో ఇరవై ఏళ్ళ తర్వాత తిరుమలని మనస్సులోనే ఊహించుకుని గర్వపడింది. నవనీతానికి మనస్సులో అందంగా ఉన్న మగాడిని చూసినప్పటి వణుకుదల ఏదో గుండెల్లో కదిలింది.

విక్టోరియాని ఎత్తుకుని జయవాణి కూడా వెంకటాచెలంతో వచ్చింది. ఆ పాత్ర కోసమే పుట్టినట్టు కనిపిస్తున్నాడు తిరుమల. ఇన్నేళ్ళూ ఈ యువకుడు ఎక్కడ దాగున్నాడు?

తర్వాతి పనులన్నీ త్వరత్వరగా జరిగిపోయాయి. ఆడుతూ పాడుతూ, బి.టెక్‌లో తిరుమలకి సీటు దొరికింది. అంతేకాదు, పెమ్మసాని సత్యనారాయణరాజు ఎండోమెంట్ స్కాలర్‌షిప్ కూడా ఇచ్చారు. దానిప్రకారం నెలకి రెండువందల రూపాయలు చేతికి వస్తాయి. ఆ రోజుల్లో బంగారం తులం వంద రూపాయలు.

చెంగ్రలావు పేట పంజా దగ్గర చిన్న ఇల్లు అద్దెకి తీయించాడు వెంకటాచెలం. దూరంగా ఉంటూనే అవసరమయిన కనీసపు సరంజామా సమకూర్చింది జయవాణి. కొడుకుకి వండిపెడుతూ, అతని పనులు చూడడానికి వరదమ్మ పట్నం వచ్చింది. స్వామి ఆరాధన కొడుకు వ్యవరాలు చూసుకునే పని ఊళ్ళో రుక్మిణమ్మది. ఇద్దరు తల్లులూ ఇద్దరి బిడ్డల పనులూ పంచుకున్నారు.

అక్కడ కూర్మయ్య చదువూ చురుకుగా సాగుతోంది. వడ్లమాని కామేశ్వరరావు ముక్కుకి సూటిగా పోయేరకం కాదు. సూటిగా పోయేదారిలో ముక్కుని నిలిపే రకం. భాషాప్రవీణ స్థాయికి భాషని ఆపోశన పట్టేరకం కాదు. ముప్పైరోజుల్లో భాధని ఒడిసిపట్టుకునే రకం. ఎప్పుడయితే కుర్రాడు మెరికలాగా ముందుకు దూసుకుపోవడం గమనించాడో, దిగువ వర్గాలకి ఉన్న గవర్నమెంటు రాయితీల

వైపూ, అవకాశాలవైపూ దృష్టి సారించాడు. అందరికీ వంద మార్కులూ రావాలి. ఈ కుర్రాడికయితే ముప్పై చాలు. అందరూ చదువుకి ఖర్చుపెట్టాలి. ఈ కుర్రాడి చదువుకి ప్రభుత్వం ఖర్చుపెడుతుంది. ఓసారి కోర్టు పనిమీద హైదరాబాదు వెళ్తూ (అప్పుడే కర్నూలు నుంచి హైదరాబాదుకి రాజధాని మారింది) కుర్రాడిని వెంటబెట్టుకుని వెళ్ళాడు. కావాల్సిన ఫారాలు నింపి, ఇవ్వాల్సిన అప్లికేషన్లు ఇచ్చి, కుర్రాడికి పెటీక భవనంలో వసతి ఏర్పాటు చేశాడు. ధారణ ఉన్న వ్యక్తికి దక్షత దొరికితే ఏమవుతుంది? కూర్మయ్య విషయంలో అదే అయింది.

అక్కడ కోరుకొండలో భూపతిరాజు కమ్మెచ్చులో సాగిన తీగలాగా అయిపోయాడు. మనిషిలో దూకుడూ ఒక దారిన పడింది. కవాతులో ముందు నిలిచాడు. చదువులో పెద్ద రాణించకపోయినా, క్రమశిక్షణ మెదడులో రక్తాన్ని కదిలించింది. సెలవులకి ఇంటికి వచ్చిన కొడుకుని చూసి బుల్లిరాజుగారూ, తమ్మారావూ పొంగిపోయారు.

సంక్రాంతికి వడ్లమాని కామేశ్వరరావుని పిలిపించి పొందూరు ఖద్దరు తానూ, రెండు బంగారు కాసులూ చేతిలో పెట్టి ఆప్యాయంగా కావలించుకున్నాడు. రిటైరయ్యేనాటికి తను డిప్యూటీ కలెక్టరవుతాడని కామేశ్వరరావుకి తెలుసు. పెన్షనూ రాక తప్పదని తెలుసు. అది నౌఖరీ ఇచ్చే కితాబు. కానీ, ఈ రెండు కాసులూ ఒక జీవితాన్ని సరిదిద్దినందుకు దక్కిన కితాబు. కామేశ్వరరావు సర్వీసులో గర్వంగా మిగిలిన జ్ఞాపకాన్ని చెప్పమంటే ఆ రెండు కాసుల్నీ ఉదహరిస్తాడు. వాటిని భద్రంగా పెళ్ళాం మెడలో దాచుకున్నాడు.

ఇప్పుడిప్పుడు సుభద్రాచార్యులవారు పాశురం చదువుతుంటే కొన్ని పదాలు మనస్సులోంచి జారిపోతున్నాయి. నిలబడి గుర్తుచేసుకుంటేనే కానీ స్ఫురణకి రావడంలేదు. తన స్వభావంలో భాగంలాగ తనతో మమేకమయిన ఆధ్యాత్మిక సంపద సంచితమయిన ఆస్తిలాగా కనిపించింది. మనస్సులో ఏదో మూల వ్యగ్రత చోటు చేసుకుంది. జీవిత భాగస్వామిని స్నేహితురాలయి, కొడుకు పొరుగింటివాడిలాగా కనిపించే వయస్సు. పొరుగూరులో తనవాళ్ళుండడం తనకి కొత్త. ఆ మాటకి వస్తే, ఈ కుటుంబానికే కొత్త. తాత ముత్తాతల నుంచీ ఆజన్మాంతం సమక్షంలో జీవించడమే అనూచానంగా వస్తున్నది. ఇప్పుడీ విపరిణామం?

రుక్మిణమ్మ జీవికలోనూ చిన్న అపశృతి కనిపించింది. చన్నీళ్ళు నెత్తిన గుమ్మరించుకుంటే శరీరం వణుకుతోంది. పులిహోర, దద్దోజనం, చక్రపొంగలీ శ్రీ వైష్ణవుల సొత్తు. పైగా, స్వామికి కైంకర్యం చేసిన పదార్థంలో మరింత రుచి మేళవిస్తుంది. అలాంటిది. సుభద్రాచార్యులవారి ఆరాధనలో గొంతు వణికితే, రుక్మిణమ్మ కైంకర్యంలో రుచిపాలు తగ్గింది.

అయితే ఇది కేవలం ప్రారంభం.

అక్కడ వరదమ్మకి పట్నం జీవితం ఇబ్బందిగానే ఉంది. ఎక్కడ శ్రీ కూర్మం, ఎక్కడ పద్మనాభం, ఎక్కడ విశాఖ? తమ ఊళ్ళోలాగా మడి సాగదు. బహుశా ఇక్కడ అవసరం లేదేమో? శిఖ, ఊర్ధ్వపుండ్రాలూ లేకపోయాక, పెద్దలతో పంక్తి భోజనానికి తిరుమల అనర్హుడు. ఆ మాట అనడానికయినా పెద్దలు ఏరీ? అయితే ఇది తిరుమల కోరుకున్న మార్పు కాదు. చదువూ, ఆధునిక జీవితం తప్పనిసరిగా నెత్తిన వేసిన మార్పేమో? ఇదివరకు అరవై అయిదుపన్నాలూ చదువుకున్న శ్రోత్రియుడు ఆనందంగా లేడూ? అలా అనుకుంటే గోచీ కట్టుకోవాలని కూడా తెలీక, గుహల్లో పచ్చిమాంసం తినే ఆదిమానవుడూ ఆనందంగానే ఉన్నాడు. ఆనందానికి అర్థం మారే కాలంతోపాటు మారుతూంటుంది.

జీవితం నిరంతరం స్రోతస్విని, ప్రతిసారీ కొత్త ఆకాశంలో కొత్తగా విరిసే కొత్త హరివిల్లు మార్పు దాని నైజం. ఇది ఆశావాది అనుకునే మాట. పాతని నశింపచేయడం, కొత్తకి అనువదింపజేయడం దాని నైజం. ఇది మంచిదా, కాదా నిర్ణయించడానికి మనమెవరం? జీవితమే దాన్ని విశ్లేషిస్తుంది.

ఉన్నట్టుండి తిరుమల ప్రేమలో పడ్డాడు. అదొక అందమయిన ప్రహసనం. బంగారం రంగూ, ఆడపిల్ల పెదాల్లాగా ఎర్రటి పెదాలూ, సన్నగా, నేవళీకంగా ఉండే ఇరవైమూడేళ్ళ కుర్రాడు చాలామంది అమ్మాయిల కళ్ళల్లో పడ్డాడు.

కానీ, బి.టెక్‌లో చేరిన కేవలం పదహారుమందిలో ఉన్న ఒకే ఒక అమ్మాయి శ్యామల. పెద్ద అందగత్తె కాకపోయినా, తిరుమల కళ్ళల్లో పడింది. ఆమె శరీరం కాస్త బరువు. చిన్న మెల్లకూడా ఉంది. లెక్కల్లో నూటికి నూరూ సంపాదించుకుని, కేవలం అర్హతతో సోంపేట నుంచి వచ్చి బి.టెక్‌లో చేరింది శ్యామల. అసలు ఆడపిల్ల అలాంటి కోర్సు చదువుతున్నందుకే అందరూ ఆశ్చర్యపోయారు. ఆ రోజుల్లో ఆడ ఇంజనీర్లు బొత్తిగా కనిపించరు. ఆ కారణం చేత ఆమె ప్రత్యేకంగా కనిపించేది. కానీ ప్రేమకి అది ప్రత్యేకత కాదు. ఆకర్షణకి అది కారణమూ కాదు. అయితే ఆకర్షణకీ, ప్రేమకీ ఎక్కువ అర్థాలూ, అన్వయాలూ తెలీని స్థితి తిరుమలది.

ఓరోజు యూనివర్సిటీ బస్సు దిగుతుంటే, ఆ అమ్మాయి దిగి, వెనకనుంచి వచ్చి "ఇవాళ నా టీస్క్వేర్ మరిచిపోయాను. థర్డ్ పీరియడ్‌కి మీది ఇస్తారా?" అని అడిగింది. గొంతు అతి నాజూకుగా, సంస్కారం అత్యంత ప్రీతిపాత్రంగా కనిపించింది. రెండో పీరియడ్‌కే తనకవసరమయినా తీసుకెళ్ళి టీస్క్వేర్ ఇచ్చాడు. మళ్ళీ తీసుకోవడం మరిచిపోయాడు. మరిచిపోయిన విషయం మర్నాటికి జ్ఞాపకం వచ్చింది. అప్పుడామె ఎక్కడ ఉందో తెలుసుకోవాలనిపించింది. షష్టిపూర్తి మహల్ ముందు నిలబడి నలుగురి అమ్మాయిల్ని శ్యామల గురించి వాకబు చేశాడు. ఆ నలుగురమ్మాయిలూ శ్యామలకంటే ఏ విధంగా చూసినా అందమయినవాళ్ళు. తిరుమలలాంటి అందమయిన కుర్రాడు తమంత అందంగా లేని ఓ అమ్మాయి గురించి షష్టిపూర్తి మహల్ దగ్గరకి ప్రత్యేకంగా వచ్చి వాకబు చేయడాన్ని 'ప్రేమ'గా తర్జుమా చేసుకున్నారు వాళ్ళు. మధ్యాహ్నానికి 'శ్యామల' లేడీస్ వెయిటింగ్ రూమ్‌లో ప్రత్యేకమయిన టాపిక్ అయిపోయింది. చాలామంది అమ్మాయిలు తిరుమలని నష్టపోయినందుకు మనస్సులో బాధపడ్డారు. శ్యామల ఆ ఛాన్స్ కొట్టేసినందుకు బహిరంగంగా ఈర్ష్యపడ్డారు. ఆ మాట శ్యామలతో అన్నప్పుడు ముందు శ్యామల షాక్ అయిపోయింది.

"ఛీ! షష్టిపూర్తి మహల్‌కి ఎందుకొచ్చారూ?" అంది శ్యామల తిరుమల కనిపించినప్పుడు.

"టీ స్క్వేర్ కోసం" అని నసిగాడు.

"ప్రేమకోసం" అంటాడేమోననుకుని, అననందుకు నిరుత్సాహపడింది. ఆ మాట అంటున్నప్పుడు తిరుమల బుగ్గలు ఎరుపెక్కాయి. సిగ్గుతో కుచించుకుపోయిన ఆడపిల్లలాగా కనిపించాడు. ఆ క్షణంలో అతని తలని తన రొమ్ముమీద ఆనించి ఓదార్చాలనిపించేంత పసితనం కనిపించింది.

"ఐ యామ్ సారీ" అంది.

"ఐ యాం సారీ" అని అతనూ అన్నాడు.

మరో పదిహేను రోజులు ఇద్దరూ కలవలేదు. కలుసుకోవాలని ఇద్దరికీ అనిపించలేదు.

కానీ పదహారోరోజు మధ్యాహ్నం ఐసిహెచ్ (ఇండియన్ కాఫీ హౌస్)లో టీ తాగుతుండగా ఎదురుగ క్లాస్‌మేట్స్ జాన్, వీరభద్రం వచ్చి కూర్చున్నారు.

"ఒక్కమాట చెప్తావురా?" అని ప్రారంభించాడు వీరభద్రం.

అర్థంకాక చూశాడు తిరుమల.

"ఓకే! నీకు శ్యామల నచ్చింది. ప్రేమలో పడ్డావు. మాకేం అభ్యంతరం లేదు. ఆనర్స్ చేస్తున్న వళ్ళివైపు వస్తే నీ సంగతి తేల్చేవాడిని. ఒక్కమాట చెప్పు బ్రదర్, శ్యామలలో స్ట్రాంగ్ పాయింట్ ఏమిటి?" అని ముందుకు వంగాడు.

"నాకు తెలుసు - బ్రేస్ట్స్" అని సిగరెట్టు వెలిగించాడు జాన్. ఇద్దరూ పగలబడి నవ్వారు. ఐసిహెచ్ అంతా తెల్లబోయి చూసేలాగా.

ఆ సాయంకాలమే శ్యామలని ప్రత్యేకంగా గమనించాడు తిరుమల. ఆ రోజుల్లో ఈనాటి చుడీదార్లు లేవు. చక్కగా చీరె కట్టుకుని, నీలిరంగు పట్టుచోళీతో పవిత్రంగా కనిపించింది అందంగా లేని శ్యామల. అందానికీ, కోరికకీ, ఆకర్షణకీ అర్థాలు చెరిగిపోయే వయస్సు అది. ఏ ఆడపిల్లయినా మగవాడి చూపు ఎటు ప్రయాణం చేస్తుందో అతి సులువుగా గ్రహించేయగలదు. అందునా బొత్తిగా గడుసుతనం తెలియని తిరుమల చూపు ఇట్టే దొరికిపోయింది. చటుక్కున పమిటె సరిచేసుకుంది. ఆమె సిగ్గుపడింది. సిగ్గుపడటం తిరుమలకీ అర్థమయింది. దాన్ని ఆకర్షణగా అర్థం చేసుకున్నాడు.

ఈసారి ఎనిమిదిన్నర ట్రిప్పులో యూనివర్సిటీ బస్సు ఎక్కేది శ్యామల. అందులో తిరుమల వస్తున్నాడని తెలిసి. అప్పటికే షష్టి పూర్తిమహల్‌లో వారిద్దరి ప్రేమకీ ప్రచారం జరిగిపోయింది.

ఒకరోజు ఇద్దరూ బస్సు తప్పిపోయారు. ఇద్దరు ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటూ బీచ్‌వైపు ఎర్రదిబ్బలవైపు నడిచారు. పిచ్చిగా వ్యాపించిన జీడిమామిడి తుప్పలకింద కూర్చున్నారు. మూడుగంటలసేపు అలా కూర్చుని మాట్లాడిన మాటల్లో ఏ ఒక్కమాటని గుర్తుపట్టమన్నా ఇద్దరూ ప్రత్యేకంగా గుర్తుపట్టలేరు. ఎర్రదిబ్బలు ఎక్కుతున్నప్పుడు శ్యామలకి చెయ్యి అందించాడు. ఆ చేతిలో శ్యామల చెయ్యి నిప్పులాగా భగ్గుమంది. ఆమె ఊపిరి వదలడం అతనికి స్పష్టంగా అర్థమయింది. ఆ రాత్రి చీకటిలో ఇద్దరూ విడిపోతున్నప్పుడు తిరుమల అడగకుండానే శ్యామల అతని చెక్కిలిమీద ముద్దు పెట్టుకుంది. ఆ స్పర్శకి తిరుమల నరాలన్నీ జివ్వుమన్నాయి. తెలీని విద్యుత్తు ఆపాదమస్తకం పరుచుకుంది. ఆ రాతి తిరుమలకి నిద్రపట్టలేదు. ఆ రాత్రి శ్యామల ఆనందంగా నిద్రపోయింది. ఆకలి ఒకరి బాధ. ఆటవిడుపు మరొకరికి ఉపశమనం. తన మనస్సుని చూపించినందుకు ఆమె తేలికపడింది. పర్యవసానం కోసం అతని మనస్సు ఆవేశపడింది.

తర్వాత ఏమవుతుంది? ఏమవ్వాలి? నిజానికి ఇద్దరికీ తెలీదు. ఈసారి కావాలనే ఇద్దరూ బస్సు తప్పిపోయారు. ఈసారి అవసరం కాకపోయినా, తోవ తెలిసినట్టు ఇద్దరూ ఫలానా ఎర్రదిబ్బ దగ్గరికే వచ్చారు. ఈసారి అవసరం కాకపోయినా, అతని చెయ్యికోసం శ్యామల ఎదురు చూసింది. ఆమె ఎదురు చూడాలని తిరుమల ఎదురు చూశాడు. ఈసారి తెలిసిన స్పర్శని వేళ్ళు నమ్మకంగా పంచుకున్నాయి. అంత దగ్గరగా చూసినా ఆమె మెల్లకన్ను అతనికి కనిపించలేదు. ఆమె అద్భుతమయిన తేనెపట్టులాగా అతనికి కనిపించింది. ఈసారి మూడు గంటలూ మాటల్లో గడపలేదు ఎందుకు? మూడుగంటల తర్వాత 'ముద్దు'కి ఆలోచనలు అతుక్కుపోయాయి కనక. గడిచిపోవాలని ఇద్దరూ ఎదురుచూశారు కనక. అనుభవంలో సెక్స్ తొంగిచూడని ఇద్దరు 'మొదటి' ప్రేమికుల అమాయకపు ఆర్తి అది. ఈసారి ముద్దులో తిరుమల ప్రమేయం ఎక్కువయింది. లోగడ ఉన్నట్టుండి ఒక్కసారి ఏడ్చేశాడు తిరుమల. శ్యామల బిత్తరపోయింది. ఏం చెయ్యాలో తెలీక అతని తలను గుండెకు హత్తుకుంది.

స్త్రీలో మాతృత్వం దేవుడిచ్చిన వరం. ఒక ఇన్‌స్టింక్ట్ దాన్ని ఎవరూ సాధించనక్కరలేదు. ఆడది తల్లికావడం అతి సామాన్యమయిన పరిణామం. ఆకలి తీర్చిన ప్రతి స్త్రీ మగాడికిచ్చే రెండవ స్పర్శ తల్లిదే. కోరిక స్త్రీ పురుషుల్ని కలుపుతుంది. మాతృత్వపు స్పర్శ ఆ కలయికని పరిపుష్టం చేస్తుంది. అది చాలా తేలికయిన పాత్ర స్త్రీకి.

ఆమె ఒడిలో పసివాడయిపోయాడు తిరుమల. అతని ముఖమంతా ముద్దులు పెట్టుకుంది శ్యామల. కానీ విచిత్రం మొదటి దశదాటకుండానే రెండో దశకి వచ్చేశారిద్దరూ. ఈ అనుభూతి పరవశంలో సెక్స్‌ని మరిచిపోయారు. లేదా సెక్స్ ఉన్నదన్న విషయం, ఉంటుందన్న విషయం, ఉండాలన్న విషయం ఇద్దరి మనసుల్లో లేదు.

ఆ తర్వాత కనీసం ఇరవైసార్లయినా ఇద్దరూ ఆ మట్టిదిబ్బలమీద కలిశారు. అరవైగంటలూ ఇద్దరూ కబుర్లు చెప్పుకున్నారు. మూడువేల ఆరువందల నిమిషాలు ఇద్దరూ ఒకరి చేతుల్లో ఒకరు గడిపారు. కానీ ఏనాడూ మొదటిరోజు అనుభూతిని దాటి ముందుకు ప్రయాణం చెయ్యలేదు. కారణం తిరుమల సంస్కారం, శ్యామల అనుభవం లేమి. ఇద్దరి ఉద్దేశాలకీ ఓ రూపం లేదు.

భగవంతుడి కోసం అన్వేషించే జిజ్ఞాసి తన అన్వేషణ ఆవలిగట్టున ఓ అందమయిన పుష్పాన్ని చూస్తే అదే భగవంతుడని నమ్ముతాడు. అతనికి లక్ష్యమే ఉంది కానీ, గమ్యం లేదు. అదే జరిగింది ఇద్దరి విషయంలో.

ఆ వేసవి సెలవుల్లో సోంపేట వెళ్ళింది శ్యామల. ఆ సెలవుల్లో ఆమెకి మేనమామతో పెళ్ళయిపోయింది. మేనమామ సింగపూర్‌లో ఏదో కంపెనీలో మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఆమె చదువుకోవడం ఇష్టంలేదు అతనితో సింగపూర్ వెళ్ళిపోయింది. ఆ తర్వాత వాళ్ళిద్దరూ జీవితంలో ఎప్పుడూ కలుసుకోలేదు.

## 11

మునిమాపువేళకి ఊరు ఊరంతా అట్టుడికినట్టు ఉడికిపోయింది. ఊరికి కాస్త అసింటా ఉన్న సరుగుడు తోపు వెనక జీడిమామిడిచెట్లు నేలకి కరుచుకుని అల్లుకుని ఉన్నాయి. పగలే ఆ స్థలమంతా జిమ్ముమంటూంటుంది. కూతవేటు దూరంలో ఊరున్నా, ఆ చెట్ల వెనకకి తొంగిచూస్తే ఏదో అడవిలో ఉన్న గుబులూ, వెరపూ కలుగుతుంది.

పొట్నూరులో దర్జీ వీర్రాజు దుకాణంలో పొన్నయ్య కాజాలూ, బొత్తాములూ కుడతాడు. గిరజాల జుత్తూ ఎప్పుడూ తెల్లటి మల్లుషరాయి, చొక్కాతో సినిమా యాక్టరులాగా ఉంటాడు పొన్నయ్య. రోజూ కొవ్వాడనుంచి పద్మనాభం మీదుగా సైకిలుమీద వెళ్తాడు. వెళ్ళేటప్పుడు పద్మనాభంలో సైకిలాపి సాయిబు సరయ్య కొట్లో బరంపురం కారా కిళ్ళీలు రెండు కట్టించుకుంటాడు. అలాగే ఇంటికెళ్ళేటప్పుడు విధిగా రెండు కిళ్ళీలు జేబులో వేసుకుంటాడు పొన్నయ్య ఊళ్ళోకి వస్తున్న విషయం సందు మొగిలోనే సుగంధీకారా వాసన ఘుమఘుమలాడుతూ దూసుకువచ్చేది. ఆ ఊరికి పూలరంగడిలాగా ఎప్పుడూ ఇస్త్రీమడతలతో కనిపించేవాడు పొన్నయ్య.

ఊరంతా గుప్పుమనించె అందగాడు పొన్నయ్య కళ్ళల్లో, అప్పుడే కుబుసం విడిచిన తాచులాగా మిసమిసలాడుతూ కొత్త అందాలతో కనిపించే నవనీతం పడడం అబ్బురమూ కాదు, ఆశ్చర్యమూ కాదు. ఊరు చిన్నది. మంచీ పాక్కుతుంది. మాటా పాక్కుతుంది ఊళ్ళో ఆ మూలనుంచి ఈ మూలకి.

పట్నం నుంచి వచ్చి కలిసే రోడ్డుకి కాస్త దూరంగా కిరసనాయిలు డిపోవుంది. మధ్యాహ్నం నాలుగుగంటలవేళ సీసా పట్టుకుని కిరసనాయిలు కోసం బయలుదేరింది నవనీతం. ఎలా వెళ్ళిందో సరుగుడు తోపు వైపు వెళ్ళింది. అంతే, మసకమసగా చీకటి పడేవేళకి రక్తంతో తడిసిన పరికిణీ, చిరిగిన జాకెట్టుతో రోడ్డుమీదకి వచ్చింది. మరో అరగంటకి ఊరంతా అక్కడే పోగయింది. మరో అరగంటకి సరుగుడు తోపులో పొన్నయ్య శవాన్ని చూశారు. మరో అరగంటకి కొడుకుల అవతారం హుటాహుటిన వచ్చేశాడు.

కైకవశి పరుగున వచ్చి కూతుర్ని వాటేసుకుంది. ఇంగితం తెలిసిన ఓ ఇంటి ఇల్లాలు లోపలికి పరుగెత్తి ఓ చీర తెచ్చి పిల్ల ఒంటిచుట్టూ తిప్పింది. నవనీతాన్ని ఇంటి అరుగుమీద కూర్చోపెట్టారు. వివరాలు తెలీకపోయినా విషయం అందరికీ అర్థమయిపోయింది. సరుగుడు తోపులో జీడిమామిడి చెట్ల కింద పొన్నయ్య నవనీతాన్ని బలాత్కారం చేసి రేప్ చేశాడు. నవనీతం చేతిలో ఉన్న కిరసనాయిలు సీసా పగలగొట్టి పొన్నయ్యని పొడిచింది. ఒకసారి కాదు, రెండుసార్లు కాదు. పదే పదే పొడిచింది. ఒకసారి కాదు, రెండుసార్లు కాదు పదే పదే నవనీతం మీద అత్యాచారం చేశాడు పొన్నయ్య. పొన్నయ్య బలాఢ్యుడు. నవనీతం వయస్సులో ఉన్న పిల్ల. సగం విరిగిన సీసా గుచ్చుకున్నా పొన్నయ్య ఆగలేదు. ఆమె అందం, ఆమె పొందులో మైకం అతన్ని పిచ్చివాడిని చేసింది. నవనీతమూ కసితో, కోపంతో పిచ్చిదయింది పాశవికమయిన కోరిక ఆమెను కబళించింది. రక్తంలోని వేడి ఆమెను తిరగబడేటట్టు చేసింది.

కడుపులో, గుండెల్లో ముఖం మీద సీసా గుచ్చుకుని రక్తం కారుతున్నా పొన్నయ్య ఆ అందమయిన శరీరానికి ఆఖరి నివాళి సమర్పించి ఆమె కౌగిలిలో ప్రాణం వదిలాడు. ఒక్కక్షణం నేరాన్ని మరిచిపోతే, రెండు ప్రాథమిక శక్తుల పోరాటంలో ఇద్దరూ పోరాడి వీగిపోయారు. ఒకరు ప్రాణాల్ని, ఒకరు శీలాన్ని నష్టపోయారు. ఈ పోరాటాన్ని ఫ్రాయిడ్, మపాసా ఇద్దరే విశ్లేషించగలరు.

సుభద్రాచార్యులుగారు మొదటిసారి బొటబొటా కళ్ళనీళ్ళు కార్చారు. ఈ పిల్లని పుట్టినప్పటినుంచీ ఆయనకి తెలుసు. కైకవశి ఎంతటి కర్తవ్యదీక్షాపరురాలో ఆయన ఎరుగును. ఎప్పుడూ బయటికి రాని రుక్మిణమ్మ వచ్చి కైకవశిని పొదివిపట్టుకుంది.

విచిత్రం నవనీతం ఏడవడంలేదు. స్థంభానికి తల ఆనించి స్తబ్దుగా కూర్చుంది. బుల్లిరాజుగారికి కబురు వెళ్ళింది. విషయం తెలిసి, నవనీతాన్ని చూసి ఆయన ఆపాదమస్తకం వణికిపోయారు. "ఆ లప్డీ కొడుకుని నువ్వు అనవసరంగా చంపావే. లేకపోతే, వాడిని నాలుగురోడ్లమధ్యా నేనే నరికేవాడిని" అన్నారు. సుభద్రాచార్యులు బుల్లిరాజుని సముదాయించారు.

కొడుకుల అవతారం హయాంలో ఎన్నడు మర్డరు కేసు లేదు. "ఆ లంజ కొడుక్కేమయిందిరా? ఈ గుంట బతుక్కు నిప్పెట్టేశాడు. నా సర్వీసులో ఇలాంటి కేసు చూడలేదు" అంటూ ఇద్దరు కానిస్టేబుళ్ళని కాపలాపెట్టి, స్వయంగా పదకొండు మైళ్ళూ సైకిలు తొక్కుకుని తగరపు వలస వచ్చేశాడు.

రాత్రి ఎనిమిదిన్నరకి విశాఖపట్నంలో ఉంటున్న తాసిల్దారు సూర్యనారాయణకి కబురెళ్ళింది. ఆయనకి ఉబ్బసం. అంగారుబొట్టు, చిన్నపిలకా, వదులుపాంటులో దీపిన ఖద్దరు షర్టు, బెల్టూ, ఎడమకాలు బూరగాలు. "మరి ఈ రాత్రికి రాలేనురా! ఆ పిల్లను స్టేషన్లో పడుకోబెట్టి కాపలాపెట్టు, రేప్పొద్దున్నే వచ్చి పంచనామా చేస్తాను" అన్నారు.

ఆ రాత్రి ఊళ్ళో చాలామంది నిద్రపోలేదు. తగరపు వలస పోలీసుల్ని ఇద్దర్ని రప్పించి, సరుగుడు తోపులో శవానికి కాపలా పెట్టాడు కొడుకుల అవతారం.

పొద్దున్నే వనభోజనాలకి బయలుదేరినట్టు ఉప్పుచెక్క నములుతూ జీపు దిగాడు తాసిల్దారు సూర్యనారాయణ. ఆయనతో ఓడవాలా బంట్రోతు, ప్లీడరు గుమాస్తా. ఆ రోజుల్లో ఎమ్మార్వోలు లెరు. మెజిస్టీరియల్ పవర్స్ అన్నీ తాసిల్దారువే. కుంతీమాధవస్వామి ఆలయంలో అర్చన చేయించుకుని, పోలీస్ స్టేషన్ బయట బల్ల వేయించుకుని కూర్చున్నారు సూర్యనారాయణ. నవనీతాన్ని చూసి జాలిపడ్డారు. "ఎవడ్రా ఆ వెధవ, ఇంత చిన్నపిల్లని చెరిచాడు" అని వాపోయాడు.

పంచనామా పూర్తయి అందరి దగ్గరా వాఙ్మూలాలు తీసుకునేసరికి మధ్యాహ్నం మూడయింది. అప్పుడు శవాన్ని పోస్టుమార్టంకి తరలించారు.

"ఈ పిల్లని ఇక్కడ ఉంచొద్దు. పట్నం పంపించెయ్. పూచీగా చూసుకోమని సూపర్నెంటు రామ్మూర్తికి కాగితం రాసిస్తాను" అన్నారు తాసిల్దారు సూర్యనారాయణ.

ఆ రోజుల్లో లాకప్‌డెత్‌లూ, లాకప్ మానభంగాలూ లేవు. బిడ్డని తీసుకెళ్ళిపోతుంటే కైకవశి భోరుమంది. బాధల్లోకెల్లా నరకబాధ తన కష్టాన్ని, ఇష్టాన్ని నోరు విడిచి చెప్పుకోలేకపోవడం. అందుకే నోరులేని జీవాలు మన ఆప్యాయతల్నీ, సానుభూతినీ ఎక్కువ సంపాదించుకుంటాయి. మనస్సు ఆ జీవిస్థితిని మన సంస్కారం మేరకు తర్జుమా చేస్తుంది. ఆ రోజు కైకవశిని చూసి జాలిపడనివాళ్ళు లేరు. నవనీతం సాహసానికి ఆశ్చర్యపడనివాళ్ళూ లేరు.

**ఉదయమే అడ్రసు** వెతుక్కుంటూ ఓ కానిస్టేబుల్ వచ్చి తిరుమలని కలిశాడు. ఇంటిముందు కానిస్టేబుల్‌ని చూసి వరదమ్మ కంగారుపడింది. విషయం తెలిసి తిరుమల నివ్వెరపోయాడు. ఆ రోజుల్లో విశాఖపట్నంలో కాస్త పెద్ద పోలీస్ స్టేషన్ మెయిన్ రోడ్డులో

(అప్పట్లో ఒకటే రోడ్డు) శివాలయానికి ఆనుకుని రోడ్డుమీదకి ఉన్న వన్ టౌన్ పోలీస్ స్టేషనే. అందులో మూడు గదులున్నాయి. హెడ్డు అప్పలనాయుడికి నవనీతం వయస్సు పిల్లలు ముగ్గురున్నారు. ఆమెను చూడగానే అతనికి ఎక్కడలేని సానుభూతీ తోసుకొచ్చింది.

"జరిగిందేదో జరిగిపోయింది. ఆడ్ని నువ్వెందుకు సంపావమ్మా? మేం బొక్కలో తోసేసి కుళ్ళబొడిసేవాళ్ళం. నా కొడుకు కుయ్యిమనకుండా నేరం వొప్పేసుకునేవోడు" అన్నాడు.

నవనీతం మొదటిసారిగా నోరు విప్పి ఒక్కటే కోరిక కోరింది. చెంగల్రావు పేట పంజా దగ్గర ఫలానా చోట ఉంటున్న చినతిరుమలాచార్యులకి తన విషయం చెప్పమని. వెంటనే కానిస్టేబుల్‌ని పురమాయించాడు.

ఉన్నపాటునే షర్టు తొడుక్కుని, తల్లిని తీసుకుని, రిక్షాలో వచ్చేశాడు తిరుమల. లాకప్‌లో నవనీతాన్ని, ఆమె స్థితిని చూసి కదిలిపోయాడు. ఆ సంఘటన జరిగిన ముప్పైగంటల తర్వాత ఒక్కసారి తిరుమలని వాటేసుకుని వరదమ్మ కాదు భోరుమంది నవనీతం. మర్డర్ జరిగాక ఆమె కంటివెంట వచ్చిన మొదటి కన్నీటి చుక్క అదే

తిరుమల వెళ్ళినప్పటినుంచీ ఓ గొప్ప స్నేహితుడిని దూరం చేసుకున్నట్టు గిజగిజలాడిపోయేది నవనీతం. ఇంటికి తిరుమల రాసే ఉత్తరాల్లో అతని అడ్రసుని రుక్మిణమ్మ చేత చదివించుకుని మనస్సుకి వంటబట్టించుకుంది. ఎందుకు? ఏదయినా అవసరం వస్తే తనని ఆదుకునే మంచిమిత్రుడు తిరుమలే. మిత్రుడేనా? ఫ్రాయిడ్‌కి ఈ పాత్రల్ని అప్పగిస్తే వారిద్దరి అవగాహనలో వారిద్దరూ గుర్తుపట్టలేని "ఆకర్షణ" ఏదో ఉన్నదంటాడు. అలాంటి ఆకర్షణ అతి పవిత్రమయిన, అతి పారమార్ధికమయిన స్థాయిలో ఋషులకే శ్రీరామచంద్రునిమీద కలిగిందని పురాణం.

ఇప్పుడు వరదమ్మ చేతుల్లోకి ఒరిగిపోయింది నవనీతం. జరిగిందంతా తెలిసిన మేరకి చెప్పాడు అప్పలనాయుడు ఈ కేసులో వంకరటింకరలు లేవు. పరిశోధనలు వసరంలేదు. రేప్‌కేసులు సాధారణంగా నిరూపణ కావు. సాక్షులు ఉండరు కనుక. ఇక్కడ నేరస్థుడు శవమై స్పష్టంగా కనిపిస్తున్నాడు. సందర్భం అర్థమయిపోయింది.

తెల్లవారేసరికి పెద్ద అక్షరాలతో పద్మనాభం పత్రికలకెక్కింది. చాలా సంవత్సరాలపాటు నవనీతం ఫోటో, పొన్నయ్య ఫొటోలు పేపర్లో పడ్డాయి. పీపుల్ వెర్సెస్ బి.నవనీతం కేసు గురించి సెషన్స్ కోర్టులో విన్నవాళ్ళందరూ నవనీతంపట్ల సానుభూతినే చూపేవారు. చాలామంది కేవలం ఆమెకి మేలు జరగాలనే విచారణ జరిగేటప్పుడు కిటికీల దగ్గర నిలబడి ఆలకించేవారు.

చార్జిషీటు వెంటనే తయారుచెయ్యడం, మేజిస్ట్రేటు ఆమెను రిమాండుకి పంపడం క్షణాలమీద జరిగిపోయింది. నవనీతం తరపున కేసు ఎవరు వాదించాలి? ఇప్పుడు వెంకటాచలాన్ని శరణు జొచ్చాడు తిరుమల. ఇలాంటి విషయాల్లో సింహంలాగా దూకుతాడు వెంకటాచలం.

"అరెరె ఎంతపనయింది? ఆ పిల్లని బయటికి లాగడం కష్టమయ్యా. ఇది కల్పబుల్ హోమిసైడు. ఎవడూ కేసు టేకప్ చెయ్యడు. బొత్తిగా గతిలేని ముసలి అడ్వొకేట్‌నో, ఏదయినా గతి దొరక్కపోతుందా అని వెదుక్కునే కుర్ర అడ్వొకేట్‌నో పట్టుకోవాలి" అన్నాడు.

ఏ రోగానికి ఎక్కడ కొట్టాలో తెలిసినవాడు వెంకటాచలం. వారాలు చేసుకుని చదువుకుని, ఫస్టుక్లాసులో పాసయి, ఎవడైనా గాడ్‌ఫాదరూ, ఆదరించే పేరున్న ప్లీడరూ లేక వాయిదాల పద్ధతిలో నల్లకోటు కొనుక్కున్న బుద్ధిమంతుడయిన ఓ కుర్రాడిని పట్టాడు వెంకటాచలం. అతని పేరు సంజీవి.

సంజీవిది వింతయిన కథ. అతని తల్లిదండ్రులెవరో ఎవరికీ తెలీదు. అతనికే తెలీదు. గరివిడికి ఇరవైరెండు కిలోమీటర్ల దూరంలో మెరకముడిదాం అన్న వూళ్ళో ఓ మామిడి తోట చెట్టుకింద ఇరవై తొమ్మిదేళ్ళ క్రితం, పుట్టిన నాలుగుగంటల్లో ఓ రైతుకి దొరికాడు. ఆ రైతుకి ఆరుగురు పిల్లలూ, అయిదు సెంట్లు భూమీ. జాలిగుండె వున్న కారణాన ఏడో బిడ్డగా ఇంట్లో పెరగనిచ్చాడు. ఊరంతా కాపులు.

నాలుగయిదు క్షత్రియుల కుటుంబాలున్నా వ్యవసాయం, సాగు వారి వృత్తులు. జ్ఞానం తెలిసినప్పట్నుంచీ తనకేం లేదో తెలుసుకున్నాడు సంజీవి. ఓ యాయవారం పంతులు అతనికి 'సంజీవి' అని రోడ్డుమీదే నామకరణం చేశాడు. సాధ్యమయినప్పటినుంచీ ఎవరినీ బాధపెట్టకుండా తన మానాన తను బతకడం అలవాటు చేసుకున్నాడు. సంజీవి ఆలోచనలెప్పుడూ పొలాన్ని దాటి, ఊరుకి దూరంగా ఉండేవి. పదో ఏటకే పదిమంది సహాయం కూడగట్టుకున్నాడు. వారంలో రెండురోజులు అయిదు కిలోమీటర్లు నడిచి గర్భాంలో ఓ రాజులింట్లో భోజనం చేసేవాడు. ఆ భోజనంలోనే రెండు కరుళ్ళు అన్నం చిన్నడబ్బాలో పెట్టుకుని రాత్రికి తెచ్చుకునేవాడు. మరో రోజు అతి కష్టం మీద తెర్లాం చేరి భోజనం చేసేవాడు. అక్కడికి మూడుకిలోమీటర్ల దూరం ఉత్తరావల్లిలో అయ్యన్నగారని సుమతీ శతకం చెప్పే పంతులున్నాడు. ఆయన దగ్గరకి వెళ్ళాడు.

కుర్రాడి కథంతా విని "ఓ రోజు మా ఇంట్లో భోంచేసి పో" అన్నారాయన.

"నేను భోజనానికి రాలేదు" అన్నాడు సంజీవి ముక్తసరిగా.

"నేను చదువుకుంటాను, స్కూల్లో చేర్పించండి" అన్నాడు.

అయ్యన్న పంతులు ఆశ్చర్యపోయాడు. "మరి తిండి ఎవడు పెడతాడ్రా?" అన్నాడు కసురుకున్నట్టు.

పదేళ్ళ కుర్రాడు పదునుగా సమాధానం చెప్పాడు. "దేముడు" అని. చర్రున ఆ మాట నసాళానికి అంటింది అయ్యన్నకి.

"అమ్మ వెధవా! మా ఇంట్లో రెండురోజులు భోజనం చెయ్యి" అని చెయ్యి పట్టుకుని తీసుకెళ్ళి రెండురూపాయలు కట్టి బడిలో చేర్పించాడు సంజీవిని. ఆ తర్వాత సంజీవి ఆగలేదు.

అవకాశాన్ని ఏర్పరుచుకుని దూసుకుపోయేవాడికీ అవకాశాలకోసం ఎదురుచూసేవాడికీ చాలా తేడా ఉంది. సంజీవి జీవితం రైలుపట్టాలమీదకి ఎక్కింది. విశాఖపట్నంలో నల్లకోటు తొడుక్కుని బార్‌లో కూర్చునేవరకూ ఆగలేదు.

వెంకటాచలం జీనియస్‌అంతా కరెక్ట్ మనిషిని పట్టుకోవడం. సంజీవిని చూడగానే తిరుమలకి ఎక్కడలేని గురి కుదిరింది. కేసు విని, నవనీతంతో ఏమాత్రమూ బంధుత్వం లేని ఇద్దరు వెంకటాచలం, తిరుమల తనని ఒప్పించి కేసు పట్టుకునేటట్టు చేయాలనే తాపత్రయం సంజీవిని ఆకర్షించింది.

"నా స్కాలర్ షిప్పు డబ్బులో నెలకి పాతికరూపాయలు మీకిచ్చుకుంటాను" అన్నాడు తిరుమల.

సంజీవి నవ్వాడు. "నెలకి పాతిక పుచ్చుకునే స్థాయికి నేనింకా రలేదు. డబ్బు కావలసినప్పుడు అడుగుతాను" అన్నాడు సంజీవి. "ఈ కేసులో పర్యవసానం రూఢిగా తెలుసు నవనీతానికి శిక్షపడుతుంది. కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్‌కి ఎంతయినా ఎనిమిదేళ్ళు వేస్తారు. అర్థం చేసుకునే జడ్జి, అర్థమయ్యేటట్టు చెప్పగల ప్రాసిక్యూషన్ అంతా కుదిరితే శిక్ష తక్కువ పడేటట్టు ప్రయత్నిద్దాం. ఈ కేసులో నవనీతం పట్ల సానుభూతి కలిగించడం ఒక్కటే స్ట్రాంగ్ పాయింటు. అందుకు మనచేతిలో కొడుకుల అవతారం, తాసీల్దార్ సూర్యనారాయణ, అప్పలనాయుడు అంతా ఉన్నారు. ముఖ్యంగా మరో ఇద్దరు కలిసి రావాలి. ప్రాసిక్యూటరు, జడ్జి. కేసు మూడేళ్ళు నడుస్తుంది ఎంత లేదన్నా. ఆ తర్వాత మరో రెండేళ్ళకి నవనీతం జైల్లోంచి బయటికి రాగలిగితే మనం విజయం సాధించినట్టే" అన్నాడు.

మరో మూడేళ్ళు. మరో రెండేళ్ళకి తన చదువు అయిపోతుంది. అప్పటికి తన స్కాలర్‌షిప్పు ఉండదు. అప్పుడు లాయర్‌కి డబ్బు ఇవ్వడం ఎలా? ఆ ప్రశ్న దగ్గర తిరుమల ఆగిపోయాడు.

ఏ జడ్జిగారి దగ్గరకి ఈ కేసు వెళ్తే నవనీతానికి మేలు జరుగుతుంది? అన్న ప్రశ్న దగ్గర వెంకటాచలం ఆగిపోయాడు.

చచ్చిపోతున్నా కోరిక తీర్చుకోవాలన్న కుర్రాడిని చంపి తన పగ తీర్చుకున్న పద్దెనిమిదేళ్ళ ఆడపిల్ల ఎలా వుంటుంది? ఆ ప్రశ్న దగ్గర సంజీవి ఆగిపోయాడు.

12

జైలు గదిలో నవనీతాన్ని చూసి సంజీవి షాక్ అయ్యాడు. జీవితంలో అతి నమ్మకంగా అనుకున్నది స్థితప్రజ్ఞత్వం ఆమెలో కనిపించింది. సంకల్పబలంతో లక్ష్యసాధనకి సిద్ధపడిన తపస్వినిలాగా కనిపించింది. ఇవన్నీ పెద్ద మాటలు. అంత చిన్న పిల్లకి వర్తించనక్కరలేదు. కానీ ఆమె గాంభీర్యం, ఓ భయంకరమయిన నేరం చేశాక కూడా ఆమెలో కనిపించే ఆత్మస్థైర్యం అతన్ని ఆశ్చర్యపరిచింది.

"ఈ కేసులో తప్పకుండా విజయం సాధిస్తా" అన్నాడు పక్కనున్న తిరుమలతో రహస్యంగా.

"ఆ అమ్మాయితో మాట్లాడకుండా ఎలా చెప్పగలరు?" అన్నాడు తిరుమల.

"ఆమెని చూడగానే నాకు కలిగిన అభిప్రాయం రేపు కోర్టులో జడ్జికి కలిగితే (కలుగుతుంది, తప్పదు) నా పని సగం తేలికయినట్టే. ఈ కేసులో నావాదన అంతా హత్యచేసే ఉద్దేశం, అవసరం, దృష్టీ ఆమెకి లేదని చెప్పడమే"

ఆశ్చర్యంగా సంజీవి ఆమెని అడిగిన మొదటి ప్రశ్న"మీకు జీవితంలో చాలా ఇష్టమయినదేది?" నవనీతం ఆశ్చర్యపోయింది. తిరుమల చకితుడయ్యాడు. కానీ సమాధానం చాలా సూటిగా, చాలా హఠాత్తుగా వచ్చింది.

"తిరుమల"

తుళ్ళిపడ్డాడు తిరుమల.

"ఇప్పుడు చెప్పినా పరవాలేదు. ఈ గొడవ జరగకపోతే నన్ను పెళ్ళిచేసుకుంటావా అని తిరుమలని అడిగేదాన్ని."

తిరుమల కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. సంజీవి మనస్సులో నవనీతం పట్ల గౌరవం ఇనుమడించింది.

"నేనేం తప్పు చెయ్యలేదు. చేసిన పనికి బాధపడటం లేదు."

"మొదటిది నేను నిరూపించగలను. రెండోది మీ ముఖమే చెప్తోంది. తీరికగా ఏం చెయ్యాలనుంది మీకు?"

"తిరుమలకి స్వెట్టరు అల్లాలని ఉంది. ఎర్రటి వూలు కావాలి."

"ఇంకా?"

"నాకు రామకోటి రాయాలని ఉంది. నాకు చదువు రాదు."

జైలు గదికి దూరంగా బొగడ చెట్టుకింద మట్టిని రెండు దోసిళ్ళని కలిపి తెచ్చాడు తిరుమల. ఎందరో నేరస్థులు ఎన్నో సంవత్సరాలుగా నడిచిన నేల అది. ఆమె వేలిని పట్టుకుని 'శ్రీరామ' రాయించాడు ఆ మట్టిలో.

"నేనింకేమీ నేర్చుకోను. రేపు నాకో పుస్తకం, పెన్నూ తెచ్చిపెడతావా?" అంది.

తిరుమల తలుపాడు. అతని కాళ్ళకి నమస్కారం చేసింది.

"ఇంక వెళ్దాం" అన్నాడు సంజీవి.

ఇదేం ఇంటర్వ్యూ నేరస్థురాలితో కేసుని వాదించబోతున్న లాయరు మాట్లాడాల్సిన విషయం ఇదా? అదే అడిగాడు తిరుమల.

నవ్వాడు సంజీవి. "రేపు కోర్టులో ఆర్గ్యుమెంటు ప్రారంభించాక నేను చెప్పే మొదటి విషయం ఇప్పుడు ఈ గదిలో జరిగిందే తర్వాత నేను చెప్పవలసింది ఆవిడ ఏం చెప్పనక్కరలేదు. పదండి" అని ఆమెవైపు తిరిగి "రేపు నేను చక్కటి పెన్ను కొనిస్తాను. ఈ

రామకోటి పూర్తయ్యేసరికి" చాలా నిరాశని ఆమె మనస్సులోకి జొప్పిస్తున్నాననిపించి అక్కడే ఆగిపోయాడు. కానీ ఆ ఆలోచన నవనీతానికి అందింది. అయితే అతను ఊహించిన నిరాశ ఆమె మనస్సులోకి రాలేదు.

సుభద్రాచార్యుగారినీ, కైకవశినీ తీసుకుని బుల్లిరాజుగారు నవనీతాన్ని చూడటానికి వచ్చారు. నిజానికి ఆ పిల్లని గురించి ఆలోచించే ప్రయత్నం ఏనాడూ చెయ్యలేదు బుల్లిరాజు. కానీ జైలుగదిలో ఆ అమ్మాయిని చూసి జాలితో, బాధతో నీరయిపోయాడు. జైలుగోడకి తలానించి ఏడ్చేశాడు. సుభద్రాచార్యులుగారు మిత్రుడ్ని పొదివి పట్టుకుని ఓదార్చారు.

దేశాన్ని పరదాస్యం నుంచి కాపాడాడని కాలు విరిగిన వీరుడిని ఎలా అభినందిస్తాం? కైకసి బిడ్డని అంత గర్వంగా అక్కున చేర్చుకుంది. రాచరికపు రక్తం నవనీతానికి గాంభీర్యాన్నిస్తే రాచరికపు సాహచర్యం కైకశికి ఉదాత్తతనిచ్చింది. ఎప్పుడూ సుభద్రాచార్యులు నవనీతాన్ని తాకలేదు. వెళ్తూ ఆమె శిరస్సు నిమిరి నుదుటిమీద ముద్దు పెట్టుకున్నారు. నవనీతం కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి. ఓ కోరిక ఆ పిల్లకెప్పుడూ ఉండేది. ఆచార్యులవారి పాదాలు తాకి నమస్కరించాలని. ఎప్పుడూ ఆయన్ని తాకే సాహసం చెయ్యలేదు. ఇప్పుడు నిరభ్యంతరంగా, మనఃపూర్వకంగా పాదాభివందనం చేసింది.

వెళ్తూ వెళ్తూ వరదమ్మని ఓసారి పలకరించి హుటాహుటిన పద్మనాభం వెళ్ళిపోయారు.

నవనీతం కారణంగా చాలారోజులపాటు తిరుమల చదువుకి ఆటంకం ఏర్పడాలి నిజానికి. కానీ పట్టుదలగా చదువుని మరింత పదనుగా సాగించాడు తిరుమల. మధ్య మధ్య 'నవనీతం' బలంగా తొంగిచూస్తోంది. కారుకింద మనిషి పడ్డాడు. కావలసిన ఒక్క ఇంజక్షన్ ఫలానాచోట దొరుకుతుంది. శక్తినంతా ఉపయోగించి అటే పరుగు తీస్తాం. లక్ష్యం రోగిని బ్రతికించడమే. కానీ పరుగు దూరానికి, తిరుమల నవనీతం నుంచి దూరంగా పారిపోవడానికి చదువుని ఆయుధంగా చేసుకున్నాడు. రెండేళ్ళకిందటే బియ్యే చదువులో డిపార్టుమెంటుకి పి. గంగాధరయ్య గోల్డ్‌మెడల్ ఎండోమెంట్ ఏర్పాటయింది. ఆ గోల్డ్‌మెడల్ తనదేనని స్పష్టంగా అందరికీ చెప్పాడు. కారణం తన స్కాలర్‌షిప్ ఆగిపోయాక మరికొన్ని నెలలపాటు ఆ గోల్డ్ మెడల్ కోర్టు ఖర్చులకి కలిసివస్తుంది.

అతనికి తెలియకుండా ఇద్దరి దృష్టి అతనిమీద పడుతోంది. డెట్రాయిట్ జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీలో ఇండస్ట్రియల్ మెషిన్స్ విభాగానికి చెందిన మిసెస్ ఎడిత్ కామెరాన్ తిరుమల గురించి విన్నది. ప్రతిభని రాణించే స్థాయిలో కాక పదునుపెట్టే స్థాయిలోనే గుర్తుపట్టే గొప్ప గుణం ఉన్న ఒకే ఒక్క దేశం అమెరికా. మిగతా దేశాలన్నీ ఆ తర్వాతే నిలుస్తాయి. జెనీవా కాన్ఫరెన్స్‌లో ఆ డిపార్టుమెంటులో ప్రొఫెసర్‌గా ఉంటున్నా రామచంద్రరావు తిరుమల గురించి ఆమెతో చెప్పాడు.

"ఇంకా చదువు ఎన్నాళ్ళుంది?" అనడిగింది. చెప్పాడు. అతని బయోడేటా రహస్యంగా పంపమంది. పంపి మర్చిపోయాడు రామచంద్రరావు. కానీ ఎడిత్ కామెరాన్ మరిచిపోలేదు.

తిరుమల మీద కన్నువేసిన మరొక వ్యక్తి మాథమెటికల్ ఫిజిక్స్ డిపార్టుమెంటులో రీడర్‌గా ఉంటున్న రాఘవాచార్యులు. రాఘవాచార్యులు జర్మనీలో నాలుగేళ్ళు పనిచేసి యూనివర్సిటీ పిలుపుమీద ఇండియా వచ్చాడు. జర్మనీనుంచి తెలుగింటి భార్యకే పుట్టిన పాడ్ అనే కూతుర్ని తెచ్చుకున్నాడు. కూతురు పూర్తిపేరు పద్మావతి. ఆ పేరు జర్మనీలో 'పాడ్' అయి కూర్చుంది.

పాడ్ ఎకనామిక్స్ ఆనర్స్ చదువుతోంది. తండ్రినుంచి బంగారం ఛాయనీ, తల్లినుంచి అమితమయిన పొగరునీ, జర్మనీనుంచి అక్కరలేనంత శరీరాన్ని ఆమె పుణికి పుచ్చుకుంది. వీటన్నిటితోనూ విపరీతమయిన తెలివితేటలు కళ్ళలో, ఆకట్టుకునేంత అందం పెదాల్లో నింపుకుంది. చూసేవాళ్ళు ఆ శరీరాన్ని కాస్త సరిపెట్టుకుంటే ఆమె జెవిడ్ కాలేజ్ ఆఫ్ సైన్సెస్‌కి బ్యూటీ క్వీన్.

టెక్నాలజీ డిపార్టుమెంట్లో తిరుమల తెలివితేటలు పాడ్ అందమంత దేదీప్యమానంగా వెలిగాయి. కాగా, అవుట్ గేట్ దగ్గర పదోనంబరు బస్సుకోసం నిలబడిన తిరుమలని చాలాసార్లు చూసింది. తిరుమలలో స్టైయిల్ లేదు. జర్మనీ నుంచి వచ్చిన పాడ్‌లో అది

బోలెడంత ఉంది. తిరుమలకి అందం మీద దృష్టిలేదు. పాడ్‌కి తన అందమంటే గర్వం ఉంది. ఈ మధ్యనే పొంటులకి అలవాటు పడిన పద్మనాభం పంతులుగారు పుట్టినప్పట్నుంచీ జర్మనీ స్థాయి ఫాషన్‌లో పెరిగిన పాడ్‌కి నచ్చలేదు. అయినా ఇదేమయినా పెళ్ళిచూపులా? అతన్ని గురించి ఆలోచించడానికీ, అతన్ని మరోసారి గమనించడానికి. ఆమె ఇష్టపడలేదు. తిరుమలకి ఆమె అందాల పోటీలో పదికి రెండు మార్కులిచ్చి పరీక్షలో ఫెయిల్ చేసేసింది.

కానీ రాఘువాచారిగారు మాత్రం తిరుమలకి పదికి ఎనిమిదిపైన ఇచ్చేశారు. ఆయన చూసింది కోయకుండా చెట్టుకి పవిత్రంగా నిలిచిన పువ్వు తిరుమల. ఎక్కువ మార్కులు ఆయన కుటుంబానికీ, సంప్రదాయానికీ. రాఘువాచారి జర్మనీలో పరిచయం అయిన ప్రతీ ఆడపిల్లతో సరసం ఆడి, ఇద్దరు ముగ్గురు ఆడపిల్లలతో ప్రణయాన్ని నెరపి, ఒక ఆడపిల్ల తండ్రితో చావుదెబ్బలు తిని, ఇండియాకి పారిపోయొచ్చి తల్లిదండ్రులు ఏర్పాటు చేసిన లావణ్యని పెళ్ళిచేసుకున్నాడు. లావణ్య ఎంతమాత్రం అందంగా ఉండదు. కానీ ఆమె తండ్రి బాంక్ అకౌంట్ చాలా అందమయినది కాగా, లావణ్య జర్మనీలో తన ప్రేమ వ్యవహారానికి ఇన్సులేషన్లాంటిది. ఆడదాని శరీరం రాఘువాచారికి కొత్తకాదు. కానీ ఏ లెక్క సాల్వు చెయ్యడానికి ఏ ఈక్వేషన్ అవసరమో తెలిసిన దిట్ట. అత్యవసరంగా బాత్‌రూమ్‌కి వెళ్ళాల్సినవాడికి ఇంటితాళం చెవులు దేవుడి వరంలా కనిపిస్తాయి. లావణ్య ఆ సమయంలో రాఘువాచారి సమస్యకి తాళం చెవి.

రాఘువాచారి ఒక్కడే తిరుమల, శ్యామల మధ్య జరిగిన రొమాన్స్‌ని కనిపెట్టాడు. వాళ్ళిద్దరూ వెళ్ళిపోయాక ఎర్రదిబ్బల దగ్గరకెళ్ళాడు. ఇద్దరిమధ్యా ప్రణయం సాగిన సాక్ష్యాలకి ఆ పరిసరాల్ని వెదికాడు. ఏమీ జరగలేదని తృప్తిపడ్డాడు. జరగకూడదని మొక్కుకున్నాడు. శ్యామల తల్లితండ్రుల అడ్రసుని సంపాదించాడు. ఇక్కడ శ్యామల జరుపుతున్న రొమాన్స్ గురించి ఆకతాయిగా కాక, అతి బాధ్యతగా ఆమె తండ్రికి ఉత్తరం రాశాడు. నిజానికి అది శ్యామలకి ఉపకారమే. అయితే ఆ ఉపకార్మ తన ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని రాఘువాచారి చేశాడు. ఆ ప్రయత్నం ఫలితమే శ్యామల చదువు ఆగిపోవడం, అర్ధాంతరంగా మేనమామతో పెళ్ళి.

ఏమయినా, కాయ కోసం ఎదురుచూస్తూ చెట్టుకు నీళ్ళు పోసే ఆశావాది రాఘువాచారి.

నవనీతం కేసు జడ్జి దాడి గోవిందరాజులనాయుడు గారి కోర్టుకి విచారణకి వచ్చింది నాయుడుగారు నాటకప్రియులు. స్వయాన నటులు. చిన్నతనంలో ఆడవేషాలు వేశారు. సహజంగా న్యాయంపట్లా, నీతిపట్లా నిర్దుష్టమయిన అభిప్రాయాలు ఉన్నవారు. ఆ మాట అందరి నీతిపరులకు వర్తించినా, నాయుడుగారు కళాహృదయులు కావడం చేత ప్రతి చిన్న అన్యాయానికీ ఆయన హృదయం ఆర్ద్రం అవుతుంది. సాటి మనిషికి జరిగే అన్యాయంపట్ల righteous indignation ఉన్న వ్యక్తి.

నవనీతం అదృష్టమది. కాగా, సంజీవికి గొప్ప అవకాశం. కేసు నల్లేరు మీద బండిలాగా సాగింది. అయితే ఏ హత్య కేసుకయినా, ఏ రేప్ కేసుకయినా కొన్ని పరిధులున్నాయి. కొంత జాప్యం తప్పదు. ఈ కేసు విషయంలోను అంతే అయింది.

కేసు విచారణ నాడు ఎంత పని ఉన్నా ఇద్దరు హాలులో కూర్చునేవారు. ఒకరు వెంకటాచలం, రెండు తిరుమల. బోనులో నిలబడిన నవనీతం చూపరుల గుండెల్ని కోసేసింది. "ఈ పిల్లకి అన్యాయం చేసిన దౌర్భాగ్యుడు చావక ఏం చేస్తాడు?" అన్నదే ప్రతి వ్యక్తి తీర్పు. గోవిందరాజులు నాయుడుగారయితే తాటస్థ్యాన్ని, నిష్పక్షపాత వైఖరినీ ఎంత ప్రయత్నించినా పాటించలేకపోయారు. ప్రాసిక్యూటర్ తెన్నేటి నారాయణరావుగారు ఈ కేసులో నేరస్థుని శిక్షించాలనే normal moral nemesisని మరిచిపోయారు. ఆయన కేవలం బాధ్యతనే నెరవేర్చసాగారు. అయినా చచ్చినవాడిపట్ల జలేమిటి? న్యాయమేమిటి? మొదటి నుంచీ అన్నివిధాలా కేసు ఏకపక్షంగానే సాగింది.

నవనీతమయితే జైలు గదిని రాముని గుడిచేసేసింది. జైలు సూపరింటెండెంట్ మనవాళ్ళయ్య రాములవారి ఫోటోని తెచ్చి ఆమెకిచ్చాడు. గుడిలో కూర్చుని రామకోటి వ్రాస్తున్నంత పవిత్రంగా తన రామకోటిని ఉద్యమంలాగా సాగించింది నవనీతం.

సంజీవికి ఎక్కువ కేసులు లేవు. ఉండాలన్న ధ్యాసా లేదు. నవనీతం కేసుని వాదించడం పెద్ద ఛాలెంజ్ ఏమీ లేదు. అందరూ కలిసికట్టుగా ఒకే లక్ష్యం వైపు ప్రయాణం చేస్తున్న కార్యసాధనలాగా అనిపించింది అతనికి. సంజీవికి అందమయిన నల్లకోటు తెచ్చాడు తిరుమల. డబ్బు పుచ్చుకోవడానికి మొహమాట పడుతున్నాడని.

అవసరం లేకపోయినా నవనీతాన్ని కలుసుకోవడం అలవాటయిపోయింది సంజీవికి.

నాలుగో సంవత్సరం పూర్తయి చెప్పినట్టు పి. గంగాధరయ్య గోల్డ్ మెడల్ పుచ్చుకున్నాడు తిరుమల. ఆ సంవత్సరం ఆంధ్రా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా వచ్చిన బెజవాడ గోపాలరెడ్డిగారి చేతులమీదుగా గోల్డ్‌మెడల్ తిరుమల అందుకోవడం సుభద్రాచార్యుల జీవితంలో మధురమయిన ఘట్టం. ఆ మెడల్‌ని ప్రకటిస్తూ రిజిస్ట్రార్ కె.వి గోపాలస్వామిగారు ప్రత్యేకంగా తిరుమల గురించి చెప్పిన మాటలు "చదివిన శాస్త్రంలో ముందుతరం పరిశోధనకి పునాదులు వేసే రీతిగా తన చదువుని సద్వినియోగం చేసుకున్న యువ మేధావి చిన తిరుమలాచార్యులు" అదీ కితాబు. బుల్లిరాజుగారు వచ్చీరాని తెలుగులో అనువదించి చెప్పగా పరవశులయిపోయారు సుభద్రాచార్యులు. "పుత్రోత్సాహము తండ్రికి" అన్న సుమతీ శతకకారుడి ఉవాచకి ఆనాడు అచ్చమయిన ప్రతినిధి ఆ తండ్రి.

ఆ రాత్రి అరగంటసేపు మాత్రమే ఆ బంగారు పతకం తల్లిదండ్రుల, మామ్మగారి చేతిలో ఉంది. మర్నాడు కాస్సేపు నవనీతం చేతిలో ఉంది.

"నాకాశ్చర్యంగా లేదు. ఇది నీదేనమి నాకెప్పుడో తెలుసు" అంది నవనీతం గర్వంగా. ఆమెకి ఆ పతకాన్ని గురించి ముందుగానే చెప్పాడు తిరుమల. ముందుగానే ఆమె మనస్సులో తిరుమల ఏనాడో ఆ పతకాన్ని సాధించేశాడు. ఇప్పుడు ఈ సంఘటన కేవలం రీ ప్లే

ఆ బంగారు పతకాన్ని తెచ్చి సంజీవి గదిలో బల్లమీద ఉంచాడు తిరుమల. సంజీవి కంగారుపడిపోయాడు. "ఇది నాకెందుకు?" అన్నాడు కంగారుగా.

"తర్వాత నాకు ఆదాయం ఉండదు. అడిగే గడుసుతనం మీకు లేదు. ఇచ్చే శక్తి నాకు లేదు. అందుకని ముందుగానే నా మనస్సులో ఈ బంగారు పతకాన్ని సంపాదించి దాచుకున్నాను. విచిత్రంగా ప్రారంభమయిన నా కెరీర్‌లో నేను ఎదురు చూసి సాధించింది. ఈ గోల్డ్ మెడల్ ఒక్కటే. చాలామందికి ఈ మెడల్ పరాకాష్ఠ. నాకు ఈ మెడల్ అవసరం" అన్నాడు.

ఇద్దరి కళ్ళలోనూ నీళ్ళు తిరిగాయి.

తిరుమల సంజీవి రెండు చేతులూ పట్టుకుని అన్నాడు. "నేను ఈ దేశంలోంచి పారిపోవడానికే బాగా చదివాను. మీ కష్టానికి ప్రతిఫలాన్ని ఇవ్వడానికే ఈ మెడల్ సాధించాను. నవనీతం పవిత్రమయిన గంగానది. నన్ను పెళ్ళిచేసుకోమని అడిగినా చేసుకునేవాడిని కాదు. ఎందుకంటే నా దృష్టిలో నవనీతం శాపవశాత్తూ జన్మనెత్తిన గంధర్వకన్య. ఆమెని మీరు కాపాడేనాటికి నేను మీ ముందు ఉండను. మీరు కాపాడుతారని నాకు నమ్మకం ఉంది. కానీ నేనెక్కడ ఉన్నా మీకు ఋణపడి ఉంటాను" సంజీవి రెండు చేతులూ కళ్ళకి అద్దుకుని భోరుమన్నాడు తిరుమల. తిరుమల ఇంతగా విచలితుడవడం సంజీవి ఎన్నడూ చూడలేదు. కాస్సేపు కంగారు పడిపోయాడు.

"మీరేం కంగారు పడకండి. నవనీతానికేం భయంలేదు. ఆమెని కాపాడే మనుషులెందరో ఆమె చుట్టూ ఉన్నారు" అన్నాడు బలహీనంగా.

ఆ రాత్రి వెంకటాచలం ఇంట్లో సుష్టుగా భోజనం చేశాడు. ఆ రాత్రి అడిగి మరీ జయవాణిచేత ఆమ్లెట్ వేయించుకు తిన్నాడు తిరుమల. ఆ రాత్రి ఆల్ఫ్రెడ్ హిచ్‌కాక్ 'సైకో' సినిమాకి టిక్కెట్లు కొని అందరినీ తీసుకెళ్ళాడు. జానెట్‌లీ మర్డర్ సీన్ చూస్తూ గావుకేక పెట్టి విరుచుకు పడిపోయిన జయవాణిని రిక్షాలో ఇంటికి చేర్చారు.

వెంకటాచలం పగలబడి నవ్వాడు. "ఆడపిల్ల అమాయకత్వాన్ని, పిరికితనాన్ని చూడడం నీకు ఇదే ఆఖరిసారోయ్. రేపట్నుంచీ నిన్ను నిలదీసే ప్రపంచంలో ఆడపిల్లల్ని చూస్తావు" అన్నాడు భుజం తడుతూ.

అర్థంకాలేదు తిరుమలకి.

"ఏంటి ఆంకుల్ మీరనేది?" అన్నాడు అర్థంకాక.

"యంగ మాన్ నీ జాతకంలో స్థానభ్రంశం రాసి ఉంది. నువ్విక్కడ ఉండాల్సిన మనిషివి కావు. ఎక్కడ ఉండాలో చెప్పే మనిషి ప్రస్తుతం ఫ్రాంక్‌ఫర్ట్‌లో విమానం ఎక్కుతోంది." అన్నాడు ముసిముసి నవ్వులు నవ్వుతూ.

అయితే మిసెస్ ఎడిత్ కామెరాన్‌కి ఫ్రాంక్‌ఫర్ట్‌లో ఆ రాత్రి ఢిల్లీ వచ్చే విమానం తప్పిపోయింది. ఆమె రేపు బయలుదేరే విమానంలో ఇండియాకి రాబోతోంది.

13

**"తిరుమల పై దేశాలకు** ఎందుకు వెళ్ళాలి?" పసివాడిలాగా అడిగాడు సుభద్రాచార్యులు.

రెండు రెళ్ళు ఎంత? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పేంత సూటిగా చెప్పాడు వెంకటాచెలం.

"బాగా చదువుకున్నాడు గనక"

"బాగా చదువుకున్నవాళ్ళంతా దేశం వదిలి పోవాలా?"

వెంకటాచెలం నవ్వాడు.

"ఇది వ్యవస్థని అడగాల్సిన ప్రశ్న. ఈ ప్రశ్నని ఎవరు, ఎవరిని అడగాలో తెలీక అప్పుడే చాలా తరాలుగా సామర్థ్యాన్ని, తెలివితేటల్ని పై దేశాలకి పంపించేస్తూ మనం నష్టపోతున్నాం."

ఈ తండ్రి అడిగే ప్రశ్నకి ప్రభుత్వమో, విద్యారంగమో, వృత్తిరంగమో సమాధానం చెప్పాలి. ఇది పద్మనాభంలో పుట్టిన ప్రశ్న కాదు. సుభద్రాచార్యుల ప్రశ్న చాలా మంది తండ్రుల మనసుల్లో విచికిత్సకి చిన్న నమూనా.

ఈ ప్రశ్నని సుభద్రాచార్యులవారు అడుగుతున్నప్పుడు ఎడిత్ కామెరాన్ పక్కనే ఉంది. ఈ ప్రశ్నని ఇంగ్లీషులో తర్జుమా చేయించుకు విన్నది. "ఆ ప్రశ్నకు సమాధానం నాకు తెలుసు" అంది.

వెంకటాచెలం ఆశ్చర్యపోయాడు.

"మీ దేశంలో చదువుకీ, అర్హతకీ, సామర్థ్యానికి కులాల గుర్తులు పెట్టుకున్నారు. మేం కేవల సామర్థ్యానికి, విజయానికి డబ్బు గుర్తుపెట్టుకున్నాం. మీరు సరుకుని 'కులం' పేరుతో బేరీజు వేస్తారు. మీ పాత తరాలు చేసిన నేరాలకి చాలా తరాలు ముడుపులు చెల్లిస్తున్నారు. మా పాత తరాల్ని మేం అడవుల్లోకి తరిమేశాం. రెడ్ ఇండియన్ల దేశాన్ని ఎందరో కాందిశీకులు ఆక్రమించుకున్నారు. మాకు బాగా బతకడమే లక్ష్యం. మీరు ముసలివాళ్ళని గౌరవించి సంప్రదాయాన్ని నిలబెడుతున్నామని చంకలు గుద్దుకుంటారు. మీ పద్మభూషణ్‌లూ, భారతరత్నలూ జీవితం ఆఖరిదశలో ఉన్న సమాజానికి సెంటిమెంటల్ తృప్తి నిచ్చే పెద్దలు. మా దేశంలో ప్రతియేటా నోబెల్ బహుమతులు పుచ్చుకునే యువరక్తం కావాలి. ప్రతియేటా కొత్త ఆలోచనకి పట్టం కట్టాలి. మేం యువకుల సామర్థ్యాన్ని సంపాదించి, వాడుకోవడానికి సముద్రాలు దాటి వెళ్తాం. మీ అబ్బాయి స్పెషలైజ్ చేసిన చదువు వినియోగానికి నేను రెండేళ్ళుగా డెట్రాయిట్ జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీలో ఒక విభాగాన్ని సిద్ధం చేస్తున్నానంటే మీరు నమ్ముతారా?"

సుభద్రాచార్యులు ఆమె మాటలకి అవాక్కయ్యాడు. వాటి నిజానిజాలు ఆయనకు తెలీవు. తెలుసుకోవాలనే ఆసక్తి లేదు. ఎవరో ఎవరికో అన్యాయం చేస్తే తనే ఎందుకు శిక్ష అనుభవించాలి? తన కొడుకే ఎందుకు దూరం కావాలి?

ఆ నేరంలో తమ తాతగారు ఓ పంచముడిని అసహ్యించుకున్న భాగం తనకీ ఉన్నదని ఎవరూ ఆయనకి గుర్తు చెయ్యలేదు. అందరూ ఆనాడు కుంతీనాథాచార్యులు వారిని బ్రతిమలాడారు. కానీ తన పుట్టుకకు తనకే బాధ్యతాలేని ఆ పంచముడి మనస్సు ఛిద్రం కావడాన్ని ఆ రోజుల్లో ఎవరూ పట్టించుకోలేదు. విచిత్రం. ఆ నిస్సహాయుడూ పట్టించుకోలేదు. కర్మని, ప్రారబ్దాన్ని నమ్మే దేశం, ఎంతో కొంత ప్రాయశ్చిత్తం చెయ్యాలి. తప్పదు.

జగద్గురువు ఆదిశంకరులు ఆనాటి మహోన్నత అభ్యుదయవాది. ఆయన ఉపదేశ పరంపరని నెత్తిన పెట్టుకున్న జాతే, పంచముడికి సాష్టాంగపడిన ఆయన సంస్కారాన్ని అవగాహనలోకి తెచ్చుకోలేదనిపిస్తుంది. ఆ పంచముడిని సాక్షాత్తూ శంకరుడిని చేసి ఆ సంస్కారాన్ని కేవలం భగవంతుడి అంగీ తొడిగి వదిలిపెట్టింది. సంతృప్తిపడింది.

ఎదిత్ కామెరాన్ చేసిన పని విడ్డూరమేం కాదు. ఆ రోజుల్లో ఆంధ్రాయూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారు అలాంటి పనే చేశారు. రాబోయే అయిదారు తరాలకి ఉపకారం చెయ్యగలిగిన విద్యావేత్తలని ఇంకా వారు చదువుకునే దశలో ఉండగానే గుర్తుపట్టి, ఉద్యోగాల్ని కేటాయించారు. ఓ దశలో ఆంధ్రాయూనివర్సిటీనిండా ఆంధ్రులు తప్ప మిగతావారు ఉద్యోగాలలో ఉన్నారనే అపవాదు వచ్చింది. ఈ అపవాదు రాజకీయమనే చెదపురుగుకి ప్రారంభం. ఆ రోజుల్లో ఆయా రంగాలలో నిష్ణాతులయిన విద్యావేత్తలందరూ ఆంధ్రా యూనివర్సిటీలో పనిచేశారు. మరో మాటలో చెప్పాలంటే ఆ రోజుల్లో ఆంధ్రాయూనివర్సిటీలో పనిచేసిన విద్యావేత్తలందరూ అటు తర్వాత కాలంలో రాష్ట్రపతులూ, కేంద్ర విద్యామంత్రులూ అయ్యారు. ఈ దేశానికి సామర్థ్యాన్ని వెదుక్కునే అలవాటు పోయింది. కులాన్ని, జాతిని వోట్లుగా తర్జుమా చేసుకునే దుర్వ్యసనం ప్రారంభమయింది. లేకపోతే నోబెల్ బహుమతి భారతీయుడి కొచ్చిందని పై దేశాలలో ఉంటున్న అమర్త్యాసేన్‌కి వచ్చాక చంకలు గుద్దుకునే దుర్దశ ఈ దేశానికి పట్టేది కాదు. చరిత్రని గమనిస్తే జర్మనీలో నాజీల పరిపాలన కారణంగా దేశాన్ని వదిలి పోవలసిన ఒకరిద్దరు వినాపై దేశాలకి వెళ్ళి విజయాలు సాధించిన వారి కథ కనిపించదు. ఇంకా ఆశ్చర్యం కలిగించే విషయం ప్రపంచాన్ని తన దమన నీతితో భయభ్రాంతుల్ని చేసిన హిట్లరే తన జీవిత కాలంలో సామర్థ్యాన్ని గుర్తించి, పోషించి, ప్రోత్సహించి ఎవరూ ఊహించలేని గైడెడ్ మిస్సైల్‌ని ఆ రోజుల్లోనే తయారుచేయించాడు. ఇది చరిత్ర.

దేశాన్ని వదిలిపోవడం ఒక విధంగా తను కోరుకున్నదయినా, నిజంగా ఆ అవకాశం ఎదురుపడేసరికి ఎంతమందికి దూరమవుతున్నాడో అవగాహనకు వచ్చేసరికి కాస్త ఇబ్బంది పడ్డాడు చిన తిరుమలాచార్యులు. అయితే ఇది ఇప్పటికి 'కాస్త ఇబ్బంది' మాత్రమే. ముందు ముందు వినూత్నమయిన భవిష్యత్తు, అభ్యున్నతివేపు ఆహ్వానించే అమెరికా, అప్పుడే అన్నీ అమర్చి, ఆహ్వానించే ఉద్యోగం ఇవన్నీ సమిష్టిగా యువరక్తాన్ని ఉర్రూతలూగించాయి.

ఆండాళ్ళుకి అన్న దూరమయ్యే పరిస్థితి అర్థమయ్యే వయస్సు కాదు. చిన్నపిల్ల. కొత్త ప్రపంచం ఎలా ఉంటుందో ఆ ఇంట్లో ఎవరికీ తెలీదు. ఆ మాటకి వస్తే ఆ ఊళ్ళో ఎవరికీ తెలీదు. ఇంకా చెప్పాల్సివస్తే ఆ చుట్టుపక్కల 20,30 గ్రామాలలో ఎవరికీ తెలియదు. "ఆచార్లుగారి కొడుకు దొరల దేశానికి వెళ్ళిపోతాట్ట" అన్న కబురు ఊరూరా చెప్పుకున్నారు. మనవడు సూట్లు కొనుక్కోవడానికి ఇప్పుడవసరంలేని, మంగళసూత్రాలూ, చెవిదుద్దులూ ఇచ్చింది రుక్మిణమ్మ. ఒక గాబర్డీను సూటూ, ఒక ఉన్ని సుటూ కొనుక్కున్నాడు.

వెంకటాచెలానికి తను తయారుచేసిన బొమ్మకి ప్రాణం పోసినంత గర్వం. విశాఖపట్నం తీసుకొచ్చి తిరుమలకి తన కానుకగా పెద్ద సూట్‌కేస్‌ను కొనిచ్చాడు.

జనరల్ ఎలక్ట్రిక్ ఆహ్వానం ఉంది కనుక వీసాకి ఏమంత శ్రమపడాల్సిన అవసరం లేకపోయింది.

తిరుమలకి ఇచ్చి పంపడానికి గుడిముందు నులకమంచాలు పరిచి వారం రోజులపాటు తిరుమలకి చాలా ఇష్టమయిన గుమ్మడి ఒడియాలూ, పేల ఒడియాలూ పెట్టారు వరదమ్మ, కైకవశి కలిసి. కొడుకు దూరమవుతున్నాడన్న బాధ ఏ కోశానా లేని ఒకే ఒక్క వ్యక్తి వరదమ్మ. కొడుకు దూరమవుతున్నాడన్న ఒకే ఒక్క ఆలోచనతో సతమతమవుతున్న వ్యక్తి సుభద్రాచార్యులు.

ఆయన దృష్టి భగవంతునివైపు, ఆధ్యాత్మిక సాధనవైపూ లగ్నమయింది. ఏ రకమయిన లౌకిక విజయం ఆయన హృదయాన్ని రంజింపచేయలేదు.

"అమెరికానుంచి ఇంటికి రావాలంటే ఎంత సమయం కావాలి?" అనడిగాడు వెంకటాచెలాన్ని.

ఆ ప్రశ్న ఇంతవరకూ ఎవరూ వెయ్యలేదు. విశాఖపట్నానికి విమాన సౌకర్యాలు తక్కువ. బొంబాయిలో దిగి రావాలి. "ఎంత లేదన్నా మూడురోజులు" అన్నాడు.

వైశాఖ శుక్ల చతుర్దశి నృసింహ జయంతినాడు తిరుమల అమెరికా ప్రయాణానికి ముహూర్తం పెట్టారు సుభద్రాచార్యులవారు. కొడుకు శ్రేయస్సుని దృష్టిలో పెట్టుకుని ప్రతి రోజూ పొయ్ గై ఆళ్వార్ 'వైయా తగళి' పాశురాన్ని నూటఎనిమిదిసార్లు పారాయణం మొదలు పెట్టారు.

బుల్లిరాజుగారు మూడు వజ్రాలు పొదిగిన ఉంగరాన్ని చేతికి తొడిగారు తిరుమలకి. అమెరికా వెళ్ళే టైం దగ్గరవుతున్నకొద్దీ రుక్మిణమ్మ మరీ బేలయిపోయింది. తనకి వయస్సు మీద పడుతోంది. ఇదివరకటి శక్తిలేదు. మళ్ళీ మనవణ్ని ఎప్పుడు చూస్తుందో ఇప్పుడు అమెరికా వెళ్ళకపోతేనేం? అనే ఆలోచన ఆమెకి రాలేదు. పెళ్ళయ్యాక అత్తారింటికి వెళ్ళడం ఎంత సహజమో, చదువయ్యాక పై దేశాలకి వెళ్ళడం అంతే సహజమని సరిపెట్టుకుంది రుక్మిణమ్మ.

ఓ రోజు చాపమీద పడుకున్న మనవడి తలని తన ఒడిలో పెట్టుకుని కూర్చుంది. తిరుమల ఆశ్చర్యపోయాడు. మామ్మ కళ్ళల్లోకి చూశాడు. ఆ కళ్ళల్లో నీళ్ళు లేవు. ఏదో చెప్పరాని దిగులు ఉంది.

"నా చిన్నతనంలో మా అమ్మమ్మ చెప్పేదిరా, ఎంతో పుణ్యం చేసుకున్నవాళ్ళకి చచ్చిపోయే ముందు దేవుడు పుష్పక విమానం పంపిస్తాడట. నా కడుపున పుట్టిన కొడుకు బతికుండగానే విమానం ఎక్కే మనవడిని కంటాడని అనుకోలేదు. నువ్వు మళ్ళీ వచ్చేసరికి నేనుంటానో లేదో తెలీదు. ఈ మామ్మ నువ్వు నూరేళ్ళూ చల్లగా ఉండాలని ఎక్కడున్నా దీవిస్తుంది" అంది.

"ఆళ్వార్ గళ్ వాళి అరుళిచ్చెయల్ వాళి" సన్నటి గొంతుతో ఆశీర్వాదాన్ని పాడింది. పాడుతూనే గోడని ఆనుకుని నిద్రపోయింది. మెల్లగా ఆమె తొడమీద తల తిప్పుకుని లేచాడు. మొదటిసారిగా ఏదో అనిర్వచనీయమైన సంపదని వదులుకుపోతున్న దిగులు అతని మనస్సులో కదిలింది.

అయితే అది క్షణమాత్రం. ఇంకా రక్తంలో వేడి ఉంది. రుక్మిణమ్మ మనస్సులో గుబులు అతని మనస్సుదాకా ప్రయాణం చెయ్యడానికి మరో ఏభై సంవత్సరాలయినా కావాలి.

గుమ్మంలోంచి ఎవరో పిలిచారు. సరాసరి గుడిలోంచే బయటకి వచ్చాడు.

కూర్మయ్యని వెంటనే పోల్చుకోలేదు. ఈ మూడు నాలుగేళ్ళలో కూర్మయ్యని చూడలేదు. గుర్తుపట్టలేనంత పొడుగు ఎదిగాడు. రెండు విషయాలు కొట్టొచ్చినట్టు కనిపించాయి అతనిలో. పట్నం ఇచ్చిన సంస్కారం మొదటిది. పొడుగు చేతుల షర్టు, పాంటూ, బెల్టూ అందంగా ఉన్నాడు. రెండోది చదువు ఇచ్చిన కళ అతనిలో స్పష్టంగా తెలుస్తోంది.

"ఫెస్టుఫారం పాసయ్యాను సార్" అన్నాడు కాళ్ళకి నమస్కారం పెడుతూ.

లేవదీసి కావలించుకున్నాడు తిరుమల. "మొదట ఆ సార్ మానాలి. రెండు: ఈ నమస్కారాలు"

"మీరు నాకు చదువు నేర్పారు సార్"

వెనకనుంచి గుడి గోడకి ఆనుకుని, గోళ్ళు కొరుక్కుంటూ ఆండాళ్ళు చూస్తోంది. తన అన్నయ్య అమాంతం కావలించుకునే మనిషిని వింతగా చూసింది. ఆ గౌరవానికీ, ఆ ఆప్యాయతకీ కారణాన్ని అర్థం చేసుకునే వయస్సుకాదు ఆ పిల్లది.

"ఈయనేంటి? నల్లగా చింతమొద్దులాగున్నాడు?" అనుకుంది.

జేబులోంచి రిబ్బను చుట్టిన చిన్న పాకెట్ తీశాడు కూర్మయ్య. "ఇది తమకోసం" అంటూ చేతిలో పెట్టాడు. తిప్పి చూశాడు తిరుమల. పొడుగు చేతుల షర్ట్‌కి పెట్టుకునే బంగారు పూత పూసిన వెండి కప్స్.

"ఓ..గాడ్! థాంక్యూ" అన్నాడు తిరుమల.

"మిమ్మల్ని చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉంది సార్. మన ఊళ్ళో అమెరికా వెళ్ళే మొదటి వ్యక్తి మీరే" అన్నాడు కూర్మయ్య.

"నిన్ను చూస్తే నాకు ఇంకా గర్వంగా ఉంది కూర్మయ్యా! మన ఊళ్ళో చదువుకున్న మట్టి పిసుక్కునే మొదటి వ్యక్తి నువ్వే. మనిద్దరం ముందుకి చూస్తున్న తరానికి ప్రతినిధులం"

సైకిలుమీద వెళ్ళిపోతున్న కూర్మయ్యని ఉద్దేశించి అరిచాడు తిరుమల.

"ఎన్ని మార్కులొచ్చాయి?"

కూర్మయ్య నేలమీద కాలు మోపాడు. "ఇరవై తొమ్మిది, సార్ మీకు 35 రావాలి పాసవడానికి. కానీ మాకు 29 చాలు" సందు మలుపు తిరిగిపోయాడు.

ఊరు వదిలి వెళ్ళేముందు కలుసుకోవాల్సిన మనిషి ఒకరున్నారు - నవనీతం.

జైలుకి వచ్చాడు. "నీ కోసమే ఎదురు చూస్తున్నాను. నీ భుజాలు కొలతలు నా దగ్గర లేవు. వెనక్కి తిరిగి నిలబడు" అంది. అల్లుతున్న స్వెట్టరుని వీపుకి ఆనించి చూసింది. ఆమె వేళ్ళు ఊలుని చీల్చుకుని శరీరాన్ని పలకరిస్తున్నాయి. తిరుమలకి భయమేసింది.

"రేపు మరొక్కసారి వస్తావా? స్వెట్టర్ పూర్తవుతుంది" అంది.

"ఇంక రాలేను. సంజీవి వస్తాడు. అతనికియ్యి. నాకు స్టేషన్లో చేరుస్తాడు" అన్నాడు.

నవ్వింది. "నీ కివ్వాలనుకున్నది స్వయంగా ఇవ్వలేకపోయిన వాటిలో ఇది రెండోది."

"మొదటిది"

"నేను" అంది కటకటాలలోంచి చూస్తూ.

పది ఎయిర్‌గ్రాముల పాకెట్ ఆమె చేతిలో ఉంచాడు. "నీకు వ్రాయడం రాదు. అయినా, సంజీవికి చెపితే నాకు రాసి పోస్టు చేస్తాడు" అని ఆమె చేతిలో ఉంచాడు.

నవనీతాన్ని వదిలిపోతున్నందుకు బాధ అనిపించలేదు. విచిత్రంగా ఒక విడుదలలాగా అనిపించింది. మనస్సుకి దగ్గరగా, ఆత్మీయంగా, ఇంకా బలంగా పెనవేసుకున్న అనుభూతికి దూరం కావడం ఒకప్పుడు విముక్తే అవుతుంది. నవనీతానికి ఇప్పుడు జరిగిన నష్టంకన్నా మరింత నష్టాన్ని కలిగించకూడదు. ఆ పవిత్రమయిన పువ్వులో కొన్నిరేకులు అప్పుడే రాలిపోయాయి. ఆ మిగిలిన వాటినయినా ఉంచగలిగినంత కాలం భద్రంగా ఉంచాలి.

జైలుకి ఎదురుగ్గా క్రైస్తవుల శ్మశానం. బస్సుకోసం నిలబడి రెంటినీ పోల్చుకున్నాడు. ఒకటి మానసికంగా చచ్చిపోయినవాళ్ళకి, రెండు శారీరకంగా పోయినవాళ్ళకి. ఎదురుగా కనిపించే నాలుగు గోడల వెనుక తనకి ఇష్టమయిన వ్యక్తి ఉంది.

మొదటిసారిగా గుండె గొంతులో కదిలింది. ఎందుకిలా పారిపోతున్నాడు తను? సమాధానం వెదుక్కునే వ్యవధిలేదు. బస్సు దూసుకు వచ్చేసింది.

వాల్తేరు స్టేషన్‌కి సుభద్రాచార్యులు, వరదమ్మ, కైకవశి, ఆండాళ్ళు, వెంకటాచెలం, జయవాణి, విక్టోరియా, సంజీవి వచ్చారు.

సంజీవి నవనీతం ఇచ్చిన పాకెట్ అతని చేతిలో పెట్టాడు. ఎర్రటి స్వెట్టరుతోపాటు, ఎయిరోగ్రాముల కట్ట కనిపించింది. తీసి చూశాడు. అన్ని ఎయిరోగ్రాములనిండా శ్రీరామ, శ్రీరామ అని వ్రాసి ఉంది. నవ్వొచ్చింది. నవనీతానికి తెలిసిన భాష అదే ఎన్నాళ్ళు గడిచినా చెప్పుకోగలిగిన సందేశమూ అదే

రైలు బయలుదేరబోతుంటే సుభద్రాచార్యులవారు ముందుకు వంగి "పెరుమాళ్ తిరుమొళి" మరిచిపోకు" అన్నారు చెవిలో. వరదమ్మ ముఖం వెలిగిపోతోంది.

వాల్తేరు స్టేషన్ రైలు దాటిపోతుంటే దూరమవుతున్న తన పరివారాన్ని చూసి ఒక్కసారి గుండె గుబగుబలాడింది. చిన్న నీటితెర కళ్ళల్లో నిండింది. గర్భగుడిలో మూలవిరాట్టులాగా సుబద్రాచార్యులుగారు కనిపిస్తున్నారు.

"నాన్నగారిలో ముసలితనం కనిపిస్తోంది" అనుకున్నాడు తిరుమల.

ప్లాట్‌ఫాం చివర తృప్తిగా అతన్ని మరొక వ్యక్తి గమనిస్తున్నాడు. అతనిపేరు రాఘవాచార్యులు.

14

తన కడుపున పుట్టింది సాక్షాత్తూ విష్ణుమూర్తేనన్న స్పృహ తనకి ఉండరాదని కోరుకున్నాడు దశరథుడు ముందు జన్మలో. కేవలం తండ్రికి పుత్రునిమీద ఉన్న మమకారాన్ని పూర్తిగా అనుభవించాలన్నదే ఆయన లక్ష్యం. కానీ తనకు పుట్టింది భగవంతుడేనన్న జ్ఞానాన్ని కోరుకుంది కౌసల్య. అంతటి అదృష్టాన్ని మరిచిపోతే ఎలా? ఆ దివ్యానుభూతిని కోల్పోతే ఆ వరానికి విలువేముంది? అదీ ఆవిడ ఉద్దేశ్యం.

అందుకనే పుత్రవియోగం ఒక తండ్రిని ఆద్యంతము విచలితుడిని చేసి ప్రాణం తీసింది. శ్రీరాముడు అవతార ధర్మాన్ని నిర్వహిస్తున్నాడన్న స్పృహ ఆ తల్లిని ఊరటపరిచింది.

దాదాపు ఇదే పరిస్థితిలో ఉన్నారు సుభద్రాచార్యులు, వరదమ్మ. చదువు ఇచ్చిన గొప్ప అదృష్టానికి మురిసిపోతూ పుత్రవియోగాన్ని సరిపెట్టుకుంది వరదమ్మ. ఆ చదువు అవసరాన్ని అంగీకరించని సుభద్రాచార్యులు తిరుమల దూరం కావటాన్ని అంగీకరించలేకపోయారు. అయితే ఇద్దరిదీ తప్పనిసరి పరిస్థితి. రుక్మిణమ్మకి ఈ రెండు ధ్యాసలూ లేవు. అజ్ఞానం అప్పుడప్పుడు ఊహించని నిర్లిప్తతని ఇస్తుంది. కొడుకులేని లోటుని తన కొడుకు అనుభవించడం ఆమెని కించపరిచింది. అంతే. సుభద్రాచార్యులవారికి శరీరం ఏభయ్యో పడిలో, మనస్సు డెబ్బయ్యోపడిలో పడింది. ఇప్పుడిప్పుడు తిరుప్పళ్ళి ఎళుచ్చి, శార్తుముర్తై మీద మనస్సు నిలవడంలేదు. గోష్టినీ నది స్నానానికి

ఏనాడో ఒంటరయిపోయారు. అయితే కర్మసిద్ధాంతంలోనూ ఒక వైచిత్రి ఉన్నది. రాబోయే జీవితం ఛాయలు జరుగుతున్న జీవితం మీద ప్రతిఫలిస్తాయి. ఇప్పటి అనాసక్తత రాబోయే అశక్తతకి కేవలం నాంది.

అక్కడ తిరుమల అమెరికాలో కాలుమోపే సమయానికి - ఉదయమే మసక చీకటిలో గోస్తనీ నదీ స్నానానికి వెళ్ళి వస్తున్న సుభద్రాచార్యులవారు ఓ కుక్కమీద కాలేశారు. భయంతో కుక్క గావుకేకపెట్టి ఆయన్ని కరిచింది. తుళ్ళిపడి కాలు తీసుకోబోయిన ఆచార్యులవారు కాలు మెలికబడి, మొదలంటా విరిగి నేల కూలిపోయారు. అంతే, ఆ తర్వాత జీవితాంతం ఏనాడూ కుంతీ మాధవస్వామి సమక్షంలో తిరువారాధన చెయ్యలేదు. ఓ కాస్త తెలతెలవారేవరకు నేలమీద అలా మూలుగుతూనే ఉండిపోయారు ఆచార్యులవారు. కరిచిన కుక్క అప్పుడే పారిపోయింది. తెల్లవారాక చాకలి రోశయ్య ఆచార్యులవారిని రోడ్డు మధ్యలో చూసి గతుక్కుమని పరుగున ఊళ్ళోకి కబురు చేరవేశాడు. ఆచార్యులవారిని నలుగురు నులకమంచం మీద మోసుకొచ్చి ఇంటిలో చేర్చారు. ఆ రోజు కుంతీ మాధవస్వామి ఊరివారి దృష్టినుంచి పరాకయ్యాడు. స్వామికి జరగాల్సిన మర్యాదలు వెనకబడ్డాయి. బుల్లిరాజుగారు బుచ్చియ్యమ్మగారు హుటాహుటిన వచ్చారు.

కుక్క కరిచినచోట గాటు బలంగా పడింది. రక్తం ఆగకుండా కారుతోంది. కుప్పగా కూలిన ఆచార్యులవారు లేవలేకపోవడాన్ని బట్టే కాలు విరిగిందని అర్ధమయింది. మధ్యాహ్నం పదకొండు గంటల సమయంలో ఆయన్ని పట్నం తరలించారు. ఆ వెళ్ళడం వెళ్ళడం పట్నంలోనే ఉండిపోయారు సుభద్రాచార్యులవారు.

బొడ్డుచుట్టూ పధ్నాలుగు ఇంజెక్షన్లు ఇవ్వాలన్నారు డాక్టర్లు. ఎక్స్‌రేలు తీసి, కాలుకి ఆపరేషన్ చెయ్యాలన్నారు. అనారోగ్యం ఆచారాన్ని వెనక బెంచీలో కూర్చోపెట్టింది. కింగ్ జార్జి ఆసుపత్రికి ఎదురుగ్గా కలెక్టరాఫీసు వెనక చిన్న ఇల్లు అద్దెకి తీయించారు రాజుగారు. అందులో అత్తాకోడళ్ళ మకాం. ఇద్దరిలో ఒకరు తైనాతీగా ఆచార్యులవారి పక్కన. పైగా అజా పజా చూసుకోవలసిన ఆండాళ్ళు మరొకపక్క. ఇలాంటి సమయంలో ధైర్యంగా పక్కన నిలవాల్సిన వ్యక్తి కొడుకు. తిరుమల సంప్రదాయాన్ని పాటిస్తే ఆచార్యులవారి స్థానంలో కుంతీమాధవస్వామికి సేవలు చేసుకునేవాడు. ఇప్పుడు స్వామికీ, తండ్రికీ సేవలు చేసే వ్యక్తి కరువయిపోయాడు. సామర్లకోటనుంచి ఓ వైష్ణవ కుటుంబాన్ని పిలిపించి తాత్కాలికంగా గుడిని అప్పగించారు బుల్లిరాజుగారు.

ఈ గడ్డు పరిస్థితిలో వెంకటాచెలం, జయవాణి కొండంత అండగా నిలిచారు.

"ఈ విషయాన్ని తిరుమలకి తెలియజేయమంటారా?" అని అడిగాడు వెంకటాచెలం సమాధానం తనకి తెలిసినా.

"వద్దు" అన్నారు ఆచార్యులవారు ముక్తసరిగా.

తను కోరుకున్న జీవిత ప్రాంగణంలో ఉన్నవాడు తిరుమల. ఎన్నో కలల్ని క్రోడీకరించి, ఎంతో వ్యయప్రయాసల కోర్చి ఇప్పుడిప్పుడే అమెరికాలో అడుగుపెట్టాడు. కాగా, అతను వచ్చి చెయ్యగలిగిందేమీ లేదు.

ఆచార్యులవారిని గౌరవించే హితులు ఎందరో ఉన్నారు. కనుక సరిపోయింది గానీ, మరో ముఖ్యమయిన సమస్య ఆ సమయంలో ఆచార్యులవారిదాకా రాలేదు. దానిపేరు డబ్బు. పద్మనాభంలో స్వామిని నమ్ముకున్న కుటుంబం సాఫీగా జీవిక సాగించడానికీ, విశాఖపట్నంలో ఆసుపత్రిలో మంచాన పడిన వ్యక్తి జీవనం సాఫీగా సాగడానికి చాలా తేడా ఉంది.

ఇల్లు అద్దెకి తీసి వెళ్తూ వెళ్తూ బుల్లిరాజుగారు రుక్మిణమ్మ చేతిలో రెండువందలు ఇచ్చి వెళ్ళారు. ఆసుపత్రి ఖర్చులు వెంకటాచెలం భరిస్తున్నాడు. అయితే అతన్ని పీడిస్తున్న అంశం మరొకటున్నది. ఆచార్యులవారు పట్నంలో ఉండడం తప్పనిసరి అయితే ఆయన మనసు బాధపడకుండా ఆయనకి ఉపాధిని ఏర్పరిచే మార్గం ఏమిటా అని? ఇది చాలా జటిలమయిన సమస్య.

కొందరు కొన్ని పనులు మానుకుంటే వాళ్ళు ఏం చెయ్యాలో ఎవరికీ అంతుబట్టదు. సర్కసులో ప్రతిరోజూ అందరినీ నవ్వించే హాస్యగాడు ఆ పని చెయ్యలేని రోజంటూ వస్తే, ఎలా జీవిక సాగించాలి? బంతి ఆటలో దేశానికి తలమానికం అయిన ఆటగాడు వృద్ధాప్యంలో ఏం చెయ్యాలి? అందుకనే సమాజాన్ని ప్రభావితం చేసే ప్రతివ్యక్తినీ సమాజం పోషించాలని వేదం ప్రబోధిస్తోంది. అయితే ఈ రోజుల్లో వేదం ఎవరికి కావాలి?

మంచి జీవితానికి కొడుకు శ్రీకారం చుట్టే సమయానికి తండ్రి జీవితంలో ఒక దశకి అర్ధాంతరంగా తెరపడింది. ముందుచూపు కలవాడు కనుక వెంకటాచెలం ఆలోచించాడు. ఆచార్యులవారికి ఏ విధంగా ఆదాయం ఏర్పరచాలి?

ఆ రోజుల్లో ఒకే ఒక పుస్తకాల షాపు విశాఖపట్నంలో పురిపండానీ, శ్రీశ్రీని, ఆరుద్రనీ, రావిశాస్త్రినీ దేశానికి పరిచయం చేసిన షాపు గుప్తా బ్రదర్స్. ప్రొప్రయిటరు జగన్నాథ గుప్తాగారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వ్యక్తి, వదాన్యులు. అడపా తడపా పుస్తకాల్ని ప్రచురించే అలవాటున్న సంస్థ. వెంకటాచెలం విషయమంతా వివరించగానే గుప్తాగారు జాలిపడ్డారు.

''కారణం నువ్వు వెదుకు, ఆదాయం నేను ఏర్పాటు చేస్తాను'' అన్నారాయన. అంటూనే గల్లాపెట్టి తీసి పాతిక రూపాయలు ఇచ్చారు.

ఆసుపత్రిలో చేరిన పదోరోజున డాక్టర్ వ్యాఘ్రేశ్వరుడు ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ సవ్యంగా జరిగి కాస్త తేరుకున్నాక తెల్లకాగితాలను, కలాన్ని తెచ్చి ఆచార్యులవాఇర్ పక్కమీద ఉంచాడు వెంకటాచెలం.

''ఆండాళ్ళు తిరుప్పావైని మీ భాషలో తెనిగించండి. ప్రచురించడానికి మా మిత్రులు ఆత్రుతపడుతున్నారు'' అన్నాడు.

సుభద్రాచార్యులవారు ఆశ్చర్యపోయాడు. ఆయన ఏనాడూ కాగితం మీద కలాన్నిపెట్టి ఎరగడు. ఆ పని ఉత్తరం ముక్క రాయడానికయినా వరదమ్మ చేసింది. అలాగని చదువురాదని కాదు. కొత్త ఆలోచనని పేపరుమీద పెట్టడం వేరు. కొత్తగా ఆలోచించడం వేరు. పైగా, తన రచనని ప్రచురించే ఆత్రుత ఎవరికుంటుంది? ఆచార్యులవారు మూర్ఖులు కారు, అజ్ఞానీ కారు. వెంకటాచెలం సంస్కారమూ, ఆలోచనా సరళినీ అర్థం చేసుకోగలిగారు.

కళ్ళు మూసుకుని ''జై శ్రీమన్నారాయణ! మీ మేలు జీవితంలో మరువరానిది'' అన్నారు. అంటున్నప్పుడు ఆయన కనుకొలకుల్లో నీరు నిండింది. వెంకటాచెలం నిట్టూర్చాడు. తన మనస్సులో ఆవేదన ఆచార్యులవారికి అర్థమయింది. ఇక డబ్బు ఇవ్వడం సుళువు. మొదట విడత ఇరవై అయిదు రూపాయలు వరదమ్మ చేతిలో ఉంచాడు.

తరువాత చాలా పేజీలు సుభద్రాచార్యులవారు నింపారు వరదమ్మ సహాయంతో. అయితే ఆ పేజీలని ఎవరూ ఎప్పుడూ చదవలేదు. ఎవరూ ఎప్పుడూ ప్రచురించలేదు. ప్రచురించమని వెంకటాచెలం గుప్తాగారిని అడగనూలేదు. ఆయన ఆసక్తి చూపనూలేదు. అది జగన్నాథ గుప్తాగారు ఆ రోజుల్లో చేసిన గుప్తదానాల్లో ఒకటి. విచిత్రం ఆయన అప్పటివరకూ ఆచార్యులవారిని చూడనూ లేదు. కష్టంలో ఉన్న దేశాన్ని ఆదుకునే ఉద్యమంలో తలమునకలవుతున్న తరానికి కష్టంలో ఉన్న ఒక వ్యక్తిని ఆదుకోవడం ఏమంత కష్టంకాదు.

ఈ సమయంలో పరోక్షంగా ఆదుకున్న మరో వ్యక్తి ఉన్నాడు. ఆయన ప్రొఫెసర్ రాఘవాచార్యులు. ఆయన మొదటిసారిగా డాక్టర్ నందివాడ శ్రీనివాసరావుగారితో వచ్చి సుభద్రాచార్యులవారిని కలిశారు. డాక్టర్ శ్రీనివాసరావుగారే రాఘవాచార్యులని సుభద్రాచార్యులవారికి పరిచయం చేశారు. ఆ తర్వాత రాఘవాచార్యులు రోజూ ఆయన్ని చూసి వెళ్ళేవాడు. లావణ్య ఒక్కసారే వచ్చి చూసింది. పాడ్ ఆ ఒక్కసారీ రావడానికి బద్ధకించింది.

రాఘవాచార్యులు డెట్రాయిట్‌లో తిరుమల మీద ఓ కన్నువేసి ఉంచాడు. తిరుమల వెస్ట్ బ్లూ ఫీల్డ్‌లో లాక్‌పైన్ రోడ్‌లో ఓ గది అద్దెకి తీసుకున్నాడు. ఆ గదికి వెతుక్కుంటూ ఓ రోజు బెంజి కారు వచ్చింది. పొడుగయిన ముక్కుపొడుం రంగు కారులో పొట్టిగా ఉన్న

డాక్టరుగారు దిగారు. ఆయన డాక్టర్ సత్యమూర్తిగారు. రాఘవాచార్యులతో బాపట్లలో సహాధ్యాయి. విషయమంతా ఫోన్‌లో చెప్పాడు రాఘవాచార్యులు. అర్థం చేసుకున్నాడు సత్యమూర్తి. అమెరికా కొత్తగా వచ్చినవాళ్ళకి అవసరాలేం ఉంటాయో సత్యమూర్తికి బాగా తెలుసు. ఆ దేశంలో బాగా చెల్లుబాటయ్యేది ప్లాస్టిక్ కరెన్సీ. రెండు మూడు కంపెనీల క్రెడిట్ కార్డ్స్ ఇప్పించాడు. తను మొదటి వాయిదా చెల్లించి కారు కూడా ఇంటిముందు నిలబెట్టాడు. అయితే రుమల వెళ్ళింది ప్రపంచంలోకెల్లా పెద్ద కార్లకంపెనీలో ఉద్యోగానికి. పైగా, ఆ కంపెనీ కోరి పిలిపించుకున్న ఆఫీసరు అతను. మూడు నెలల్లో కంపెనీకారు ఇచ్చింది. ఈ మూడు నెలల్లో తల్లికీ, తండ్రికీ ఆరు ఉత్తరాలు రాశాడు. ఆ రోజుల్లో పద్మనాభానికి ఫోన్ చేసే అవకాశాలు తక్కువ. ఇండియాలో అంతా క్షేమంగా ఉన్నారన్న దొంగ ఉత్తరాలు రెండు వచ్చాయి. అమెరికాకు అలవాటు పడిన యువతరం సరిపెట్టుకుంటున్న లక్షలాది దొంగ ఉత్తరాలకి ఇది ప్రారంభం. తిరుమలకి సంబంధించినంతవరకు. ఏ తల్లిదండ్రులూ తమ ఇక్కట్లని అంత దూరంలో ఉన్న బిడ్డలకి చెప్పుకోరు. చెప్పడం వల్ల ఉపయోగం ఉండదని వాళ్ళకి తెలుసు. చెప్పడంవల్ల అమెరికాలో బిడ్డలకి మనశ్శాంతి లేకుండా చేస్తామని వారికి తెలుసు. తల్లిదండ్రులకీ, బిడ్డలకీ మధ్య ఏర్పడే అంతరానికి ఇది కేవలం ప్రారంభం. తల్లిదండ్రుల, బిడ్డల మమకారాల్లో ఆత్మవంచనకి ఇది శ్రీకారం.

**ఆపరేషన్ అయిన** ఆరో నెలకి నేలమీద కాలుమోపారు. సుభద్రాచార్యులవారు. ఏభై సంవత్సరాల అలవాటుని కాళ్ళు అప్పటికి మరిచిపోయాయి. శరీరం దూదిపింజలాగా తూలింది. వరదమ్మ భుజం పట్టుకుని అడుగువేశారు. క్రమంగా తెలిసొచ్చిన విషయం చిన్న కుంటి నిలిచిపోయిందని. ఆచార్యులవారి అవిటితనానికి తిరుమల విదేశీ జీవనమంత వయస్సొచ్చింది. ఆపరేషన్ జరిగిన రెండు రోజులముందే కైకవశి పట్నం వచ్చేసింది. అప్పుడప్పుడు జరిగే నవనీతం కేసు విచారణకి కోర్టుకి వెంకటాచలంతో వెళ్ళివచ్చేది.

పద్మనాభంలో సామర్లకోట కుటుంబం స్థిరపడింది. అనారోగ్యం నుంచి కోలుకోగానే పద్మనాభం వచ్చెయ్యమని బుల్లిరాజుగారు పదే పదే బ్రతిమలారు సుభద్రాచార్యులవారిని. ఆసుపత్రినుంచి ఇంటికి చేరిన మూడోరోజునే వెదుక్కుంటూ వచ్చాడో ముసిలి బ్రాహ్మడు. అతని పేరు అనంగాచార్యులు. ప్రస్తుతం కుంతీమాధవస్వామిని సేవించుకుంటున్న అర్చకుడాయన. అయిదుగురు మనుషులకు ఆయనే దిక్కు. అందులో ఓ విధవ చెల్లెలు, ఓ రోగిష్టి అన్నగారూ ఉన్నారు. ఆయనకి కుంతీమాధ్వస్వామే ఆధారం. ఆయన చూడవచ్చింది సుభద్రాచార్యులవారిని పరామర్శించడానికి కాదు. తనగోడు ఆయనకి విన్నవించుకొనడానికి. అనంగాచార్యులు వెళ్ళే సమయానికి ఆచార్యులవారికి ఓ విషయం అర్థమయింది.

అవసరంలో ఉన్న వ్యక్తినే కుంతీమాధవస్వామి ఆదుకున్నాడని. ఈ సంగతి రుక్మిణమ్మ, వరదమ్మకీ తప్ప ఎవరికీ తెలీదు. తెలియాల్సిన అవసరం లేదు. ఈ కారణం చేతనే బుల్లిరాజుగారు ఎంత ప్రాధేయపడినా పద్మనాభం రావడానికి తిరస్కరించారు సుభద్రాచార్యులు. ఏదో కొత్తసాకు చెప్పారు.

సుభద్రాచార్యుల అడ్రసు పట్నానికి ఎందుకు మారిందో వెంటనే అర్థంకాలేదు. తిరుమలకి. మారినట్టు చాలాకాలం తెలియనివ్వలేదు బుల్లిరాజుగారు. అయితే ఎప్పటి ఉత్తరాల్ని అప్పుడు చేరవేయటం క్రమేపీ కష్టమవుతూండటం వల్ల కొత్త అడ్రస్సు తిరుమలకి తెలియచేశారు.

తండ్రి పట్నానికి చేరడం అభివృద్ధిగా అర్థం చేసుకున్నాడు తిరుమల. అతని దృష్టంతా అభివృద్ధివైపే సారించి ఉంది. అందువల్ల సంప్రదాయంలో కూరుకుపోయిన తండ్రి హఠాత్తుగా పట్నంలో ఉండవలసి రావడాన్ని అతని మనస్సు మరోవిధంగా అర్థం చేసుకోలేకపోయింది. ఇది రెండు తరాల పరాయీకరణ (alienation)లో రెండో దశ.

ఈలోగా నవనీతం కేసు విచారణ ముగిసింది. జడ్జి గోవిందరాజులనాయుడుగారు కల్పబుల్ హోమిసైడుగా నేరాన్ని పరిగణించి అయిదేళ్ళు శిక్షవేశారు. అందులో దాదాపు మూడేళ్ళు గడిచిపోయింది. ఇక జరగాల్సిన రెండేళ్ళలో మంచి నడవడికగాను ఏమ్మాత్రం శిక్ష తగ్గినా ఎంత లేదన్నా 18 నెలల్లో నవనీతం విడుదలవుతుంది. తిరుమల సంజీవికి కృతజ్ఞత చెప్తూ మూడు పేజీల ఉత్తరం రాశాడు. జైల్లో రామకోటి చాలా చురుకుగా సాగుతోంది నవనీతానికి. శిక్ష తగ్గిపోయినందుకు బాధపడింది. సంజీవి నవ్వుకున్నాడు. బయటి ప్రపంచంతో ఈ రెండు మూడు సంవత్సరాలూ సంబంధాలు నిలిపింది సంజీవి. మధ్య మధ్య కైకవశి, వెంకటాచెలం, అప్పుడప్పుడు బుల్లిరాజుగారూ వచ్చిపోతున్నారు. ఓసారి కోరుకొండనుంచి భూపతిరాజు వచ్చి పూతరేకుల పాకెట్ ఇచ్చి వెళ్ళాడు. భూపతిని చూసి ఆశ్చర్యపోయింది నవనీతం. ఊహించలేనంత గంభీరమయ్యాడు. అతి త్వరలో బట్టతల కావడానికి అన్ని ఛాయలూ కనిపించాయి. అంతకుమించి శరీరం పెద్దదయింది. వెళ్తూ వెళ్తూ నవనీతం తన నిమిరాడు ఆర్ద్రంగా. రెండు మూడురోజులదాకా భూపతిరాజుని మరిచిపోలేకపోయింది నవనీతం.

జైలునుంచి విడుదలయ్యే సమయం దగ్గర పడుతున్నకొద్దీ నవనీతంలో దిగులు ఎక్కువయింది. దాన్ని కనిపెట్టినవాడు సంజీవి.

"త్వరలో విడుదలవుతున్నందుకు ఆనందంగా లేదూ?" అని అడిగాడు.

"లేదు" అంది నవనీతం.

తనకి పద్మనాభం వెళ్ళాలని లేదు. తన తల్లి ప్రస్తుతం విశాఖలో ఆచార్యులవారింట్లో తలదాచుకుంటోంది. తనూ అక్కడ చేరితే వాళ్ళకి బరువు కావడం తప్ప మరొక గత్యంతరంలేదు. ఆ ప్రపంచం ఆనందంగా తనని మరిచిపోయింది. విడుదలయి తనేం చెయ్యాలి? సంజీవి నవ్వుకున్నాడూ. ఆ ప్రశ్నకి సమాధానం తనకి తెలుసు. విడుదలయి ఆమె ఏం చెయ్యాలో నిర్దిష్టమయిన ప్రణాళిక వేసి ఉంచాడు. ఆ మాటే నవనీతంతో చెప్పాడు సంజీవి.

ఆ ప్రణాళిక తెలిసిన వ్యక్తి మరొకరున్నారు. ఈ దేశానికి ఆవలి తీరంలో అమెరికాలో ఉన్న తిరుమల. తెలిశాక ఆనందంతో ఆరుపేజీల ఉత్తరం రాశాడు తిరుమల సంజీవికి.

ఆమె జైలునుంచి విడుదలవుతున్న రోజు ఎవరికీ తెలియచెప్పలేదు సంజీవి. ఆఖరికి వెంకటాచలానికి కూడా.

ఉదయం పదిగంటలకి జైలు రిజిష్టరులో సంతకాలన్నీ పూర్తయి తన వస్తువులన్నీ తీసుకుని నవనీతం జైలు బయటకి వచ్చేసరికి చెట్టునీడలో ఒకే ఒక వ్యక్తి నిలబడి ఉన్నాడు - సంజీవి. అతని చేతుల్లో పెద్ద పూలగుచ్చం ఉంది. నవనీతం చేతిలో 82 రామకోటి పుస్తకాల బరువుంది. అంతకుమించి గతం మనస్సులో వదిలిపోయి జ్ఞాపకాల బరువు.

సంజీవి ఆమె దగ్గరకి వచ్చి చేతిలో పూలగుచ్చం ఉంచాడు. ఆమె చేతిలో బరువు అందుకున్నాడు.

"ఇప్పుడేం చెయ్యాలి?" ఆ ప్రశ్న నవనీతం అడగలేదు. ఆమె కళ్ళు అడుగుతున్నాయి.

సంజీవి మాటల్లో సమాధానం చెప్పాడు. "ఇన్నాళ్ళూ నా మనస్సులో ఉన్న మాట అడుగుతున్నాను. నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అన్నాడు.

హత్య జరిగాకా, విచారణ జరుగుతున్నప్పుడూ, కోర్టులోనూ ఎన్నడూ నవనీతానికి కన్నీరు రాలేదు. కానీ ఈ ప్రశ్న అడుగుతున్న సంజీవిని చూసి అయిదు సంవత్సరాలు తన దగ్గరకి రాకుండా దూరంగా ఉంచిన దుఃఖాన్ని ఒక్కసారి వెళ్ళగక్కేసింది. భోరుమని పసిపిల్లలాగా ఏడుస్తున్న నవనీతాన్ని పసిబిడ్డలాగా పొదివి పట్టుకున్నాడు సంజీవి.

15

రిజిస్ట్రార్ ముందు సంజీవి, నవనీతం పెళ్ళికి సాక్షి సంతకాలు వెంకటాచెలం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెన్నేటి నారాయణరావుగారు చేశారు. సందడి చిన్నదయినా అక్కడికి వచ్చిన అందరి మనస్సులూ ఆర్ద్రతతో, ఆనందంతో పరవశం అయ్యాయి. విషయం తెలిసి రిజిస్ట్రారు దైవాధీనంగారు వధూవరులని అక్కడే నిలబెట్టి రెండు పూలమాలలు తెప్పించి ఇద్దరిచేతా ప్రత్యేకంగా దండలు మార్పించారు. ఎక్కువ హడావుడి జయవాణిది. కనకాంబరం రంగు కంచిపట్టు చీర ప్రత్యేకంగా ఎన్నికచేసి స్వయంగా నవనీతానికి కట్టి తన గొలుసు కూడా అలంకరించి మరీ రిజిస్ట్రారు ముందు నిలబెట్టింది.

ఇంక చిగర్చదని ఆశలు వదులుకున్న చెట్టుకి పచ్చని చిగుళ్ళు పొడచూపడంలాంటిది. నవనీతానికి, ఆమె ఒక్కరి గురించి ఆలోచిస్తోంది. ఒక్క ఆలోచనే మనస్సులో కదులుతోంది. సంజీవి. ఇలాంటి ఆలోచన అతని మనస్సులోకి ఎలా వచ్చింది? ఎప్పుడూ అతన్ని అంత తదేకంగా పరికించి ఉండదు. తల్లీదండ్రీ ఎవరో తెలీని ఈ వారాలబ్బాయి మోడువారిన మొక్క ముందు చెంబుడు నీళ్ళతో నిలబడిన అపర భగీరథుడిలాగా కనిపించాడు. ఆర్ద్రత గౌరవాన్ని, సాధుత్వాన్ని పెంచుతుంది. భగవంతుడి ముందు భక్తుడి స్థితిని ఎవరో కవి వర్ణించాడు - 'నిర్వీర్యు'డయ్యాడు అని. సంజీవి పట్ల నవనీతం పరిస్థితి అది. రాబోయే నూరేళ్ళ జీవితంలో అతని పట్ల ఆమెకి ఉన్న అమితమయిన గౌరవం, మగాడిపట్ల ఆడదానికి ఉండాల్సిన కోరికని ఏ పదో వరసలోనో ఉంచింది. ఆమె ఏనాడూ అతనికి స్త్రీ ఇవ్వాల్సినంత సుఖాన్ని ఇవ్వలేకపోయింది. అతనూ పుచ్చుకోలేకపోయాడు. అయితే ఇద్దరిలోనూ ఆ ఆనందానికి ప్రాముఖ్యం లేదు. వారి సహజీవనం అకారణంగా ఎప్పుడూ తప్పటడుగు వెయ్యలేదు. కుంటివాడికీ, చేతికర్రకీ సహజీవనం ఎలాంటిది? భక్తుడికీ, భగవంతుడికీ మధ్య సయోధ్య ఎలాంటిది? పోలిక ఏదైనా వారిద్దరూ చుట్టూ ఉన్న సమాజం అబ్బురంతో చూసేంత ఆదర్శప్రాయమైన జంట అయ్యారు. జీవితం నష్టపోయిన ఇద్దరు కలుపుకున్న స్నేహం అది. ఇందులో స్వార్థం లేదు. ఆకాంక్ష లేదు. విపరీతమయిన తృప్తి ఉంది.

రిజిస్ట్రార్ ఆఫీసులోంచి బయటికి వచ్చాక, "ఒకాయన నీతో మాట్లాడడానికి అమెరికాలో ఎదురు చూస్తున్నాడు" అని నవనీతం చెవిలో చెప్పాడు.

నవనీతం ఆశ్చర్యంగా అతన్ని చూసింది. ఆమె మనస్సులో ఆ క్షణం కదిలిన ఒకే ఒక్క వ్యక్తి జ్ఞాపకం - అదే తిరుమల.

"మీకెలా తెలుసు?" అంది బలహీనంగా.

"ఆయన దగ్గర్నుంచి నిన్ను నేను దోచుకున్నాను కనుక. ఇప్పుడు అమెరికాలో తెల్లవారుఝామున రెండయింది. గంటన్నర నుంచీ ఆయన ఫోన్ దగ్గరే కూర్చున్నాడు, రా, మాట్లాడుదుగాని" అని రిక్షా ఎక్కించాడు.

టెలిగ్రాఫ్ ఆఫీసులో గంట తర్వాత అంటే అమెరికా లెక్కల్లో తెల్లవారుఝామున మూడు గంటలకి తిరుమల గొంతు వినిపించింది. మాట ఆచితూచి మాట్లాడాలని నవనీతానికి తెలీదు. ఎప్పుడూ దూరంగా తిరుమలని పలకరించలేదు.

"చినబాబూ!" అంది ఈతరాని పిరికి మనిషి వరద నీట్లో ఊతం కోసం అరిచినట్టు.

"చిన్నీ" అని ముద్దుగా పిలిచాడు. ఆ పేరుకి ఆ ఫోన్‌కాల్‌లోనే మొదటిసారిగా బారసాల. కదిలిపోయింది నవనీతం.

"నాకు సంజీవి అంతా చెప్పాడు చిన్నీ. సంజీవిలాంటి భర్త నీకు దొరికినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. మూడు గంటలనుంచీ విపరీతమయిన చలిలో కూర్చుని నీ పెళ్ళి గురించే ఆలోచిస్తున్నాను. చిన్నీ అమెరికా నుంచి నీకేం కావాలి చెప్పు. వైట్‌హౌస్ తెమ్మన్నా పెకిలించుకుని వస్తాను" అన్నాడు.

అటునుంచి వస్తున్న సమాధానం వినిపించకపోయినా తృప్తిగా ఆమె ముఖాన్ని చూస్తూ నలిగిపోయిన షర్టుతో నిలబడిన సంజీవిని గమనించింది.

"మా ఆయనకి మంచి ఉన్నికోటు పంపించు చినబాబు" అంది ఆనందంగా. చాలా సంవత్సరాల తర్వాత ఆమెలో పెల్లుబికిన ఆనందం అది. భర్తని 'మా ఆయన' అనడం కూడా మొదటిసారే.

'మా ఆయన' అన్నప్పుడు ఇండియాలో సంజీవి కళ్ళలో ఆనందాన్ని సరితూచే ఆనందం అమెరికాలో మరో రెండు కళ్ళు అనుభవించాయి. "మీ ఆయనకి రెండు సూట్లు పంపుతాను చిన్నీ. ఒకటి వాళ్ళావిడ అడిగింది. రెండు ఆయన స్నేహితుడు ఆయన పెళ్ళికిచ్చింది. దేవతలకి రెక్కలూ, కిరీటాలూ ఉంటాయని పురాణాలు చెప్పాయి. మనలాగే రెండు కాళ్ళూ, ఓ ముక్కూ, రెండు చేతులూ ఉంటాయని తెలీదు. నీ భర్త చాలామంది ఆడపిల్లలు కలలుగన్నా దొరకని దేవతామూర్తి. జాగ్రత్తగా దాచుకో"

నవనీతం గర్వంగా తనని చూసే చూపుకి అర్థం సంజీవికి బోధపడలేదు. రెండు ఖండాల దూరంలో రెండు హృదయాలు పంచుకున్న రహస్యమది.

"త్వరగా పెట్టేయ్. నాకు నాలుగు వందల యాభై రూపాయల బిల్లవుతోంది" అన్నాడు సంజీవి.

నవ్వుతూ ఫోన్ పెట్టేసింది. ఈ ఫోన్‌కాల్ సంజీవి ఆమెకిచ్చిన పెళ్ళికానుక. ఈ ప్రపంచంలో ఆమె కోరుకునే ఒకే ఒక వ్యక్తితో పంచుకోవాలనుకున్న ఆనందాన్ని నాలుగు వందల యాభై రూపాయలతో సంజీవి ఆమెకి కొనిపెట్టాడు.

'జీవితంలో ఇంకా ఇంత ఆనందం మిగిలి ఉందా?' అనుకుంది నవనీతం.

దండలతో గుమ్మంలోకి వచ్చి నిలబడిన నవనీతం, సంజీవిని చూసి బిత్తరపోయారు సుభద్రాచార్యులు, వరదమ్మ, రుక్మిణమ్మ. దూరం నుంచే ముగ్గురికీ పాదాభివందనాలు చేశారు ఇద్దరూ. వెంకటాచెలం జరిగిన సందర్భాన్ని వివరించాడు.

"దైవానుగ్రహం. మనుషుల్లోనూ దేవుళ్ళుంటారు. నవనీతం నేలరాలిపోవాల్సిన పువ్వుకాదు. నాకు తెలుసు" అన్నారు సుభద్రాచార్యులు.

రుక్మిణమ్మ ఆనందంగా తనమెడలో ఉన్న ఒకపేట పగడాల దండ తీసి నవనీతం మెడలో వేసింది.

వరదమ్మ చిలిపిగా "మా అమ్మాయి పేరు చెప్పి లోపలికి రావయ్యా!" అంది.

నవ్వులతో ఆ ఇల్లు నందనవనమయిపోయింది.

నోటంట మాట రానిదీ, మాటలాడలేనిదీ ఒక్కర్తే - కైకవశి. ప్రపంచంలో ఉన్న భాష యావత్తూ ఆ క్షణంలో ఆమె సొంతమయితే ఆమె ఏం మాట్లాడేది? నవనీతం అదృష్టం గురించా? సంజీవి ఔదార్యం గురించా? త్యాగం గురించా? ఆరాధన గురించా? దగ్గరకు అల్లుడూ, కూతురూ నడచివచ్చినప్పుడు కూతురుని చూడలేదు కైకవశి. అమాంతం అల్లుడి కాళ్ళమీద పడి భోరుమంది. ఆ దృశ్యానికి అక్కడున్నవాళ్ళంతా కదిలిపోయారు. వరదమ్మ కైకవశిని లేవదీసింది.

నవనీతం రాకతో సంజీవి దశ తిరిగింది. నవనీతం కేసులో సంజీవి పెద్దగా కృషి చేసిందిలేదు. చెయ్యవలసిందీ లేదు. అయితే కేసుకంటే నవనీతం, తీరా గెలిచాక గెలుపుకంటే ఇద్దరి వివాహం చాలా మందిని ఆకర్షించింది. నలుగురూ చెయ్యలేని పని ఏ ఒక్కడో చెయ్యడానికే గొప్పతనమని పేరు పెట్టుకుంటాం. అది మనకి సాధ్యమయ్యే స్థితిలో ఉంటే ఈర్ష్యపడతాం. సాధ్యంకాని స్థితిలో ఉంటే

'అదృష్ట'మని సరిపెట్టుకుంటాం. కలలో కూడా ఊహించని స్థితిలో ఆ పని జరిపితే ఆయనకి మహానుభావుడని బిరుదు ఇచ్చి మరిచిపోతాం.

వీటన్నిటికీ దగ్గరలో సంజీవి పరపతి ఇమిడింది. రెండు రకాల పార్టీలు ఆయన దగ్గరకి రావడం ప్రారంభించారు. ఎక్కడా సమాధానం దొరక్క, కేవలం సెంటిమెంటుతోనో చాకచక్యంతోనో సాధించాల్సిన కేసులు, పాపర్ దావాలు. నిజానికి పాపర్ కేసులు తగు

మాత్రం ఫీజుతో చేపట్టే పని సంజీవి చేతిలో పడింది. సంజీవి దురాశపరుడు కాదు. కాగా, అతని జీవితం నేర్పిన పాఠం దేనిమీదా ఆశలు పెంచుకోక వచ్చింది చేతికి దక్కినందుకే ఆనందించమని. నవనీతంతో చాలా హార్దికమయిన సంసారాన్ని ప్రారంభించాడు. ఇద్దరికీ ఒకరికొకరు కొత్త 'రుచి'ని జీవితాలకు చేర్చారు. వివాహంతో నిజమైన అన్యోన్యతను సాధించిన అపురూపమయిన సకృతుగా ఎదురయ్యే సందర్భమది.

ఇదే సమయంలో మరొక వివాహానికి ఇంకొక వ్యక్తి రకరకాల ఉచ్చులు పన్నుతున్నాడు. ఆయన రాఘవచారి. అయితే అందులో దురుద్దేశంలేదు. తెలివితేటలపాలు ఎక్కువుంది. విఘ్నేశ్వరుడు తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షిణం చేసి, భూప్రదక్షిణం చెయ్యబోయిన తమ్ముడిని ఓడించడంలో దుర్మార్గం లేదు. దేవుడు కనుక ఆ లౌక్యానికి 'మేథస్సు' లేబుల్ అంటించారు పెద్దలు. రాఘువాచారి విషయంలో విఘ్నేశ్వరరావుగారికి తీసిపోని మేథస్సునే ఉపయోగించాడు.

అంత ప్రయత్నం ఎందుకు? 'పాడ్'వంటి అందమయిన, చదువుకున్న అమ్మాయికి ప్రయత్నిస్తే తిరుమలకంటే మంచి సంబంధం దొరకదా? నిజానికి దొరకదు. కారణం పెళ్ళి విషయంలో - పాడ్ పెళ్ళి విషయంలో - రాఘవాచారికి కొన్ని లక్ష్యాలున్నాయి. కొన్ని అనుభవాలున్నాయి. కొన్ని పరిథిలున్నాయి.

పాడ్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఇండియాలో ఉండే పిల్లకాదు. అమెరికాలో పెరిగిన అబ్బాయిలు ఇండియాలో అమ్మాయిల్ని పెళ్ళి చేసుకుని అమెరికా తీసుకుపోతే లక్షణంగా పాంటులు తొడుక్కుని, నుదుటిన బొట్టు చెరిపేసుకుని, లక్ష్మీ లక్కీగా, సావిత్రి చెవీగా ఉన్నాయి. కానీ, అమెరికాలో పెరిగిన ఏ ఆడపిల్లా ఇండియాలో పెరిగిన కుర్రాడిని పెళ్ళి చేసుకుని అమెరికా వెళ్ళాకగానీ, ఇండియా వచ్చిగానీ, సుఖంగా కాపరం చేసిన సందర్భాలు ఒక్కటి కూడా లేవు. ఇది రాఘువాచారికి బాగా తెలుసు. అందుకు కారణం అమెరికా వాతావరణానికి మారిన ఆడపిల్ల ధోరణిలోకి మగాడు మారడం కష్టం. ఎందుకంటే పురుషాధిక్యతతో పెరిగిన వాతావరణంలోంచి కుర్రాడు వెళ్తున్నాడు కనుక. అయితే స్త్రీలు? సావిత్రి, అనసూయ, అరుంధతి మోడల్స్‌లో తండ్రులు తయారు చేశారు. భర్త దుర్మార్గుడయితే దుర్మార్గంతో సరిపెట్టుకోవడం, ఫేషన్ మనిషే అయితే అతనికి నచ్చే విధంగా ఫాషన్‌లకి అలవాటుపడటం సంస్కృతిలోనే అలవాటు చేయ్యడం కష్టంకాదు. మార్పు ఆడపిల్లల సైక్‌లో భాగంగా ఈ సంస్కృతి పెంచింది కనుక.

మాథమాటికల్ ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా రాఘవాచారికి ఈ ఈక్వేషన్స్ బాగా తెలుసు. తాగుబోతువాడికి తాగుడుని అర్థం చేసుకునే పెళ్ళాం కావాలి. భగవద్గీతని పారాయణం చేసే మొగుడికి మహా పాతివ్రత్యం మీద నమ్మకం ఉన్న భార్య కావాలి. తప్పనిసరిగా అమెరికా వైపే దృష్టి సారించిన అమ్మాయికి తప్పనిసరి పరిస్థితుల్లో అమెరికాలో అడుగుపెడుతున్న కుర్రాడు భర్త కావడం క్షేమం. అయితే అతనికంటే ముందు అమ్మాయి అమెరికాకు అలవాటు పడిందా? పెళ్ళి చెడిపోతుంది. అమెరికా కంటే ముందు అబ్బాయికి అలవాటు పడాలి. ఇది బూతుగా అనుకున్నమాట కాదు. అందుకనే తిరుమల అమెరికా వెళ్ళేదాకా 'పాడ్' అమెరికా ఊసు ఎత్తకుండా ఆపాడు. తీరా తిరుమల అమెరికా వెళ్ళాక 'పాడ్' అమెరికా యాత్రకి అన్ని ప్లానులూ పూర్తిచేశాడు. ఇప్పుడు ఈక్వేషన్ కరెక్టుగా ఉంది. అమెరికాలో ఉన్న కుర్రాడు ఇండియానుంచి వచ్చిన, రావడానికి సిద్ధంగా ఉన్న, రావడానికి ఇష్టపడుతున్న అమ్మాయిని అమెరికాలో కలుసుకోబోతున్నాడు. ఇక ఈ పెళ్ళి ఫెయిలయ్యే అవకాశంలేదు.

పాడ్ తెలివయిన అమ్మాయి. పైగా నాన్న కూతురు. ఎకనామిక్స్ ఆనర్స్ ఫస్టు క్లాస్‌లో పాసయింది. అయితే తిరుమల కోసం అమెరికాలో జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ అర్రులు చాచినట్టుగా ఆమె కోసం ఎవరూ అర్రులు చాచలేదు. అయినా ఆమెకి ఓ చిన్న సైజు

ఉద్యోగం స్నేహితుల సహాయంతో చూసి పెట్టాడు. ఆ ఉద్యోగానికి ఆమె ఎకనామిక్స్ ఆనర్స్ అవసరం బొత్తిగా లేదు. ఇంగ్లీషు మాట్లాడే మంచి శరీరం ఉన్న అమ్మాయ్ చాలు. ఆ రెండూ 'పాడ్'కి ఉన్నాయి.

"ఇది బ్రెయిన్ డ్రైన్ కాదా?" అని అడిగాడు ఓ మిత్రుడు రాఘవాచారిని.

రాఘవాచారికి కావలసినంత సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉంది. నవ్వి, "కాదు. ఇది బ్రెయిన్ ఇన్ ది డ్రైన్ (బ్రెయిన్ మా అమ్మాయిది) ఐ యామ్ ట్రైయింగ్ టు సాల్వేజ్ ఇట్!" అన్నాడు.

కానీ ఎలా? అమెరికాలో ఏదీ ఆశ్చర్యం కాదు. అమెరికా బతుక్కి అర్రులు చాచిన ఎమ్మేలు తీరా ఈ డిగ్రీ ఆ దేశంలో చెల్లదంటే కేవలం ఉపాధికోసం గాస్‌స్టేషన్లో గాస్ నింపే పనికి కుదురుకోవడం తెలుసు. చదివిన ఎమ్మేని కుళ్ళు కాలవలో పారేసి అమెరికా పరిభాషలో ఎస్సెల్సీ లాంటి అర్హతని సంపాదించి, కాస్తపాటి డాలర్లతో కారు షెడ్లలో బతికిన, బతుకుతున్న వాళ్ళని తెలుసు. ఎందుకు? 'రేపు' అద్భుతంగా ఉండగలదని, ప్రయత్నిస్తే 'రేపు నీదే' నన్న ఆశని ఆ వ్యవస్థ ఇస్తోంది. పుట్టుక కారణంగా, కులం కారణంగా, జాలి కారణంగా ఆ అవకాశాన్ని ఈ వ్యవస్థ కొందరికయినా దూరం చేస్తోంది.

అందుకే ఆ రోజుల్లోనే తిలక్ కవి కనుక, ముందుకు చూసేవాడు కనక "అమెరికాలో డాలర్లు పండును" అన్నాడు.

డెట్రాయిట్‌లో పాడ్‌కి ఉద్యోగం కుదిరింది. ఉద్యోగం తిరుమలకి తరచు కనిపించే చోట కుదిర్చారు పెద్దలు. విశాఖలో వదులు పాంట్లు వేసుకుని తిరిగే ఆచార్లుగారి బైతు మొదట సాదా సీదా కారులో, దరిమిలాను జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ కారులో తిరగడం అందంగా కనిపించింది (మనిషికాదు) పాడ్‌కి. ఇది కూడా అమెరికా ప్రభావమే. అమెరికాలో గ్లామరు ప్లాస్టిక్ కరెన్సీ - ఫేస్ కాదు. కరెన్సీ జేబులో ఉంటే ఆరునెలల్లో మనిషి వాలకం క్రాపు, మాట, అతను మనమీద చూపే ప్రభావం అన్నీ మారిపోతాయి. మరి మార్పునే ప్రేమించే పాడ్ తిరుమలపట్ల ఆకర్షితురాలు కావడంలో ఆశ్చర్యంలేదు.

పాడ్, తిరుమల నాలుగయిదుసార్లు కలిశారు. ఇప్పుడు అమెరికా పద్ధతిలో శరీరం తగ్గే ప్రయత్నాలు ప్రారంభించి అమెరికా లిప్‌స్టిక్‌తో, శరీరాన్ని అంటుకునే పీటర్ ఇంగ్లండ్ బనీన్లతో ప్లేట్‌లో వడ్డించిన గులాబ్ జామ్‌లాగా ఉంది పాడ్

అయిదారు నెలల్లో ఇద్దరూ అమెరికన్ బాణీలోనే డేటింగు చేశారు. నైట్ క్లబ్బుల్లో వచ్చీరాని డేన్సులు చేసి దానికి 'మాడర్నయిజేషన్'గా ఇద్దరూ గుర్తులు పెట్టుకున్నారు. మధ్య మధ్య ముద్దులు పెట్టుకున్నారు.

ఓ పదినెలల తర్వాత డెట్రాయిట్‌లో కార్నిజీ డిటెక్టివ్ ఏజన్సీ నుంచి సీల్ చేసిన కవర్ వచ్చింది రాఘవాచారికి.

అందులో విషయం "పాడ్ అనే అమ్మాయి చాలా చలాకీ పిల్ల. చాలా తెలివయినది. ఆవిడకి ఇటాలియన్ పీజా అన్నా, సెవిస్టా రెడ్ వైన్ అన్నా, టాప్‌లెస్ క్లబ్బులన్నా చాలా ఇష్టం. 'తిరమల్' (ఇంతకంటే వాళ్ళకి ఆ పేరు అర్థంకాలేదు) అనే కుర్రాడితో ఈ మధ్య తెగ తిరుగుతోంది. కెనడాకి వెళ్ళే అండర్ గ్రౌండ్ టన్నెల్ ప్రక్కన ఫలానా రోజు రాత్రి చెవర్లెట్ కన్వర్టిబుల్‌లో ఆ కుర్రాడితో వెళ్ళింది."

రాఘవాచారి నిట్టూర్చాడు ఆనందంగా. ఇంక రెండో దశ ప్రయత్నానికి ఇది ప్రారంభం అని నిర్ణయానికి వచ్చాడు. కారులోనే ఆ రిపోర్టుకి నిప్పంటించి ఇంటికి వస్తూ దారిలో 'మురుగన్'కి ఓ కొబ్బరికాయ కొట్టి ఇల్లు చేరాడు.

16

**మంచి ముహూర్తం** చూసుకుని, చక్కగా పంచె, ఉత్తరీయం వేసుకుని, భార్యకి కష్టపడి పట్టుచీర కట్టించి, వెంకటాచెలం వెంటరాగా, సుభద్రాచార్యులవారిని కలుసుకోవడానికి వచ్చాడు రాఘువాచారి.

ఇందులో మోసంలేదు. వంచన లేదు. అక్కరలేని లౌక్యం ఉంది. సుభద్రాచార్యులు, వరదమ్మ మొదట ఆశ్చర్యపడ్డారు. రాఘువాచారి అంత పెద్దవాడు తమ మామూలు ఇంటికి వచ్చి పిల్లనిస్తానని అడగడం చాలా ఆనందంగా భావించారు. కాగా, రాఘువాచారిగారి నుదుటిన ఉన్న తిరుచూర్ణం సుభద్రాచార్యులవారిని ఎక్కువ ఆకర్షించింది. ఆ బొట్టు ఆయన పొద్దుటే పెట్టాడని, కేవలం ఈ సమావేశానికే పరిమితమని ఆయనకి తెలీదు. వరదమ్మనీ, రుక్మిణమ్మనీ ఆకర్షించిన విషయం ఫోటోలో అందంగా ఆండాళ్‌లాగా ఉన్న పద్మావతి. ఆ అమ్మాయి ముఖమే ఫోటోలో చాటంత కనిపిస్తోంది. ఆమె ముఖంలోనే ఆండాళ్ కాని, శరీరమంతా 'పాడ్' అని కిందనున్న పాంటు, షర్టు చూడలేదు కనుక వారు ఊహించలేకపోయారు. పోతే, వెంకటాచెలం మధ్యవర్తిత్వం మిగతా పని పూర్తి చేసింది. ఇవాళ తిరుమల అమెరికాలో ఉన్నాడంటే దానికి కారణం వెంకటాచెలం. అందుకు పడాల్సిన శ్రమ, కృషి అంతా ఆయనదే తిరుమల శ్రేయస్సుని కోరే వ్యక్తి వెంకటాచలం. అతనికి జీవిత భాగస్వామినిని ఎంచి తీసుకువస్తే కాదనేదేముంది? కట్నాలు, కానుకల ఊసు రాఘువాచారి అడగనూ లేదు. చెప్పాలని సుభద్రాచార్యులవారికి తెలియనూ తెలీదు.

"మరి అబ్బాయితో మాట చెప్పి, పిల్లని చూపించి" అని నసిగింది వరదమ్మ. వెంకటాచెలం నవ్వాడు. "అవన్నీ పాతరోజులమ్మా. ఆరు నెలలుగా అమెరికాలో ఇద్దరూ ఒకరినొకరు చూసుకుంటున్నారు. ఇంతవరకూ ఇద్దరూ వేర్వేరు ఇళ్ళల్లో ఉన్నారు. మనం ఆ మూడు ముళ్ళూ వేయిస్తే ఒకే ఇంటికి మారిపోతారు" టూకీగా కథని క్రోడీకరించాడు వెంకటాచెలం.

అతను పొరపాటుపడ్డాడు. డిట్రాయిట్‌లో కాబోయే వధూవరులిద్దరూ దాదాపు ఒక ఇంటికే మారిపోయారు. ఎంతో కొంత తండ్రి మనస్సులో తిరుమల అల్లుడు కావాలనే కోరిక ఉన్నదన్న ఆలోచనని పసిగట్టింది పాడ్ సంప్రదాయాన్ని తెంచుకునే సాహసం ఇంకా చెయ్యలేని తిరుమల కాస్త ఆలోచనల్ని సడలించి, వయస్సు సహాయంతో జీవితంలో రూల్సుని సడలించాడు.

ప్రహ్లాద కళ్యాణ మంటపంలో అతి ఘనంగా పెళ్ళి ఏర్పాట్లు చేశాడు రాఘువాచారి. ఆ రోజుల్లో ఆ వివాహం అతి వైభవంగా, ఇటు సంప్రదాయం, అటు అధునాతన పోకడలు దెబ్బతినకుండా జరిగిన వివాహం. పెళ్ళికొడుకు, పెళ్ళికూతురూ అమెరికానుంచి ఒకే విమానంలో, ఒకే కారులో, ఒకే టాక్సీలో, ఒకే ఇంటికి వచ్చారు. ఇంకా నూతన వధువు గృహప్రవేశానికి నాలుగయిదు రోజులు వ్యవధి ఉంది కనక గుమ్మంలోంచే వరదమ్మకీ, రుక్మిణమ్మకీ 'బై' చెప్పి, తిరుమలని ఇంటి దగ్గర దింపి, తన ఇంటికి వెళ్ళిపోయింది 'పాడ్' పాంటూ, షర్టూ, గాగుల్స్‌తో ఉన్న అమ్మాయే తమకి కాబోయే కోడలని ఇద్దరూ పోల్చుకోలేకపోయారు. చెప్పాలని తిరుమల ప్రయత్నించనూ లేదు.

పెళ్ళిలో మగపెళ్ళివారి తరపున ఊపిరి తిరగకుండా పనిచేసిన వాళ్ళిద్దరు - నవనీతం, కూర్మయ్య. ఊపిరి సలపని పనులన్నీ వెనకుండి సవరించిన వాళ్ళిద్దరు - వెంకటాచెలం, సంజీవి. ఊపిరి బిగపట్టి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయిన వాళ్ళిద్దరు - వరదమ్మ, రుక్మిణమ్మ. బుల్లిరాజుగారు మలేరియాతో ఖాయిలాపడి ముహూర్తం వేళకి బుచ్చియ్యమ్మని తీసుకుని టాక్సీలో వచ్చారు. అందరినీ మించి ఈ పెళ్ళి జరిపిస్తున్న సుభద్రాచర్యుల మనస్సులో ఏం జరుగుతోంది? తన కొడుకు ఈసారి తనకి ఇంకా దూరమవుతున్నట్టనిపించింది. ఉద్యోగానికి వెళ్ళినప్పటి కంటే తిరిగి వచ్చిన తిరుమలలో నాగరికత విభిన్నంగా, కొట్టొచ్చినట్టు కనిపించింది. గోస్తనీ నదికి తెల్లవారు ఝామునే తనతో నడచివచ్చిన వటువుని గుర్తుపట్టడానికి ప్రయత్నించారు ఆచార్యులుగారు. కానీ ఎక్కడా వెదకడానికి ప్రయత్నించినా తిరుమలలో కనిపించలేదు.

ఈ వివాహ మహోత్సవమంతా ఆచార్యులుగారి మనస్సులో ఏదో మూల 'దిగులు'ని మిగిల్చింది. అలాగని ఖిన్నవదనంతో కూర్చోలేదు. వియ్యంకుడికి, వియ్యపురాలికి ఖరీదయిన పట్టుబట్టలు పెట్టి, రామేశ్వరం నుంచి రుద్రాక్షలు తెప్పించి, బంగారు పువ్వుతో హారం చేయించి ఆయన చేతుల్లో పెట్టి పాదాభివందనం చేశాడు రాఘవాచారి. లావణ్య చెయ్యాలనుకుంది కానీ శరీరం సహకరించలేదు.

గుమ్మంలో అడుగుపెట్టిన నూతన వధువుని చూసి పొంగిపోయింది రుక్మిణమ్మ. సిరియ తిరుమడల్, తిరువాయ్ మొళి, ధనుర్మాసాల్లో 'ఇయల్ సాత్తు' నైవేద్యం - ఈ సంప్రదాయాన్ని దాటి ప్రపంచం ఎంత దూరం ప్రయాణం చేసింది. తన మనవడు ఎంత మారిపోయాడు. పలకరించే వాళ్ళందరితో అలవోకగా తనకర్థంకాని ఇంగ్లీషులో మాట్లాడుతున్న, ఆడపిల్లలాగా నాజూకుగా ఉన్న తిరుమలని చూస్తూ ఆనంద పారవశ్యంలో అలాగే గోడని ఆనుకుని కూర్చుని కళ్ళు మూసుకుంది రుక్మిణమ్మ. అందరి భోజనాలు ముగిశాక అత్తగారికి భోజనానికి పిలవాలని ఆమె కోసం వెదికింది వరదమ్మ. అప్పుడు గోడకి ఆనుకుని నిద్రపోతున్న రుక్మిణమ్మని చూసింది. ఎంత కదిపినా లేవలేదు రుక్మిణమ్మ. భయంతో సుభద్రాచార్యులవారిని పిలుచుకొచ్చింది. మరో గంటకి రుక్మిణమ్మని అమెరికన్ ఆసుపత్రికి చేర్చారు.

అప్పుడే పసుపు బట్టలు తీసి, పాంటు తొడిగాడు పెళ్ళికొడుకు. నాయనమ్మ పక్కనే కదలక కూర్చున్నాడు. ఆమె వొడిలో తనకెన్నో మధురస్మృతులున్నాయి. గుడ్డిదీపం వెలుగులో కుంతీమాధవస్వామి ఆలయం పక్క గదిలో ఇంగ్లీషు అక్షరాలు రాసే మనవడిని తదేకంగా చూస్తూ కూర్చునేది రుక్మిణమ్మ. లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతో కుర్రాడు నిద్రపోయేవాడు కాదు. మనవడి మీద వాత్సల్యంతో ఆమె నిద్రపోయేదికాదు. ఆ యింట్లో ఎవరికీ కాఫీ అలవాటు లేదు. కానీ మనవడికోసం కాస్త పొడి తెప్పించి ఓ రాత్రప్పుడు కాఫీ కలిపి ఇచ్చేది రుక్మిణమ్మ. అది నాయనమ్మా మనవడి మధ్య రహస్యం. కుర్రాడు బాగా చదువుకుని, కాస్త ముందుకుపోయి, పెద్ద పెద్ద విషయాలు తెలుసుకున్నప్పుడు ప్రత్యేకంగా అడిగి తనకర్థం కానివన్నీ చెప్పించుకుని వినేది. ఆవిడకి ఆ క్షణాల్లో ఒకటే అర్థమయ్యేది. అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాల్లో ఎవరూ ఊహించలేని చదువు తన మనవడు సాధిస్తున్నాడని. మార్పు కొందరిని భయపెడుతుంది. కొందరిని జోకొడుతుంది. కొందరిని ఆనందింపచేస్తుంది. సుభద్రాచార్యులు భయపడ్డారు. వరదమ్మ నిర్లిప్తంగా అర్థం చేసుకుంది. రుక్మిణమ్మ అమాయకంగా ఆనందపడింది.

తన పరిణామంలో రహస్యంగా పాలు పంచుకున్న నేస్తురాలు కళ్ళుమూసుకుని ఆసుపత్రి మంచం మీద పడుకుని ఉంది. రీనల్ ఫెయిల్యూర్ అన్నారు డాక్టర్లు. అప్పటికే హెపాటిక్ కోమాలోకి జారిపోయింది శరీరం. మరో నాలుగురోజులు ప్రాణాల్ని ఆ పల్చటి ఎముకలగూడులో నిలపగలిగారు డాక్టర్లు. ఆ తర్వాత వాళ్ళ చేతుల్లో ఏమీ మిగలలేదు. మనవడి వివాహాన్ని కళ్ళారా చూసి, మనవడి వైభవానికి మనసారా గర్వపడి, శ్రీకృష్ణుడి విశ్వరూపాన్ని చూసిన కళ్ళతో ఇంకేమీ చూడనని కళ్ళు మూసుకున్న ధృతరాష్ట్రుడిలాగా ఓ పవిత్రమైన క్షణంలో కళ్ళు మూసుకుని ఇక కళ్ళు తెరవలేదు రుక్మిణమ్మ.

చాలా ఇబ్బంది పడుతూనే అంత్య క్రియలన్నీ జరిపారు సుభద్రాచార్యులు. కాలు ఇంకా పూర్తిగా స్వాధీనం కాలేదు. అయినా ఏ కొరతా రాకుండా జరిపించారు.

అత్యంత ఆనందప్రదంగా జరిగిన వివాహంలో రుక్మిణమ్మ కన్నుమూయడం ఒకింత అపశ్రుతి. సుభద్రాచార్యులు క్రమంగా తన చుట్టూ ఉన్న ప్రపంచం ఖాళీ అయిపోతున్నట్టు భావించారు. ముందు తరం తన జీవిత భాగస్వామినిని వెదుక్కుని దూరమయింది. వెనకతరం శాశ్వతంగా సెలవు తీసుకుంది. వంశపారంపర్యంగా వస్తున్న ధార్మిక జీవనాన్ని వదులుకుని ఇక్కడ ఏం చేస్తున్నట్టు? ఏం చెయ్యాలో, ఎక్కడికి పోవాలో తెలీని అవ్యవస్థలో నిలిచిపోయింది ఆయన జీవితం.

కూర్మయ్య ఆ పెళ్ళిలోనే పన్నెండేళ్ళ ఆండాళ్ళుకి కాలిన్స్ డిక్షనరీ కొనిచ్చాడు. "మాటలో పొరపాటుని చెప్పినవాళ్ళేకాక, విన్నవాళ్ళూ సులువుగా మరిచిపోవచ్చు. వ్రాతలో పొరపాటుకి ఎల్లకాలం సాక్ష్యం ఉంటుంది. విజ్ఞానానికి వాచ్ డాగ్ డిక్షనరీ" అంటూ ఇచ్చాడు. ఇస్తున్నప్పుడు అతని వేళ్ళ నల్లదనం పుస్తకానికి అంటుకున్నట్టనిపించింది. అందరిలో తనకెందుకు బహుమతినిచ్చాడో అర్థంకాలేదు ఆండాళ్ళకి. డిక్షనరీ తీసుకుని ఆ హడావిడిలో నాన్నగారి సందుగ పెట్టెలో పడేసి మరిచిపోయింది.

పద్మనాభం వచ్చిన కొడుకుని చూసి సానయ్య పొంగిపోయాడు. "ఏట్రా నంజికొడుకా నువ్వింత సదువు సదివాక కూడా నేను మట్టిపిసుక్కోవాలా?" అన్నాడు ఆప్యాయంగా. నులకమంచం మీద కూర్చుని మట్టిలో సగం కాళ్ళు దిగబడిపోయిన తల్లినీ, తండ్రినీ చూస్తూ చెప్పాడు కూర్మయ్య "మట్టి పిసుక్కోవడం నేరమూ కాదు, హేయమూ కాదు" (ఆ మాట వాళ్ళిద్దరికీ అర్థంకాలేదు.)

"అంటే?"

"సిగ్గుపడే పనికాదు. చదువు వృత్తిని బాగా చేసుకోమంటుంది కానీ, మానుకోమని చెప్పదు."

"అయితే సచ్చేదాకా నన్ను మట్టి పిసుక్కోమంటావా నీ..."

మాట పూర్తికాకుండా ఆపింది భర్తని. "ఒరే నాన్నకి ఓ తెల్లటి సొక్కా కొనివ్వవూ" అనడిగింది.

ఆ సాయంకాలమే భీమ్లీ వెళ్ళి ఓ ముతకపంచె, ఓ గ్లాస్కో చొక్కా కుట్టించి తెచ్చాడు కూర్మయ్య. పద్మనాభంలో మూడురోజులున్నాడు. ఆ మూడు రోజులూ విడవకుండా తొడిగి, చొక్కానిండా బీడీలు దోపి, మట్టిమరకలు చేసి, కూర్మయ్య పట్నం వెళ్ళేసమయానికి చొక్కాని చింపేశాడు సానయ్య. కూర్మయ్య నవ్వుకున్నాడు.

కొడుకుల అవతారాన్ని పోలీసు స్టేషన్‌కి వెళ్ళి పలకరించాడు కూర్మయ్య. గాబర్డీన్ పాంటు, షర్టులో ఉన్న కూర్మయ్యని చూసి, "అమ్మ నా కొడకా! ఎంతటి వాడివయిపోయినావురా!" అని భుజం తట్టి పలకరించి, టీ తెప్పించాడు. తన మొదటి గురువుకి రాజమండ్రి కోటగుమ్మం చుట్టల్ని రెండు కట్టలు బహూకరించాడు. ఆప్యాయంగా కబుర్లు చెప్పాడు అవతారం.

"మా బెమ్మిగాళ్ళకి సదువు తప్ప మరోటి అబ్బదు. ఇంకా తెలివయినవోడయితే ఎదవ అలవాట్లు, తప్పుడు లక్షణాలు అబ్బుతాయి. నీలాంటోళ్ళకి కష్టపడినా సదువు అబ్బదు. నీకు కుదిరింది. దాన్ని వదిలిపెట్టకు. నీలాంటోళ్ళకి దాన్ని భద్రంగా ఉంచుకోవడం ఎలాగో తెలుసు. జేబులు కొట్టే నా కొడుక్కి న్నూర్రూపాయల కాగితం దొరికినట్టు. నువ్వు సాలా గొప్పోడివయిపోయాక నన్ను మెడ్రాస్ తీసుకెళ్ళి బుడ్డ ఆపరేషన్ సేయించరా బాబూ, నీ పుణ్యం వుంటాది" అన్నాడు.

కూర్మయ్య నవ్వుకున్నాడు. "నేను గొప్పోడిని కావడానికి చాలా సంవత్సరాలు పడుతుంది. అంతవరకూ దాన్ని పోషించకండి. మా ఫ్రెండు నాన్న హైదరాబాదులో డాక్టరు. ఆయన్ని కనుక్కుని ఏం చెయ్యాలో రాస్తాను" అన్నాడు.

కూర్మయ్య రెండు చేతులూ పట్టుకుని ఏడ్చినంత పనిచేశాడు కొడుకుల అవతారం. "నా సర్వీసులో నీకు సదువు చెప్పడం నేను చేసిన గొప్ప పనిరా" అన్నాడు శిష్యుడితో.

విచిత్రంగా కూర్మయ్య జీవితంలో ఈ సంభాషణ అతని లక్ష్యాన్ని నిర్దేశించింది. మరో ఏడేళ్ళ తర్వాత కూర్మయ్య సర్జన్ కావడానికి, మరో తొమ్మిదేళ్ళ తర్వాత గొప్ప సర్జన్ కావడానికి కొడుకుల అవతారం ఊహించని స్ఫూర్తినిచ్చాడు. కానీ ఆ క్షణంలో కూర్మయ్య నవ్వుకున్నాడు. అవతారం బేలతనానికి జాలిపడ్డాడు. కానీ మరో రెండేళ్ళ తర్వాత ఈ క్షణం ఎంత బలమయిన ముద్రవేసిందో గుర్తుకొచ్చింది. అది ముందు కథ.

సుభద్రాచార్యులవారి వానప్రస్థం గంభీరంగానే ప్రారంభమయింది.

ఆయన ఊళ్ళోనే ఉన్నారని తెలిసిన ఓ భక్తుడు గరుడా బంగార్రాజుగారు. జగన్నాథస్వామి దేవాలయానికి వంశపారంపర్యంగా ధర్మకర్త. వదాన్యులు. వైశ్యులు. బట్టల వ్యాపారం. కోపం వస్తే అగ్నిహోత్రుడయిపోతాడు. కానీ ఎప్పుడూ కోపంరాదు. ఎందుకు కోపం రావాలో తెలిసిన వ్యాపారి కనుక. ఆయన ఆచార్యులవారి దగ్గరకి వచ్చి జగన్నాథస్వామి వారి ఆలయంలో ప్రతిరోజూ పురాణ కాలక్షేపం జరపమని ఆహ్వానించాడు. అదొక్కటే సుభద్రాచార్యులవారికి చేతనయిన పని. కాగా సాయంకాలమయ్యాక తీరికగా గుడిలో కూర్చునే తన వయస్సువారితో సత్సాంగత్యం అభిలషణీయమే. అంగీకరించాడు.

ఈ విధంగా ఒక వ్యాపకం ఆచార్యులవారికి ప్రారంభమయింది. ఆటవిడుపుగా ప్రారంభమయిన వ్యాసంగంలో 'రుచి' క్రమంగా చెప్పే ఆయనకీ, వినే ప్రేక్షకులకీ వంటబట్టింది. రోజంతా సాయంకాలం గడిచే రెండుగంటల పురాణ కాలక్షేపానికి మనసా వాచా సిద్ధపడేవారు ఆచార్యులవారు. వంట ముగించుకుని ఆయనతో తనూ ఆలయానికి వెళ్ళి కూర్చునేది వరదమ్మ. అవకాశం వున్నప్పుడు ఆ ప్రేక్షకులలో వెంకటాచెలం రాఘవాచారీ ఉండేవారు. విదేశీ సంప్రదాయాన్ని పుణికి పుచ్చుకుని పుట్టిన తన కూతురుకి, ఇంత ధార్మిక సంపదని వారసత్వంగా పుచ్చుకున్న తిరుమలని భర్తని చేయగలిగినందుకు చాలా గర్వపడేవాడు రాఘవాచారి. ఆ రోజుల్లోనే అల్లుడి కాళ్ళు కడిగి కన్యాదానం చేసిన రాఘవాచారి సుభద్రాచార్యులవారికి పాదాభివందనం చెయ్యడమూ అలవాటు చేసుకున్నాడు.

సంప్రదాయంలో ఓ గంభీరమయిన వాస్తవం ఉన్నది. దాన్ని అవలంబించడం సరే, దాన్ని అనుకరించినా కొంతవరకయినా సమాజంలో గౌరవం దక్కుతుంది. అనుసరించి సుభద్రాచార్యులు ఆ గౌరవాన్ని దక్కించుకుంటే, అనుకరించి రాఘవాచార్యులు అల్లుడిని దక్కించుకున్నాడు. అయితే యిద్దరిలోనూ 'సంకల్పం'లో దుర్మార్గం లేకపోవడం గమనార్హం. సంకల్పంలో స్వార్థం ఉన్న దొంగ సాధువులను గౌరవించి ఈ సమాజం ఎంతో కొంత అవమానం పాలవుతోంది. అయితే ఆ నష్టం స్వార్థానిదే కానీ, సమాజానిది కాదు.

చైత్రశుద్ధ పంచమినాడు సుభద్రాచార్యులు లేచి ఆరాధన ముగించుకుని కైంకర్యానికి ఎదురు చూస్తూ కూర్చున్నారు. దద్దోజనంతోపాటు, ఘుమఘుమలాడే చక్రపొంగళిని స్వామి ముందుంచింది వరదమ్మ. ఆమె ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. ఆచార్యులవారు ఆశ్చర్యపోయారు.

"ఏమిటివాళ స్వామికి విశేషం?" అన్నారు.

"స్వామికి కాదు, మనకి" అంది వరదమ్మ గుమ్మాన్ని ఆనుకుని భక్తిగా కూర్చుని "తిరువారాధన కానివ్వండి" అంటూ.

ఇంకా అర్థం కాలేదు. ఆమె పెదాలు పెరియాళ్వార్ తిరుమొళిలో మొదటి రెండుదశకాల్నీ వల్లిస్తున్నాయి.

"వరదా! ఏమయింది?" అన్నారు ఆచార్యులవారు ఆప్యాయంగా.

"రాత్రినుంచి ఈ రోజుకి ఎదురు చూస్తున్నాను. ఇవాళ తిరుమల పుట్టినరోజు. సూర్యుడు ఉదయించడానికి అరగంట ముందే పుట్టాడు. ప్రతీ సంవత్సరం మీతో గోస్తనీ నదికి నడిచివచ్చే ముందు నా చెవిలో గుర్తుచేసేవాడు చక్రపొంగలి గురించి. తిరువారాధన అయ్యాక నా దగ్గర కూర్చుని గోరుముద్దలు పెట్టించుకుతినేవాడు. శిఖని తీసేవరకూ ఇంగ్లీషు పరీక్షలు రాసినా నేనే తినిపించాను. తీరా క్రాఫింగు పెట్టుకున్నాక" ఆగిపోయింది.

తుళ్ళిపడ్డారు సుభద్రాచార్యులవారు. అప్పుడే సంవత్సరాలు దొర్లిపోతున్నాయి. చైత్రశుద్ధ పంచమి తిరుమలకి గుర్తుందో లేదో? ఈ తిథులూ, ఈ విధులూ అర్థంకాని ప్రపంచంలో ఉన్నాడు వాడు. ఎక్కడ ఉన్నా, బిడ్డ సుఖంగా ఉండాలి. భక్తిగా పెరుమాళ్ళకి ఆరాధన

జరిపారు. ఆయన మనసంతా ఆ క్షణంలో చిన తిరుమలాచార్యులతో నిండిపోయింది. ఆర్ధ్రతతో వరదమ్మ కళ్ళు జలపాతాలయ్యాయి. "నా బిడ్డని నూరేళ్ళు చల్లగా కాపాడు" అని స్వామికి మనస్సులోనే మొక్కుకుంది.

తెలుగు తిథిని దాటి తిరుమల పుట్టినరోజు రావడానికి ఇంకా పన్నెండు రోజులుంది. ఇప్పుడు అమెరికాలో రాత్రి పదిగంటలయింది. అప్పటికి ఆరో పెగ్గు టీచర్స్ తాగి అవుట్ అయిన తిరుమలని పాడ్, మరో ఇద్దరు మిత్రులు వేళాకోళం చేస్తూ కారు వెనక సీట్లోకి మోసుకొచ్చి పడుకోబెట్టారు.

వరదమ్మ ప్రార్థించిన దేవుడు ప్రస్తుతం తిరుమలని చల్లగానే చూస్తున్నాడు. డిట్రాయిట్ చల్లగాలి జోకొడుతోంది.

## 17

చాలా సంవత్సరాలుగా అలవాటులేని చాలా పనులు సుభద్రాచార్యులవారు స్వయంగానే చేసుకోవడానికి అలవాటు పడ్డారు ఇప్పుడిప్పుడు.

సంప్రదాయం కాలాన్ని, అవసరాన్ని పురస్కరించుకుని ఒక జాతి తరతరాలుగా అనుసరిస్తున్న అలవాట్ల సమీకరణ వాటిని భగవంతుడితో ముడిపెట్టింది. తులసి, పుదీనా ఈ రెండు ఆకులకీ యాంటీ సెప్టిక్ లక్షణాలున్నాయి. ఆ కారణం చేతనే వాటి ఉనికి శ్రేష్టం, ఉపయోగకరం. తులసికి దేవతారూపాన్నిచ్చి ఇంటి పెరట్లో నిలుపుకుంది. హిందూమతం. దాన్ని రుచికరమయిన పలావ్ దాకా తీసుకెళ్ళి కడుపు నింపుకుంది ఇస్లాం. రోజూ చెరువులో స్నానం చేసి సూర్యభగవానునికి అర్ఘ్యం ఇచ్చే సనాతనుడు టొరెంటోలో ఆ పని చెయ్యబోతే ఆసుపత్రి పాలవుతాడు. పిట్స్‌బర్గ్‌లో వేంకటేశ్వరస్వామి కోవెలలో పురోహితుడు ఉన్ని స్వెట్టరు, మేజోళ్ళు తొడుక్కునే స్వామివారికి మంత్రపుష్పం చదువుతాడు. వేంకటేశ్వరస్వామి అందుకు ఆక్షేపణ పలకడనుకోవాలి. మతం చేత నిర్దిష్టమైన లక్ష్యాన్ని అర్థం చేసుకోని మౌఢ్యమే ఆఫ్ఘనిస్తాన్‌లో బుద్ధుని అపూర్వ కళావైభవాన్ని నాశనం చేసినా, అయోధ్యలో బాబ్రీ మసీదుని కూలదోసినా.

జీవితానికి అవసరమయిన మార్పునే క్రమంగా మతం తన చట్రంలో అందంగా అమరుస్తుంది. లేదా, ఆ నాటి ఋషులు అందంగా తీర్చిదిద్దారు. ఎంత మానవహితాన్ని, సమాజశ్రేయస్సునీ దృష్టిలో ఉంచుకోకపోతే అలనాటి రామానుజులు వేంకటేశ్వరస్వామికి పత్రి పూజని నిర్దేశిస్తారు? ప్రవక్త లక్ష్యం - ఆయన రామానుజులయినా, క్రీస్తు అయినా, మహమ్మదు అయినా సమాజ హితమే.

ఇంత చెప్పడానికి కారణం మార్పుని తిరుమల హేతుబద్ధంగా అంగీకరించినంత సుళువుగా, సుభద్రాచార్యులు అంగీకరించలేకపోయారు. అయితే క్రమశః అంగీకరించక తప్పలేదు. అదీ, జీవితం నేర్పే క్రూరమైన పాఠం.

పట్నంలో కొన్ని తప్పనిసరయిన పనులున్నాయి. పొద్దున్నే కొత్త రోడ్డు దగ్గర పాలబూత్‌కి పోయి పాలు తెచ్చుకోవాలి. తెల్లవారు ఝామున లేవడం ఆచార్యులవారికి కష్టంకాదు. ఇక్కడ గోస్తనీ నది లేదు, కుంతీమాధవస్వామి లేడు. జీవిక సాగడానికి కొన్ని అవసరాలున్నాయి. ఉదయం చలి ముఖ్యంగా విశాఖపట్నంలో చలి తట్టుకోలేనంత దుర్భరంకాదు. అయినా పట్నంలో ఉత్తరీయం చాలదని వెంకటాచెలం మరీమరీ పోరి ఆచార్యులవారి చేత రెండు ఫ్లానల్ చొక్కాలు కొనిపించాడు. ఆకుపచ్చ ఫ్లానల్ చొక్కా వేసుకుని తలకి ఉత్తరీయం చుట్టుకుని అందరికన్నా ముందే క్యూలో నిలబడేవారు ఆచార్యులవారు.

వరదమ్మ వయస్సుకంటే త్వరగా ముసిలిదయిపోయింది. ఇదివరకు ఆచార్యులవారిని లేపి, నదికి పంపించగలిగేది. ఇప్పుడు పాలపాకెట్‌తో ఇంటికి వచ్చి నెమ్మదిగా భర్త కుంపటి రాజేసే సమయానికి వరదమ్మ నాలిక కొరుక్కుంటూ లేచేది. అప్పటికి సుభద్రాచార్యులవారు స్నానం ముగించుకుని స్వామి నివేదనకి తానే స్వయంగా వంట ప్రారంభించేవారు. అప్పుడు హడావుడిగా స్నానం ముగించుకుని తడి జుట్టుని ముడివేసుకుని భర్త చేతిలో గరిటెని అందుకునేది.

***వృద్ధాప్యంలో దాంపత్యం స్నేహంలాంటిది. ఒకే కారణానికి ఒంటరయిన ఇద్దరి సఖ్యత ఆ జీవనం.*** ఎంతో కొంతగా ఆండాళ్ళు తల్లికి తోడయ్యేది. అమ్మాయిని సి.బి.ఎం హైస్కూలులో చేర్పించారు ఆచార్యులవారు.

పట్నం జీవితం కొత్త అలవాట్లనీ, కొత్త బాధ్యతల్నీ కొత్త పనుల్నీ నెత్తిన వేసింది.

పద్మనాభంలో పెరట్లో పొట్లపాదూ, ఇంటిముందు వంగమొక్కలూ వంటివి ఓ కాపు కాసేవి. అప్పుడప్పుడూ భక్తులు వస్తూవస్తూ గుమ్మడికాయనో, ఆనపకాయనో ఇంటిదగ్గర ఇచ్చిపోయేవారు. వారానికి ఒకసారి బుల్లిరాజుగారి తోటనుంచి బుట్టెడు కూరగాయలు వచ్చేవి. కాగా, స్వామివారి నివేదనే ఆచార్యులవారికి చాలు. పల్లెటూరి జీవితంలో ఎక్కువ తికమలు లేవు. ఇప్పటికీ సరళిలో చిన్న మార్పు ఉన్నా, పల్లె జీవితం సరళంగా సాగిపోతూనే ఉంది.

విశాఖపట్నంలో కిరసనాయిలుకి రేషన్ కార్డు కావాలి, రేషన్ కార్డుకి కొన్ని వివరాలు కావాలి. రేషన్ తెచ్చుకోవడానికి తైనాతీగా మనిషి కావాలి,. మధ్యాహ్నం పదకొండు పన్నెండుగంటలదాకా క్యూలో సుభద్రాచార్యులుగారు నిలబడిన సందర్భాలు కోకొల్లలున్నాయి. ఆ సందర్భాల్లో ఎండల్లో నెత్తిన ఉత్తరీయం వేసుకుని కాలి చెప్పులు లేకుండా నిలబడిన సుభద్రాచార్యులవారిని అక్కడ క్యూలో నిలబడిన వారెవ్వరూ గుర్తుపట్టేవారు కాదు. ఇది పట్నం జగన్నాధస్వామి ఆలయంలో రామాయణం వరకూ రాని జీవితాలు చాలా ఉన్నాయి. ఇలాంటప్పుడు న్యాయంగా రెండు కలిసి రావాలి. ఒకటి: ఇలాంటి పనులు చేసే పిల్లలు. రెండు: ఇలాంటి పనులు చేయించుకోగలిగే ఆదాయం. వరదమ్మ బొత్తిగా లోకజ్ఞానం తెలీని మనిషి. ఇంటిని సాకడానికే ఆమె సమయం సరిపోతున్నది. కనుక ఆచార్యులవారి జీవితం ప్రస్తుతం పాలడిపో, కూరలమార్కెట్టు, రేషన్ దుకాణం, పచారీ దుకాణం, కిరాణా దుకాణం, అన్నీ గడిచాక జగన్నాథస్వామి ఆలయం మధ్య గడుస్తున్నది.

సి.బి.ఎం హైస్కూలులో దైవాధీనం మాస్టారుగారు బైబిలు పాఠం చెప్తుంటే ఆండాళ్ళు కంగారు పడింది. ఆ స్కూలులో చదువు మాన్పించే స్థితికి వచ్చారు ఆచార్యులవారు. ఇలాంటి సమయాల్లో సలహా సంప్రదింపులు వెంకటాచెలంతోనే. విషయం తెలిసిన వెంకటాచెలం నవ్వుకున్నాడు. ఆ రోజుల్లో విశాఖపట్నంలో హైస్కూళ్ళు రెండో మూడో. అటు ఎం.జి.ఎం ఇంకా మీదికి పోతే సెయింట్ ఆంథోనీ స్కూలు అప్పుడప్పుడే ప్రారంభమయింది. పైగా, పేరుకి కెనేడియన్ బాప్టిస్టు మిషన్ స్కూలయినా మతం ప్రమేయం పెద్దగా వత్తిడి చెయ్యకుండా అక్కడ టీచర్లందరూ దాదాపు బ్రాహ్మణులు. తెన్నేటి రామ్మూర్తిగారు, క్రరి సూర్యనారాయణగారుణ వేదుల సుబ్బారావుగారు ఇలాగ. ఉన్న ఆ కొద్దిమంది క్రైస్తవ టీచర్లూ చాలా చక్కని ఉపాధ్యాయులు. పట్నంలో పట్నం అలవాట్లను పాటించినట్టే, స్కూల్లో యాజమాన్యం రూల్సుని పాటించాలి. తప్పులేదు. తప్పేదీ లేదు. మొదట ఈ విషయానికి ఆండాళ్ళుని ఒప్పించారు. అసలు ఇలాంటి విషయాల్ని తండ్రిదాకా తీసుకురానక్కరలేదని మందలించాడు. పైగా, మరో మతాన్ని గురించి తెలుసుకోవడం పాపం కాదు. అవగాహన ఒక విధంగా విశాల దృక్పథాన్ని ఏర్పరుస్తుంది. ఇంటికి తీసుకువెళ్ళి తన భార్య జయవాణిని చూపించాడు. ఆమెతో తను కూడా చర్చికి ఎలా వెళ్ళేదీ వివరించాడు.

"కాలం మారుతోంది. మన విలువల్ని, మరో మతం నేర్పే విషయాల్ని గుడ్డిగా త్రోసిపుచ్చడం కాదు. అక్కరలేనివి, ఛాందసంగా మన నెత్తిన రుద్దినవి మన మతంలోనూ ఉన్నాయి. చదువు విచక్షణని నేర్పుతుంది. నువ్వు స్కూలుకి వెళ్ళేది అందుకోసం. క్రైస్తవ మతం ప్రపంచంలో మూడొంతులు మానవాళి నమ్ముకున్న మతం. దాన్ని చూసి భయపడక్కరలేదు. చర్చిలో ప్రార్థన చేసినంత మాత్రాన మనం చెడిపోతామని అనుకోనక్కరలేదు" ఆండాళ్ళుకి కాస్త ఉపశమనం కలిగింది.

అనుదినం తెల్లారి లేస్తే ఇంట్లో తిరుప్పల్లాండు, తిరువాయ్ మొళి వింటూ పెరిగిన అమ్మాయి స్కూల్లో బైబిలు నేర్చుకుంటోంది. దైవాధీనం మేష్టారుగారు రోజూ ఉదయం ప్రార్థన చెయ్యగా అందరితో కలిసి "ఏసు హల్లెలూయ, హోసన్న రాజు గెల్చి లేచి వచ్చెన్"

పాడుతోంది. ఆ రోజుల్లో అంతగా మత దూషణ లేదు. దానికి అవసరమూ లేదు. కాగా చక్కటి క్రమశిక్షణకీ, దీటయిన చదువుకీ పెట్టింది పేరుగా నడిచిన స్కూలు, నడిపిన ఉపాధ్యాయులు ఆనాటివారు.

పదిహేనురోజుల కొకసారి తిరుమల దగ్గర్నుంచి ఉత్తరం వచ్చేది. అది ఆ ఇంట్లో పండగ. ఎంత లేదన్నా ఆరేడు పేజీల ఉత్తరం రాసేవాడు. సుభద్రాచార్యులవారు, వరదమ్మ వింటూండగా అన్నయ్య ఉత్తరాన్ని కేవలం పారాయణ చేసేది ఆండాళ్ళు. ఆ సమయాల్లో తండ్రి రహస్యంగా కళ్ళజోడుక్రింద నీటి తెరల్ని తుడుచుకోవడం ఆమె దృష్టిని దాటిపోయేది కాదు. వరదమ్మ అయితే బేల. ఆమె కళ్ళు ఆమె చెప్పిన మాటలు వినేవి కావు. ఆమె చెప్పేది కాదు. చెల్లెలికి విధిగా ఏవో బహుమతులు పంపేవాడు. తొలిరోజుల్లోనే రిస్టువాచ్ పంపాడు. పల్చటి నైట్‌గౌన్ పంపాడు. కానీ దాన్ని వేసుకునే ధైర్యం లేకపోయింది ఆండాళ్ళుకి. అందరూ పడుకున్నాక ఒకటి రెండుసార్లు ఆ గౌను వేసుకుని గదిలో అటూ ఇటూ తచ్చాడింది. అమెరికా వెళ్ళిన తొలిరోజుల్లోనే తిరుమల, పాడ్ కలిసి నయాగరా దగ్గర తీయించుకున్న ఫొటోలూ, సియర్స్ టవర్ ముందు తీసిన ఫొటోలూ పంపాడు. ఆ రోజుల్లో పాడ్ ఎంత ఇబ్బందిగా చీర కట్టుకున్నదీ, ఎంత అయిష్టంగా నిలబడ్డదీ అర్థమయింది ఒక్కరికే - ఆండాళ్ళుకి.

❦❦❦

**ఆచార్లుగారు** ఫోటోల్ని చూసినప్పుడల్లా "చూశావా! ఊర్ధ్వపుండ్రాలు మరిచిపోయాడు" అని రుసరుసలాడేవారు. దూరమయిపోయిన సంప్రదాయం తండ్రికి కనిపించేది. కేవలం దూరమయిన కొడుకే కనిపించేవాడు వరదమ్మకి. అమెరికా దూరంగా ఉందే అన్న దిగులు ఆండాళ్ళుకి తోచేది. మనస్సు అన్నయ్య దగ్గరకి ఆలోచనల్లోనే ప్రయాణం చేసేది.

అందమయిన బంగారం పేషర్స్ కలాన్ని వెంకటాచెలానికి పంపాడు. జయవాణికి ప్రత్యేకంగా ఏరి అత్యాధునికమయిన స్కర్ట్‌ని పంపించింది పాడ్ విక్టోరియా స్వీడన్ చాక్లెట్లు లొట్టలు వేస్తూ వారం రోజులు తిన్నది.

వెంకటాచెలం గర్వంగా పెన్నుని పదిమందికీ చూపించి తిరుమల గురించి చెప్పుకున్నాడు. తీరిగ్గా కూర్చుని తిరుమల ఇచ్చిన పెన్నుతోనే ఉత్తరం రాస్తున్నప్పుడు రెండుమూడుసార్లు వణికే చేతుల్లోంచి పెన్ను జారిపోవడం జయవాణి కనిపెట్టింది. వెంకటాచెలం ముఖంలో ఆనందానికీ, చేతిలో వణుకుకీ పొంతన లేకపోవడాన్ని గుర్తుపట్టింది. మంచినీ, చెడునీ మనస్సులోనే దాచుకునే శక్తి ఉన్నవాడు వెంకటాచెలం. ఆ విషయం జయవాణికి తెలుసు. అందుకనే చిన్న అపశ్రుతి, చిన్న విభేదం ఆమె దృష్టిలో పడింది.

తర్వాత వచ్చే ఫోటోల్లో తిరుమల పాడ్‌చేత చీర కట్టించే ప్రయత్నం ఎక్కువగా చెయ్యలేదు. కారణం చెయ్యలేకనా? చేసి ఓడిపోవడమా? ఏమయిన పాంటూ, షర్టుతో ఉన్న చాలా ఫోటోల్ని తండ్రికి చూపకుండా దాచింది ఆండాళ్ళు. చాలాసార్లు ఇద్దరూ కలిసిన ఫొటోలే రావడం వల్ల అసలు తండ్రికి చూపించే అవకాశమే రాలేదు వరదమ్మకి మాత్రం ఇందులో విపర్యయం ఇబ్బంది పెట్టలేదు. కాగా, తల్లి దృష్టి వేరు. ఆమె చూసేది బిడ్డ ముఖాన్ని, కోడలి అందాన్ని. ఓసారి ఇంటిముందు ఫ్రాక్‌తో ఉన్న కోడల్ని చూసి కాస్సేపు ఆగిపోయింది వరదమ్మ.

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు? వదినెని గుర్తుపట్టలేదా?? అంది ఆండాళ్ళు నవ్వుతూ.

"వదినె నీళ్ళు పోసుకున్నట్టుంది. ఎన్నో నెలో రాసి కనుక్కో" అంది వరదమ్మ.

ఆండాళ్ళు నవ్వింది. తల్లిని వేళాకోళం చేసింది. "అమెరికా డాక్టర్లు కూడా చెయ్యలేని పని నువ్వు ఫోటోలు చూసి చేస్తున్నట్టున్నావే? ఏమిటమ్మా నీ పిచ్చి. వదిన నీళ్ళు పోసుకుంటే అన్నయ్య మనకి చెప్పడూ?" అంది నవ్వుతూ.

కానీ ఆండాళ్ళు గ్రహించలేని విషయం వరదమ్మ గ్రహించింది. నిజంగానే పాడ్ నీళ్ళు పోసుకుంది. ఎప్పుడయితే పీరియడ్స్ తప్పాయో పాడ్ తిరుమలమీద విరుచుకుపడింది. అతనిమీదపడి రక్కి దాదాపు కొట్టినంతపని చేసింది. ఇప్పుడు చేస్తున్న ఉద్యోగంలో పెద్ద

ప్రమోషన్‌కి తీవ్రంగా కృషి చేస్తోంది పాడ్ మరో అయిదారు నెలల్లో ఆ కృషి ఫలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొదట్నుంచి పాడ్ బద్ధకస్తురాలు. ఆమెకి నిద్రన్నా, ఐస్‌క్రీమ్‌లన్నా, స్లీవ్‌లెస్‌లన్నా, బర్ట్ లంకాస్టర్ సినిమాలన్నా విపరీతమైన అభిమానం. కడుపన్నా, పిల్లలన్నా, పురుళ్ళన్నా రోత. పైగా ఇది అమెరికా ఫాషన్. అమెరికాలో అందరూ ప్రేమించుకుంటారు. కానీ దాదాపు అంతా పిల్లల్ని కనడాన్ని ఓ భయంకరమయిన దుశ్చర్యగా చూస్తారు. అయితే ఎవరికి వారు స్వతంత్రంగా జీవనం సాగించడం అక్కడ అవసరం కనుక గర్భధారణ ప్రతిబంధకం అయ్యే అవకాశం ఉంది. పిల్లలంటే ఎంత లేదన్నా రెండేళ్ళు తమ జీవన సరళిలో అంతరాయం. అంత వ్యవధి అక్కడి 'తొందర' జీవితాలకి లేదు. ఆ ఒరవడిలో నడుస్తున్న, నడవక తప్పని మనవాళ్ళకీ అదే అవాంతరం. అదే ఆలోచన తప్పదు. పెళ్ళయిన సంవత్సరానికే కోడలు నెలతప్పడం ఇరుగు పొరుగులకి మిఠాయి పంచడం, అయిదో నెల దొంగ చలిమిడి ఒళ్ళో పెట్టడం, ఏడో నెల చూలాలికి దిష్టి తగలకుండా రెండు చేతులనిండా ముత్తయిదువలు గాజులు తొడగడం ఇవన్నీ చరిత్రలో భాగాలు. అమెరికాలో ముత్తయిదువులూ, గాజులూ ఇవన్నీ పాతకాలపు పైత్యాలు. ఈ మధ్య భారత మహిళలు బయటకి వచ్చేటప్పుడు ప్రత్యేకంగా, శ్రద్ధగా బొట్టు చెరుపుకు రావడం తప్పనిసరయింది. న్యూయార్క్ సమీపంలో Dottarsని ప్రత్యేకంగా వెంబడించి, ఆపి కొట్టి చంపడం జరిగింది. "అదీగాక బొట్టుని చూసి లక్షప్రశ్నలతో చంపుతారండి. వాళ్ళకి సమాధానాలు చెప్పుకునేకంటే తీసేసుకోవడమే సుఖం" అంది ఒకావిడ చీర బదులు స్కర్టుతో, ఎత్తుమడమల బూట్లతో ఆఫీసుకు వెళ్తూ.

ఏమయినా ఉన్న దేశంలో ఆచారాల్ని పాటించాలనే ఆత్రంతోనో, వదిలిన దేశంలో వికారాలని చదువుకున్న మహిళలకు అనిపించిన కారణానో, తప్పనో, తప్పనిసరయ్యో చాలామంది స్త్రీలు చాలా భారతీయ ఆచారాలను వదులుకుంటున్నారు. ఇలా అంటున్నప్పుడు విదేశాల్లో ఉంటున్న వారందరినీ దుయ్యబట్టడం ఉద్దేశం కాదు. పండగలకీ, పబ్బాలకీ తెలుగుదేశాన్ని మరిపించే తెలుగుదనం అక్కడా కనిపిస్తుంది. అయితే తెలుగుదనం, సంప్రదాయం - ఫాన్సీ డ్రస్సుల్లాగా తెలుగు పండుగలు - సాయంకాలం సమావేశానికి మాత్రమే పరిమితమయిపోయింది. ఇది తప్పనిసరా? తప్పని సరిపెట్టుకోవాలా? తెలీదు. తెలుగుదనం అక్కడ చొక్కాకి తగిలించుకునే బాడ్జి, ఒక సింబల్.

ఏమయినా నెల తప్పిందనగానే పాడ్ గుండె పగిలిపోయింది. పాడ్ ఇంత సెన్సిటివ్ అవుతుందని తిరుమల అనుకోలేదు. "ఇప్పుడిప్పుడే పిల్లలు వద్దు" అన్న పాడ్ ఆలోచనకి అభ్యంతరం చెప్పలేదు తిరుమల. అయితే అదేదో లక్ష్మణరేఖ కావాలని, పిల్లలనే పీడకలని ఆలోచనలోకయినా రానివ్వని స్థితిలో పాడ్ ఉందని అతను ఊహించలేకపోయాడు. ఆమెని సముదాయించడానికి ప్రయత్నించాడు. పాడ్ సుతరామూ అంగీకరించలేదు.

ఏతావాతా, ఆమె వ్యగ్రత కారణంగానో, సహజ పరిణామంగానో ఆమెకి రక్తపుపోటు ఎక్కువయింది. ఆ కారణంగా అప్పటి పరిస్థితుల్లో అబార్షన్ అంత మంచిది కాదనీ అవసరమయితే మరో రెండు నెలల తర్వాత ఆలోచించవచ్చుననీ డాక్టర్లు అన్నారు.

కానీ అంతవరకూ ఆగే స్థితిలో లేదు. పైపెచ్చు, పెరిగిన కడుపుతో, ఆఫీసుకి స్కర్టుల్లో తిరగడం 'వ్యభిచారి' అని పటం కట్టించుకుని తిరిగినంత అవమానకరంగా భావించింది పాడ్ సహజంగా తిరుమల సరళమయిన స్వభావం కలవాడు. ఆఫీసు వ్యవహారాల్లో, రిసెర్చిలో తలమునకలయినవాడు. కొందరికి నిజానికి చాలామందికి జీవితాల్లో వివాహం పెద్ద పరిణామం. కానీ తిరుమలకి, ఆ మాటకి వస్తే పాడ్‌కి వివాహం ఒక దశ. ఒక సంఘటన. చాలామంది ఇల్లాళ్ళకి మాతృత్వం ఒక వరం. కానీ పాడ్‌కి ఈ స్థితి అత్యంత దుర్భరం.

పాడ్ ఈ పరిణామాన్ని తట్టుకోలేకపోయింది. ఓ రోజు బాగా రాత్రయ్యాక తిరుమల ఆఫీసునుంచి ఇల్లు చేరాడు. అప్పటికి పదిన్నర దాటింది. బయట విపరీతమయిన చలి. కారు గరాజ్‌లో ఉంచి ఇంట్లో అడుగుపెట్టేసరికి ఇల్లంతా నిర్మానుష్యంగా ఉంది. పాడ్ అలికిడిలేదు. కుర్చీ జరిపి దానిమీద నిలబడి వెంటిలేటర్‌లోంచి లోపలికి చూశాడు.

చేతి నరాన్ని రేజర్‌తో కోసుకుని రక్తం మడుగులో పాడ్ అచేతనంగా పడిపోయి కనిపించింది.

**18**

అయిదారుగంటలు మృత్యువుతో హోరాహోరీ పోరాడి తేరుకుంది పాడ్ కళ్ళిప్పి తిరుమలని చూసి భోరుమని వాటేసుకుంది.

చచ్చిపోవాలన్న ఆలోచన ఉదాసీనతతో చేసిందే కానీ, తీరా చావునుంచి కోలుకున్నాక 'పాడ్' పిరికిదయిపోయింది. పెళ్ళయ్యాక తిరుమల స్నేహం, ఊతం సాన్నిహిత్యం కోరుకున్న సంఘటన ఇదే తర్వాతి జీవితంలో వాళ్ళిద్దరూ దగ్గరవడానికి ప్రారంభం ఇదే శారీరక సంబంధానికి కేవలం వయస్సు కారణమయితే, తన నిస్సహాయ స్థితిలో తిరుమల 'తోడు' ఎంత అవసరమో ఆమెకి ఇప్పుడు తెలిసి వచ్చింది. పాడ్‌లాంటి స్త్రీ తన ప్రాణంలాగే భర్తకీ అతి సులువుగా దూరమయిపోగలదు. ఆ తెగువ, ఆ అహంకారం, ఆ నిర్లక్ష్యం ఆమెలో స్వతహాగా ఉన్నాయి. వీటన్నిటికీ పెద్ద సమాధానం ఈ సంఘటన. దైవికంగా ఆలోచిస్తే 'పాడ్' ఆత్మహత్య చేసుకోబోయి బ్రతకడం వారిద్దరి జీవితంలో అనూహ్యమైన అవసరమయిన మలుపు. వాళ్ళిద్దరినీ దగ్గర చేసిన మలుపు.

జీవితం చాలా విచిత్రమయినది. పెళ్ళి ఇద్దరిని దగ్గర చేస్తుంది. అది కేవలం సాంఘికమయిన పరిణామం. కానీ చావు ఇద్దరిని దగ్గర చేయడం విచిత్రమయిన పరిణామం. తన కష్టంలో కొండంత ఆధారం తిరుమలే కాగలడన్న ఆలోచనని చాలాసార్లు; అతనినుంచి పారిపోవాలనుకున్న పాడ్ ఏనాడూ మరిచిపోలేదు. అది ఆమె మాంగల్యానికి నాలుగోముడి.

విచిత్రంగా ఇంత జరిగినా, కడుపులో గుడ్డుకి ఏమీ జరగలేదు. కారణం పుట్టబోయే బిడ్డ అక్షరాలా మొండిపిండం. తల్లి కడుపుని అంటిపెట్టుకునే ఉంది.

కోడలు నీళ్ళు పోసుకున్నదని తెలిసి వరదమ్మ పండుగ చేసేసింది. సుభద్రాచార్యులవారూ ఆనందించారు. ఆ రోజు హుగుడి కథని జగన్నాథస్వామి ఆలయంలో రెచ్చిపోయి చెప్పారు. రాఘవాచారి భక్తులందరికీ పులిహోర పంచిపెట్టించాడు.

అమెరికాలో ఉన్న అమ్మాయిలెవరూ పురిటికి ఇండియా రారు. పుట్టిన పాతికేళ్ళకి భారతదేశం వదిలి వెళ్ళినా, పుట్టబోయే బిడ్డ అమెరికా పౌరుడు కావాలని వారి తపన. 'జననీ జన్మభూమిశ్చ' అన్న ఆలోచనలో వైభవం ఈ తరం అమెరికా బిడ్డలకి వివరించబోవడం వృధా రాఘవాచారిగారు సుభద్రాచార్యులవారిని భార్యతో సహా అమెరికా వెళ్ళమన్నారు. సముద్రాలు దాటి మ్లేచ్ఛుల దేశాలకి పోవడం పాపమని భావించే తరానికి చెందినవారు ఆచార్యులవారు. కాగా, ఆ దేశంలో తన ఆచారం, మడీ సాగదు. సమాధానం ఆలోచించడానికి ఎక్కువ వ్యవధి తీసుకోలేదు. ససేమిరా వెళ్ళనన్నారు. రాఘవచారి భార్య కూతురుకి సహాయపడుతుందని ఆశలేకపోయినా, సహాయం అవసరం కనక ప్లెయిన్ ఎక్కారు.

భయంకరమైన కష్టంలోంచి ఓ మంచి పని సాధ్యమవుతుంది. అక్టోబరు విప్లవాన్ని ముందు అనూహ్యమైన అవ్యవస్థ ఉంది. ఆ మాటకి వస్తే ప్రతీ అవతార ధర్మమూ ఇవన్నీ పెద్ద విషయాలు.

జయవాణి వెంకటాచెలానికి రాబోయే కష్టాన్ని ముందుగా గుర్తుపట్టింది. అందుకు కారణం ఆమెలో వైద్యులకి ఉండే కుశాగ్రబుద్ధి ఉండటంకాదు. స్త్రీలకి కలిసొచ్చే ముందు చూపు. మాతృత్వం వారికిచ్చిన వరమిది. చేతిలో ఉన్న పసిబిడ్డకి రేపు రాబోయే రుగ్మతను ఇవాళే గుర్తుపట్టే గొప్ప దృష్టి తల్లికి భగవంతుడిచ్చాడు.

తిరుమల అమెరికానుంచి పంపించిన షీఫర్స్ పెన్ను వెంకటాచలం చేతిలోంచి జారిపోవడాన్ని వెంకటాచెలం అంతగా పట్టించుకోలేదుగానీ, జయవాణి గుర్తుపట్టింది. అంతేకాదు, వెంకటాచెలం అంతగా పట్టించుకోలేదుగానీ, జయవాణి గుర్తుపట్టింది. అంతేకాదు, వెంకటాచెలం స్నానం చేసి వచ్చాక మడత విప్పిన బనీను ఇబ్బందిగా తలను వెతుక్కోవడం ఆశ్చర్యంగా గమనించింది. ఓసారి భోజనం చేస్తూండగా మంచినీళ్ళ గ్లాసు కంచంలోకి వొలికిపోయింది చేయిజారి. వీటన్నిటినీ సమీకరిస్తే ఏదో గుర్తు తెలీదు. అనారోగ్యాన్ని గుర్తుపట్టింది.

ఆమె మేనమామ లూథరన్ చర్చి పాస్టరు థామస్ గాబ్రియేల్ గారున్నారు. ఆయన హోమియోపతి వైద్యం చేస్తాడు. అతడిని ప్రత్యేకంగా ఇంటికి ఆహ్వానించింది. ఎన్నడూ తన తరపు బంధువుల్ని పలకరించని జయవాణి మొదటిసారిగా మేనమామని ఇంటికి పిలుచుకురావడాన్ని ఆశ్చర్యంగా గమనించాడు వెంకటాచెలం. ఎంతకాదన్నా పుట్టింటిమీద ప్రేమ ఆడదానికి సహజం. అంతకంటే కలిసి బ్రతికే వ్యక్తిమీద ప్రేమ అందుకు కారణమని వెంకటాచెలం గుర్తుపట్టలేకపోయాడు. పట్టకుండా జాగ్రత్తపడింది. గాబ్రియేల్‌కి ఆమె చెప్పిన సంఘటనలు వింతగా తోచలేదు. వాటిని రోగంగా ఆయన గుర్తుపట్టలేకపోయాడు. అందుకని డాక్టరు వరహాలశెట్టిగారిని తనతో వెంటబెట్టుకు వచ్చాడు. వరహాల శెట్టిగారు లౌకిక ప్రపంచాన్ని బాగా ఎరిగిన వ్యక్తి. కాగా, రాబోయే రోగానికి సూచనలను ముందుగా గుర్తుపట్టగలిగిన దృష్టి ఉన్నవాడు. వరహాలశెట్టిగారితోపాటు వెంకటాచెలం తాగవలసిన టీకప్పు నేలమీద పడి పగిలిపోయింది తప్పున రోగం గుర్తుపట్టాడు వరహాలశెట్టి. మరో అయిదారు నెలల్లో స్పష్టంగా కనిపించబోయే పార్కిన్సన్స్ రోగానికి ఇవి సూచనలు. చేతుల్లో, వేళ్ళలో, నరాల్లో బలం సడలి, మెదడు అదుపులో పెట్టలేని వణుకు ప్రారంభమవుతుంది. క్రమంగా నరాలు గట్టిపడి గిడసబారుతాయి.

అయినా రోగాన్ని వెంకటాచెలం ముందు ఇంతగా దాచవలసిన అవసరం ఏముంది? అతని స్వభావం బాగా తెలిసిన జయవాణి మనస్సులో అందుకు కారణం ఉంది. వెంకటాచెలం మనస్సుని భూతద్దంలో ఉంచి పదిమందికీ బాహాటంగా చూపే వ్యక్తి. అతనికి చుట్టూ ఉన్న ప్రపంచం కావాలి. ఏమీ సంబంధం లేని సుభద్రాచార్యులని చూసి పది పన్నెండేళ్ళు పూసుకు ఉపకారం చేసి, ఆప్త బంధువయిన వ్యక్తి, నలుగురికీ దూరంగా ఉండలేడు. అలాంటిది నలుగురిలో దూరంగా ఉండాల్సిన వ్యాధిని ఎలా తట్టుకోగలడు? పదిమంది కష్టాన్ని తీర్చే మనిషి తనకి వచ్చిన కష్టాన్ని ఎలా ఎదుర్కొంటాడు? రోజూ వందమందికి సూదిమందు ఇచ్చే డాక్టరు తనకి ఇవ్వాల్సిన ఇంజెక్షన్‌ని ఎలా తట్టుకుంటాడు?

రోగం కంటే ఆ రోగం తనని తప్పనిసరిగా పదిమందికీ దూరం చేయడం అతన్ని బాధపెడుతుందని జయవాణి గుర్తించింది. పరిష్కారం రోగంపరంగా తన చేతుల్లో లేదు. పరిణామం పరంగా వీలయినన్ని సవరణలు చెయ్యడానికి పూనుకుంది. ఆ సవరణలు, రోగంతోపాటే వెంకటాచెలానికి తెలియాలి.

ముఖ్యమైన విషయం వెంకటాచెలం ఉద్యోగం మానేస్తే ఆదాయం ఉండదు. ఇల్లు గడవడానికి ఆదాయం కావాలి. ట్రైనింగ్ కాకపోయినా, కాస్త తక్కువ జీతంతో వరహాల శెట్టిగారి ఆసుపత్రిలో నర్స్‌గా ఉద్యోగం సంపాదించుకుంది జయవాణి. వెంకటాచెలం ఉద్యోగం మానేస్తే మూడోవంతు పెన్షన్ వస్తుంది. తన జీతం, పెన్షన్ కలిస్తే కూడా విక్టోరియాని పెద్ద స్కూల్లో చదివించే ఆస్కారం లేదు.

అందుకని చెలానికి తెలియకుండానే విక్టోరియాని చిన్నబడికి మార్పించింది. ఇవన్నీ జరగడానికి మూడు నాలుగు నెలలు పడితే, వెంకటాచెలం రోగం ముదిరి అతనికే అర్థంకావడానికి అయిదునెలలు పట్టింది. చాలా హుషారుగా అందరికీ తలలో నాలికలాగా ఉండే

మనిషి మూలనపడక తప్పదన్న ఆలోచన చాలా భయంకరమైనది. రోగంకన్నా, రోగం వల్ల వచ్చే నష్టం వెంకటాచెలాన్ని క్రుంగదీసింది. మొదటినుంచీ మరొకరి సమస్యల్ని నెత్తిన వేసుకోవడమే కానీ, తను మరొకరికి సమస్య కావడం తెలీని వెంకటాచెలం మరింత నీరు కారిపోయాడు. ఈ మనస్తాపం పార్కిన్సన్స్ రోగాన్ని మరింత ప్రకోపింప జేసింది. దానాదీనా సంవత్సరంలో రావలసిన స్థితి ఆరునెలలకే వచ్చింది.

ఓ రాత్రి జయవాణి మంచం మీద అటు నుంచి ఇటు వత్తిగిల్లేసరికి మంచం ఖాళీగా కనిపించింది. కంగారుపడింది. వెంకటాచెలం పెరట్లో కొబ్బరిచెట్టుకింద మంచం వాల్చుకుని కూర్చున్నాడు. ఆపాదమస్తకం ఆకులాగా వణుకుతున్నాడు. అతి ప్రయత్నం మీద నోటిలోకి సిగరెట్టు వెళ్తోంది. వచ్చి పక్కన కూర్చుంది జయవాణి. కూర్చోడాన్ని గమనించాడు వెంకటాచెలం.

"నేను నీకు అన్యాయం చేశాను జయా" అన్నాడు ఆమెవైపు చూడకుండానే.

"అవును. చాలా అన్యాయం చేశారు" అంది వణికే చేతుల్తో అందుకోలేని ఆయన సిగరెట్టుని తన చేతుల్తో అందుకుంటూ.

ఆశ్చర్యంగా చూశాడు వెంకటాచెలం.

"మొదట మీ అన్యాయం చెప్పండి. తరువాత నా అన్యాయం చెప్తాను" అంది.

"అనవసరంగా నీ జీవితాన్ని పాడుచేశాను. ఈ రోగంతో ఏమీ చెయ్యలేక నీకూ, విక్టోరియాకీ" గొంతు గాద్గదికమయింది.

"ఇంక నా అన్యాయం వినండి. మీ బాధని ముందునుంచే నాకు చెప్పుకోకపోవడం. అందరి బాధల్నీ తన బాధని చేసుకుని, ప్రాణాలర్పించిన దేవుడి మతంలో పుట్టాను నేను. నేను కావాలని కోరుకున్న మనిషికి, నన్ను కావాలని కోరుకున్న మనిషికి చేదోడయి నిలవడం ఏమంత కష్టంకాదు."

పసివాడిని తీసుకున్నట్టు వెంకటాచెలాన్ని ఒళ్ళోకి తీసుకుంది జయవాణి. నోట్లో సిగరెట్టూ ఉంచి మరో గుక్క పొగని పీల్చుకోనిచ్చింది. "మీకు పార్కిన్సన్స్. మీ ఉద్యోగానికి రిటైర్మెంటూ కాగితం టేబులు మీద సిద్ధంగా ఉంది. మీకు రావలసినవన్నీ ఇస్తూ ఉద్యోగం నుంచి విడుదల చెయ్యడానికి మీ డైరెక్టరు రామదాసుగారు హైదరాబాదు నుంచి ఉత్తరం రాశారు. ఆయనతో నేను ఇరవైరోజుల కిందటే మాట్లాడాను"

వెంకటాచెలం ఆశ్చర్యపోయాడు.

"మీరు కాగితం పంపగానే, ఆ పనులన్నీ ఆనందంగా జరిగిపోతాయి. మరో ఎనిమిది రోజుల్లో అంటే రాబోయే ఫస్టు తారీఖు నుంచీ వరహాలశెట్టిగారి ఆసుపత్రిలో నర్సుగా చేరబోతున్నాను" ఏదో వెంకటాచెలం అనబోతే నోరు మూసింది.

"ఆడదానికి ముఖ్యంగా చదువు ఎక్కువ రాని ఆడదానికి భగవంతుడు పుట్టకతోనే పుష్కలంగా నేర్పిన విద్య ఒకటుంది - సేవ. దానికి ట్రైనింగ్ అక్కరలేదు. ఈ మాటలు నేనన్నవి కావు. ఉద్యోగం కావాలని అడిగినప్పుడు వరహాలశెట్టిగారన్నవి."

"మరి విక్టోరియా చదువుకి మన ఆదాయం సరిపోతుందా?" అన్నాడు బలహీనంగా.

"నేను లిటిల్ ఫ్లవర్ స్కూలులో చదవనని ప్రిన్సిపాల్‌తో చెప్పేశానమ్మా" అంటూ వచ్చింది విక్టోరియా. అంతరాత్రిలో మంచంపక్క నేలమీద మోకాళ్ళమీద చేతులు ఆనించుకుకూర్చుంది. ఈసారి వెంకటాచెలం, జయవాణి ఇద్దరూ ఆశ్చర్యపోయారు.

లిటిల్ ఫ్లవర్ నుంచి ఎం.జి.ఎం.కి కూతురు మారిన విషయం వెంకటాచెలానికి తెలీదు. లిటిల్ ఫ్లవర్‌లో మానేస్తున్న విషయం జయవాణికి తెలీదు.

"ఎందుకమ్మా?" అంది జయవాణి.

''నువ్వు ఉద్యోగానికి వెళ్తావు. నాన్న ఇంట్లో ఉండాలి. సేవ చెయ్యడం నీకు దేవుడు నేర్పాడు. ఇంట్లో ఉండి నాన్నకి సేవచెయ్యడం నాకు నువ్వు నేర్పు'' అంది విక్టోరియా.

తల్లిదండ్రులిద్దరూ అమాంతం బిడ్డని పొదివి పట్టుకున్నారు. మంగళసూత్రంతో ఏకమయిన జీవితాల్లో కూడా కనిపించని సాన్నిహిత్యం.. ఆత్మీయత కేవలం ప్రేమాభిమానాలతో ఏర్పడిన అపూర్వమయిన సందర్భం ఇది. అన్యోన్య జీవనానికి మతం, కులం, జాతి ఆటంకం కానక్కర్లేదనడానికి ఈ కుటుంబం తార్కాణం.

వెంకటాచెలం మనస్సులో ఉన్న ఆ ఒక్క సందేహమూ విడిపోయింది. రోగాన్ని అనుభవించడం ఒక బాధ అయితే, దాన్ని అంగీకరించి, ధైర్యం చెప్పే మనుషులు పక్కన నిలబడడం గొప్ప అదృష్టం.

వెంకటాచెలం స్వతహాగా ధైర్యవంతుడు. కష్టంలో కూడా కొత్త ఆశని వెదికే మనస్తత్వం అతనిది. భార్యా, కూతురూ కొండంత ఆసరా ఇచ్చాక ''ఇక నేను పార్కిన్సన్స్‌కి సిద్ధంగా ఉన్నాను'' అనుకున్నాడు. అనుకున్నాక రోగం తీవ్రత తప్పనిసరిగా తగ్గింది.

ఏమయినా, వెంకటాచెలం మరో నెలలో ఉద్యోగ విరమణ చేశాడు. నర్స్ బట్టల్లో జయవాణిని చూసి వెంకటాచెలం, విక్టోరియా కాస్సేపు వేళాకోళం చేశారు. భార్య డ్యూటీకి వెళ్ళడానికి వణికే చేతులతోనే చిన్న కేరేజీ సర్దాడు వెంకటాచెలం.

''ఈ పని మీదికాదు'' అని లాక్కోబోయింది జయవాణి.

''ప్రస్తుతం నువ్వు నాకు భర్త. ఈ డ్యూటీ భార్యలు చెయ్యాలని మా మతం చెప్తోంది'' అని విక్టోరియాకి కన్నుకొట్టాడు.

తండ్రీ కూతుళ్ళిద్దరూ కొత్తవాచీని జయవాణికి తొడిగారు. వీధి చివరి మలుపు తిరిగే వరకూ చెయ్యి చూపించాడు. వెంకటాచెలం చెయ్యి వణుకుతోంది రోగం వల్ల. విక్టోరియా చెయ్యి వణుకుతోంది ఆనందంవల్ల.

జీవితంలో అందరికీ కష్టాలు వస్తాయి. ఇష్టం ఉన్నా, లేకపోయినా వాటిని ఎదుర్కోక తప్పదు. కొందరు కష్టాల్ని భూతద్దంలో చూసి భయపడతారు. కొందరు చూసి భయపెడతారు. కొందరు కష్టాల్ని కూడా ఆనందంగా అలంకరించుకుంటారు. కష్టంలోనే ఆటవిడుపుని వెతుక్కుని దాన్ని తేలిక చేసుకుంటారు.

ఆ క్షణంలో వాళ్ళని ఎవరు చూసినా ''మనకీ పార్కిన్సన్స్ రోగం రాలేదేం?'' అని బాధపడేటంత ఆనందంగా ఉన్నాడు వెంకటాచెలం. అది జయవాణి, విక్టోరియా అనే ఇద్దరు స్త్రీమూర్తుల అవగాహన, ఆదరణ అనే రెండు అపూర్వమయిన గుణాలతో అనారోగ్యం మీద అద్భుతంగా సాధించిన విజయం.

## 19

కృతజ్ఞత, ఆరాధన సెక్స్‌ని వెనుక బెంచీలో కూర్చోబెడుతుంది. భగవంతుడి సమక్షంలో భక్తుడు నిర్వీర్యుడు కావడంలో అర్థం ఇదే. వివాహం కొత్త స్నేహితుడిని పరిచయం చెయ్యడమే కాదు, కొత్త రుచినీ జీవితానికి అందిస్తుంది.

అయితే భార్యని స్నేహితుడిగా మలుచుకోడానికి కొందరికి జీవితకాలం చాలదు. చాలామందికి భార్యని బానిసని చేసుకునే పురుషాధిక్యతని ఈ సమాజం పుష్కలంగా అందించింది. బ్రతకడానికే మొదట్నుంచీ భార్య నవనీతాన్ని స్నేహితురాలు చేసుకోడానికి ఎక్కువ శ్రమ పడనక్కరలేకపోయింది. చాలా తరచుగా కష్టాలు మనల్ని దేవుడి స్ఫురణకి దగ్గర చేస్తాయి. కొందరిని కష్టాలు గట్టిగా అనుసంధిస్తాయి. అలాంటి అదృష్టవంతులు సంజీవి, నవనీతం.

విచిత్రంగా ఏ చదువూ లేని నవనీతం సంజీవి జీవితానికి చుక్కాని అయింది. కొందరు జీవితంలోంచే ఆదర్శాన్ని ఎంచుకుంటారు. పేదరికంలోంచి ఐశ్వర్యాన్ని అందుకున్న అదృష్టవంతుడు తరచుగా ఆ పేదరికంనుంచి పారిపోవాలనుకోడు. మరి కొంతమంది కొందరి పేదలకయినా చేయూతనిస్తారు. సంజీవి దగ్గరకి వచ్చే కేసుల్లో తనలాంటి దురదృష్టవంతుల కేసుల్ని ఎంపిక చేసేది

నవనీతం. జీవితంలో అవనీతి బోలెడంత. అవినీతికి లోనయిన మనుషుల్ని ఎక్కువ ఖర్చులేకుండా కాపాడేవాళ్ళు అతి తక్కువ. కనుక సంజీవికి 'పాపర్ వకీలు' అనే పేరు అచిరకాలంలోనే కుదిరిపోయింది. అందుకు సంజీవి బాధపడలేదు. తనమాట విన్నందుకు నవనీతం పొంగిపోయింది. సర్వనాశనమయిపోయిందనుకున్న బిడ్డ జీవితాన్ని పరిపుష్టం చేసిన అల్లుడికి భగవంతుడికి నైవేద్యం అమర్చినట్టు భక్తిగా వండి వడ్డించేది కైకవశి.

ఎప్పుడూ సంజీవి ఇంటి చుట్టూ మనుషులుండేవారు. వారి దగ్గర డబ్బుండేది కాదు. కానీ మనస్సులనిండా కృతజ్ఞత ఉండేది. సంజీవి, నవనీతం అంటే అపరిమితమయిన భక్తి ఉండేది. కక్షిదారులు వస్తూ దేవుడి దగ్గరకి వెళ్ళినట్టు ఏదో వస్తువు తెచ్చి భక్తిగా సంజీవి టేబులు మీద ఉంచేవారు. ఎలాంటి వస్తువులు? తొక్కుడు లడ్డూ, బరంపురం పేలపు ఉండలు, పాకం చలిమిడి మరికొందరయితే కొబ్బరికాయలూ, పువ్వులూ. ఒక్కొక్కరు ఇత్తడి చెంబుతో పడమటింట్లో కాచిన పాలు, జున్ను తెచ్చేవారు. ఆకలి వేసినవాడేవడూ రెండుసార్లు భోజనం చెయ్యడు. మనిషి బతకడానికి తగుమాత్రం ఆదాయం చాలు. అది పుష్కలంగా ఉంది సంజీవికి. అంతకుమించి చాలామందికి లేని ఆదరాభిమానాలు ఉన్నాయి. అన్నిటికన్నా చేస్తున్న వృత్తి అమితమయిన తృప్తిని కలిగిస్తోంది.

ఆ రోజుల్లోనే మనోవర్తికోసం తాగుబోతు మొగుడిమీద దావా వేసిన ఓ అనాథ భార్య, రెండేళ్ళ గుడ్డి కొడుకు సంజీవి దగ్గరకి వచ్చారు. భర్త రిక్షా లాగేవాడు. వాడి సుఖవ్యాధుల కారణంగా కొడుక్కి కళ్ళు పుట్టుకతోనే పోయాయి. పెళ్ళయిన రెండేళ్ళకే ఇంకా వయస్సులో ఉన్న పెళ్ళాన్ని వదిలేసి, కల్లుపాక నడిపే గున్నమ్మని తగులుకున్నాడు. ఆ కేసుని పట్టుదలగా భర్తచేత పట్టించింది నవనీతం. సీత చాలా అందమయిన పిల్ల. అంతే అందంగా పుట్టిన కొడుకు నారిగాడు. వాడికి రెండో ఏటికే తను పాచిపని చేస్తున్న డబ్బుతో చెవులకి పోగులు కుట్టించింది. భర్త ఎప్పుడయితే ఇంటికి రాకుండా పోయాడో నవనీతానికి తన కథ చెప్పుకుంది. నవనీతం భర్తద్వారా పంచాయితీ పెట్టించింది. గూడెంలో పెద్దలు సభతీర్చి గవరయ్యకి వందా పాతిక రూపాయలు జరిమానా వేశారు. ఆ తర్వాత గవరయ్య ఊళ్ళోంచి పారిపోయాడు. గున్నమ్మే వాడిని దాచిందని చాలామంది చెప్పుకున్నారు. ఇంక వాడిమీద కేసేమిటి? ఎవరు ఎవరిమీద తీర్పు చెప్పాలి? మరో ఆరునెలలకి గవరయ్య కల్లుపాకలోనే దర్శనమిచ్చాడు. ఆ విషయం తెలిసి నవనీతం సీతని వెంటబెట్టుకుని వెళ్ళింది. ఆ చుట్టు పక్కల అందరికీ నవనీతం అంటే గౌరవం ఉంది. ఆమె కాళ్ళమీద పడిపోయాడు గవరయ్య. పెళ్ళాన్ని ఏలుకొంటానన్నాడు. వారం రోజుల్లో వందరూపాయలు తెచ్చి ఇస్తానన్నాడు. సంకురాత్రికి ఇల్లు కుదుర్చుకుని పెళ్ళాన్ని తీసుకెళ్తానన్నాడు.

**కానీ ఆ** అవసరంలేకపోయింది. ఆ రోజుకి సరిగ్గా ఇరవై రెండోరోజున కామెర్లతో హఠాత్తుగా చచ్చిపోయింది సీత. ప్రేమసమాజం వారు శవానికి దహన సంస్కారాలు జరిపించారు. కుర్రాడిని తమ సమాజంలో చేర్చుకుంటామన్నారు. నవనీతం ఆ గుడ్డి కుర్రాడిని చూసి విలవిలలాడిపోయింది.

"నారిగాడిని మనదగ్గరే ఉంచుకుందామండీ" అంది సంజీవితో. సంజీవి ఆశ్చర్యపోయాడు. కాస్సేపు సమాధానం చెప్పలేకపోయాడు. "ఇంతవరకూ నువ్వు నిర్వహించిన పాత్రలన్నీ ఒక యెత్తు. ఈ పాత్ర ఒక ఎత్తు. నారయ్య వెనక భయంకరమైన కథ ఉంది. విషాదం ఉంది. అవన్నీ మరిచిపోయి వాడికి కొత్త జీవితాన్ని ఇవ్వడం చాలా కష్టమయినపని. కాగా, రేపు నువ్వు తల్లివయితే ఆ కుర్రాడు నిన్ను నష్టపోయే ప్రమాదం ఉంది" అన్నాడు.

అయితే నవనీతం అందరిలాంటి మనిషి కాదు. అందరిలాంటి జీవితం గడిపిన వ్యక్తి కాదు. తండ్రి ఎవరో తెలిసినా దూరంగా తల్లి నీడలో పెరిగిన వ్యక్తి. భర్తకాని వ్యక్తి సాంగత్యంలో పుట్టిన మనిషి. చిన్నతనంనుంచీ తన జీవితంలో అవిటితనం ఉంది. ఆ అవిటితనాన్ని స్పష్టంగా గుర్తుపట్టింది నవనీతం. అలాంటి మరొక జీవితాన్ని సాకడం తనకేం కష్టం కాదు. తన కోరికని రెట్టించింది

నవనీతం. సంజీవికి నవనీతం మీదకన్నా ఆమె పట్టుదల మీదా, స్థైర్యం మీదా మక్కువ ఎక్కువ. అందుకని ఆమెని వారించలేదు. ఆ విధంగా నారిగడు 'నారాయణ' అయి కొత్త ఇంట్లో తప్పటడుగులు వెయ్యడం మొదలెట్టాడు. ఆ కుటుంబం విచిత్రమయిన వ్యక్తుల సముదాయం. ఎక్కడో వారాలు చేసుకుని బతికిన అనాథ ఒకరు. హత్యానేరం కింద శిక్షని అనుభవించిన ఇల్లాలు, మనస్సు విప్పి చెప్పుకోవడం చాతకాని మూగ తల్లి, ఎందుకు చేతులు మారాడో తెలియని వయస్సులో కొత్త ఇంటికి వచ్చిన రెండేళ్ళ గుడ్డిబిడ్డ.

జీవితంలో ఒక్క మలుపు విచిత్రంగా తిరగాలేకానీ, ఆ పైన జరిగేదంతా విచిత్రంగానే ఉంటుంది.

చెంగల్రావుపేట పంజాకి అయిదు రోడ్లు కలుస్తాయి. పడమటి రోడ్డువైపు నాలుగు అడుగులు వెయ్యగానే రోడ్డుమీద ఎలక్ట్రిక్ స్థంభాలకి కట్టి నాలుగయిదు గేదెలు కనిపిస్తాయి. పోలా పైడితల్లి నాయుడు పాడి అంతా రోడ్డుమీదే విస్తరించి ఉంటుంది. ఆ రోజుల్లో సైకిళ్ళు. కార్లూ ఇప్పుడున్నన్ని లేవు కనక ఎవరూ నాయుడికి అభ్యంతరం చెప్పలేదు. పైడితల్లి నాయుడు శాపవశాత్తూ భూలోకంలో పడిన గంధర్వుడులాంటివాడు. ఉదయం నాలుగు గంటలకే లేచి ఓ గోచీ, తువాలూ కట్టుకుని అన్ని గేదెల్ని గడ్డితో పామి కడుగుతాడు. ఆ పనిలో అతనికి భార్య, పిల్లలూ చెయ్యికలుపుతారు. ఉదయం అయిదుగంటలనుంచీ అరుగులనిండా గిన్నెలు పట్టుకుని కూర్చున్న చిన్నా, పెద్దా అంతా మూగుతారు.

అందరికీ పాలు పితికి పంచుతాడు నాయుడు. నిజాయితీగా పాలల్లో నీళ్ళు కలుపుతాడు. నీళ్ళు కలిపిన విషయం వాళ్ళకి చెప్తాడు. నీళ్ళు కలపని పాలకి ఖరీదు ఎక్కువ నిర్ణయిస్తాడు. ఏడున్నరకి దూడల్ని వదిలేస్తాడు. పదిగంటలకి శుభ్రంగా స్నానం చేసి ఖద్దరు పంచె కట్టి కమ్మని నాటుచుట్ట వెలిగించి ఇంటి అరుగుమీద కొలువు తీరుస్తాడు. నాయుడు పద్దెనిమిది ఏళ్ళు పాకలో ఉండి ఈ మధ్యనే పెంకుటిల్లు వేశాడు. అతనికి ముగ్గురు కూతుళ్ళూ, కొడుకూ. ఆలోచనలో కూడా చదువు జోలికి పోడు. సాయంకాలం బంగారం రంగు సిల్కుచొక్కా తొడిగి, కునేగా సెంటు రాసి చేతికి బంగారం గొలుసు తగిలించి ర్యాలీ సైకిలు మీద షికారుకి వెళ్తాడు. చీకటి పడ్డాక బిస్కట్ బ్రాందీ అరసీసా తాగుతాడు. ఏ రోజూ కనక మహాలక్ష్మి అమ్మవారిని దర్శనం చేసుకోందే నిద్రపోడు. ఏమాటా 'నీయమ్మ' అనకుండా మాట్లాడడు. అతను ఆ మధ్యనే కాంగ్రెసులో చేరాడు. వచ్చే పంచాయితీ ఎన్నికలలో నిలబడతాడని నలుగురూ చెప్పుకుంటున్నారు. అతని పెదకూతురు గౌడు గేదలాగా ఉంటుంది. పాలు పితకడానికి గేదెముందు పొదుగుపట్టుకుని కూర్చుంటే గేదెతో పోటీ పడుతున్నట్టుంటుంది. దాన్ని పాడేరులో ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా చేస్తున్న సుబుద్ధి పట్నాయక్‌కి ఇచ్చి పెళ్ళి చేశాడు. సుబుద్ధి దుర్బుద్ధి కలవాడు. మామగారి ఆస్తిపాస్తులూ, అంతస్థులూ తెలిసి ఎన్నడూ పాడేరులో కాపరం పెట్టలేదు. శని, ఆదివారాల్లో పెళ్ళాంతో కాపురం చేసి పాడేరు వెళ్తూంటాడు. ఎన్నడూ విశాఖపట్నం బదిలీకి ప్రయత్నం చెయ్యలేదు. అల్లుడికి అనువుగా ఉంటుందని ఆ రోజుల్లో తెన్నేటి విశ్వనాథంగారి చేత ఓ మాట చెప్పించుకుని ఇంట్లో ఫోన్ పెట్టించాడు. కొచ్చిన్ కేఫ్‌కి ఎదురుగా విశ్వనాథంగారి ఇల్లు. ఉదయాన్నే ఏడుగంటలకి నురుగులు కక్కే పాలు పితికి సిల్వర్ చెంబుతో పైడితల్లి నిలబడేవాడు. విశ్వనాథం బాబు ఎప్పుడు ఎదురుపడినా పాదాలకి వంగి నమస్కారం చేసేవాడు. ఎవరి వృత్తులు వాళ్ళు నిర్వహించడంలో కమిట్‌మెంట్, భక్తీ పోని రోజులవి.

పైడితల్లినాయుడు గురించి ఇంత చెప్పడానికి కారణం ఉంది. ఆ చుట్టుపక్కల ఫోన్ ఉన్న ఇల్లు నాయుడు ఒక్కడిదే. పొద్దుటే పేడకడి తీసే నాయుడుకీ, ఇంట్లో ఫోన్‌కీ పొంతనలేదు. అయినా రెండు కొసల్నీ ఒడిసి పట్టుకున్నాడు నాయుడు. ఆధునిక జీవనానికి అర్రులు చాచినా జన్మతః వచ్చిన వృత్తిని చిన్నచూపు చూడలేదు. ఈ రోజుల్లో అభివృద్ధిని సాధిస్తున్నామని నేలవిడిచి సాముచేస్తున్న చాలామందికి ఆ రోజునే కనువిప్పు పోలా పైడి తల్లి నాయుడు.

నాయుడి పరపతి డిట్రాయిట్‌లో తిరుమలదాకా పాకింది. కారణం ద్వారంవారి ఇంటి దగ్గర్నుంచి వాసావారి ఇంటిదాకా ఆ పది వీధుల్లో ఫోన్ ఉన్న ఇల్లు నాయుడు ఒక్కడిదే ఆ రోజుల్లో ఫోన్ అవసరం పెద్దగా ఎవరికీ లేదు. పాడేరులో అల్లుడు లేకపోతే నాయుడికీ లేదు. ఏమయినా నాయుడి ఇంటికి దగ్గర్లోనే సుభద్రాచార్యులవారున్నారు. ఆయన గొప్పవాడని నాయుడు విన్నాడు. జగన్నాథస్వామి కోవెలలో ఆయన ప్రవచనానికి ఓసారి ఎవరో చెప్తే వెళ్ళాడు. ఒక్కమాట నాయుడు బుర్రలోకి వెళ్ళలేదు. కాగా, గుడిస్తంభానికి ఆనుకుని నిద్రపోయాడు. అంత సుఖంగా ఎప్పుడూ నిద్రపట్టలేదు. విపరీతంగా గుర్రు పెడుతున్న అతన్ని మరో భక్తుడు మోచేతితో పొడిచి లేపాడు. వెంటనే గుడిలోంచి వచ్చేశాడు. ఒక్కటి మాత్రం అర్థమయింది నాయుడికి. సుభద్రాచార్యులు మహానుభావుడని.

మనకి చేతకానివీ, అర్థంకానివీ మన స్థాయికి దిగని కారణాన చిన్నచూపు చూసేతరం వరకు పెరగలేదు నాయుడు. ఆ తర్వాత ఆచార్యులువారు ఎప్పుడు తారసపడినా దారిపక్కకి తొలిగి నమస్కారం చేసేవాడు. ఒకటి రెండుసార్లు జున్నుపాలు, అల్లుడు పాడేరునుంచి తెచ్చిన తేనె ఆచార్యులవారింటికి వెళ్ళి సమర్పించుకున్నాడు.

ఓ రోజు ఉదయమే రెండు దానిమ్మపళ్ళు పట్టుకుని సుభద్రాచార్యులవారింటికి వచ్చాడు పైడి తల్లినాయుడు. ఆచార్యులవారికి గుమ్మంలోంచే నమస్కారం చేశాడు. "మరో అరగంటలో అబ్బాయిగారి దగ్గర్నుంచి ఫోన్ వస్తుంది బాబూ. తమర్ని ఫోన్ దగ్గర ఉండమన్నారు చినబాబుగారు. అమెరికానుంచి ఫోనొచ్చింది" అన్నాడు.

ఫోన్‌లో మాట్లాడడం బొత్తిగా అలవాటులేదు ఆచార్యులవారికి. పైగా, ఈ నాయుడింటికి వెళ్ళడం. మనస్సు వెనకాడింది. అది గ్రహించాడు నాయుడు. "చినబాబుగారు తమతో మాట్లాడాలని ఇదయిపోతున్నారు. నా ఇంటి వసారాలో ఫోనెట్టాను. ఆలోచించకండి బాబూ! తమరు గుడికెళ్ళినట్టే అనుకోండి" అన్నాడు.

అబ్బాయితో మాట్లాడి రమ్మని వరదమ్మ ప్రోత్సహించింది. వెళ్ళడానికి ఒప్పుకున్నారు సుభద్రాచార్యులవారు. ఎగిరి గెంతేసి మాయమయిపోయాడు పైడితల్లినాయుడు.

అరగంట తర్వాత పైడి తల్లినాయుడు ఇంటికి వచ్చారు సుభద్రాచార్యులవారు. ఇంటి ముంగిట్లో అడుగుపెట్టగానే నిర్ఘాంతపోయారు. ఇంటిల్లిపాదీ కొత్తబట్టలు కట్టుకుని తనకోసం ఎదురు చూస్తున్నారు. నాయుడు భార్య శాయిలమ్మ అయితే పట్టుచీరె కట్టుకుని గుడికి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపించింది. ఆ వసారా అంతా శుచిగా ఉంచారు. బల్లమీద ఫోన్ కునేగా సెంటుతో అమర్చింది నాయుడి మూడో కూతురు. నాయుడు ఖద్దరు లుంగికి పట్టు ఉత్తరీయం అరవ ఫక్కీలో నడుంకి బిగించి ఆచార్యులవారికి ఆహ్వానం పలికాడు.

మిరియాల పొడి వేసిన వేడి పాలు వెండి పళ్ళెంలో తీసుకొచ్చి నిలబడింది శాయిలమ్మ. ఆచార్యులవారు నవ్వారు. "ఇప్పుడేం తీసుకోను" అన్నారు.

మరో పావుగంటకి ఫోన్ మోగింది అమెరికా ఫోన్ ఆగి ఆగి మాట్లాడాలి. ఆ రోజుల్లో ఇప్పుడున్నంత శాటిలైట్ నెట్‌వర్క్ లేదు. చాలా మజిలీలు దాటి రావాలి గొంతు.

టెలిఫోన్ వైర్లలో లీలగా మాత్రమే తెలుస్తున్న తండ్రి గొంతు వినగానే ఆనందంతో కళ్ళనీళ్ళు తిరిగాయి తిరుమలకి. "చిన్నా" అని పిలుస్తున్నప్పుడు ఆచార్యులవారి ఆర్తి టెలిఫోన్ అవసరంలేకుండానే అమెరికా వరకూ ప్రయాణం చేస్తున్నట్టనిపించింది. ఆయన గొంతు గాద్గదికమయింది.

ఆయన ఎక్కువ ప్రశ్నలు వెయ్యలేదు. "రోజూ రెండు పూటలా ద్వయమంత్రం పఠిస్తున్నావా?" అనడిగారు.

తండ్రిని బాధపెట్టకుండా ఉండాలని బరువుగా అబద్దం చెప్పాడు తిరుమల. దాదాపు ఇరవై నిమిషాలు మాట్లాడాడు. అనర్గళంగా అమెరికా కబుర్లన్నీ చెప్పాడు., అమ్మ క్షేమసమాచారాలడిగాడు. వెంకటాచెలం ఆరోగ్యం గురించీ, సంజీవి ప్రాక్టీసు గురించి అడిగాడు. తిరుమల మనస్సులో 24 ఏళ్ళు పెరిగిన ఇండియా జ్ఞాపకాలు ఒక్కొక్కటే దూసుకు వచ్చాయి. సుభద్రాచార్యులగారికి మాత్రం అమెరికా గురించి ఒక్కటే తెలుసు. అక్కడ తన కొడుకు ఉన్నాడని.

తనకి కూతురు పుట్టిందని చెప్పాడు తిరుమల ఆనందంగా. "మీ మామగారున్నారు. జాతకం చూసి చక్కని పేరు నిర్ణయించి బారసాల జరిపించు" అన్నారు సుభద్రాచార్యులవారు.

తిరుమల నవ్వుకున్నాడు. అమెరికాలో పుట్టిన బిడ్డ కారణంగానే అమెరికా పౌరసత్వం వస్తుంది. అందువల్ల ఆసుపత్రి వదిలేలోగానే ఆ బిడ్డపేరు నమోదు కావాలి పాడ్‌ని ఆసుపత్రి నుంచి పంపేస్తున్న మూడోరోజునే బిడ్డ పేరేమిటని ఆసుపత్రి ఉద్యోగులు అడిగారు. తిరుమలకి వెంటనే తల్లిపేరు, నాయనమ్మ పేరు జ్ఞాపకం వచ్చాయి. ఆలోచించే లోగానే పాడ్ నాన్సీ అని చెప్పేసింది.

"అదేమిటి?" అన్నాడు తిరుమల ఆశ్చర్యంగా.

"అది మా ఆఫీసులో నా కొలీగ్ పేరు. ఆవిడంటే నాకు చాలా ఇష్టం. ఈజిట్ నాట్ లవ్లీ?" అంది పాడ్

ఆ పేరు విషయం తండ్రికి చెప్పలేదు.

ఇరవై నిముషాల తర్వాత తృప్తిగా ఫోన్ పెట్టేశారు.

ఆ ఆనందంలో మిరియాల పాలు గటగటా తాగారు. ఇంటికి వచ్చి రోజంతా వరదమ్మకి టెలిఫోన్ సమాచారం తిప్పి తిప్పి చెప్పారు.

ఇది కేవల ప్రారంభం. అటు తర్వాత ముప్పై సంవత్సరాలు. కేవలం ముప్పై సంవత్సరాలు. ప్రతి పదిహేనురోజులకీ కొడుకుతో మాట్లాడుతూనే ఉన్నారు సుభద్రాచార్యులు. తండ్రితో కొడుకు లంకె నెలకి రెండు టెలిఫోన్ కాల్స్. బోలెడన్ని డాలర్లు. ఆచార్యులవారికి అవసరంలేని డాలర్లు.

కొడుకంటే ఎవరు? జీవితాంతం ప్రతి పదిహేను రోజులకీ భూగోళానికి అటువైపు నుంచి ఆత్రంగా వినిపించే ఓ గొంతు.

## 20

గుమ్మంలో సుభద్రాచార్యులవారిని, వరదమ్మని చూసి ఆశ్చర్యపోయాడు వెంకటాచెలం. ఆది దంపతుల్లాగా దర్శనమిచ్చిన వారిద్దరినీ చూసిన దగ్గర్నుంచీ తన వణుకు మరింత ఉధృతమయి పోయింది.

సుభద్రాచార్యులవారిలో ఆవేదన ఎన్నడు ముఖంలో ప్రతిబింబించదు. అలాంటిది వణికిపోతున్న వెంకటాచెలాన్ని పొదివిపట్టుకున్నారు. అలాగే లోపలికి నడిపించి మంచమ్మీద కూర్చోపెట్టారు. జయవాణి డ్యూటీకి వెళ్ళింది. విక్టోరియా కూడా ఇంట్లో లేదు. వెంకటాచెలం ఒంటరిగానే ఉన్నాడు.

"నీ ఆరోగ్యం బాగోలేదని తిరుమల చెప్పాడు. ఒక్కమాట మాత్రమయినా చెప్పకూడదా?" అన్నారు ఆచార్యులవారు.

"అందరి కష్టాలూ నెత్తిన వేసుకోవడం అలవాటు. నా కష్టాన్ని ఎవరికీ పంచకూడదని ఇంట్లో కూర్చున్నాను. తప్పనిసరిగా నెత్తిన వేసుకున్న వాళ్ళిద్దరున్నారు - జయ, విక్కూ, ఇద్దరూ ఇంట్లో లేరు" అన్నాడు వెంకటాచెలం.

"అబ్బాయి నీ గురించి  ఎప్పుడూ అడుగుతాడు. నిజానికి వాడే నన్ను గుచ్చిగుచ్చి అడిగాడు. ఊళ్ళో ఉన్న నీ గురించి అమెరికాలో ఉన్న అబ్బాయి చెప్తే కానీ తెలియదు" అన్నారు.

"కుర్రవాడిని పట్టుదలగా చదివించి మిమ్మల్ని ఒంటరిని చేసిన పాపమేమో?" అన్నాడు వెంకటాచెలం.

నవ్వారు ఆచార్యులవారు.

"పదోయేటే నందవ్రజం, రేపల్లె వదిలి వెళ్ళిపోయారు శ్రీకృష్ణస్వామి. తమని మరిచిపోయాడని అక్రూరుడి ముందు గోపికలు కినుక వహించారు. కానీ వెళ్ళకపోతే ఎలా? అవతార ధర్మమంతా అటువైపు ఉంది. వాడి జీవితం వాడిది" వరదమ్మ కళ్ళు తుడుచుకుంది.

పురాణాల అవగాహన ఊహించలేనంత బలాన్ని ఈ ఇద్దరి మనస్సులకీ ఇచ్చింది. వాటి పరమార్థం అదేనేమో.

"నేను నీకు ఎలాంటి ఉపకారమూ చెయ్యలేను. అన్నిటా పేదవాడిని. ఒక్కపని చేస్తాను" అని లేచారు సుభద్రాచార్యులవారు. అదేమిటో అర్థం కాలేదు వెంకటాచెలానికి.

"రేపు నీకు వంట చేసి పెట్టొద్దని మీ ఆవిడకి చెప్పు" అని లేచింది వరదమ్మ. ఈ దంపతులిద్దరూ మనస్సులో ఏదో కూడబలుక్కునే వచ్చారని వెంకటాచెలానికి అర్థమయిపోయింది. ఏమిటది?

మరునాడు ఉదయం ఆరుగంటలకే సుభద్రాచార్యులవారూ, వరదమ్మా వెంకటాచెలం ఇంటికి వచ్చారు. ఆచార్యులవారు వంగపండురంగు పంచె, ఉత్తరీయం. ఊర్ధ్వపుండ్రాలతో సాక్షాత్తూ విష్ణుమూర్తిలాగా వెలిగిపోతున్నారు బంగారం రంగు చీర పింజెపోసి కట్టి, ఎర్రటి చూర్ణాన్ని నుదిటిన ధరించి సాక్షాత్తూ గోదాదేవి గుమ్మంలో అవతరించినట్టు నిలబడింది వరదమ్మ. ఇద్దరూ రెండు సంచులతో వచ్చారు. సంచిలోంచి చిన్న కిరసనాయిలు స్టౌ గిన్నెలూ వరండాలో పెట్టుకున్నారు.

ఆచార్యులవారు వ్యాసపీఠాన్ని పెట్టుకుని దానిమీద రామాయణం గ్రంథాన్ని ఉంచారు.

"మంచీ చెడూ మనకి కర్మపరిపాకాలే. దేవుడూ తప్పించలేడు. అవన్నీ సంచితాలు కానీ ఉపశమనం కలిగించేటట్టుగా ఆశీర్వదిస్తాడు. ఇవ్వాల్టినుంచీ ఓ మండలంపాటు నీ ముందు 'సుందరకాండ' పారయణం చేస్తాను - కాదు చెప్తాను. నీ మనస్సు తేలికవుతుంది. రుగ్మత బరువు దిగిపోతుంది" అన్నారు.

కుర్చీలో కూర్చున్న వెంకటాచెలం అమాంతం నేలనపడి ఆచార్యులవారికి సాష్టాంగ పడిపోయాడు.

"ఈ నలభై రోజులూ నా చేత్తో ఇంత అన్నం తినిపిస్తానయ్యా" అంది వరదమ్మ.

ఉపకారం గొంతు పెద్దది. ఖంగుమనే గొంతుతో "కూజంతం రామరామేతి" అంటూ ఎత్తుకున్నారు ఆచార్యులవారు. ఎప్పుడొచ్చారో జయవాణి, విక్టోరియా వీధిగుమ్మం మెట్ల దగ్గరే కూర్చుండిపోయారు. రామభక్తుడు - మారుతి స్వామి అనుగ్రహంతో లంకకు లంఘించాడు. ఆనాటి శ్రవణం పూర్తయ్యేసరికి అరిటాకులో ఘుమఘుమలాడుతూ పచ్చకర్పూరం, జీడిపప్పు, బాదం కిస్మిస్ వేసి చేసిన చక్రపొంగలి వడ్డించింది. పదకొండు గంటలకి దంపతులిద్దరూ మాయమయిపోయారు.

వెంకటాచెలం, జయవాణి, విక్టోరియా నోటమాట రాకుండా ఉండిపోయారు. శ్రీరంగం నుంచి రంగనాథుడు సాక్షాత్తూ దేవేరితో వేంచేసి ఇంటిముందు ప్రత్యక్షమయిన అనుభూతి పొందారు.

కృతజ్ఞత, విశ్వాసం ఈ రెండింటి రూపమే హనుమ. వర్ణసంకరమయిం శ్రీవైష్ణవుడి ఇంట్లో పరమ నిష్ఠాగరిష్ఠులయిన సుభద్రాచార్యులవారి సుందరకాండ పారాయణకీ అర్థం అదే వరదమ్మ నైమిత్తిక కర్మలో మునిగి తేలిన సహధర్మచారిణి.

అలా ప్రతిరోజూ 40రోజులపాటు సుందరకాండ పారాయణ ఆ ఇంట్లో జరిగింది. ప్రతిరోజూ ప్రసాదాన్ని స్వయంగా వండి వడ్డించింది వరదమ్మ.

"ఎందుకమ్మా మీకీ శ్రమ?" అంది జయవాణి.

"నా బిడ్డని ఆకాశంలో నిలబెట్టాడు మీ ఆయన. ఇక్కడ వండి వడ్డించిన ప్రసాదం పితృదేవతలు ఆరగించడంలేదూ? ఇక్కడనుంచే నా కొడుక్కి ఆరగింపు చేస్తున్నాను" అంది వరదమ్మ. కదిపితే చాలు పురాణం, పారలౌకిక ప్రసక్తి, బిడ్డ స్ఫురణ. ఆమెని చూసి ఎందుకనో బయపడ్డాడు వెంకటాచెలం. ఆచార్యులవారి సుందరకాండ పారాయణంలో ప్రశాంతత ఉంది. ఆమె కార్యరూపంలో చెప్పరాని ఆవేదన ఉంది. దూరమయినదానికి సిద్ధపడుతున్నారు ఆచార్యులవారు. దూరమయినదానికి దగ్గర కావడానికి అన్నిరకాలయిన మార్గాలనూ వెదుకుతోంది ఆమె అంతరంగం. ఆయనది విముక్తి. ఆమెది విరక్తి. హనుమ లంకకు లంఘించడం, అమ్మవారికై అన్వేషణ, అశోకవన ప్రవేశం, సీత సందర్శనం, మహాకాయ సందర్శనం, ముద్రికను అమ్మకి సమర్పించడం, లంకాదహనం అన్నీ సవిస్తరంగా ఆచార్యులవారు చదివి వివరిస్తుంటే తన్మయుడయి విన్నాడు వెంకటాచెలం. ఈ రోగం వల్ల ప్రత్యేకంగా తనకు దక్కిన అదృష్టం ఆచార్యులవారు తన ఒక్కరికే సుందరకాండ ప్రవచించడం.

సుందరకాండ వైశిష్ట్యాన్ని వివరిస్తూ "రామాయణాన్ని తొలుత గానం చేసిన పుణ్యాత్ముడు హనుమ. రామాయణాన్ని మొదటిసారిగా విన్న శ్రోత సీత. తను రాక్షసుడు కాదని అమ్మవారికి నమ్మకం కలిగించడానికి అశోకవనంలో చెట్టుమీద ఉండి అమ్మకు వినిపించేలాగా గానం చేశాడు. కనుకనే సుందరకాండకి అంత ప్రత్యేకత. ఈ కాండ మంత్రబద్ధం. పరమ పవిత్రం" అంటూ ముగించారు.

పార్కిన్సన్స్ రోగానికీ, మనస్సుకీ సంబంధం ఉంది. ఈ నలభైరోజులూ ఆ రోగాన్ని మరిచిపోయాడు వెంకటాచెలం. కాగా, రోగం తీవ్రత ఏ కాస్తో తగ్గినట్టనిపించింది. నలభై రోజులూ స్వామి కైంకర్యాన్ని వండి వడ్డించింది వరదమ్మ. ఆఖరి రోజున ఇద్దరికీ కొత్త బట్టలు పెట్టి సాష్టాంగ పడిపోయాడు. కాస్త దూరంగా అదే పని చేశారు జయవాణి, విక్టోరియా.

"నీ వంటివాడికి ఈ పారాయణం కుచేలుడి అటుకులు. నీకు భగవంతుడు మేలు చేస్తాడు" అంటూ స్టౌ, గిన్నెలు, వ్యాసపీఠం, రామాయణ గ్రంథం అన్నీ పుచ్చుకుని నిష్క్రమించారు ఆచార్యులవారు. వెంకటాచెలం జీవితంలో అది మధురాతి మధురమయిన ఘట్టం.

కోరుకొండ సైనిక స్కూలులో కమ్మెచ్చులాగ సాగిన భూపతిరాజు మైనారిటీ తీరిన మూడో ఏటికే భీమునిపట్నం అసెంబ్లీ నియోజకవర్గానికి ఎన్నికయ్యాడు. ఆనాటి ఆంధ్రరాష్ట్ర అసెంబ్లీలో అందర్లోకీ కుర్రాడు భూపతిరాజు.

పదవిలోకి వచ్చిన నాయకుడి చుట్టూ పరివారం అలవోకగా సిద్ధమవుతుంది. భూపతిరాజు సరసన చేరిన మొదటి వ్యక్తి కత్తి గవర్రాజు. మీసాలకు నిజంగానే సంపెంగ నూనె రాసి, నల్ల బనీను మీద మల్లుచొక్కా వేసి, చిన్న లాఠీ ధరించి రాజుగారిని తలదన్నే ఫక్కీలో సిద్ధమయ్యాడు గవర్రాజు. నీలాపు బుడ్డడు, సవర తవిటినాయుడు పాలకొండ నుంచి వచ్చారు. టెక్కలి సోంబుడు, రణస్థలం దొరియా వీరంతా భూపతిరాజు పరివారం.

వ్యక్తిచేస్తే ఆరాచకం అనిపించుకున్న చాలా విషయాలు, నాయకుడు చేస్తే అలవాటుగా చెలామణీ అయిపోతాయి. కోరుకొండ చదువు భూపతిరాజుకి క్రమశిక్షణ నేర్పింది. తన వ్యక్తిత్వానికి ఒక బాణీని ఏర్పరిచింది. ఇప్పుడు ఎమ్మెల్యే రాజుగారు రాధారీ బంగళాలో తన పరివారంతో విస్కీ సేవిస్తారు. ఎవరో లేడిమాంసం వండించి రాజుగారికి నివేదిస్తారు. అప్పుడప్పుడూ రాధారీ బంగళా వెనుకనున్న మామిడితోపులోంచి రెండోఝాముకు రాజాం నుంచి లక్కాయి అనే సవరగుంట వస్తుంది. అది రాజుగారికి ఆషక్కు. రెండు

ముక్కుపుటాలకీ వెండిపోగులతో, చెవులకి నాలుగయిదు పగడాల రింగులతో మిసమిసలాడే శరీరంతో సవరలపిల్ల లక్కాయి. ముఖం ఆరేళ్ళ పిల్లని భూతద్దంలో చూస్తున్నట్టుంటుంది. శరీరం పాతికేళ్ళ యవ్వనాన్ని చిన్న స్థలంలో కుదించినట్లుంటుంది.

రాత్రి వేళల్లో ఎమ్మెల్యేగారి వ్యవహారాలన్నీ వారి లీలలు, వారి పరివారం భద్రంగా కాపాడి, పోషించే చీకటి గది రహస్యాలు.

ఈ ఒక్క విషయాన్నీ మరిచిపోతే, ఎమ్మెల్యే పదవికి వచ్చినప్పట్నుంచీ ఈ చుట్టుపక్కల ఏ నాయకుడూ చెయ్యలేనంత అభివృద్ధిని భూపతిరాజు సాధించాడు. పనిదొంగని గదమాయించడం రాజుకి తెలీదు. పదిమంది మధ్య చొక్కాపట్టుకుని కుళ్ళబొడవడమే తెలుసు. కాగితలమీద వ్యవహారాలు కదలడం భూపతిరాజుకి వొళ్ళుమంట. ఏ పనయినా నిలబడి చేయించేవాడు. ఆయన పదివిలోకి వచ్చాక మొదటిసారిగా రేవిడి, మజ్జివలస, పాండ్రంగి పద్మనాభం కలుపుతూ బి.టి రోడ్డు పడింది. తగరపు వలస దగ్గర ఆగని బస్సులేదు. వ్యవసాయానికి, వ్యాపారానికి భీమిలిని కూడలి చేశాడు. అచిరకాలంలో రాజుగారి గురించి ఆ ప్రాంతమంతా కథలుగా చెప్పుకున్నారు.

స్వభావంలో చిలిపితనం, పెంకితనం ఆరోగ్యకరమయిన ప్రయోజనాలకు ముడిపడితే సత్ఫలితాలనిస్తాయి. సన్మార్గంలో నడిచే సాత్వికుడు సాధించలేని పని అడ్డదారిన నడిచే మనిషి సాధించగలడు. రాబర్ట్ క్లైవు చిన్నతనంలో పెద్ద రౌడి అని చెప్పుకుంటారు. కొడుకుని చూసి బుల్లిరాజుగారు, బుచ్చియ్యమ్మగారె ఆశ్చర్యపోయారు. లక్కాయి విషయం ఆయన చెవులదకా రాకపోలేదు. అంతకుమించి రాజుగారు చేస్తున్న మంచిపనులు పదిమంది చెప్పుకోగా విన్నారు.

ఇంక ఆలస్యం చేయకుండా రాజుగారికి పెళ్ళిచేసెయ్యాలనుకుని, ప్రస్తుతం శృంగవరపు కోటలో పనిచేస్తున్న రెవిన్యూ ఆఫీసరు వడ్లమాని కామేశ్వరరావుకి కబురుపెట్టారు. సమస్యలకి అడ్డదారి పరిష్కారాన్ని సూచించే సమర్థుడు కామేశ్వరరావు. భూపతిరాజు జీవితాన్ని పరోక్షంగా ఓ మలుపు తిప్పిందీ ఆయనే. అందుకనే అతని జీవితానికి మరో మలుపు అవసరమయినప్పుడు బుల్లిరాజుగారికి కామేశ్వరరావు గుర్తొచ్చాడు.

**ఏవిఎన్** కాలేజీ గేటు దాటేసరికి ఉధృతంగా వర్షం ఎత్తుకుంది. ఎటు పరుగెత్తాలన్నా తలదాచుకునే నీడలేదు. ఏడుపొచ్చినంత పనయింది ఆండాళ్ళుకి. అంతకుమించి పొడిగా ఉన్నప్పుడు గంభీరంగా, గౌరవంగా కనిపించిన సిల్కు చుడీదార్, చున్నీ వర్షానికి తడిసి శరీరానికి అంటుకుపోయాయి. ఆండాళ్ళుకి కళ్ళనీళ్ళు తిరిగాయి. ఏం చెయ్యాలో పాలుపోక వర్షంలో శిలావిగ్రహంలాగా నిలబడిపోయింది. చేతిలోని పుస్తకాలు తడిసి, చిరిగి జారిపోయాయి.

అప్పటికి మసకమసకగా చీకటి ఆవరిస్తోంది. పక్కనే పరుగులు తీస్తున్న మనుషుల దృష్టి అదృష్టవశాత్తూ వర్షం మీద ఉండి, వర్షంలో తడుస్తున్న అమ్మాయి మీద లేదు. ఎదురుగ్గా పులి కనిపిస్తే హఠాత్తుగా పరుగెత్తాలన్న ఆలోచనా రాదు, స్పృహ ఉండదు. రిఫ్లెక్స్‌లు పనిచెయ్యని సందర్భమది.

ఉన్నట్టుండి తన భుజం మీద వెచ్చటి తెల్లకోటు పడింది. ఎలా పడిందో, ఎవరు వేశారో చూడకుండా కోటుని ఒంటికి లాక్కుంది. శరీరానికి వేడి, మనస్సుకి ధైర్యం క్రమంగా ఆక్రమించుకున్నాయి. తన నెత్తిన గొడుగు పట్టాడా వ్యక్తి. కళ్ళమీంచి ధారలు కారుతున్న నీటిని తుడుచుకుంది. ఆ వ్యక్తి కూడా కళ్ళమీదకి జారుతున్న జుత్తుపాయని సరిచేశాడు. చేతిలో తడిసి ముద్దయిన పుస్తకాల్ని అందుకున్నాడు.

పసితనంలో తన ఒడిలోకి తీసుకుంటున్న తల్లి లాలన గుర్తొచ్చింది ఆండాళ్ళుకి. రోడ్డుకి మధ్యలో ఆ మసక వెలుగులో దక్కిన ఆదరణ నీటిలో కొట్టుకుపోతున్న మనిషికి కొయ్యదుంగ దొరికినట్టనిపించింది అతని భుజాన్ని బలంగా పట్టుకుంది. నిలిచిపోయిన అడుగులు కదిలాయి.

అతని ముఖం చూడగానే "థాంక్స్" అంది. అతనెవరూ? సముద్రంలో మునిగిపోతున్న వ్యక్తికి చెయ్యి అందించిన మనిషిని ఆ ప్రశ్న ఎవరూ అడగరు. నిజానికి ఆ ప్రశ్న మనస్సులోనే నిలవదు. శరీరం తడిచిన చోట ఇంకా బయటకి కనిపిస్తున్నట్టుంది. "కోటు బటన్స్ పెట్టుకోండి" అన్నాడతను.

అప్పుడతన్ని చూసింది. చూసి గుర్తుపట్టింది. అతను కూర్మయ్య. గుర్తుపడుతూనే అతని భుజాన్ని వదిలేసింది. వదిలేస్తూనే ఆమె శరీరానికి వర్షపు జల్లు ఫెడీల్మని కొట్టింది. గావుకేక పెట్టింది ఆండాళ్ళు. ఆమెని గువ్వపిట్టలాగా దగ్గరకి తీసుకుని గొడుగుపట్టాడు కూర్మయ్య.

"ఛీ!ఛీ" అంటూ అతని చేతుల్ని విడిపించుకుని పరుగుతీసింది ఆండాళ్ళు వర్షంలోనే. ఇప్పుడు వర్షం తెలియలేదు, శరీరం తడుస్తున్న విషయం తెలియలేదు. పరిసరాలు తెలియలేదు.

మేకల గమేళామీదనుంచి చెంగల్రావు పేట పంజాదాకా పరుగెత్తి ఇంటి ముంగిట్లో ఆగింది. కూతుర్ని చూసి "వర్షంలో పరుగెత్తకపోతే ఎక్కడయినా ఆగి రాలేకపోయావ్? ఆ కోటేమిటి?" అంది వరదమ్మ.

అప్పుడు చూసింది తన వొంటిమీద కోటుని. అప్పుడు గుర్తొచ్చింది కూర్మయ్య దగ్గర ఉండిపోయిన తన పుస్తకాలు. కూర్మయ్య తాకినచోట శరీరమంతా భగ్గున మండుతోంది. ఒంటిమీద బల్లిపాకినట్టు అసహ్యంగా కోటు విప్పి పారేసింది. కోటులోంచి కూర్మయ్య బస్సుపాసు రెండురూపాయల చిల్లరా, ఓ తావీజూ కిందబడ్డాయి.

వాటిని చూస్తూ తెల్లబోయింది. ఆ క్షణంలో కూర్మయ్య మీద అసహ్యత ఏ కాస్తో తగ్గినట్టనిపించింది.

## 21

ఆ రోజు అయిదో తారీఖు.

నెలకి ఇంకా ఇరవై ఐదురోజులుంది. బస్సుపాసు లేకపోతే ఇబ్బందే అయినా కూర్మయ్యని మరోసారి కలుసుకోవడానికి మనస్కరించలేదు. వర్షానికి తడిసి ముడతలుపడిన కార్డిగాన్‌ని ఓ మూలపారేసింది ఆండాళ్ళు. నాలుగు రోజుల తర్వాత కూర్మయ్య మీద విముఖత కాస్త దూరం కాగా, తనకి సహాయపడిన కార్డిగాన్‌ని ఇస్త్రీ చేయడం తన బాధ్యతగా భావించింది. బస్సుపాసుకోసం, కార్డిగాన్ కోసం తనదగ్గరకి రాలేదేం? నాలుగు రోజుల తర్వాత మరే కారణంచేతా కాదు. కేవలం కుతూహలం కారణంగా కూర్మయ్య నాలుగయిదుసార్లు జ్ఞాపకం వచ్చాడు. అదిగో, ఆ సమయంలోనే చాలా సంవత్సరాల కిందట అతనిచ్చిన డిక్షనరీ గుర్తొచ్చింది. ఒక్కసారి మనస్సులోనే ఆ పుస్తకాన్ని వెదికింది. నాన్నగారి సందుగపెట్టెలో పారేసిన విషయం గుర్తొచ్చింది. సందుగ పెట్టె తెరిచి చూస్తే నిన్ననే కొన్నంత కొత్తగా డిక్షనరీ కనిపించింది. అట్ట తిరగేస్తే అతి చక్కని దస్తూరితో కూర్మయ్య వ్రాసిన అక్షరాలు కనిపించాయి. 'ఆండాళ్ళు మేడమ్‌కి నమస్కారాలతో' అని రాశాడు. తన దూరాన్ని, స్థానాన్ని తెలిసిన మనిషి కూర్మయ్య. అతని ఔచిత్యానికి మొదటిసారిగా అతనిమీద గౌరవం కలిగింది.

అప్పుడు కూర్మయ్యని కలుసుకుని బస్సుపాసు, కార్డిగాన్ ఇవ్వాలనిపించింది. ఏవిఎన్ కాలేజీ గేటుని ఆనుకునే ఆంధ్రా మెడికల్ కాలేజీ గేటు. మూడు నాలుగుసార్లు గేటు దగ్గరే ఎవరికోసమో ఎదురు చూస్తున్న అందమయిన పిల్లని చాలామంది స్టూడెంట్స్ గమనించారు. ఆమె తమని పలకరిస్తే బాగుణ్ణని ఒకరిద్దరు సైకిళ్ళను నెమ్మదిగా నడిపారు. మరికొందరు పలకరించారు. విచిత్రంగా కూర్మయ్య కనిపించలేదు. మూడురోజులు వరుసగా కనిపించకపోయేసరికి ఆశ్చర్యపోయింది ఆండాళ్ళు. ఏం చెయ్యాలో పాలుపోలేదు. కూర్మయ్య ఎక్కడుంటాడో తెలీదు. ఒక్కటి మాత్రం తెలుసు. బస్సులో కాలేజీకి రావలసినంత దూరంగా ఉంటాడు. అతనికి తప్పనిసరిగా

బస్సుపాసు అవసరం. చదువుకి కార్డిగానూ అవసరమే. తను ఇబ్బంది పడుతున్నా, అతనిపట్ల తన అసహ్యాన్ని స్పష్టంగా వ్యక్తీకరించిన కారణంగా తనని కలుసుకుని ఉండదు. కాస్త మనస్సుకి బాధ కలిగించింది. తనకు సహాయం చెయ్యబోయిన వ్యక్తిని ఇంతగా హింసించే హక్కు తనకి లేదు. అంత అవసరమూ లేదు. ఇంక ఆలస్యం చేయకుండా మరునాడు ఒక స్టూడెంట్‌ని ఆపి వాకబు చేసింది.

"కూర్మయ్యగారు కాలేజీకి వస్తున్నారా?"

ఆ స్టూడెంటు పేరు పెద్దిరాజు. ఆశ్చర్యంగా చూశాడు ఆండాళ్ళుని.

"మీకింకా తెలీదా?" అన్నాడు.

ఆశ్చర్యంగా చూసింది. "ఏమిటి?"

"ఎనిమిది రోజుల కిందట దొండపర్తి దగ్గర పెద్ద ఆక్సిడెంటు జరిగింది. మెడికల్ కాలేజీకి వస్తున్న ఓ స్కూటర్‌ని ఇసుకలారీ కొట్టేసింది. మా ఫ్రెండు అశోక్ రాతీ అక్కడికక్కడే చనిపోయాడు. పిలియన్ మీద ఉన్న కూర్మయ్య లక్కీగా తప్పించుకున్నాడు. కానీ కోమాలో ఉన్నాడు."

ఆండాళ్ళుకి ఏడుపొచ్చినంత పనయింది. "వాట్?" అంది.

"పూర్‌ఫెలో అంతకు వారం ముందు తన కార్డిగాన్, బస్సుపాసూ పారేసుకున్నాడు. యూనో, హి ఈజె పూర్ ఫెలో. ఎవరికీ చెప్పలేదు. కార్డిగాన్ లేక మూడు క్లాసులు పోయాయి. మా అందరికీ తెలిసి మా పాకెట్‌మనీతో వాడికి తెలీకుండా ఓ కార్డిగాన్ కొనిచ్చాం. నాలుగు రోజులు ఎవరికీ చెప్పకుండా కాలేజీక్ నడిచి వచ్చాడు. తర్వాత మాకు తెలిసి ఎవరో ఒకరు పికప్ చేసేవాళ్ళం. ఆ రోజు అశోక్ పికప్ చేశాడు. బాడ్‌లక్. అశోక్ పోయినట్టు ఇంకా కూర్మయ్యకి తెలియదు."

వెక్కి వెక్కి ఏడ్చేసింది ఆండాళ్ళు. పెద్దిరాజు కంగారుపడిపోయాడు. "సారీ, కంట్రోల్ యువర్ సెల్ఫ్. కూర్మయ్య మీ బాయ్ ఫ్రెండా? ఐ యామ్ సారీ"

ఆండాళ్ళు తుళ్ళిపడింది. కానీ ఏమీ సమాధానం చెప్పలేదు.

"ఎక్కడున్నారు ఇప్పుడు?"

"కె.జి.హెచ్ భావనగర్ 'ఎ' వార్డులో. బెడ్ ఫార్టీ ఎయిట్."

అంతే వస్తున్న రిక్షాలో దూకింది. కారుతున్న కన్నీటిని ఆపుకోవడానికి ప్రయత్నించలేదు. తన చేతిలో కార్డిగాన్ మరో కారణానికి మళ్ళీ తడిసి ముద్దయింది. అదిప్పుడు అతి పవిత్రమయిన బంగారు అంగీలాగా ఆమెకి కనిపించింది. సైకిలు రిక్షా నత్తనడక నడుస్తున్నట్టనిపించింది.

వార్డు అంతా రద్దీగా ఉంది. ఎక్కడ చూసినా పేషెంట్లు, వాళ్ళని ఆదుకుంటున్న బంధువులు. గొడవగొడవగా ఉంది. వార్డు వరండాలో వెదురుపుల్లల పరదాలు స్థంభాలకి కట్టి మంచాలు వేసి పేషెంట్లని ఉంచారు. మరీ సీరియస్‌గా ఉన్న నలుగురు పేషెంట్లని పల్చటి గుడ్డ కర్టెన్లని అడ్డంగా పెట్టి పడుకోబెట్టారు. ఆ నలుగురిలో ఒకడు కూర్మయ్య. ఎనిమిది రోజులు గడ్డం పెరిగింది చేతికి సెలైన్ పెట్టారు. పక్కనే ఆక్సిజన్ సిలెండరు. ప్రత్యేకంగా చూస్తేకానీ గుర్తుపట్టేటట్టుగా లేడు. మంచం పక్క నేలమీద పడుకుని ఉన్నాడు తండ్రి సానయ్య. కాస్త సారా కడుపునిండా తాగి, వస్తున్న దుఃఖాన్ని అణుచుకుని పడుకున్నాడు. తల్లి ముత్తి కూర్చుని మోకాళ్ళమీద తల ఆనించుకుని కునికిపాట్లు పడుతోంది. ఆండాళ్ళుని చూసి, గుర్తుపట్టి చటుక్కున లేచింది. మొగుడ్ని లేపింది. "ఓలమ్మో నా కొంప బుగ్గయిపోనాది తల్లీ ఈ నంజికొడుకుని కుండలు సేసుకు బతుకుదాం రా అంటే సదువులన్నాడు. సచ్చి శవమైపోయినోడ్ని సావకుండా బతికిత్తన్నారు డాట్టర్లు" అని ఘొల్లుమన్నాడు సానయ్య.

ముత్తి మొగుడ్ని ఆపింది.

దుఃఖం బయటికి రాకుండా ఆండాళ్ళు నోట్లో చున్నీ కుక్కుకుంది. కూర్మయ్యలో చలనం లేదు. బతికున్నాడనడానికి మెల్లగా కదులుతున్న ఊపిరే సాక్ష్యం. తలకి బలంగా కట్టు. చెయ్యి విరిగింది సిమెంటు కట్టువేశారు. శక్తి చాలక కూర్మయ్య మంచమ్మీదే కూలబడిపోయింది.

కెవ్వుమంది ముత్తి. "ఆచార్లుగారి బొట్టివి. మా యమ్మ మా తల్లి ఆడ్ని ముట్టుకోకమ్మా మాకు పాపమత్తాది" అంది ఏడుస్తూ.

ఆ మాట విన్నాక తప్పనిసరిగా కూర్మయ్య నుదుటిమీద చెయ్యివేసింది. ఒళ్ళు చల్లగా పాలరాయిలాగా ఉంది. మాములుగా అయితే కలలో కూడా కూర్మయ్యమీద చెయ్యి వేసేదికాదు. చెయ్యి తగిలినందుకు తనని తాను క్షమించుకునేది కాదు. ఆమెలో మూడు తరాల కిందటి కుంతీనాధాచార్యులవారి జీన్స్ ఎక్కడో ఉన్నాయి. వాటితోబాటు సంస్కారం, సెంటిమెటూ కలబోసిన తార్కిక స్వభావం కూడా ఉంది. ఉందని ఆ క్షణం వరకూ ఆమెకీ తెలియదు. ఆ సందర్భంలో కూర్మయ్య నుదుటి మీదకి కదిలిన ఆ చెయ్యి సాక్ష్యం చెప్పింది.

వెంటనే డ్యూటీ డాక్టర్ని కలిసింది. కాలేజీ అమ్మాయి పేషెంట్ మీద అంత ఆసక్తి చూపడం ఆశ్చర్యాన్ని కలిగించింది డాక్టర్‌కి. జరిగింది, జరగవలసిందీ వివరంగా చెప్పాడు. మందులూ, ఇంజెక్షనూ ఎలా ఇవ్వాలో చెప్పాడు. రెండు చేతులమధ్యా తలపెట్టుకుని కూర్చున్న ఆండాళ్ళను చూసి "మీరు కూర్మయ్యకి గర్ల్‌ఫ్రెండా?" అనడిగాడు.

మరే సందర్భంలోనయినా ఆ ప్రశ్నకి మీదపడి రక్కి కరిచేది. ఇప్పుడా పని చెయ్యలేదు. చెయ్యాలనిపించలేదు. నవ్వేసింది. ఎక్కడో మనస్సులో కూర్మయ్య ప్రస్తుతం ఈ స్థితిలో ఉండటానికి తనే కారణమన్న గిల్ట్ తొంగిచూస్తోంది.

"ఆడికి గురక వచ్చిందన్నప్పుడే మజ్జిగైరమ్మ తావీజు పంపానమ్మగారూ. నంజికొడుకు నా మాటిని కట్టుకునుంటే ఈ పని జరిగేదికాదు" అన్నాడు సానయ్య కళ్ళిప్పకుండా నేలమీద పడుకుని దొర్లుతూనే. వెంటనే తన హేండ్ బాగ్‌లో ఉన్న తావీజుని తీసి అతని చేతికి కట్టింది. కానీ కట్టిన అరగంటలోనే నర్సు ఆ తావీజుని విప్పించేసింది.

ఎన్ని కారణాలకి ఈ నేరాన్ని తను భరించాలి? ఆ క్షణం నుంచీ సానయ్య, ముత్తితో పాటు ఆండాళ్ళు కూడా కూర్మయ్య పక్కనే కూర్చుంది. తల్లిదండ్రులు వద్దని బతిమాలారు. ఇంటికి వెళ్ళమని ప్రాధేయపడ్డారు. రాత్రిళ్ళు ఇంటికి వెళ్ళేది. తెల్లారేసరికి ప్రత్యక్షమయ్యేది. ఆమెలో మార్పునీ, వేదననీ సుభద్రాచార్యులు సూచనామాత్రంగా గుర్తుపట్టారు.

తీర్థవిధి చేస్తూ అడిగారు "ఆరోగ్యం బాగోలేదా చిన్నా?" అన్నారు.

"ఉంది నాన్నా" అంది ముక్తసరిగా.

ఆమెను కూర్చోమన్నారు. తిరువయ్‌మొళిలో ఉలకముందు పెరువాయ్ ఉపాయ వరణం చదివించారు పదిసార్లు "రోజూ నూట ఎనిమిదిసార్లు చదువు, నీ మనస్తాపం పోతుంది" అని దీవించారు.

కె.జి.హెచ్‌లో కూర్మయ్య చలనం లేని చేతిని పట్టుకుని రోజూ నూట ఎనిమిదిసార్లు ఆ పాశురాన్ని వల్లించింది. ఆళ్వారుల దివ్యాశీర్వాదం, వారి కటాక్షం సెలైన్‌తోపాటు కూర్మయ్య నరనరాలకూ ఎక్కిందేమో? పద్దెనిమిదోరోజుకి కనుబొమలు కదిలాయి. కళ్ళు టపటపా కొట్టుకున్నాయి. ఆ సాయంకాలానికి మెల్లగా తెల్లగుడ్డు కనిపించింది. మనస్సులోనే తండ్రికీ, ఆళ్వారులకీ మొక్కుకుంది ఆండాళ్ళు. సానయ్య అయితే మరోసీసా ఎక్కువ తాగి గెంతులు వేశాడు. ముత్తి ఆండాళ్ళు కాళ్ళమీద పడిపోయి కన్నీళ్ళతో కడిగేసింది.

"దేవతలాగొచ్చి నా బిడ్డని కాపాడావు తల్లా! మళ్ళీ జన్మెత్తి నా చర్మం నీకు చెప్పులు సేయిత్తా" అంది.

ఎప్పుడైతే కూర్మయ్య తేరుకున్నాడని అర్థమయిందో ఆండాళ్ళు అక్కడనుంచి మాయమయిపోయింది. ఆమె కృషి, చేసిన నేరాణికి ప్రాయశ్చిత్తం స్థాయిలోనే నిలిచిపోయింది. సంస్కారం సానుభూతిని సంప్రదాయం గడపదాటనివ్వలేదు.

కూర్మయ్య స్పృహ వచ్చి కళ్ళు తెరిచేటప్పటికి సానయ్య, ముత్తి మరో నలుగురు మిత్రులే ఎదురుగా కనిపించారు.

వరదమ్మ బుద్దెరిగినప్పటినుంచీ ఆచారం, మడి రక్తమాంసాల్లాగా అతుక్కుపోయిన కుటుంబంలో పుట్టింది. ఏడాది పొడుగునా ఏకాదశికో, పున్నమికో, వైకుంఠ ఏకాదశికో ఏదో కారణానికి తలస్నానాలు, ఆరాధనలు, కైంకర్యాలూ నిత్యకృత్యాలయిపోయాయి. ఒక దశ గడిచాక నిష్ఠనీ, నియమాలనీ ఒక్కొక్కప్పుడు శరీరం ఎదిరిస్తుంది. కొన్నాళ్ళయి తల స్నానం చేస్తే దాదాపు గంటసేపు ఊపిరి అందకుండా బాధపడేది. ఆ ఎగ ఊపిరితోనే పాశురాలూ, విష్ణుసహస్రనామం, తిరువాయ్‌మొళి ఊపిరితిత్తుల్లో పవిత్రమయిన సంచారాన్ని చేసేవి. ఇప్పుడిప్పుడు గంటపైగా నోటమాట రాకపోగా ఆ ఆలోచనవేపు కూడా వెళ్ళనివ్వడం లేదు.

ఆమెని డాక్టర్ అచ్యుతరామయ్యగారి దగ్గరకి తీసుకెళ్ళి మునిసిపల్ ఆసుపత్రి క్యూలో నించుని మందు తెచ్చేవారు సుభద్రాచార్యులు. లేవగానే స్నానం, ఆరాధన అన్నీ సక్రమంగా సాగిపోవాలి. ఆసుపత్రిలో జాలరి వీధి, రెల్లివీధి. సోల్జర్ పేట రోగులతోపాటు నిలబడి వచ్చాక మరొక స్నానం తప్పేది కాదు. ఈ ఇంట్లో ఎవరో ఒకరు మరొకరి బాధ్యత వహించడం తప్పనిసరి కనుక ఆ 'ఒకరు' తప్పనిసరిగా సుభద్రాచార్యులే అయిపోయారు. సంకల్పబలం ఆయనకు ఆసరా. దైవకృప వెన్నెముక. శ్రీరంగనాథుడు జీవగర్ర. జీవితంలో ఒక దశ గడిచాక ప్రాణాన్ని నిలిపేది ఆరోగ్యం కాదు, సంకల్పం. అది దృఢంగా ఉన్న మనిషి ఆచార్యులవారు.

సాయంకాలం జగన్నాథస్వామి ఆలయంలో పురాణం అప్పుడప్పుడు తొట్రుపడుతోంది. ఆలోచనలు ఇదివరకులాగా పడుగుపేకలాగా అల్లుకోవడంలేదు. కథ మధ్య మధ్య తెగిపోతోంది. అయితే శ్రోతలూ ఆచార్యులవారికి అలవాటుపడిపోయారు. ఆయన అనారోగ్యాన్ని అలవాటుగా వాళ్ళూ సరిపెట్టుకోవడం నేర్చుకున్నారు. పురాణకాలక్షేపం అయ్యాక నాన్నగారిని ఇంటికి తీసుకువెళ్ళడానికి ఆండాళ్ళు వచ్చేది. ఆమె భుజం మీద చెయ్యి వేసి నడుస్తూ మరొక బాధ్యత జీవితంలో తోసుకువస్తోందని గుర్తుపట్టారు. ఆండాళ్ళు పెళ్ళి. వైష్ణవం అంతా మూర్తీభవించినట్టుంటుంది ఆండాళ్ళు. తిరుమలకి చీర కడితే ఆండాళ్ళు అయిపోతుంది. లేదా, ఆండాళ్ళుకి పాంటు తొడిగితే అమెరికానుంచి తిరుమల దిగినట్టుంది.

"రేపు అన్నయ్య ఫోన్ వచ్చే రోజు కదూ?" అన్నారుఆచార్లుగారు.

"అవున్నాన్నా" అంది ఆండాళ్ళు.

ఈ దశలో చాలామంది వృద్ధదంపతులకి కొడుకులు ఆధారంగా నిలిచిన సందర్భాలు మరుగునపడిపోయాయి. ఇప్పుడు వారి గొంతులే ఊతం.

"అన్నయ్యని ఇండియాకి వచ్చెయ్యమనకూడదా నాన్నా?" అంది ఆండాళ్ళు.

"వాడి జీవితాన్ని నిర్ణయించే హక్కు నాకేముందమ్మా? నేను మరికొన్నాళ్ళకి సెలవుతీసుకుంటాను. వాడింకా నూరేళ్ళు బతకాలి."

ఆ రాత్రి వంట గదిలో ఏదో అలికిడి అయి తుళ్ళిపడి లేచాడూ ఆచార్యులవారు. అప్పటికే లేచి కూర్చుంది ఆండాళ్ళు. గడియారం చూశారు. తెల్లవారుఝామున మూడు. ఇద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకుని లేచారు. వంట గదివేపు నడిచారు.

చక్కగా తలస్నానం చేసి పట్టుచీర పింజెపోసి కట్టుకుని ఉంది వరదమ్మ. ఎదురుగా పీటవేసి, తామరాకు పరిచి వేడివేడిగా వండిన పదార్థాలు వడ్డించింది. చక్రపొంగలి, వంకాయ మెంతికూర, ముద్దపప్పు, కొబ్బరికాయపచ్చడి, పరిషేచనకి వెండిగ్లాసు అన్నీ అమర్చి ఉన్నాయి. ఆమె ముఖం తృప్తితో వెలిగిపోతోంది. అలికిడికి తలెత్తి చూసింది వరదమ్మ భర్తనీ, కూతుర్నీ.

"అన్నం వడ్డించేశాను. ఇంక ఆలస్యంలేదు. తిరుమల పీతాంబరం కట్టుకుని వచ్చేస్తాడు" అంది ఆనందంగా.

సుభద్రాచార్యులు, ఆండాళ్ళు నిర్విణ్ణులయిపోయారు.

**22**

రాఘవాచారి, లావణ్య ఇండియాలో దిగారు.

తిరుమల సకుటుంబంగా వస్తున్నాడన్న వార్తని రెండు పెద్ద ట్రంకు పెట్టెలతో సూచించారు. అమెరికానుంచి వచ్చే కుటుంబాల కథ అదొక పెద్ద ప్రహసనం. ఇలాంటి ప్రయాణాలకే ప్రత్యేకించిన పెట్టెలు కొన్ని ఉంటాయి. ఒక్కొక్క పెట్టెలో ఆరేళ్ళ వయస్సుగల పిల్లలు కాలు మడత పెట్టుకోకుండా ముగ్గురు పడుకోవచ్చును. అంత విశాలంగా, అంత భారీగా ఉంటాయి. వాటిలో ఏం ఉంటాయి? అమెరికా వెర్రిని ఇండియాలో పంచటానికి కావలసినంత సామగ్రి ఉంటుంది. వాకీటాకీలూ, కీ చైన్‌లూ, రీబోక్ షూలూ, రంగురంగుల టైలు, 'కిక్ మి ఎగైన్', 'ఒహో నాట్ నౌ', 'దట్సిట్' లాంటి రకరకాల నినాదాల బనీన్లూ, సగం చిరుగులుపడ్డ జీన్‌ఫాంటులూ, చూయింగ్ గమ్‌లూ, అమెరికాల సినిమాల కేసెట్లూ, కంప్యూటర్ ఫ్లాపీలూ, కెమెరా రీల్సూ, చిన్నసైజు విస్కీ సీసాలూ, మార్ల్‌బరో సిగరెట్టు పాకెట్లూ.. మీ ఇష్టం.

వెళ్ళేటప్పుడు ఈ సూట్‌కేసులనిండా ఏముంటాయి? కరక్కాయలూ, తేనెసీసాలూ, మొలతాళ్ళూ, ఊరగాయడబ్బాలూ, షిరిడీసాయిబాబా విబూదీ, పసుపు పొట్లాటలు, మిరియాలు, లవంగాల పాకెట్లూ, కంచి పట్టుచీరలూ, ఎమ్మెస్ సుబ్బలక్ష్మి విష్ణు సహస్రనామాలూ, ఇటీవల తెలుగు సినిమాల వీడియోలు, ఘంటశాల పాత పాటలు, పవిత్రమైన గంగాజలం.

మీ ఇష్టం.

ఆ ఇరవై రోజుల్లో అమెరికా పైత్యాన్నంతా ఈ దేశానికి దిగుమతి చేసి, మరో మూడేళ్ళపాటు ఇండియా సంప్రదాయ సంపదని మూటగట్టుకు పోతారు. ఇది ఈ తరంలో అమెరికా వెళ్ళిన, ఇంకా ఇండియాని మరిచిపోని, మరిచిపోలేని, మరిచిపోలేదని తమని తాము సమర్థించుకోవడానికి యాతన. నిజానికి అమెరికా, ఇంగ్లాండు తెలుగు సమావేశాల్లో ముఖ్యంగా మహిళల్లో కనిపించే తెలుగుదనం ఇండియాలో కనిపించదు. ఇండియాలో పాంటుతో, సగం కత్తిరించిన జుత్తుతో, బొట్టులేకుండా, లిప్‌స్టిక్‌తో, వీలైతే గాగుల్స్‌తో తెలుగు సభల్లో కనిపించడం ఫాషన్. గోరింటాకు, పాపిట్లో కుంకుమ, పట్టుచీరలతో, వంకీలతో వడ్డాణాలతో అమెరికా తెలుగుసభల్లో మన మహిళలు కన్నుల పండుగగా కనిపిస్తారు. అది ఈ తరం వరకే. వారు దూరమైనదేదో వారికి తెలుసు. పళ్ళకి స్టీలు తీగలతో, భూతద్దాల కళ్ళజోళ్ళతో, నడుం దాకా రాని పొట్టి బనీన్లతో, చూయిగ్ గమ్ నములుతూ కనిపిస్తే వారు రెండో తరం తెలుగువారు. మరి కాస్త టైమిస్తే ఈ కంచిపట్టు చీరెలు ఎందుకో, ఏం చెయ్యడానికో వారికి తెలియదు.

ఇది వలసపోయిన ఆంధ్రులలో పరిణామం.

ఈ పరిణామాన్ని అమెరికాలో దిగుతూనే ఆపోశన పట్టిన మొదటితరం తెలుగు కుటుంబం తిరుమల, పాడ్, నాన్సీ ఇండియాలో దిగారు. మీనంబాకం ఎయిర్‌పోర్టులో వాళ్ళకి రాఘవాచారి స్వాగతం చెప్పాడు. వచ్చిన వాళ్ళలో తండ్రికోసం, తల్లికోసం, చెల్లికోసం తిరుమల వెదికాడు. వారెవరూ కనిపించలేదు.

"మా వాళ్ళు రాలేదా?" అన్నాడు మామగారితో.

"ఆచార్లుగారికి పురాణం ఉంది, అమ్మగారికి ఆచార్లుగారున్నారు. ఆండాళ్ళుకి కాలేజీ ఉంది" అన్నాడు రాఘవాచారి.

తిరుమలకి ఇది ఎదురు చూసిన ఇండియా కాదు. అతని మనస్సు క్షణం క్రుంగిపోయింది. మద్రాసునుంచి విశాఖపట్టణం దాకా చేసిన ప్రయాణంలో కాళ్ళు పట్టుకోవడం లాటివన్నీ చేసి పాడ్ తన ఇంటికి వచ్చిన రెండురోజులూ చీర కట్టుకోవడానికి ఒప్పించాడు అతి

కష్టమ్మీద. అమితమయిన అయిష్టంతో ఆ పని రెండు రోజులే చేస్తాననీ, ఆపైన తన ఇంటికి వెళ్ళిపోతాననీ హెచ్చరించింది. గూడూరు నుంచి బాపట్లదాకా మరో ముఖ్యమైన మార్పుని పెళ్ళాంచేత భట్టీయం వేయించాడు. అది కూతురు పేరు నాన్సీ కాక ఝాన్సీగా పరిచయం చేయాలని. ఇది కేవలం ఇరవైరెండురోజుల ఒప్పందం. ఇరవై రెండోరోజున ఇద్దరూ ఎయిర్ ఇండియా విమానంలో ఉంటారు. విమానం ఆకాశంలోకి లేచిన మరుక్షణం ఝాన్సీ మళ్ళీ నాన్సీ అయిపోతుంది. ఇది పెద్దగా ఇబ్బంది పెట్టే విషయం కాదు కనుక పాడ్ ఒప్పేసుకుంది. ఎంత ప్రయత్నించినా ఇద్దరికీ రాజీ కుదరని విషయం ఒక్కటి ఉండిపోయింది అత్తమామలకి పాదాభివందనం చెయ్యడం. తిరుమల బతిమాలాడుకానీ, ఆమె శరీరాన్ని చూసి ప్రస్తుతం ఆ శాల్తీని అంత ఇబ్బంది పెట్టడం మంచిది కాదని ఆగిపోయాడు.

వాల్తేరు స్టేషన్‌కి ఆండాళ్ళు వచ్చింది. చెల్లెల్ని చూసి అమాంతం కావలించుకుని ముద్దులు పెట్టేసుకున్నాడు తిరుమల. వదినె కోసం కలయజూసింది. రాఘువాచారి పక్కన నిలబడిన పాంటు వేసుకున్న స్థూలకాయుడే వదిన అని గుర్తుపట్టి ఆశ్చర్యపోయింది. అమెరికా పాలు తాగి అప్పుడే అమ్మతో పోటీపడుతున్న నాన్సీ ఎలియాస్ ఝాన్సీని అతి శ్రంతో ఎత్తుకుని ముద్దాడింది. పాడ్ చీర కట్టుకోవాలి కనుక కారులో సరాసరి రాఘువాచారిగారింటికి వెళ్ళి మరో రెండుగంటల తరువాత ఇంటినుండు దిగాడు తిరుమల.

**ఎప్పుడూ ఆవేశాన్ని** చూపని సుభద్రాచార్యులవారు కూడా తిరుమలని చూడగానే ఆనందభరితులయ్యారు. వరదమ్మ కర్పూర హారతిచ్చి పారాణి నీళ్ళు దిష్టితీసింది. కోడల్ని, మనవరాల్ని చుబుకం పుణికి ముద్దులాడింది. తల్లి మరీ నీరసంగా ఉండటం గమనించాడు తిరుమల.

ఎక్కడి పద్మనాభం? ఎక్కడి కుంతీనాథస్వామి ఆలయం? ఎక్కడ డిట్రాయెట్? సుభద్రాచార్యులవారికి అదొక ఊహించరాని కల. రాఘువచారి ఇంట్లో వదిలేయగా తెచ్చిన సూట్ కేసు తెరిచి తల్లికి ఫ్రాంక్‌ఫర్ట్ ఎయిర్‌పోర్టులో కొన్న గొలుసు ఇచ్చాడు. ఆండాళ్ళుకి ప్లాటినమ్ బ్రేస్‌లెట్.

ఎంత ఆలోచించినా తండ్రికి ఏం బహుమతి ఇవ్వాలో తోచలేదు తిరుమలకి. అమెరికానుంచి వచ్చే ఏదీ ఆచార్యులవారికి తృప్తినివ్వదు – తిరుమల తప్ప. కానీ ఆలోచించి ఆలోచించి ఎక్కువ బరువుగా లేని బంగారు తీగతో చేసిన కళ్ళజోడు ఫ్రేము తండ్రికి తెచ్చాడు.

ఆ రోజు కొడుకు జీవితమంతా అడిగి చేయించుకున్న అన్ని పిండివంటలూ పేరు పేరునా చేసి వడ్డించింది. కానీ ప్లెయిన్ ఫ్రాంక్‌ఫర్ట్ దాటినప్పటినుంచే తిరుమల కడుపులో గుడగుడ శబ్దం ప్రారంభమయింది. నిజానికి అమెరికాలో పగలు భోజనం అలవాటు లేదు. పెదాలకి శాండ్‌విచ్ అతికించుకుని కారుల్లో పరుగులు తీస్తారు అంతా. ఎంతో కొంత రాత్రికి ఎంగిలిపడతారు. అయినా తల్లి తృప్తికోసం కాస్త కతికి లేచిపోయాడు.

తిరుమల మనస్సులో కలుసుకోవాల్సిన వాళ్ళ లిస్టు చాలా పెద్దదే ఉంది. అక్కడ ఉన్నన్నాళ్ళూ తనతో ఉండడానికి కారు మాట్లాడుకున్నాడు. ఆ సాయంత్రమే సంజీవి ఇంటికి వెళ్ళాడు.

తిరుమలని చూడగానే తప్పిపోయిన కుక్కపిల్ల దొరికినట్టు అమాంతం మీదపడి కావలించుకుంది నవనీతం. ఆలోచనతో చేసిన పనికాదు అది. తీరా జరిగాక ఆమె సిగ్గుపడింది. తిరుమలా సిగ్గుపడ్డాడు. సంజీవి నవ్వుకున్నాడు. నారాయణ ఇప్పుడు ఎదిగాడు చెయ్యి పట్టుకుని తడిమి నారాయణని పరిచయం చేసింది.

"నీ జీవితంలో ప్రతి విషయం నన్ను షాక్ అయ్యేటట్టు చేస్తుంది. ఊహించని గొప్ప విషయం ఈ నారాయణ" అన్నాడు తిరుమల.

కైకవశి జున్ను తెచ్చింది. ఎన్నాళ్ళు తనని ఎత్తుకు సాకిందో. తల ముగ్గుబుట్ట అయిపోయింది. లేచి వెళ్ళి అమాంతం ఆమె గుండెకి హత్తుకుపోయాడు. మాటల్లో చెప్పలేని ఆర్ద్రత అంతా ఆమె కళ్ళలో వెళ్ళుకొచ్చింది. తిరుమలని పసిబిడ్డగా పాలుపోసి ఎత్తుకుని దేవాలయమంతా తిరిగింది.

చెట్టంత ఎదిగిన తిరుమల జుత్తులోకి వేళ్ళు పోనిచ్చి బజారులో పింగాణీ బొమ్మని చూసినట్టు ఒళ్ళంతా తడిమి చూసింది. చాక్లెట్ రంగు బనీనులో తిరుమల బంగారంలాగా మెరిసిపోతున్నాడు.

సంజీవికి అందమైన పీటర్ ఇంగ్లండు షర్ట్. నల్లకోటు తెచ్చాడు. నవనీతానికి బంగారం పార్కర్. "నీ రామకోటి ఇంకా పూర్తయి ఉండదని నాకు తెలుసు. నీకు నేర్పిన మూడక్షరాలూ ఈ పెన్నుతో కొన్ని లక్షలయినా రాస్తావని తెచ్చాను. ఇంగ్లండ్ హేరాడ్స్‌లో ఇదొక్కటే పెన్ను" అని ఇచ్చాడు.

వెంకటాచెలాన్ని చూసి అతని గుండె నీరయిపోయింది. అతని పార్కిన్సన్స్ గురించి విక్టోరియా ఫోన్ చేసి చెప్పింది. జయవాణి చెప్పాలనుకుంది కానీ తిరుమల గొంతు అటునుంచి విన్నాక నోట్లో మాటరాలేదు. భోరుమంది. కష్టంలో ఆత్మీయుల పలకరింత చెప్పలేనంత ఉపశమనం. మీదపడిన ఉపద్రవాన్ని అందంగా అలంకరించుకుని ఆ ముగ్గురూ తిరుమల ముందు నటించలేకపోయారు. జయవాణి మరీ బేలయిపోయింది. ఆమెని భుజానికి హత్తుకుని ఓదార్చాడు. విక్టోరియా అందంగా, పొడవుగా, ఫ్రాక్‌లో రబ్బరు బొమ్మలాగా ఉంది. వెంకటాచెలం ముక్కు కొట్టొచ్చినట్టు తెలుస్తోంది. శిలువ ఉన్న బంగారం గొలుసు ఆమెకి అందించాడు తిరుమల. తన కంప్యూటర్‌లో అందరి పేర్లూ ఎక్కించి ఎవరెవరికి ఏయే బహుమతులివ్వాలో రాసుకుని ఒక ప్రింటౌట్ పెట్టుకున్నాడు. జయవాణికి నాలుగు నైట్‌గౌన్స్ తెచ్చాడు. రెండడుగుల కర్రని సాగదీస్తే నిలువెత్తు చేతికర్రగా ఊతాన్నిచ్చే ఈ చేతికర్రలో చిన్న స్పందన ఉంటుంది. రోగుల శరీరంలో స్పందనకి సమాధానంగా కర్రలో వైబ్రేషన్స్ పనిచేస్తాయి. బ్యాటరీ సహాయంతో పట్టుకు నడిచినంతసేపూ చిన్న ఓదార్పునిచ్చే ఏర్పాటు ఇది.

మూడోరోజు నించే పాడ్‌కి ఎలర్జీ ప్రారంభమయింది. ఎండకీ, ఉక్కపోతకీ శరీరం మీద ఎర్రటి బొబ్బలు ప్రారంభమయ్యాయి. తిరుమలకి విరేచనాలు ప్రారంభమయ్యాయి. వరదమ్మ ఆప్యాయంగా కొడుక్కి అన్నీ చేసిపెట్టి తినిపించాలన్న కోరిక ఆ విధంగా అటకెక్కింది.

ఇండియాలో ఉండే ఇరవై రెండు రోజుల్లో చాలా కార్యక్రమాలు విమానంలోనే వేసుకుని దిగారు. రెండు రోజులు తిరుపతిలో తోమాలసేవ, కళ్యాణం. అటు తర్వాత శ్రీరంగంలో రెండురోజులు స్వామికి తిరుమంజన సేవ, పూలంగిసేవ మొక్కుకున్నారు. సుభద్రాచార్యులు వారి రథం కదిలేదే కానీ, ఎప్పుడూ లేనిది రెండురోజులుగా చిన్న జ్వరం, వణుకు ప్రారంభమయింది. ఆ విధంగా ఆండాళ్ళు మాత్రం అన్న, వదినెలతో కదిలి వెళ్ళింది. తిరుమల కొండమీదే నాన్సీకి గురక, జ్వరం ప్రారంభమయింది. అక్కడనుంచి శ్రీరంగాన్ని ఒక్కరోజుకి కుదించి ఇల్లు చేరారు. చేరినప్పటినుంచీ పసిపిల్లల స్పెషలిస్టుతో రెండుపూటలా కాలం సాగిపోయింది.

కొడుకు రాకముందునుంచే వరదమ్మ సింహాద్రి అప్పన్నకి తిరుమల తలనీలాలు మొక్కుకుంది. తిరుమల నవ్వుకున్నాడు. కానీ పాడ్ కస్సుమని లేచింది. తలనీలాలు ససేమిరా తీయడానికి వీలులేదంది. ఏమయినా తీసేది తిరుమల. జుత్తు అతనిది. ఓ ఉదయం అమ్మనీ, నాన్ననీ కారులో ఎక్కించుకుని వెళ్ళి చక్కగా గావంచా కట్టుకుని పీటమీద కూర్చుని భక్తిగా స్వామికి తలనీలాలు సమర్పించుకున్నాడు. తత్కారణంగా ఇండియాలో ఉన్నంత కాలం పాడ్ద్వారా తన తల్లిదండ్రులకు కలిగించాలనే ఆనందాన్ని తిరుమల

నష్టపోయాడు. అయితే పాడ్ అత్తమామలకి అడుగులకు మడుగులొత్తే కోడలు ఏనాడూ కాదు. అలాంటి సేవలు ఆ వృద్ధ దంపతులు ఆశించనూ లేదు.

రాఘవాచారి వాల్తేరు క్లబ్బులో అల్లుడి గౌరవార్థం తన మిత్రులతో విందు ఏర్పాడు చేశాడు. ఆ విందులో డెట్రాయెట్ ఫాషన్లో ఫ్రాక్ వేసుకుని అమెరికన్ పద్ధతిలో పాడ్ తయారయి అందరికంటే ఎక్కువ వైన్ తాగి, అందరికంటే ముందు అవుట్ అయిపోయింది.

డెట్రాయిట్‌లో తన పనిచేస్తున్న స్నేహితుడు విష్ణుమూర్తి తల్లిదండ్రుల్ని చూడటానికి శ్రీకాకుళం దగ్గర రణస్థలానికి కారులో వెళ్ళాడు తిరుమల. అందుకు ప్రత్యేకమైన కారణం ఉంది. అమెరికా వెళ్ళినప్పటినుంచీ బిడ్డల్ని దూరం చేసుకున్నామని బాధపడే తండ్రులు, కుటుంబానికి దూరమయ్యామని బాధపడే కొడుకులూ ఏ కొద్దిమందయినా ఉండి ఉంటారు. కానీ వాళ్ళందరికీ భిన్నమైనవారు విష్ణుమూర్తి తల్లిదండ్రులు. ఈ విషయాన్ని పదేపదే తిరుమలకి చెప్పి గర్వపడేవాడు విష్ణుమూర్తి. తిరుమల ఇండియాకు వెళ్తున్నాడనగానే తల్లికి అత్యాధునికమైన గ్రైండర్, తండ్రి కాళ్ళకి కీళ్ళనొప్పులు పోయేలాగా రబ్బరు కణుపులున్న రెండు చెప్పుల జతలు ఇచ్చి పంపాడు విష్ణుమూర్తి. ఈసారి ఇండియా ప్రయాణంలో బాధ్యతగానే కాక, ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న కార్యక్రమం కోసం రణస్థలం ప్రయాణం. హైవేకి తూర్పుగా ఎనిమిది మైళ్ళలోపున గిరగాం అనే చిన్నపల్లె. అక్కడ ఉంటున్నారు విష్ణుమూర్తి తండ్రి బత్తుల రేచకుడు, ఆయన భార్య. ఆయన అరవై ఎకరాల మోతుబరి. చదువు తప్ప అన్నీ ఉన్నవాడు. ఆయన కుటుంబంలో అటు ఏడుతరాలూ, ఇటు ఏడు తరాల్లో చదువుకున్నవాడు విష్ణుమూర్తే.

గిరిగాం వచ్చాక రేచకుడి గురించి కనిపించిన మొదటి వ్యక్తే దారి చూపించాడు. కానీ అంతా తిరుమలని చూసి నిర్ఘాంతపోయారు.

"తమరొస్తున్నట్టు ఆరికి తెలుసా బాబూ?" అనడిగాడు ఓ రైతు సైకిలాపి ఆశ్చర్యంగా.

"ఏం?"

"ఎవర్నయినా ఇంటికి తీసుకెళ్తే నరికేస్తారు బాబూ. ఆరు ఎవరినీ చూడరు. ఎవరినీ ఇంటికి రానివ్వరు."

"మరి వ్యవసాయం ఎలా?"

"ఆరికి వ్యవసాయం ఓ లెక్కేంటి బాబూ! పాతికెకరాల్లో జీడిమామిడి, మరో పదెకరాలు మామిడి ఉంది. నామాటిని వెనక్కి ఎళ్ళిపోండి బాబూ" అన్నాడు.

రేచకుడిని కలుసుకోవాలనే ఆత్రం మరింత ఎక్కువయింది తిరుమలకి. "ఆయనిల్లు ఎక్కడ?"

"నేను చెప్పానని చెప్పకండి, బాబూ ఆరిది ఇల్లుకాదండి దివాణం. ఆరి ముత్తాతగోరు రెండెకరాల్లో డిప్ప పెంకు వసారా లోగిలి ఇల్లు కట్టారు. ఆ తాటితోపు దాటి 'రేచుబాబు ఇల్లు' అని గట్టిగా అరవండి బాబూ కనిపించిన కాకి దారి సూపిత్తాది" అని సైకిలు తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు రైతు.

తాటితోపు దాటాక ఆ అవసరం లేకపోయింది. కనిపించినంతమేరా చెట్లూ, వాటిమధ్య పెద్ద పెంకుటిల్లు కనిపించింది. విష్ణుమూర్తి గర్వపడే, గిరిగాం రైతులు భయపడే, విచిత్రమైన పేరున్న రైతు ఎలా ఉంటాడు?

తను ఏం చూడబోతున్నాడు?

ఇల్లు దగ్గరవుతున్న కొద్దీ సన్నటి గొంత సాగదీస్తూ సాగుతున్న పల్లెపదం వినిపించింది. ఆ గొంతులో బాధ లేదు, ఆర్తిలేదు, ఆవేదన లేదు. ఆనందం ఉంది, తృప్తి ఉంది.

ఎత్తరుగులు మెట్లు ఎక్కి పాతకాలం దర్వాజాని తెరిచాడు తిరుమల. ఎదురుగ్గా విశాలమయిన మడత కుర్చీలో బత్తుల రేచకుడు కనిపించాడు. అతన్ని చూస్తూనే శిలాప్రతిమలాగా నిలబడిపోయాడు తిరుమల.

**23**

మిలటరీ కుర్చీలో కాళ్ళు బారజాపుకుని కూర్చుని ఉన్నాడు బత్తుల రేచకుడు. వాక్యం తప్పు. కాలు బారజాపుకుని కూర్చున్నాడు. ఒక కాలు మోకాలి వరకు లేకపోవడం స్పష్టం తెలుస్తోంది. నోట్లో రెండువేళ్ళ మందాన చుట్ట వెలుగు తోంది. తలుపు తెరుచుకోవడం చూసి తుళ్ళిపడ్డాడు. అంతకుమించి నున్నటి గుండు, సూటుతో వచ్చిన వ్యక్తిమీద స్పష్టంగా అమెరికా ముద్ర కనిపించడంతో కంగారుపడిపోయాడు.

"ఎవడ్రా, లంజకొడుకు? ఈయన్ని నా ఇంటికి తీసుకువచ్చింది?" అని తిరుమల వెనక్కి చూస్తూ గర్జించాడు.

"నేనే దారి వెతుక్కువచ్చా" నన్నాడు తిరుమల. చాలా సేపటిదాకా కోపం వదిలి శాంతించలేకపోయాడు. విచిత్రం. కోపం పూర్తిగా పోయాక పసిపిల్లవాడయిపోయాడు.

"నీకు మా బుల్లిబాబు తెలుసా?" అనడిగాడు. ఓ వెదురు కర్ర చంకకింద ఊతం చేసుకుని గెంతుతూ లేచి తిరుమలముందు పండి మగ్గిన సపోటా పళ్ళుంచాడు.

"ఆడెలా ఉన్నాడు బాబూ? పెద్ద ఉద్యోగం చేస్తున్నాడా? ఆడెలా ఉంటాడో కాస్త సెప్పు బాబూ నీలాగా సూటేత్తాడా? నీలాగా నల్ల కళ్ళద్దాలెడతడా? ఆడికారు ఏ రంగులో వుంటాది? ఓడలాగుంటాదా? నా కొడుకు సీమమందు తాగుతాడా? ఆడి పెళ్ళాం అమెరికా దొరసాని?" ప్రశ్నల వర్షం కురిపించాడు. ప్రతి ప్రశ్న వెనకా ఆసక్తే కానీ, ఆర్తిలేదు. ఉత్సాహమే కానీ ఉద్విగ్నత లేదు.

తిరుమల అన్నీ చెప్పాడు తీరిగ్గా. "ఆడి ఫొటో నీ దగ్గరుందా బాబూ?" అనడిగాడు. ఇటీవల టొయొటా కారుదగ్గర నిలబడి నయాగరా దగ్గర విష్ణు, అతని భార్య, అమెరికన్ దొరల్లాగా ఉన్న ఇద్దరు పిల్లలూ తీయించుకున్న ఫోటో తీసి ఇచ్చాడు. ఆ ఫోటో చూసి మరీ పిల్లాడయిపోయాడు రేచకుడు.

"ఈడు పెద్దోడు. ఆడిపేరు రే. అదేటా సింగిల్ అక్షరం అన్నాను బుల్లోడితో. అది నీ పేరన్నాడు. ఆడు నన్ను ఫోన్‌లో ఇంగ్లీషులో తాత అంటాడు. ఈ రెండోవాడు అదేటి ఆ.. టెడ్ ఈడు నక్కజిత్తులోడు. పిలిత్తేనే పలుకుతాడు."

"ఇవన్నీ మీకెలా తెలుసు? వాళ్ళనెప్పుడయినా చూశారా?"

"అమ్మో? అంతపనే. మా బుల్లెబ్బాయి ఉత్తరాలు రాత్తాడు. పూర్ణయ్య పంతులుగారిచేత సదివించుకుంటాను. టెడ్డుగాడు ఫోన్‌లో వందేమాతరం పాడతాడు. ఆడిగొంతు ఘంటసాల గొంతులా ఉంటాది."

అంత ఆనందపడుతున్న తండ్రిని ఎప్పుడూ చూడలేదు తిరుమల. బిడ్డల్ని చూడాలని బెంగపెట్టుకునే తండ్రుల్ని తెలుసు. కానీ ఈయన? ఆలోచనల్లోని ఆనందాన్ని జుర్రుకుంటున్నాడు.

"మీకు కాలు లేదని మీ అబ్బాయి నాకు చెప్పలేదే?"

రేచకుడు నవ్వాడు. "నాక్కాలు లేకపోతే ఆడికేమయింది బాబూ. గిరిగాం రైతు నాకొడుక్కి కాలుంటేనేం పోతేనేం? నా కొడుకు దొర. సీమలో పెద్ద ఉద్యోగం సేత్తున్నాడు. అది చాలు నాకు."

"అసలు కాలు ఎలా పోయింది?"

"మనకి ఒంటినిండా సక్కెరే బాబూ. తీపి తినక్కరలేదు. సిన్నప్పట్నుంచీ నేను ఇమాం పసందు అంటే పీక్కోసుకుంటాను. అలా బయటికి సూడు, కనిపించే మేరలో అయిదెకరాల మామిడితోపు నాదే ఆరువేలు పళ్ళు దింపుతాను. ఎండలు ముదిరి, తొలకరిదాకా

ఎంతలేదన్నా రెండొందల పళ్ళు తింటాను. నీ యవ్వ పోతే దొరబిడ్డలాగా పోవాలికానీ, ఏడుత్తూ బతికితే ఏం లాభం? మా డాట్టరు పద్మనాభయ్య 'ఒరే రేసునాకొడకా! తింటే సత్తావురా' అన్నాడు. నేను నవ్వి, 'అయితే తినే సత్తాను' అన్నాను. రెండురోజులూ పనికట్టుకు తిన్నాను. పండొదిలితే వొట్టు"

"మరి విష్ణుకి తెలియజెయ్యలేదేం?"

"తెలిత్తే ఆడేటి సేత్తాడయ్యా? అన్నీ తెలిసిన మూర్ఖుణ్ణి నేను. ఇప్పుడు ఒక్క పండు కూడా తినలేను"

"ఏం?"

ఆ ఊపులో చెప్పబోయాడు, కానీ అంతలో. "నువ్విలా రాడం నాకిష్టం లేదు బాబూ" అని ఆగిపోయాడు.

"ఎందుకని?"

"నా వల్ల నాకొడుకు మనస్సు పాడుకాకూడదు. ఆడు అమెరికాలో సల్లగా ఉండాల"

"ఎప్పటికయినా ఈ నిజం తెలిస్తే అతని గుండె పగులుతుంది కదా?"

"అందుకే.. అందుకే ఆడికి తల్లిదండ్రుల్ని మరిచిపోవటం అలవాటు సేత్తున్నా" మరో చుట్ట వెలిగించాడు.

"ఎందుకని? ఎందుకా అవసరం వచ్చింది?"

ప్రశ్నకి సమాధానం వెంటనే చెప్పలేదు. కాస్సేపయ్యాక తలెత్తి "నువ్వు అమెరికా వెళ్ళి ఎన్నాళ్ళయింది బాబూ?" అనడిగాడు.

"రమారమి మూడేళ్ళు"

"ఆడు ముప్పయి ఏళ్ళకిందట ఎళ్ళాడు. అప్పుడు ఈ సుట్టూ ఉన్న ఏబయ్ ఎకరాల మాగణీ, మెరకానాది. మా పక్కరైతు వీదిబడిలో ఆరోక్లాసు చదివి, వేలిముద్ర ఏసే నన్ను ఎగతాళి చేస్తే ఆ నా కొడుక్కి బుద్ది సెప్పాలని నా కొడుకుని శికాకుళంలో పెట్టి సదివించా. ప్రతీవారం వెన్నపూస, జున్నూ సాయంగా తీసుకెళ్ళేవాడిని. ఆడిచేత ఇంగ్లీషు పాఠం చదివించుకు పొంగిపోయేవాడిని. ఆడు కాలేజీ సదువుకొచ్చినప్పుడు ఊళ్ళో గొర్రెపోతుని కోసి పండగ సేసా. మా బుల్లిగాడు సదువు మాని పొలంలొ నాకు సాయపడతానన్నాడు. ఎదిరించి, గొడవపెట్టి ఆడ్ని అమెరికా పంపించాను."

"ఆ తర్వాత ఎన్నిసార్లు అతన్ని చూశారు?"

"అయిదుసార్లు, ఆఖరిసారి చూసింది ఆరేళ్ళనాడు."

"మరి కొడుకుని దూరం చేసుకున్నానని బాధగా ఉండదా?"

"సచ్చికాటికెల్లేనాడు మనకెవడు దగ్గర బాబూ? మనకి సేవలు సెయ్యలేదని ఆల్ల బతుకెందుకు పాడుసెయ్యాల. ఆడు నాకెందుకు సేవ సెయ్యాల? ఆడి బతుకు ఆడు బతకాల."

ఆశ్చర్యంగా చూశాడు రేచకుడిని. ఈ మారుమూల గ్రామంలో ఈ చదువురాని రైతు ముప్పై ఏళ్ళు తను పాటించి ఓ సందేశాన్ని ఈ తరం తల్లిదండ్రులకి ఇస్తున్నాడా అనిపించింది.

"ఆడికోసం, నా రోగం కోసం, నా పెళ్ళాం వైద్యంకోసం నలభై ఎకరాలు అమ్మేశాను. అయిదెకరాలు తాకట్టులో ఉంది. మరో అయిదెకరాలు మామిడి పండించుకు తినేత్తారా అన్నాను మా బుల్లోడితో. 'తినేయ్ నాన్నా. కావాలంటే సెప్పు, మరో పదెకరాలకి డబ్బు పంపితా' అన్నాడు" అని చెప్తూ పసిపిల్లాడికి కితకితలు పెట్టినట్టు నవ్వాడు.

రేచకుడిలో ఎక్కడా పశ్చాత్తాపం లేదు, వేదన లేదు. ప్రతి కష్టాన్నీ 'తృప్తి'గా తర్జుమా చేసుకునే అద్భుతమయిన సంకల్పబలం ఏదో ఉంది.

"ఆడికి నేను ఉత్తరాలు రాయను. నెలకోసారి పంచాయితీ ఆఫీసుకెళ్ళి మాట్లాడతాను. ఆడు ఈ పాతికేళ్ళలో పంపించిన వస్తువులన్నీ సూత్తావా బాబూ"

లోపలికి తీసుకెళ్ళి ఓ గది తెరిచాడు. కళ్ళు తిరిగిపోయాయి తిరుమలకి. దసరాకి ఊళ్ళల్లో బొమ్మల కొలువు తీర్చినట్టు గదంతా రకరకాల వస్తువులున్నాయి. అందులో హవానా చుట్టల పాకెట్లు, సబ్బుల పాకెట్లు, సిగరెట్ లైటర్లు, బ్యాటరీ లైట్లు, ఖరీదైన ఇరానీ తివాసీలు. చీరలు, సూటు గుడ్డలు, చిన్న రేడియో సెట్లు. ఒకటేమిటి? వాడకం లేక అవి క్రమంగా పాడవుతున్నాయి. సియర్స్ టవర్, లిబర్టీ విగ్రహం, వాషింగ్టన్‌లో లింకన్ మెమోరియల్ బొమ్మలూ అన్నీ అంతటా ఉన్నాయి.

గెంతుకుంటూ వెళ్ళి ఓ శాలువా తీసి "ఈ సిల్కు గుడ్డ ఆళ్ళమ్మకోసం పంపించాడు ఆరునెలల కిందట" అన్నాడు గర్వంగా.

"మరి ఆవిడ వాడుకోలేదేం?"

నవ్వాడు రేచకుడు అదేదో జోక్‌లాగా "ఎలా వాడుతాదయ్యా? ఈ లోకంలో ఉంటేగా వాడుకోడానికి"

పిడుగు పడ్డట్టు తుళ్ళిపడ్డాడు తిరుమల.

"మీ ఆవిడ...?"

"సచ్చిపోయి నాలుగేళ్ళయింది."

"వాట్? మరి ఆవిడ కబుర్లు చాలా చెప్పాడే? ఆవిడకోసం చాలా.."

"సెప్పాడా! మరి సచ్చిపోయిన ఆడి తల్లిని నాలుగేళ్ళు ఆడి మనస్సులో బతికించాను. నేను గొప్పోణ్ణా, కాదా, సెప్పు బాబూ" అన్నాడు గర్వంగా.

తిరుమలకి ఈ మనిషి బొత్తిగా అర్థంకావడంలేదు. కానీ ప్రతిమాటకీ రేచకుడి వ్యక్తిత్వం రానురానూ విశ్వరూపం దాల్చేస్తోంది.

"అమెరికానుంచి వస్తే కాలుపోయిన నాన్ననీ, సచ్చిపోయిన తల్లినీ తల్చుకు ఏడుత్తాడని పూర్ణయ్య పంతులుగారితో చెప్పి అవాకులూ చెవాకులూ రాయిత్తాను. ఉత్తరాల్లో నేను రెండుసార్లు యాత్రలకెళ్ళాను. ఓసారి కాశీ ఎల్లాను. నిజానికి గిరిగాం దాటి ఎక్కడికీ పోలేదు" అన్నాడు రేచకుడు.

తిరుమలకి నోటమాట రావడంలేదు. "అసలు మీ ఆవిడ ఎలా పోయింది?"

"అది కొడుక్కోసం మనేద ఎట్టుకుంది. మజ్జిగైరమ్మ జాతరకీ, నూకాలమ్మ జాతరకీ తిప్పా. దాని కళ్ళల్లో పువ్వులేశాయి. నా దగ్గర దాచి వండుతూ సెయ్యి కాల్చుకునేది. ఓసారి నాతో తోటకొచ్చింది. దిగుడు బావిలో పడిపోయింది. వెన్నెముక విరిగిపోయింది. దాన్ని మంచమ్మీదనుంచి నేను వంటచేసి పెట్టాను. దగ్గరుండి ఉచ్చా, దొడ్డీ తీశాను. నీళ్ళుపోసి, చీర కట్టాను. సచ్చిపోయాక మా బుల్లోడు సెయ్యాల్సిన పని - తలకొరివి ఎట్టాను. అంతా ఈ సేతి కర్రతోనే" ఏడుస్తాడేమోనని అతన్ని చూశాడు. అటువంటి ఛాయలేమీ అతనిలో లేకపోగా, ఏ కొద్దిపాటి గర్వమో కనిపించింది.

"ఈ ఆడ లంజలమీద పేమ పెంచుకుంటే గోతిలో పడిపోతామయ్యా! మా యావిడి నా సేత అన్నీ సేయించుకుని నా ముందు కాళ్ళకి లంకేసేసింది. సచ్చిపోతూ పండు తిననని నాసేత ఒట్టేయించుకుంది" అన్నాడు.

తిరుమల నవ్వాడు "తల్లి చావునే కొడుకునుంచి దాచి మోసం చేస్తున్న మీరు మీ ఆవిడకిచ్చిన మాటని తప్పలేరా?" అన్నాడు. కత్తితో పొడిచినట్టు గింజుకుపోయాడు రేచకుడు ఆ మాటకి.

"కొడుకుని మోసం సేసేది ఆడ్ని బాధపెట్టే హక్కు నాకు లేదని. నా పెళ్ళాన్ని మోసం సెయ్యనిది దాచి సుఖపెట్టే అవకాశం ఇంక రాదని" ఈ మాటంటున్నప్పుడు రేచకుడి కనుకొలకుల్లో చిన్న మంచి ముత్యంలాంటి నీటిచుక్క తళుక్కుమంది.

నిట్టూర్చి లేచాడు తిరుమల. "మీ బుల్లయ్యకి ఏమయినా చెప్పమంటారా?" అన్నాడు.

గెంతుతూ వచ్చి "నువ్వు ఇక్కడ విన్నదీ, సూసిందీ ఏమీ చెప్పకు. తల్లికుక్క పిల్ల పుట్టగానే దాన్ని తినేత్తాది. కారణం తెలుసా? తన ప్రేమనుంచి ఆ పిల్ల దూరమయిపోతాదేమోనన్న భయంసేత. నా భయానికి ఆడి పీక కొరికీకుండా ఇన్నాళ్ళూ జాగ్రత్తపడుతున్నాను. రెక్కలొచ్చాక పిల్ల గూడులోంచి ఎగిరిపోకపోతే తప్పు తల్లిది కానీ, పిల్లది కాదయ్యా. పెపంచకాన్ని అలవాటు సేసి గూడులోంచి తోసెయ్యాల. నేనాపనే సేత్తున్నాను."

అప్రయత్నంగా రేచకుడి ఒక్కకాలికి వొంగి నమస్కారం చేశాడు తిరుమల. పాముని చూసినట్టు ఒక్క గెంతు వెనక్కి గెంతాడు.

"తప్పు బాబూ పెద్దింటి బిడ్డలాగున్నావు. నీ సేత దండమెట్టించుకునేంత సెడిపోలేదునేను. ఉండు" అని ఓ బస్తా ఇమాం పసందు నింపి, పాలేరునిచ్చి కారులో పెట్టించాడు రేచకుడు.

కారెక్కేముందు తిరుమల భుజం మీద చెయ్యేసి ఆపాడు. "వచ్చినప్పట్నుంచీ సూత్తున్నాను. నువ్వు తొడుక్కునే కోటు ఎంతుంటాది?"

నవ్వాడు తిరుమల. "కనీసం మూడువేలు."

బొడ్డులోంచి మడతలుపడ్డ నోట్ల కట్టలోంచి మూడువేలు తీసి "ఈ రంగు మా బుల్లోడికి శానా బాగుంటాది. ఈ అయ్య కొనిచ్చాడని ఆడికి నువ్వు కొనియ్యి" అన్నాడు.

కారు కదిలింది.

24

అమెరికాలో ఉంటూ ఇండియాకి వచ్చిపోయే భారతీయులు ఇక్కడ గడిపే రోజులన్నీ తూకంగా, లెక్కగానే గడుస్తాయి. విమానంలోంచి దిగినప్పటినుంచీ లెక్క ప్రారంభమవుతుంది. ఈ సమయం వాళ్ళని దాదాపు మూడేళ్ళు ఊరించే సమయం. మూడేళ్ళుగా ఎన్నో కలలతో భద్రంగా దాచుకున్న సమయం.

దీనిలో మొదటి పదిరోజులూ ప్రయాణం అలసట నుంచి సెటిల్ కావడానికీ ముద్దులూ కౌగిలింతలూ, ఫోన్‌కాల్సూ, భోజనాలూ విరోచనాలూ, మందులూ "ఐ యామ్ నాట్ వెల్. ఐ యామ్ ఆన్ డైట్"లకీ ఖర్చయిపోతుంది. తర్వాతి పదిరోజులూ ప్రయాణానికీ, తీసుకెళ్ళాల్సిన సామాన్లకీ, అమెరికాలో జీవితాన్ని వీలయినంత ఇండియనైజ్ చెయ్యడానికీ ఖర్చు చేస్తారు.

అమెరికాలో కనీసం నలుగురయిదుగురు పంచాంగాలూ, తెలుగు కాలెండర్లూ తీసుకురమ్మని పురమాయించారు. ఎమ్మెస్ భజగోవింద శ్లోకాలూ, విష్ణుసహస్రనామం పది కాసెట్లు కొన్నాడు. వచ్చేటప్పుడు అంతా అమెరికా మర్యాదతో సిల్వర్ చెంచాలూ, సిగరెట్టు పెట్టెలూ పంచుతారు. వెళ్ళేవాళ్ళు అందరికీ విష్ణుసహస్రనామం పంచుతారు. ఇండియన్ దేవుడు అమెరికాలో విశ్వరూపం దాల్చినట్టు ఇంకెక్కడా ఉండడు.

మరొక పాపులర్ వస్తువు ఒకటుంది. ఆంధ్రదేశంలో చాలామంది చెయ్యరు కానీ, అమెరికాలో ఏకాదశికీ పున్నమికీ సత్యనారాయణ వ్రతం చేసేవారున్నారు. వాటికి ప్రత్యేకంగా కాసెట్లున్నాయి. మంత్రాలమధ్య 'విఘ్నేశ్వరుడి మీద అక్షింతలు వెయ్యండి. 'మమ' అనుకోండిలాంటి పురోహితుడి సూచనలు కూడా ఉంటాయి. అలాగే యజ్ఞోపవీతం వేసుకునే మంత్రాల కేసెట్, పెట్టెల్లోకి షిర్డీ సాయిబాబా విబూది, తిరుమల వేంకటేశ్వరుడి లడ్డూ చేరాయి.

ఎప్పుడూ నడుం వంచి పనిచెయ్యని పాడ్ వంటింట్లో పనిచెయ్యడానికి పువ్వుల ఆప్రాన్‌లు కుట్టించింది. నాన్సీకి కంచి పట్టు పరికిణీ, మామిడిపిందెల నెక్లెసూ చేయించింది.

ఆ రోజుల్లోనే ఫాల్గుణశుద్ధ ఏకాదశి వచ్చింది. పద్మనాభంలో కుంతీ మాధవస్వామి కళ్యాణోత్సవాలు. తిరుమల వెంటరాగా కారులో సుభద్రాచార్యులు, వరదమ్మ పద్మనాభం వెళ్ళారు. ఆరోజు ఊళ్ళో వారికి పెద్ద పండగ. ప్రస్తుతం పోణంగిపల్లి వెంకటరామాచార్యులు గుడిని సేవిస్తున్నారు. బుల్లిరాజుగారికి ఆచార్యులవారొచ్చినట్టు కబురెళ్ళింది. ఎమ్మెల్యే భూపతిరాజుగారికీ తెలిసింది. ఆ రోజు మాధవస్వామికి జరగాల్సిన విష్వక్సేన పూజ, స్థాలీపాక హోమం వెనుకపడ్డాయి. ఆచార్యులవారినీ, వరదమ్మనీ రెండెడ్ల బండిమీద కూర్చోపెట్టి ఊరు రెండు ఫర్లాంగులూ ఊరేగించారు. బుల్లిరాజుగారు ఇరువురికీ అప్పటికప్పుడు పట్టుబట్టలు పెట్టారు. ఎమ్మెల్యేగారయితే భీమిలినుంచి బంగారు కడియం తెప్పించి ఆచార్యులవారికి తొడిగి కాళ్ళమీదపడిపోయాడు. మర్నాడు పేపర్లన్నీ ఎమ్మెల్యేగారి వినయసంపదనీ, ఔదార్యాన్నీ కొనియాడాయి. తిరుమల జీవితంలో గుర్తుంచుకునే మధురఘట్టం తల్లిదండ్రులకి పద్మనాభం ప్రజలు జరిపిన సత్కారం.

ఆరోజు మాధవస్వామికి కళ్యాణం ముగిసి, పూజలన్నీ అయ్యాక రామాచార్యులు సుభద్రాచార్యులవారి వెనుక నిలబడి వారు మంత్రపుష్పాన్ని పఠిస్తూండగా వంత పలికాడు. సాయంకాలానికి పాడ్ తప్ప మనవరాలితో సహా మరో కారులో రాఘవాచారి వచ్చాడు. పాడ్ ఎందుకు రాలేదు? ఆమె ఫ్రెండ్స్‌తో 'బ్రిడ్జ్ ఆన్ ది రివర్ క్వాయ్' సినిమాని రెండోసారి చూడడానికి వెళ్ళింది. సినిమా మీద ప్రీతితో కాదు. పద్మనాభం మీద ఏవగింపుతో.

ఏమయినా, రాత్రి ఇల్లు చేరేసరికి వరదమ్మకి కళ్ళు తిరిగి స్పృహ తప్పిపోయింది. తిరుమల వెంటనే ఒక నెఫ్రాలజిస్ట్‌నీ, ఒక కార్డియాలజిస్ట్‌నీ తీసుకొచ్చాడు. ఇద్దరూ ఆమెను పరిశీలించి తేల్చిందేమిటంటే ఆమె చాలా ఆనందంగా ఉన్నదనీ, ఆనందం అవధులు దాటి అలసటకి దారితీసిందనీ.

అమెరికానుంచి వచ్చినప్పట్నుంచీ కలుసుకోని వ్యక్తి ఒకరున్నారు. కూర్మయ్య అతనికి పెద్ద ఆక్సిడెంట్ జరిగిందనీ, అందులోంచి బ్రతికి బయటపడ్డాడనీ విన్నాడు. తీరా కూర్మయ్య పూతరేకులు, పాలకోవా పాకెట్‌తో ఇంట్లో కనిపించేసరికి ఆశ్చర్యపోయాడు. అన్నవరం వెళ్ళి నున్నగా గుండు చేయించుకున్నాడు. నుదుటిమీద ఏటవాలుగా నల్లటి చార తెలుస్తోంది. వస్తూనే సరాసరి తిరుమల పాదాలకి నమస్కారం చేశాడు. తిరుమల సిగ్గుపడిపోయాడు "వాటీజ్ దిస్?" అంటూ.

"మీరు నాకు మూడో గురువు. మొదటి గురువు కొడుకుల అవతారం, రెండో గురువు వడ్లమాని కామేశ్వరరావు" అన్నాడు.

కూర్మారావులో (ప్రస్తుతం మారిన పేరు) ఇదివరకు లేని ఏదో ఆకర్షణ కనిపిస్తోంది. ఆ ఆకర్షణ చదువుదీ, క్రమంగా ప్రోదిచేసుకుంటున్న సంస్కారానిదీ. అతనిలో కొట్టొచ్చినట్టు కనిపించే మరో గొప్ప ఆకర్షణ ఆ వినయం వెనుక పుట్టుకతో అబ్బిన ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ కూడా తొంగి చూస్తూంటుంది.

ఇద్దరూ ఆప్యాయంగా కబుర్లు చెప్పుకున్నారు. ఆ మాటల్లో ఒక్కసారి కూడా ఆండాళ్ళు ప్రసక్తిలేదు. కూర్మయ్య వచ్చినప్పుడు ఆండాళ్ళు ఇంట్లో లేదు. కనుక ఆమె తరఫునుంచి కూడా కూర్మయ్య ప్రసక్తి వచ్చే ఆస్కారం లేదు.

మరో రెండురోజులకి తిరుమల అమెరికా విమానం ఎక్కుతాడనగా సుభద్రాచార్యులుగారు కొడుకుకి తలంటు పోయించి కావిపంచె, ఉత్తరీయం ధరింపచేసి ఊర్ధ్వపుండ్రాలు స్వయంగా పెట్టి స్వయంగా ఉచ్చరిస్తూ తిరుప్పల్లాండు చదివించారు.

నందగోపుని కోడలు నీలని ఉద్దేశించి ఆండాళ్ళు ప్రవచించిన పాశురం ఆచార్యులవారికి చాలా ఇష్టం:

'కందుకము వ్రేళ్ళ సందిటను కలదాన!

అందమగు కురుల నెత్తావి కల లలన!

కుందనపు కంకణాల్ చిందులాడే పాడ

కెందమ్మి పోలేటి నీ సోగకేల‘

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి తెలుగుసేతని వివరిస్తూ చదివించారు.

పెరుమాళ్ళుకి కైకర్యం జరిపి, తీర్థగోష్టి చేశారు. ఆ రోజు మళ్ళీ అలనాటి పద్మనాభం వైభవాన్ని మనస్సులో నిలుపుకుంటూ తిరుమలని ఏడేళ్ళ చిన్నవాణ్ణి చేసుకుని చూసుకు మురిసిపోయారు.

తిరుమల జీవితంలో తండ్రికి సంబంధించిన మధురమైన జ్ఞాపకాల్లో అది ఆఖరుది. ఆ తరువాత మళ్ళీ అలాంటి అనుభవం అతనికి తటస్థపడలేదు.

ఆ సాయంకాలం కూర్మయ్య మిత్రులు పదిమంది పనికట్టుకు వచ్చి తిరుమలని కలిశారు. నిజానికి అతన్ని ఇంట్లోంచి బయటికి ఆహ్వానించి కొచ్చిన్ కేఫ్‌లో విందుచేసి కబుర్లు చెప్పారు. వాళ్ళు చెప్పినవి విన్నాక మతిపోయింది తిరుమలకి. వాళ్ళు వెళ్ళాక పిచ్చివాడిలాగా రాత్రి పదిగంటలదాకా బీచ్‌లో తిరిగాడు. భీమ్లీలో కూలిపోయిన కట్టడం గోడమీద కూర్చుని ఓ రాత్రికి అలసిపోయాక ఇల్లు చేరాడు. ఈ మూడేళ్ళ అమెరికా జీవనం అతని దృక్పథంలో, ఆలోచనలో  చాలా మార్పులు తెచ్చింది. తను బయట చాలా విశాలమయిన ప్రపంచాన్ని చూశాడు. దృక్పథంలో మార్పు వచ్చింది. ఆలోచనలు విశాలమయి, ఎదుటివ్యక్తి అభిప్రాయాలకి స్పందించే అవకాశాన్ని కల్పించాయి.

మర్నాడు ఉదయం ఆండాళ్ళుని పలకరించాడు - "ఇవాళ ఏం పనుందమ్మా?" అని.

"ఓసారి కాలేజీకి వెళ్ళాలన్నయ్యా"

"ఇవాళ కాలేజి మానేయ్. మనిద్దరం విజయనగరం వెళ్తున్నాం."

ఆశ్చర్యపోయింది ఆండాళ్ళు. అన్నయ్యతో కారులో కూర్చుంది. తగరపు వలస దాటేదాకా ఏం మాట్లాడలేదు తిరుమల. చెల్లెలి చేతిలో పెద్ద చాక్లెట్ల పాకెట్ కొనిపెట్టాడు. చెల్లెలికి చాక్లెట్లంటే చాలా ఇష్టం.

నేషనల్ హైవే వదిలి కారు విజయనగరం వైపు తిరిగాక మెల్లగా అడిగాడు "నేనడిగే ప్రశ్నలకి సూటిగా సమాధానం చెప్పు. నాకంటే దగ్గర మనుషులు నీకెవరూ ఉండరు. మనసులో ఉన్నది స్పష్టంగా చెప్పాలి. నువ్వు కూర్మయ్యని ప్రేమిస్తున్నావా?"

తలమీద పిడుగు పడ్డట్టయింది. మొదట్నుంచీ ఆండాళ్ళు పిరికిమనిషికాదు. భయపడే తరహా లేదు. ఆమెకి వెంటనే కోపం తలకెక్కింది.

"ఆ స్కాండ్రల్ చెప్పాడా నీకు?" అంది సూటిగా.

కూర్మయ్య స్నేహితులు ఆ మాట చెప్పినప్పటికంటే ఎక్కువ షాకయ్యాడు ఆమె కోపాన్ని, ధోరణినీ చూసి.

"అంటే నీకు కూర్మయ్యంటే"

"ఛీ! దీనికోసమే అయితే విజయనగరందాకా వెళ్ళక్కరలేదన్నయ్యా కారు వెనక్కి తిప్పు. ఐ డోంట్ వాంట్ టు డిస్కస్ ఎబౌటిట్"

కారు వెనక్కి తిరిగింది. ఇరవై రెండు మైళ్ళ ప్రయాణంలో, నలభై అయిదు నిముషాలు వ్యవధిలో వాళ్ళిద్దరూ మరొక్క మాట మాట్లాడుకోలేదు. మాట్లాడాలని తిరుమలకి తోచలేదు. చెప్పాలని ఆండాళ్ళుకి అనిపించలేదు. ఇద్దరూ రెండు రకాలయిన ప్రపంచాల్లో ఉండిపోయాడు. నిజానికి ఆ తరువాత జరిగిన నలభై ఎనిమిది గంటల్లో తిరుమల మద్రాదు రైలెక్కేవరకూ ఆండాళ్ళు అతనికి కనిపించలేదు.

అమెరికా భారతీయుల అద్భుత దృశ్యం ప్రతిసారీ అమెరికా వెళ్ళేటప్పుడు వారి వీడ్కోలు సంఘటన. అందరూ భోరుమని ఏడుస్తూంటారు. మళ్ళీ ఎప్పుడో ఎలాగో? అందరి మనసుల్లో అదే ఆలోచన.

జీవితమంతా దూరమవడానికి సిద్ధపడి మరో దేశంలో స్థిరపడిన భారతీయులు అప్పుడు తాత్కాలికంగా వేరవడానికి పడే విచిత్రమయిన యాతన అది.

ఈసారి నిరభ్యంతరంగా పాడ్ పాంటుతోనే వచ్చింది. రాఘవచారిగారు వాళ్ళకి మద్రాసులో వీడ్కోలు ఇవ్వడానికి వాళ్ళతోపాటే బయలుదేరాడు. భోషాణంలాంటివి ఆరు పెట్టెలు రైలెక్కాయి. తిరుమల స్టేషన్‌కి వచ్చిన సుభద్రాచార్యులకీ, వరదమ్మకీ పాదాభివందనం చేశాడు. ఎమ్మెల్యే భూపతిరాజు - సోంబడు, సవరబుడ్డడు వెంటరాగ పెద్ద దండతో వచ్చి తిరుమల మెడలో వేసి పెద్ద హంగామా చేసేశాడు. సంజీవి మంచిగంధం అగరొత్తులు, చక్కటి గోపాలకృష్ణుడి వెండిపటం తెచ్చి చేతిలో పెట్టాడు. అతనితో నవనీతం, కైకవశి, నారాయణ వచ్చారు. నారాయణకి ఎవరెక్కడున్నారో తెలీదు. ఆప్యాయంగా బుగ్గ తడిమాడు తిరుమల.

"మరో రెండేళ్ళపాటు నా మనస్సులో విడవకుండా నిలిచిపోయే విషయం చెప్పేదా?" అన్నాడు తిరుమల నవనీతం చెవిలో.

"ఏమిటది?"

"నీ కొడుకు నారాయణ. నీలాంటి మనిషితో కలిసి పెరిగినందుకు ఒక్కసారి బ్రాత్రూమ్‌లోకి పారిపోయి ఒంటరిగా ఏడవాలని ఉంది. అప్పటికి కానీ ఈ ఆనందంనుంచి నాకు విడుదల దొరకదు."

ప్రపంచం ఏమయినా అనుకోనీగాగ, సంజీవి చూడనీగాక, మునివేళ్ళమీద నిలబడి తిరుమల బుగ్గమీద ముద్దుపెట్టుకుంది నవనీతం.

రైలు కదిలే సమయానికి ప్రయాణం చేస్తున్నవారికీ, చూస్తున్నవారి కళ్ళల్లోనూ నీళ్ళు తిరిగాయి. వరదమ్మ భర్త గుండెలమీద తల ఆనించి వాలిపోయింది కొడుకునే చూస్తూ. ఆమె కళ్ళల్లో కొడుకు నీళ్ళమధ్య వెయ్యి ముఖాలుగా కనిపిస్తున్నాడు.

ఆండాళ్ళు సరాసరి మెడికల్ కాలేజీ మెన్స్ హాస్టల్‌కి వచ్చేసింది. మెరుపుతీగలాగా ఉన్న అందమయిన అమ్మాయి అలా హాస్టల్‌కి రావడం అదే మొదటిసారి. అప్పటికే ఆండాళ్ళు ఎవరో, ఆమె ఎవరికోసం వచ్చిందో దాదాపు అందరికీ తెలుసు. కూర్మయ్య ఏక్సిడెంట్‌తో విశాఖపట్నమంతా భగ్గుమంది. వయస్సులో ఉన్న కుర్రాడి ఆకస్మిక మరణానికి అంతా జాలిపడ్డారు ఆ స్కూటర్ మీద మరో కుర్రాడు బతికినందుకు అంతా నిట్టూర్చరు. హాస్టల్ విద్యార్థులకి మాత్రం ఆ సంఘటన వారి మనస్సులో ఒక అపూర్వమైన 'లవ్‌స్టోరీ'గా స్థిరపడింది. ఆండాళ్ళువంటి అందమైన అమ్మాయిని దక్కించుకోవడానికి కూర్మయ్యకి ఎదురైన ఏక్సిడెంటుకయినా సిద్ధపడొచ్చునని చాలామంది కుర్రాళ్ళు భావించారు. ముఖ్యంగా ఫైనలియర్ చక్రవర్తి. చక్రవర్తి మెడికల్ కాలేజీ హీరో. మంచి నటుడు ఎక్కువగా చదువు వంటబట్టకుండా నాలుగేళ్ళుగా ఫైనలియర్ చదువునే సాగిస్తున్న మెడికో అతనికి 'ది గ్రాండ్ ఓల్డ్‌మాన్ ఆఫ్ వివింసి' అని బిరుదు. ఎక్కువ సంవత్సరాలు గడిపిన కారణంగా కాలేజీలో చిన్న గాంగ్‌కి లీడర్. సీనియారిటీ దృష్ట్యా చిన్న చిన్న సౌకర్యాలకి అలవాటుపడ్డాడు. అవసరమయినప్పుడు అరకోడి కూర, అరబాటిల్ విస్కీ, మిఠాయి కిళ్ళీ ఉచితంగా ఇచ్చే భక్తులున్నారు.

ఆండాళ్ళు వచ్చేటప్పటికి కూర్మయ్య హాస్టల్లో లేడు. చక్రవర్తికి కబురందింది. హాస్టల్ వరండాలన్నీ స్టూడెంట్స్‌తో నిండిపోయాయి. ఓ అందమైన ఆడపిల్ల హాస్టల్లో ఉందన్న వార్త నిప్పులాగా రాజుకుంది. కూర్మయ్యకోసం కొన్ని బృందాలు వెదకడానికి బయలుదేరాయి.

చిరిగిపోయిన లుంగీకి మాసికలు వేయించుకుని రెల్లివీధివైపు నుంచి నడిచి వస్తున్న కూర్మయ్యకి రెండు బులెట్ మోటారు సైకిళ్ళు ఎదురొచ్చాయి. ఆశ్చర్యంగా చూశాడు కూర్మయ్య.

"మొదట మోటార్ సైకిలెక్కరా హీరో" అన్నాడు ఫ్రెండ్

కూర్మయ్య ఎక్కాడు.

హాస్టల్ వరండానిండా మనుషులు. అర్థంకాలేదు కూర్మయ్యకి. తన రూమ్ దగ్గర అరుగుమీద కూర్చుని ఎదురుచూస్తోంది ఆండాళ్ళు. అలనాడు వర్షంలో కలిశాక ఇదే ఆ అమ్మాయిని చూడడం. అందంగా, గొప్పగా, గాజుబొమ్మలాగా ఉంది.

ఆశ్చర్యపోయాడు. కూర్మయ్యని చూసి లేచింది ఆండాళ్ళు. అతనివైపు రెండడుగులు వేసింది. సినిమాలో క్లైమాక్స్ సన్నివేశంలాగ అంతా గమనిస్తున్నారు.

"నాలుగురోజుల కిందట మా అన్నయ్యని కలిశావా?" అంది. మాటలో హీనభావం స్పష్టంగా తెలుస్తోంది.

కూర్మయ్య తలూపాడు.

అంతే! చాచి ఫెడీల్మని చెంపమీద కొట్టి విసవిసా నడిచి వెళ్ళిపోయింది.

ఆ శబ్దం ఆ చుట్టుపక్కల హాస్టల్ అంతటా తుపాకిలాగా ప్రతిధ్వనించింది.

25

ఉన్నట్టుండి ఓ విచిత్రమైన సంఘటన జరిగింది. రాత్రి మూడోఝామున వరదమ్మ సన్నటి గొంతుతో ముప్పయి సంవత్సరాలు పాతబడిన పాట వినిపిస్తూనే తుళ్ళిపడి లేచింది ఆండాళ్ళు.

బృందారక సందోహముతో

వందారు మౌనిబృందంతో

పెందిరువడిపయి పెరుమాళ్ళే, శ్రీ

మందిరమును విడి తరలేనే -

పాట వినిపిస్తోంది. ఆ పాటలో ఎప్పుడో మూడు దశాబ్దాల కింద సెలవు తీసుకున్న వయస్సు హొయలు పలుకుతోంది. అంత మధురంగా తల్లి పాడగా ఎప్పుడూ వినలేదు. అది చిన్ననాటి తల్లి జ్ఞాపకం. ఆండాళ్ళుకి భయమేసి తండ్రిని లేపింది. పెళ్ళిచూపుల్లో ఇరవై తొమ్మిదో పాశురాన్ని పాడుతోంది వరదమ్మ.

"ఆలమేపి బ్రతికే ఈ బేలలలో ఒకడవై

అవతరించుటేల? మా

అనుగవు కానేల?"

పాటలో ఆమె తాదాత్మ్యం, భక్తి ప్రపత్తి పరవశుల్ని చేసింది ఆనాటి సుభద్రాచార్యుల యువక రక్తాన్ని. సాక్షాత్తూ శూడిక్కొడుత్త నాచియార్ (ఆముక్తమాల్యద) స్వామికి తాను ధరించి మాలలను సమర్పించిన గోదాదేవి స్ఫురణకొచ్చింది. జీవితం ఎన్నో దశలను గడిచి ఆ అనుభూతులమీద తెర కప్పింది. ఒక్కసారి అలనాటి అనుభవాలు కళ్ళముందు కదిలాయి. చటుక్కున లేచాడు. ఆండాళ్ళూ తండ్రి వెంట నడిచింది.

వారిద్దరికీ పెరటి వసారాలో కనిపించిన దృశ్యం దిగ్భ్రాంతుల్ని చేసింది. ఎర్రటి కావిపట్టు చీర మడిసార కట్టుకట్టి జుత్తుని మీదకి శిఖలాగా దువ్వి, మల్లెపువ్వుల్ని అలంకరించుకుని ఉంది వరదమ్మ. కాళ్ళకి పసుపు పారాణి. ముఖమంతా చక్కని పసిమితో వెలిగిపోతోంది. నుదుటిన రూపాయంత బొట్టు. అపస్మారంలో కళ్ళు నిమీలితాలయ్యాయి.

పాటలో భాషకంటే భావం త్రోసుకువచ్చి మాటని అస్పష్టం చేసింది. అప్పటికి టైము రెండు దాటింది. ఎప్పట్నుంచి వరదమ్మ ఇలా కూర్చుంది? ఉన్నట్టుండి ఏమిటీ వేషం? ఎప్పటిదీ ఆవేశం?

ఇద్దరూ వచ్చి నిలుచున్న స్పృహ ఆమెకి లేదు. సుభద్రాచార్యులు వంగి "వరదా!" అని పలకరించారు. కళ్ళు విచ్చుకోడానికి ప్రయత్నించాయి. పాట నిలిచిపోయింది. గోడని ఆనుకున్న శరీరం మెల్లగా నేలమీదకి జారిపోయింది. వరదమ్మ స్పృహ తప్పింది. తల్లి తలని ఒడిలోకి లాక్కుని భోరుమంది ఆండాళ్ళు.

ఏదో పోగొట్టుకున్న మనస్సు అన్నీ సమృద్ధిగా ఉన్న దశలోకి పారిపోతోంది. ఈ దశలో బలమైన లోపం ఉంది? చెప్పుకోగల శక్తి, తట్టుకోగల ధైర్యం ఆ మనస్సుకి లేదు. తనకి తోచిన ఆటవిడుపుని మనస్సే వెతుక్కుంటోంది. దీనిని 'ఫిట్స్' అంటామా? ఎమోషనల్ రిటార్డేషన్ అంటామా?

వరదమ్మ ముఖంలో అలవికాని ఆనందం కనిపిస్తోంది. అది ఈ దశది కాదు. వర్తమానానికి సంబంధించినది కాదు. గుర్తుపట్టారు సుభద్రాచార్యులు.

"తిరుమలా నీకోసం మీ అమ్మ చేస్తున్న త్యాగంరా ఇది" అన్నారు బయటికి. ఆ మాట ఇంకా భయపెట్టింది ఆండాళ్ళుని.

జయవాణి ఉద్యోగంలో ఇంక్రిమెంటు వచ్చింది. వెంకటాచెలం రోగం ఇదివరకు కన్నా మరింత రెచ్చింది. ఒకపక్క ఉద్యోగ బాధ్యతలూ, మరొకపక్క తనని నమ్ముకున్న భర్త బాధ్యతలూ ఆమెని హైరానా పెట్టడం వెంకటాచెలం దృష్టికి రాకపోలేదు.

వెంకటాచెలం ఆలోచనలపుట్ట. సమస్యలకి పరిష్కారాలను అప్పటికప్పుడు ఊహించడంలో, వాటిని అమలు పరచడంలో మరింత దిట్ట.

ఓరోజు ఉదయం లేచేసరికి మాటకూడా కొంత నట్టువడి శరీరంలో కదలిక మరింత ఎక్కువయి ముఖమంతా పాలిపోయింది. మొదటిసారిగా బాత్రూమ్‌కి వెళ్ళడానికే ఓపిక లేదని జయవాణికి చెప్పలేకపోయాడు. అయితే 'సేవ'ని వృత్తిగా చేసుకున్న కారణంగానేకాక, సేవించడం ప్రేమగా అలవాటు చేసుకున్న జయవాణి అతన్ని కమోడ్‌లో కూర్చోపెట్టి అతనికి ఏమాత్రం విసుగుదలా, ఏహ్యాభావం కనిపించకుండా బాత్‌రూమ్‌లో పోసి వచ్చింది.

అప్పటికి వెంకటాచెలం కళ్ళల్లో నీళ్ళు కనిపించాయి. అయితే వెంకటాచెలానిది ఏడిచే మనస్తత్వం కాదు. గర్వంగా ఏడిచే వాళ్ళ కన్నీళ్ళు తుడిచే నిఖార్సయిన మనస్తత్వం.

'ఇలారా' అని జయవాణికి సంజ్ఞ చేసి, దగ్గరకి వచ్చిన జయవాణి పాదాలకి కుర్చీలోంచే నమస్కారం చెయ్యబోయి ఆమె పాదాలమీద పడిపోయాడు. జయవాణి హడలిపోయింది. అంతకుమించి చలించిపోయింది.

"నేనేదో గొప్ప ఉపకారం చేస్తున్నానని బాధపడకండి. మానవజాతి ఆనందం కోసం తన ప్రాణాల్ని ఫణంగా పెట్టిన జీసస్ మాకు ఆదర్శం, సేవ మాకు కష్టంకాదు, గమ్యం" అంది.

వెంకటాచెలానికి జయవాణి ఆ క్షణంలో వందడుగుల ఎత్తు మనిషిగా కనిపించింది. ఆ క్షణంలోనే అతని జీవితంలో ఓ ముఖ్యమైన నిర్ణయాన్ని తీసుకున్నాడు. తీసుకుని, వెంటనే అమలుకు అన్ని ప్రయత్నాలూ ప్రారంభించాడు.

విక్టోరియాలో యౌవనం వెల్లివిరిసింది. ఆమెలో జయవాణి గాంభీర్యం, వెంకటాచెలం ఠీవి తగుపాళ్ళలో చోటుచేసుకున్నాయి. ఎప్పుడూ కలుపు మొక్కలో ఆరోగ్యం పాలు ఎక్కువ. హీనమైన దృష్టితో అంటున్న మాట కాదు, శాస్త్రీయపరమైన నిజం. రెండు మతాల, రెండు దృక్పథాల, రెండు జాతుల సమన్వయం విక్టోరియా, రెండు రీతుల సమీకరణకూడా.

ఆమె భవిష్యత్తుని గర్వంగా చూడాలని కలలు కన్నాడు వెంకటాచెలం. రాబోయే కాలం ఆమె ముందు విశాలంగా పరుచుకున్నా, తనకి చాలా దుర్భరం కాబోతోంది.

కట్‌స్లీవ్స్ బనీను తొడిగి, మాక్సీలో కాలేజీకి తయారయిన విక్టోరియాని దగ్గరికి పిలిచి నుదుటిమీద ముద్దుపెట్టుకున్నాడు వెంకటాచెలం. ప్రస్తుతం తన మాటలు వాళ్ళిద్దరికీ అర్థమవుతున్నాయి.

"నిన్ను హఠాత్తుగా చదువు మానిపిస్తే నామీద కోపం వస్తుందా అమ్మా?" అన్నాడు. ఆశ్చర్యంగా చూసింది విక్టోరియా. ఆవేశంగా మరింత ఆర్ద్రమయి ఆకులాగ అల్లల్లాడిపోతున్న అతని రెండు చేతుల్నీ కదలకుండా పట్టుకుంది. "నువ్వు మా డాడీవి. ఏ పనీ కారణం లేకుండా చెయ్యవని నాకు తెలుసు. ఈ క్షణంలో నిప్పులో దూకమన్నా నేను రెడీ" అంది.

అంత నిండయిన మనిషి నీరయిపోయాడు. ఏడుపు తరంగంలా తోసుకొచ్చింది. తండ్రిని తల్లయి అక్కున చేర్చుకుంది విక్టోరియా.

"మతాలమీద నాకు నమ్మకం లేదమ్మా. ఏ దేవుడు నాకు వరమిస్తాడో తెలీదు. ఆ ఇచ్చే దేవుడి పాదాలు ఒకే ఒక్కసారి పట్టుకు అడుగుతాను. నన్ను వచ్చే జన్మలో నీ కడుపున పుట్టించమని"

ఆ క్షణంలో విక్టోరియా భయపడింది తండ్రిని చూసి, ఆర్ద్రత పార్కిన్సన్ రోగానికి శత్రువు - ధైర్యవంతుడూ, అహంకారి అయిన తండ్రి చాలా తేలిగ్గా రోగానికి లొంగిపోతున్నాడు.

"డాడ్" అని అతని ముఖాన్ని పుణికిపుచ్చుకుంది.

ఆ దుఃఖాన్ని కూతురు నుంచి దాచడానికి ఎంత దొంగతనం కావాలి. ఆ నటనకి రోగం తనకు శక్తి నేం మిగిల్చింది?

అంతా సినిమాల్లోలాగా నిముషాల్లో జరిగిపోయింది.

ఆండాళ్ళు తన స్నేహితురాలి ఇంటికి హవామహల్ దగ్గరకి వెళ్ళివస్తోంది. ఆ రోజుల్లో పట్టపగలే ఆ స్థలం నిర్మానుష్యంగా ఉంటుంది. చుట్టూ ఎర్రమట్టి దిబ్బలు. దుర్మార్గుడి ఆత్మబలంలాగా నిటారుగా, నమ్మకంగా నిలబడి అతడి సంకల్పానికి చెయ్యి సాయం చేస్తున్నట్టుంటాయి.

అప్పటికి సాయంకాలం ఆరయింది.

ఉన్నట్టుండి రోడ్డుకి అటుపక్క పాతకాలపు అంబాసిడర్ ఆగింది. అందులో సినిమాల్లోలాగే నల్ల కళ్ళద్దాలు పెట్టుకున్న నలుగురున్నారు. ఒకరు మాత్రం స్పష్టంగా తెలుస్తున్నారు. అతను మెడికల్ కాలేజీ పెద్దదిక్కు. ది గ్రాండ్ ఓల్డ్‌మాన్ ఆఫ్ వీఎంసి చక్రవర్తి.

"మైడియర్ ఆండాళ్ళూ" అని పిలిచాడు.

ఆ పిలుపులో అరబాటిల్ బిస్కత్ బ్రాందీ ఇవ్వగలిగినంత మాధుర్యం ఉంది, మత్తు ఉంది.

ఆ పిలుపు తుపాకీలాగా ఆండాళ్ళు నసాళానికి అంటింది. ఆమెలో కోపం నసాళం దాటి ఆకాశాన్ని తాకింది. అలా ఎవరు పిలవగలరో ఆమెకి తెలుసు. ఎవరీ పని చేస్తున్నారో ఆమె ఊహించగలదు. ఆ స్కాండ్రల్ కూర్మయ్య. ప్రథమకోపానికి ఓ దుర్గుణం ఉంది.

కారణాలు మనస్సుకు హత్తేలోగానే నిర్ణయాలు తీసేసుకుంటుంది. ఆమె ఆలోచనలు ఒక దారికి వచ్చేలోగానే ఆ సాయంకాలపు వెలుగులో ఆ కారులో చీకటిలో కూర్మయ్య కనిపించాడు. అది పచ్చకామెర్లరోగి లక్షణం.

ఆ రోగాన్ని బాగా ఔపోసన పట్టిన పాటి వైద్యం నేర్చుకున్నాడు చక్రవర్తి.

గొప్ప గొప్ప మర్డర్ కేసుల్లో గొప్పగొప్ప పొరపాట్లు జరుగుతుంటాయి. దానికి కారణం మానస మనస్తత్వమే.

పోలయ్యకీ, వెంకయ్యకీ శతృత్వం - పోలయ్య వెంకయ్యని చంపించాలని పన్నాగం పన్నాడు. (తమరు ప్రొద్దుటూరు, కడప ప్రాంతాలకు వెళ్తే ఈ కథ ఇప్పటికీ నడుస్తూంటది) దారిలో వెంకయ్య జీపుని నలుగురు మనుషులు ఆపారు. బాంబులు పేల్చారు. జీపు డ్రైవరు చచ్చిపోయాడు. వెంకయ్య కొనప్రాణంతో ఉన్నాడు. పోలీసులు ఎప్పటిలాగే అంతా ముగిశాక వచ్చారు. వెంకయ్య దగ్గర వాగ్మూలం తీసుకున్నారు. వెంకయ్యకి తనని ఎదిరించి చంపిన నలుగురూ ఎవరో తెలీదు. కానీ ఒక్కటి మాత్రం తెలుసు. పోలయ్యే ఈ పని చేయించాడని. వాగ్మూలంలో నలుగురి పేర్లు చెప్పలేకపోయాడు. తెలిసిన పోలయ్య పేరు ఒక్కటే చెప్పాడు. చచ్చిపోయాడు. పోలయ్య ఆ క్షణంలో తిరుమలలో వెంకటేశ్వరస్వామి కళ్యాణం చేయిస్తున్నాడు. అందుకు దేవుడే సాక్ష్యం. ఇద్దరు నేరస్తులు దొరికారు. కానీ హతుడు చెప్పిన పోలయ్యకి గట్టి ఎలిబీ ఉంది. కనుక ఆరేళ్ళ తర్వాత కేసుని న్యాయస్థానం కొట్టేస్తుంది.

ఇప్పుడు కారు దాకా నడిచిన ఆండాళ్ళు మనస్సులో కూర్మయ్యే ఉన్నాడు. ఆ కూర్మయ్య ప్రస్తుతం కారులో లేడు.

"ఏరా! నా మీద దౌర్జన్యం చేస్తావురా?" అని హూంకరించింది.

ఆండాళ్ళు దమ్మున్న మనిషి. దమ్మునే నమ్ముకున్న మనిషికి విచక్షణ ఉండదు. ఆమె ప్రస్తుతం కూర్మయ్యని ఎదిరిస్తోంది. కానీ కారులో కూర్మయ్యతో ప్రమేయంలేని నలుగురున్నారు. ఆ నలుగురూ ఒక్కసారి ఆమెను కారులోకి లాగారు. కారు దూసుకుపోయింది.

పదిహేనేళ్ళ ముసలికారు శబ్దంలో ఆండాళ్ళు నాజూకయిన కేక కలిసిపోయింది. రెండోసారి వేసిన కేకని, ముక్కుని గట్టిగా - ఆవరించిన అనెస్థీషియా మత్తు బయటకి రానీయలేదు.

వెంకటాచెలం తన పడకగదిలో మెత్తని దిండ్ల మధ్య ఉన్నాడు. అతని కాళ్ళమీద పల్చటి దుప్పటి ఉంది. చదువుకోడానికి పుస్తకాలు బోలెడన్ని ఉన్నాయి. కానీ చదివే స్థిమితం లేదు.

ఆకలి వేస్తే అందుకు తినడానికి అందుబాటులో పళ్ళున్నాయి. కొంచెం శ్రమపడి పోసుకోగలిగితే ఫ్లాస్కులో కాఫీ ఉంది. కానీ ఆ పని చెయ్యడానికి అవకాశం ఇవ్వని రోగం ఉంది.

అవసరం వస్తే అందుకుని ఫోన్ చెయ్యడానికి దగ్గర్లోనే ఫోను ఉంది. తప్పనిసరయితే ఫోన్ చెయ్యవలసిన నంబర్లు - అంబులెన్స్, ఎమర్జెన్సీ, ఏవిఎన్ కాలేజీ ప్రిన్సిపాల్, వరహాలశెట్టి ఆసుపత్రి, పోలీసు కంట్రోల్ రూమ్, ఫైర్ అలారం సర్వీసు ఇలాంటివన్నీ వరుసగా, స్పష్టంగా వ్రాసి ఉన్నాయి. కానీ ఏ ఫోనూ చెయ్యగలిగిన శక్తి లేదు.

జయవాణి ఆసుపత్రికి వెళ్ళేముందు వెంకటాచెలానికి అన్ని అవసరాలూ తీర్చి, ఇస్త్రీ చొక్కా మార్చి, నుదుటిమీద ముద్దుపెట్టుకుని బయట తాళం వేసుకుని వెళ్ళిపోతుంది. అలాంటి తాళం మరొకటి విక్టోరియా దగ్గర ఉంటుంది. తాళం వేసిన ఇంట్లో ఒంటరిగా వెంకటాచెలం ఉంటాడు.

అతన్ని ఒంటరిగా వదిలిపోవడం ఆ ఇద్దరి ఉద్దేశం కాదు. జీవితాన్ని లొంగదీసుకుని దాన్ని సజావుగా నడిపే పని జయవాణి చేస్తోంది. ఆ లొంగదీసే అర్థతల్ని విక్టోరియా మరోచోట సంపాదించుకుంటోంది. ఇద్దరికీ వెంకటాచెలం అంటే ప్రాణం. వెంకటాచెలానికి ఏడుప్రాణాలు. అయిదు శరీరంలో, రెండు బయటా ఉన్నాయి.

మరి ఏమిటి సమస్య?

**జీవితంలో** ఈ ప్రశ్నకి సమాధానాలు కోట్లు ఉన్నాయి. ఎందుకంటే జీవితాలూ కోట్లకొద్దీ ఉన్నాయి కనుక.

వెంకటాచెలం ముందుచూపు కలవాడు. విక్టోరియా చదువుకి రెండు లక్షలు బ్యాంకులో వేశాడు. పెళ్ళికి మరో రెండున్నర లక్షలు దాచాడు. ఆ రోజుల్లో (ఆ డబ్బు ఈనాటి పాతికలక్షలు) జయవాణి అసమర్ధురాలు కాదు. తను సంపాదించి కట్టిన ఇల్లూ, రిటైరయినప్పుడు వచ్చిన పైకం అన్నీ ఉన్నాయి.

జీవితమంతా ఆనందాన్నిచ్చిన శరీరం అవసానంలో ఈడిగిలపడుతూంటే వదిలి పోవడానికి మనస్సు గింజుకుంటుంది. అది విచిత్రమయిన మమకారం. వదిలిపెట్టడానికి ఆత్మీయులు విలవిలలాడుతారు. అది అర్ధంలేని విశ్వాసం.

ఉపయోగంలేని వస్తువుని పట్టుకుని ఊగిసలాడటం వెంకటాచెలం మనస్థత్వం కాదు. స్వాధీనం కాని తన శరీరాన్ని మరొకరు సాకడం అతని స్వభావం భరించలేదు. అతనిలోని అహంకారం మీద పడిన తీవ్రమైన దెబ్బ అది.

జీవితాన్ని గర్వంగా, హుందాగా, నిజంగా, నిండుగా గడపలేని వ్యక్తికి ఓ మార్గం ఉంది. ఆ మార్గాన్ని సుగమం చేసి సిద్ధం చేసుకున్నాడు వెంకటాచెలం.

మేడమీద అద్దెకుంటున్న మేజర్ సజ్జన్‌సింగ్ ఆరడుగుల మూడంగుళాల మనిషి. పచ్చగా దబ్బపండులాంటి ఛాయ, ఖంగుమనే గొంతు, ఉంగరాలు తిరిగిన గడ్డం. శరీరానికి అక్కరలేనంత తినీ తినీ శరీరం మోయలేనంత బరువుని పెంచుకుని, పాదాల దగ్గర కీళ్ళు విరగ్గొట్టుకున్నాడు. ఆ రోజుల్లో ఏం తిని హరాయించేవాడో చెప్పడం అతనికి సరదా. ఆ రోజుల్లో రోజూ ఒకటిన్నర సీసాల రమ్ తాగేవాడు. ప్రస్తుతం అతి కష్టమ్మీద దాన్ని తొమ్మిది పెగ్గులకి కుదించాడు. అతనికి వెంకటాచెలం మీద అమితమయిన గౌరవం. ఈ రోగం వచ్చినప్పట్నుంచీ అమితమయిన జాలి. సెలవులు వచ్చినప్పుడల్లా వెంకటాచెలంతో పార్టీకి కూర్చుని, అతడు తాగలేకపోయినా రెండు పెగ్గులు తాగించి ఆనందించడం ఓ సరదా. అతనికి రివాల్వర్ లైసెన్సు ఉంది. డ్యూటీ లేనప్పుడు, ఉన్నప్పుడూ దాన్ని పట్టుకు తిరుగుతాడు. ఇంతవరకూ ఒక్కసారి కూడా దాన్ని కాల్చి ఎరగడు. డాక్టరు ఇంజక్షన్ ఇవ్వడం (మరొకరికి) చూస్తేనే ఏడ్చేంత సున్నితమయిన మనస్సు.

మూడురోజుల క్రితం రివాల్వర్ ఉపయోగాల గురించి పదో పెగ్గులో గంటన్నర ఉపన్యాసమిచ్చాడు సజ్జన్‌సింగ్ వెంకటాచెలానికి. ఆ ఉపయోగాలు ఆరు. శత్రువుల్ని ఎదిరించడం, ప్రాణాల్ని తీయడం, మగతనానికి నిదర్శనం, గర్వకారణం, నలుగురి మధ్యా మనమంటే ఓ ప్రత్యేకత, చావుని తన చెప్పుచేతల్లో ఉంచుకున్న అహంకారం.

సజ్జన్‌సింగ్ ఒక్కటి చెప్పడం మరిచిపోయాడు. అక్కరలేని జీవితానికి ముగింపు రాసుకునే హక్కునిస్తుంది. ఆ రోజు సింగ్‌ని పన్నెండో పెగ్గు తాగనిచ్చి రివాల్వర్ దొంగతనం చేశాడు వెంకటాచెలం.

మర్నాడు శరీరంలో చక్కెర ఎక్కువయి ఆసుపత్రిలో చేరాడు సింగ్. అందుకనే వెంటనే రివాల్వర్ గుర్తురాలేదు.

ఆ రోజే జయవాణి వెంకటాచెలం నుదుటిన ముద్దుపెట్టుకు వెళ్ళింది. వెళ్తున్న భార్యని పిలిచాడు "జయా!"

ఆగింది.

"చెప్పడానికి మళ్ళీ అవకాశం రాదేమో నాకీ రోగం అంటే చాలా ఇష్టం. ఎందుకో తెలుసా? ఇది నిన్ను దేవతని చేసింది కనుక"

ఈ సారి బుగ్గమీద ముద్దుపెట్టుకుని వెళ్ళింది జయవాణి. వీధి మలుపు తిరిగేదాకా కిటికీలోంచి చూశాడు.

కాలేజీకి వెళ్తున్న విక్టోరియాని దగ్గరకు తీసుకుని "రేపు పెళ్ళయ్యాక నీకు కొడుకు పుడితే తప్పకుండా నా పేరే పెట్టమ్మా అది తప్పక నేనే అవుతాను."

"ఇప్పుడున్నావు కదా నాన్నా" అంది నవ్వుతూ.

"అప్పుడుంటానో లేదోనమ్మా" అన్నాడు వెంకటాచెలం నవ్వుతూ.

దువ్వెన తెచ్చి నాన్న తలని అందంగా దువ్వి బయటికి నడిచింది. తనకి చిరకడితే విక్టోరియా. తన నుంచి తనే ఆ క్షణంలో సెలవు తీసుకున్నాడు.

అతి కష్టం మీద ఓ వాక్యం అద్దమ్మీద లిప్‌స్టిక్‌తో రాశాడు. "నా తిరుగుబాటు ఈ జీవితం మీద కాదు. ఈ జీవితం సాయంకాలం మీద" ఆ తర్వాత అలసిపోయాడు.

కుర్చీలో మడతలు పడకుండా చొక్కానీ, లుంగీని సరిచేసుకుని అద్దంలో తనని తాను మరొక్కసారి చూసుకున్నాడు. ఈ రోగిష్టి వెంకటాచెలం తనుకాడు. తనని వెక్కిరించే మరెవరో. ఇతను తన జీవితానికి పారిహాసిక.

అప్పుడు రివాల్వర్ కణత దగ్గర ఉంచుకుని బలంగా ఊపిరి పీల్చుకుని మీట నొక్కాడు.

**26**

ఆ రోజుల్లో బీచ్‌లో తీర్థపురాళ్ళు దాటితే ఎర్రదిబ్బల మధ్య పట్టపగలు హత్య చేసినా ఎవరికీ తెలిసే ఆస్కారం లేదు. అంతా నిర్మానుష్యం. పిట్టమనిషి అటువైపు కనిపించేవాడు కాదు. వెళ్ళడానికి దారికూడా లేదు .ఆ ఎర్రగుట్టల మధ్య నేలకంటుకుని వ్యాపించిన జీడిమామిడిచెట్ల నీడలో మత్తుగా కళ్ళిప్పింది ఆండాళ్ళు.

ఆమె వెంటనే చక్రవర్తిని గుర్తుపట్టలేదు. జరిగిన సంఘటన స్ఫురణకి రావడానికి కాస్త టైమ్ పట్టింది. తీరా వచ్చాక ఎదురుగా కూర్మయ్య కనిపిస్తాడనుకుంది. అనుకుంటోందని చక్రవర్తి గ్రహించాడు. అప్పటికి బిస్కత్ బ్రాందీ మూడొంతులు సీసా పూర్తయింది. చార్మినార్ సిగరెట్టు బ్రాందీ వాసనని తేలిగ్గా జయిస్తోంది.

"నిన్ను కూర్మయ్య ఇలా బలవంతంగా లాక్కొచ్చి రేప్ చేస్తాడని ఆశపడ్డావో, లేక భయపడ్డావో నాకు తెలియదు. ఐయామ్ సారీ ఇప్పుడు జరుగుతున్నదేదీ కూర్మయ్యకి తెలీదు. నేనే నా అంతట నేనే చేశాను. రాజూ పాపకి ఒక సిలేస్ ఫోర్ట్ టాబ్లెట్, లెమన్ జ్యూస్ ఇవ్వరా" అన్నాడు.

ఇచ్చిన రెండూ పుచ్చుకోలేదు ఆండాళ్ళు. తాచుపాములాగా లేచింది.

"నన్నెందుకు తీసుకొచ్చావ్?"

"నువ్వు క్లియోపాత్రావీ, గ్రేటాగార్బోవీ, అనితా ఎక్బర్గ్‌వీ కాదని చెప్పడానికి."

"యూ..." అని చెయ్యెత్తింది.

"కొడితే తలవంచుకుని భరించడానికి నేను కూర్మయ్యని కాను. చెయ్యి దించు. చెప్పేది విను. వినిపించడానికే నిన్నిక్కడికి తీసుకొచ్చాను" అని ఆమెను ఎర్రదిబ్బమీదకి తోశాడు చక్రవర్తి.

పడిన దెబ్బకంటే, ఎక్కడో ఆమె అహంకారం దెబ్బతింది. ఆమెకి దుఃఖం తోసుకొచ్చింది. కానీ ఏడ్చే మనస్తత్వం కాదు ఆండాళ్ళుది. పెదాలు నొక్కిపెట్టి దుఃఖాన్ని పట్టుదలగా మార్చే 'పోజ్'ని సాధించింది.

"నన్ను మా కాలేజీలో అంతా రౌడీ అంటారు. కానీ ఆ లక్షణాలు నాలో లేనందుకు ఇప్పుడు బాధపడుతున్నాను. ఉంటే" పళ్ళు బిగించాడు.

"నువ్వు కూర్మయ్యకి చేసిన పనిలో సగం నాలాంటివాడికి చేసి ఉంటే నిన్నీపాటికి పగ తీర్చుకోడానికయినా రేప్ చేసేవాడిని. వాట్ డూ యూ నో ఆఫ్ కూర్మయ్య?"

తలెత్తింది ఆండాళ్ళు.

"తయారు కాబోయే రేపటి డాక్టర్ల తరానికి రోల్ మోడల్ కూర్మయ్య. నీకు వర్షంలో గొడుగుపట్టిన పాపానికి పది సర్జరీ క్లాసులు నష్టపోయాడు. తన ప్రాణమిత్రుడు చచ్చిపోవడం చూశాడు. చావుకి దగ్గరగా వెళ్ళి బతికాడు. నువ్వు ఆసుపత్రిలో సేవ చేశావని చెపితే ఏడ్చాడు.

'ఆమె నిన్ను ప్రేమిస్తోందిరా' అంటే బూతు మాట విన్నట్టు చెవులు మూసుకున్నాడు. నీకు కృతజ్ఞత చెప్పుకోడానికి కూడా నీ ముందుకు రాకపోవడానికి కారణం నువ్వు తనని అసహ్యించుకుంటావని."

ఆండాళ్ళుకి అతను చెప్పే మాటలకన్నా పరిస్థితి అర్థమయింది. చక్రవర్తి వల్ల తనకి భయంలేదు.

"ఈ మాటలన్నీ విని నేనే రాస్కెల్ కాళ్ళమీద పడతాననుకుంటే..." అంటూ ఉండగానే ఆండాళ్ళు చెంప ఛెళ్ళుమనిపించేలాగా కొట్టాడు చక్రవర్తి.

"నాకు బాధగా ఉంది. ఎందుకో తెలుసా? కూర్మయ్యని నువ్వు కొట్టిన దానికి సాక్ష్యం కాలేజీ అంతా ఉంది. నేను నీ చెంప పగలగొట్టిన సాక్ష్యం ఈ నలుగురూ తప్ప ఎవరూ లేరే అని."

ఉక్రోషం వచ్చింది ఆండాళ్ళుకి. 'నీ భాషణ పూర్తయితే నేను వెళ్ళొచ్చా?" అని లేచి నిలబడింది.

కూర్మయ్యకి జరిగినదానికి ప్రతీకారం చెయ్యాలనుకున్న తన ఉద్దేశం చిన్నాభిన్నమయిపోతోందని అర్థమయింది చక్రవర్తికి. ఈమెలో పట్టుదల కేవలం ఈ వ్యక్తిది కాదు. ఈ జాతిది, ఈ కులానిది, ఈ పుట్టుకది.

"ఆసుపత్రిలో కూర్మయ్యకి సేవ చేసింది ప్రేమతో అనుకున్నాను, గిల్ట్‌తో అని ఇప్పుడర్థమయింది. ఐ యామ్ సారీ, ఆ దృష్టితోనే మీ అన్నయ్యని కలిశాం. నీ ప్రేమ గురించి చెప్పాం."

తుళ్ళిపడింది ఆండాళ్ళు. "వాట్? కూర్మయ్య చెప్పలేదా?"

నవ్వాడు చక్రవర్తి. "కూర్మయ్యకి నీమీద ప్రేమ ఉంటేగా చెప్పడానికి, అతనికి నువ్వంటే భక్తి ఉంది. ఇప్పుడు భయం ఉంది. నిజానికి నీ నుంచి దూరంగా ఉండడానికే కాకినాడ మెడికల్ కాలేజీకి ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నాడు. స్కాలర్ షిప్ పోతుందిరా అన్నా వినిపించుకోలేదు"

ప్రతీమాటా రివాల్వర్ తూటాల్లాగ తగులుతున్నాయి ఆండాళ్ళుకి. పసిపిల్లలాగా ఆండాళ్ళు చక్రవర్తి చేతులు పట్టుకుని అడిగింది. "ఒక్కటి చెప్పండి కూర్మయ్య నా గురించి మీ అందరితో" ఆమెకి తెలియకుండానే చక్రవర్తిని 'మీరు' అంది.

నవ్వాడు చక్రవర్తి. "మరో పదేళ్ళు శ్రమపడితే తప్ప కూర్మయ్య స్వభావం నీ కర్థంకాదు. దేవుడు ప్రత్యక్షమయి మోనాలిసాని అతని ముందు నిలబెడితే సిగ్గుతో తలొంచుకుని తోవనిస్తాడు."

మరో తుపాకీ దెబ్బ.

"సంస్కారం పుట్టుకతో అబ్బే గుణం కాదని నిన్ను చూస్తే కాదు కూర్మయ్యని చూస్తే బాగా అర్థమవుతుంది. ఇంతకాలం నీలాంటి అమ్మాయిని దక్కించుకున్నందుకు కూర్మయ్యని చూసి ఈర్ష్యపడ్డాం. ఇప్పుడు నీ నుంచి బయటపడ్డ అదృష్టానికి కూర్మయ్యని చూసి ఈర్ష్యపడతాం. ఓ.కే గ్రేటాగార్బో! గుడ్ బై" అని ఫ్రెండ్సు వైపు తిరిగి, "ఈ బుట్టబొమ్మని ఊళ్ళో వదిలేసి రండిరా" అన్నాడు.

కారు ఎక్కడం, ఊళ్ళోకి రావడం ఆండాళ్ళుకి గుర్తులేదు. జీవితంలో మొదటిసారిగా కూర్మయ్యని కలుసుకోవాలని కోరిక కలిగింది. ఇలాంటప్పుడు తన మనస్సుని విప్పి చెప్పుకోడానికి ఎవరైనా మనిషి కావాలి. ఎవరా మనిషి?

గుమ్మంలో ఆండాళ్ళుని చూడగానే, ఒక్క గెంతు గెంతి ఆమెని ఒడిసి పట్టుకుంది కైకవశి. పుట్టినప్పట్నుంచీ తల్లికాక, తనని తెలిసిన మరో వ్యక్తి కైకవశి. అమాంతం కావలించుకుని ముద్దులు పెట్టుకుంది. అంతే. అంతవరకు బిగువుగా నిలుపుకున్న గాంభీర్యం జారిపోయింది ఆండాళ్ళుకి. కైకవశి సమక్షంలో చిన్ననాటి పసిబిడ్డ అయిపోయింది. ఆమె భుజం మీద తలవాల్చి భోరుమంది. కంగారు పడిపోయింది కైకవశి. పలకరించడానికి మాటలు లేవు. ఆ శబ్దానికి మెట్లు దిగుతున్న నవనీతం పరుగున వచ్చింది. కైకవశి చేతుల్లో పసిబిడ్డలాగా ఏడుస్తున్న ఆండాళ్ళుని చూసి నివ్వెరపోయింది. ఇద్దరూ కలిసి ఆమెను స్థిమితపరిచారు. నవనీతం గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చింది.

కాస్సేపటికి మామూలు మనిషయింది ఆండాళ్ళు. మెల్లగా జరిగినదంతా విపులంగా చెప్పింది.

రామాయణాన్ని రావణుడు చెపితే ఎలా చెపుతాడు? "అభిరుచితో ఓ కుర్రాడి పెళ్ళాన్ని నా దగ్గరకు తెచ్చుకుంటే, కోతుల్ని అడ్డం పెట్టుకుని నా దేశాన్ని కాల్చుకుతిన్నాడు. అతని పేరు రాముడట" ఇలాగే ఏదో చెప్పేవాడేమో.

'అభిజాత్యం' పెట్టుబడిగా పెరిగిన ఆడపిల్ల జరిగిన కథని తనపరంగా చెప్పింది. అందులో కూర్మయ్య అనే నిమ్నజాతి ప్రేమికుడూ, అతన్ని సమర్ధించే చక్రవర్తి అనే విలనూ అంతా ఉన్నారు.

అసలు కైకవశి నుంచీ, నవనీతం నుంచీ ఆండాళ్ళు ఆశించిందేమిటి? సానుభూతా? సహకారమా? ఓదార్పా? సలహానా? ఆ క్షణంలో భోరుమనే స్థలం కావాలి. అక్కున చేర్చుకుని ఓదార్చే వ్యక్తి కావాలి. కైకవశి ఆ పని చేసింది. మరి నవనీతం?

ఆ పరిస్థితిలో ఏ సానుభూతిపరురాలైనా చేసే పనే చేసింది. "దీనికింత బాధపడతావెందుకు? మా ఆయనతో చెపుతాను. ఆ దౌర్భాగ్యుడు కూర్మయ్య అంతు తేలుస్తాను."

"నో..నో..నో ఇది కాదు నేనాశించింది."

"అయినా, నీలాంటి గొప్ప పుట్టుక పుట్టిన అమ్మాయివేపు కళ్ళెత్తి చూడడానికి వాడికెంత పొగరు?"

"అయ్యయ్యో.. అదికాదు అతని గురించి ఆలోచించాల్సింది."

సంజీవి వచ్చాడు ఏమిటంటూ.

"ఒక్కసారి మా అన్నయ్యతో ఇక్కడినుంచి మాట్లాడవచ్చా?" అంది.

"ష్యూర్" అంటూ నంబర్లు తిప్పాడు సంజీవి.

ఉన్నట్టుండి తిరుమలతో మాట్లాడతాననడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. అటుపక్క గొంతు వింటూనే సంజీవి చేతిలోంచి ఫోన్ లాక్కుంది నవనీతం.

"ఎలా ఉన్నావు చినబాబూ?" అంది. ఆ పలకరింతలో ఆత్మీయుల వాత్సల్యం ఎక్కువ ధ్వనించింది. ఏ స్వార్ధానికీ ఆస్కారంలేని తల్లి ప్రేమ ప్రతిఫలించింది.

ఆ మాటలు అలా సాగిపోయేవే కానీ, ప్రస్తుతం మాట్లాడాల్సింది ఆండాళ్ళని భుజం గిల్లి గుర్తు చేశాడు సంజీవి భార్యకి. అప్పుడు తన పరవశంలోంచి బయటికి వచ్చింది.

"బాబూ నా ఎదుట ఆండాళ్ళుంది. అవును. మీ చెల్లాయే. పద్మనాభంలో ఆ కమ్మరి కొడుకు కూర్మయ్యలేడూ అతను చిన్నపాపని అల్లరిపెడుతున్నాడట. కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ వచ్చి అమ్మ చేతుల్లో వాలిపోయింది. మా అందరికీ ఆండాళ్ళుని చూసి గుండె తరుక్కుపోయింది" ఇంకా ప్రసంగం సాగేదేకానీ, నవనీతం చేతిలోంచి టెలిఫోన్ లాక్కుంది ఆండాళ్ళు.

"ఆ రోజు నన్ను విజయనగరం తీసుకెళ్తూ ఓ ప్రశ్న అడిగావు గుర్తుందా అన్నయ్యా 'కూర్మయ్యని నువ్వు ప్రేమిస్తున్నావా' అని. ఆ రోజు సమాధానం చెప్పలేదు. ఇప్పుడు చెపుతున్నాను. ఎస్. కూర్మయ్యని ప్రేమిస్తున్నానన్నయ్యా. ఐ లవ్ హిమ్, ఐ లవ్ హిమ్. ఐ లవ్ హిమ్"

నవనీతం నిర్ఘాంతపోయింది. కైకవశి అర్థంకాక వెర్రిచూపులు చూసింది. ఏమీ చూడలేని కుర్రాడొకడు వాళ్ళ మధ్య ఉన్నాడు. ఆ కుర్రవాడి పేరు నారాయణ. అందరిమధ్యా నాజూకయిన ఆండాళ్ళు చెయ్యిని అందుకుని, అందులో ఓ చాక్లెట్ ఉంచి పిడికిలి మూశాడు.

**27**

ఆ తర్వాత రెండు రోజులూ ఏమీ జరగలేదు. తుఫాను ముందు వ్యాపించిన ప్రశాంతత అది. తర్వాత ఏం జరుగుతుంది? ఏం జరగాలి? తన మనస్సులో మాట తెలిసిన అన్నయ్య అమెరికా నుంచి ఏం చేస్తాడు? ఎందుకనో తన మనస్సులో ఆ ఆలోచన స్థిరపడ్డాక, ఆ ఆలోచనని అన్నయ్యతో పంచుకున్నాక ఆండాళ్ళు మనస్సు తేలికయిపోయింది.

రెండురోజుల తరువాత కాలేజీ నుంచి ఆండాళ్ళు ఇంటికొచ్చేసరికి వసారాలో కూర్మయ్య కనిపించాడు. స్థంభానికి ఆనుకుని తల్లీ, నులకమంచం మీద సుభద్రాచార్యులూ కనిపించారు. హాస్టల్‌లో కూర్మయ్యని కొట్టాక ఇదే చూడడం అతన్ని. ఆసుపత్రి నుంచి బయటికి వచ్చినప్పటికంటే చాలా నీరసంగా జబ్బు మనిషిలాగా కనిపించాడు. ఆండాళ్ళుని చూసి లేచి నిలబడ్డాడు బితుకుబితుకుమంటూ. కూర్చోమని ఆచార్యులవారు సంజ్ఞ చేశాక తప్పనిసరిగా కూర్చున్నాడు. పులి ముందు నిస్సహాయంగా దారులు వెదుక్కుంటున్న లేడిపిల్లలాగా కళ్ళు కదులుతున్నాయి.

మొదటిసారిగా కూర్మయ్య అనే మనిషిని పరిశీలనగా చూసింది అతని ముఖంలో చాలామందిలో కనిపించని సంస్కారం కనిపిస్తోంది. జుత్తు మీదకిపోయి, మరికొద్దికాలంలోనే బట్టతల అయ్యే సూచనలు తెలుస్తున్నాయి. పెదాలు నల్లగా ఉన్నాయి. జీవితంలో ఏ విషయం మీదయినా నిర్దుష్టమయిన అభిప్రాయాన్ని ఏర్పరుచుకోగల పట్టుదల ఆ పెదాల్లో తెలుస్తోంది. అయితే శరీరానికి మించిన సౌందర్యాన్ని చూడటం అప్పుడే అలవాటు చేసుకుంది ఆండాళ్ళు.

ఎప్పుడూ కూర్మయ్యతో సన్నిహితంగా కానీ, స్నేహపూర్వకంగా కానీ మాట్లాడలేదు ఆండాళ్ళు. అతన్ని తను ప్రేమిస్తున్నదన్న విషయం కూర్మయ్యకి తెలిశాక మొదటిసారిగా తన తల్లిదండ్రుల సమక్షంలో మాట్లాడాలి. ఇంతకంటే అగ్ని పరీక్ష ఉండదు.

"హాయ్" అంది క్లుప్తంగా.

అదీ అనలేదు కూర్మయ్య. "చిన్నయ్యగారు అమెరికా నుంచి ఫోన్ చేశారు. నేను... మీరు.."

"ఆయన్ని చిన్నయ్యగారనక్కరలేదు నువ్వు. అన్నయ్యతో నేనేం మాట్లాడానో నాకు గుర్తుంది."

"మీరు చేస్తున్నది. అదే, మీరనుకుంటున్నది మంచిది కాదు. నాకు పెద్దస్వామిగారంటే గొప్ప భక్తి. వారికిలాంటి అన్యాయం జరగకూడదు. అది చెప్పిపోదామనే వచ్చాను. నేను త్వరలో ఇక్కడినుంచి కాకినాడకి వెళ్ళిపోతాను. ఆ తర్వాత నా సంగతి మీకు తెలియకుండా జాగ్రత్తపడతాను" కూర్మయ్య లేచి దూరం నుంచే సుభద్రాచార్యులవారి పాదాలకి నమస్కరించి వెళ్ళిపోయాడు.

"ఈ అమ్మాయిని నేనూ ప్రేమిస్తున్నాను. ఆ మాట చెప్పడానికే నేనొచ్చాను" అంటాడేమోననుకుంది ఆండాళ్ళు.

కూర్మయ్య మాటలు వెన్నుపోటులాగా అనిపించాయి. అన్నయ్యతో చెప్పిన తన నిర్ణయాన్ని పరిహాసం చేస్తున్నట్టనిపించింది.

"కూర్మయ్యా ఆగు. నన్ను పెళ్ళిచేసుకోవడం నీకిష్టం లేదా?" అరిచింది. అది కేవలం కోపంతో, తిరుగుబాటుతో అన్నమాటే. ఆ ప్రశ్నలో కన్విక్షన్ కంటే, తన తల్లిదండ్రుల నిశ్శబ్దాన్ని ఛేదించడానికి వాడిన ఆయుధం.

వీళ్ళు నన్ను తిట్టరేం?

గుమ్మంలో ఆగి వెనక్కి చూశాడు కూర్మయ్య.

"నువ్వు వెళ్ళు, బాబూ" అన్నారు సుభద్రాచార్యులుగారు లేస్తూ కూర్మయ్య వెళ్ళిపోయాడు. వెంటనే నూతి దగ్గర చల్లటి నీళ్ళు నెత్తిన గుమ్మరించుకుని పెరియాళ్వార్ తిరుమొళిని బిగ్గరగా చదవడం ప్రారంభించారు. అంత ఉచ్ఛ్వస్వరంతో తండ్రి ఎన్నడూ చదవడం ఆండాళ్ళు గమనించలేదు. 'రండి, ఈ కుటుంబాన్ని ఏ ఆళ్వారయినా కాపాడండి. నా బిడ్డకి ఇంత జ్ఞానబోధను చేయించండి' అని మొరపెట్టుకుంటున్న ఆర్తి ఆ ధ్యానంలో ధ్వనించింది.

మళ్ళీ రెండుగంటలసేపు ఆ ఇంట్లో నీరవ నిశ్శబ్దం. ఆ రాత్రి తండ్రి భోజనం కాకుండా ఆండాళ్ళుని భోజనానికి లేవదీసింది వరదమ్మ. ఏమీ అర్థం చేసుకునే స్పృహలో లేదు ఆండాళ్ళు.

రెండు ముద్దలు నోట్లోకి వెళ్ళాక సుభద్రాచార్యులవారు ఎదురుగ్గా పీట వేసుకు కూర్చున్నారు. "లేచిపోలేని సమయం ఇదొక్కటే అని నిన్ను భోజనానికి కూర్చోపెట్టాను. తిను" అన్నారు కూతురితో. ఎంతో సంయమనంతో మాట్లాడినా, ఆ గొంతులో తప్తత తెలుస్తోంది.

"చిన్నీ! నీకు జ్ఞానం వచ్చే వరకూ నిన్నేమని పిలిచేవాడినో తెలుసా? అమ్మమ్మా అని. మా మాతమహి చాలా అమాయకురాలు. నైష్ఠికురాలు. ఆవిడని ఎక్కువ నాకు తెలీదు. మా అమ్మ చెప్పేది. ఎంచేతనో ఆమెని చూడాలని నా తహ తహ. ఎలా? నువ్వు మీ అమ్మ కడుపున పడ్డాక మా అమ్మమ్మని పిలుచుకున్నాను. నువ్వు పుట్టకముందే నీకు అమ్మమ్మ పేరు పెట్టుకున్నాను" గోడకి తల ఆనించి కాస్సేపు అవాక్కయిపోయారు.

"క్రమ శిక్షణాయుతమయిన ప్రవృత్తి నిష్ఠ ఈ వంశానికి జీవగర్ర. ఓ కథ చెప్తాను విను. ఒకప్పుడు రంగనాథుని సేవించడానికి ఇద్దరు కుష్ఠురోగులు వచ్చారు. వారిని చూసి దివ్యప్రబంధాన్ని విణ్ణప్పం శెయ్‌వార్ ఈసడించుకున్నారు. ఆ ఈసడింపువారికి కుష్ఠుగా మారింది. అంతఃకరణ శుద్ధమయ్యాక ద్వారకానాథుడు వారికి ఆరోగ్యాన్ని ప్రసాదించారు. వారి శ్రీపాద సన్నిధిలోనే నిత్యకైంకర్యం చేస్తూ విణ్ణప్పం శెయ్‌వారు తరించారు. కారణం ఏదయినా మలినపడిన వ్యక్తిని ఈసడించుకోరాదని వైష్ణవ సంప్రదాయం. మన జీవితాన్ని మన పూర్వ కర్మలు నిర్దేశిస్తాయి. నీ కర్మని సంస్కరించే శక్తి నాకెక్కడిది. నిన్ను అసహ్యించుకోకుండా జాగ్రత్తపడతాను. అందువల్ల నా కర్మ సిద్ధాంతం దెబ్బ తింటుంది కనుక."

"శిఖ తీస్తేనే తీర్థగోష్ఠికి నోచుకోని ఈ ఇంట్లో నువ్వు చేసే పనికి పరిణామమేమిటో నీకు తెలియకపోదు. నువ్వనుకున్నట్టు నువ్వు చెయ్యదలిస్తే, ఈ ఇంట్లో ఇది ఆఖరి భోజనం. నేనూ, అమ్మా ఎదురుగ్గా కూర్చుని నీ చేత తినిపించాలని ఆగాం. ఈ తర్వాత నాకు మా అమ్మమ్మ ఉండదు. నీకూ నీ తల్లిదండ్రులు ఉండరు. పాపకి ఆ గిన్నెలో ఉన్న మీగడంతా వొడ్డించు" అని లేచిపోయారు.

అమ్మ అద్భుతంగా పక్వం చేసిన సిద్ధాన్నం కన్నీళ్ళతో నీరు కారిపోయింది. పీటమీంచి లేచిపోయింది ఆండాళ్ళు. చెయ్యిపట్టుకు ఆపింది వరదమ్మ. "వద్దమ్మా! ఆఖరి భోజనం అభాసు చెయ్యకు" అంది.

**కష్టానికి చిహ్నం కన్నీళ్ళు.** కష్టానికి ఆటవిడుపూ కన్నీళ్ళే. దుఃఖం చాలా కష్టాలనుంచి విముక్తినిస్తుంది. అది సృష్టిలో ఏర్పాటయిన అపూర్వమైన వరం. దానిని ఉగ్గపట్టడం ఒక్కొక్కప్పుడు ప్రమాదం. విపరీతం కూడా. అందుకనే ఊహించలేని విపరీత పరిణామంలో తల్లిదండ్రుల నిర్లిప్తత తిరుమలని భయపెట్టింది. భోరుమనే తల్లిని ఓదార్చడం సుళువు. గంభీరంగా చిరునవ్వు నవ్వే తల్లి మనస్సులో కరడు కట్టిన దుఃఖపు శిలని ముందు బద్దలు కొట్టాలి. దాన్ని కరగనివ్వాలి. అప్పుడు ఓదార్పు. కానీ ఆ పనులు చెయ్యగల సామగ్రి తన దగ్గర లేదు. ఆ సామగ్రిని సమకూర్చుకోగల అనుభవమూ లేదు. కానీ ఒక్కటిమాత్రం ఉంది. ఆవేదనకి లోనయిన వ్యక్తులపట్ల సానుభూతి. తండ్రికి ఆ సానుభూతి అవసరం లేదు. తల్లికి అవసరమని తెలీదు. విచిత్రమైన వ్యక్తుల మధ్య విచిత్రమైన సందిగ్ధంలో పడిపోయాడు.

వచ్చినప్పటినుంచీ ఎక్కడికీ వెళ్ళకుండా తల్లిని అంటుకుపోయాడు. ఉదయాన్నే తండ్రితో స్నానం చేసి నూతన యజ్ఞోపవీతధారణ చేశాడు. "అపవిత్రః పవిత్రో వా..." చదివించి బ్రాహ్మచర్య, గార్హస్థ్య, ఆతిథేయ ఉపవీతాలను ధరించాడు. వచ్చీరాని భాషలో గోడకి చేరబడి తిరుప్పళ్ళాండు, పూచ్చురల్ చదివాడు. చిన్ననాటి తిరుమలని భూతద్దంలో చూస్తున్నట్టు గమనించి వరదమ్మ నవ్వుకుంది.

ఇవన్నీ మనస్ఫూర్తిగా చేసిన పనులు కాదు. మనస్సుని సముదాయించుకోడానికి చేసినపని. అమెరికాలో పాతివ్రత్యం నిరూపించుకోవడానికి పసుపు రాసుకున్నట్టు. అమెరికాకి స్కిన్ లోషనే కావాలి. ఆముదాలవలసకి పసుపు చాలు. డిట్రాయిట్ ఇంజనీరు ఇరవై ఏళ్ళ తరువాత విశాఖపట్నంలో `తిరుప్పళ్ళాండు` చదవబోవటం అలాంటిదే

రెండు రోజుల తర్వాత ఆ పని బోరుకొట్టింది. పుస్తకం పక్కన పారేసి లేచాడు. కూర్మయ్యతో, ఆండాళ్ళుతో మాట్లాడాడు. అన్నయ్య గొంతు విని చెల్లెలు పొంగిపోయింది. "ఇటు రారా?" అన్నాడు కూర్మయ్య. వెంటనే గొప్ప ఆలోచన తిరుమల మనస్సులో మెరిసింది. "రేపే వస్తున్నాం" అన్నాడు.

"వస్తున్నాం" అంటాడేమిటి?

రాత్రి తల్లితో మాట్లాడాడు. "చెల్లాయిని చూడ్డానికి వస్తావా అమ్మా?" అని. వరదమ్మ వణికిపోయింది. అమెరికానుంచి వచ్చాక ఆమెలో కనిపించిన మొదటి చైతన్యమిది. వైద్యుల దృష్టిలో గాయం బాధపెట్టాలి. బాధ లేకపోతే రోగం ముదిరినట్టే. అమ్మయ్య! ఈమెలో ఆవేదన ఉంది. కాకపోతే దానిమీద బలమైన ముసుగు ఉంది.

సుభద్రాచార్యులవారిని అడిగే ధైర్యం, రమ్మనే ధైర్యం లేదు తిరుమలకి. మరునాడు కారు మాట్లాడి వచ్చాడు. తల్లిని కాకినాడ తీసుకెళ్తున్నాడని తెలిసి ఆచార్యులవారు మొదట ఆశ్చర్యపోయారు. తిరుమల ఉద్దేశానికి కాదు. భార్య ఉద్యుక్తతకి. కిమ్మనలేదు.

అప్పటికప్పుడు ఓ మిత్రుడినడిగి ఖాళీగా ఉన్న ఓ ఇంటి పోర్షన్‌ని అద్దెకి తీసుకున్నాడు తిరుమల. ఉండేది కాసిని రోజులయినా తల్లిని హోటల్‌లో ఉంచడం ఇష్టంలేక. రెండు గదులు, చిన్న వసారా, ఎదురుగ్గా పెద్ద మైదానం, పక్కవాటాలో పదిమంది పిల్లల అరుపులూ, కేకలూ ఆ ఇల్లు మిట్టమధ్యాహ్నం వీథిబడిని గుర్తుచేస్తుంది.

వంటకి అవసరమైన వస్తువులన్నీ కొని తెచ్చాడు. ఆ సాయంకాలమే ఆండాళ్ళు, కూర్మయ్య వచ్చారు. ఇల్లు వదిలి వెళ్ళిపోయాక కూతుర్ని అదే చూడటం వరదమ్మ.

స్త్రీకి వివాహం ద్వారా దక్కే సౌభాగ్యమంతా ఆండాళ్ళులోనే కనిపిస్తోంది. ముఖానికి పసుపు రాసుకుని స్నానం చేసిన ఛాయలు తెలుస్తున్నాయి. మెడలో మంగళసూత్రం ధగధగా మెరుస్తోంది.

తల్లిని చూసి ఉప్పొంగిపోయి, ఆమె కౌగిట్లోకి దూకింది. ఆవేశంగా వరదమ్మ కూడా ముందుకొచ్చింది.

''ఆండాళ్ళూ'' అని ఆమెను ఆపింది కూర్మయ్య.

ఒక్క క్షణం అంతా స్థబ్ధు అయిపోయారు.

''సంచిత పాపం ఈ జన్మలో మా ఎడబాటు. ఆగామి పాపం నా బిడ్డని ఆదరించడం. అది పాపమయితే మరో జన్మ ఎత్తి అనుభవిస్తాను'' అని ఆండాళ్ళుని గుండెలకి హత్తుకుంది వరదమ్మ. దూరం నుంచే కూర్మయ్య వరదమ్మకి సాష్టాంగపడిపోయాడు. తిరుమలకి కళ్ళనీళ్ళు తిరిగాయి.

తన సౌశీల్యానికి పెద్దల ఆశీర్వాదం ఇప్పటికి దొరికినట్టు మురిసిపోయింది ఆండాళ్ళు.

''నీ చేతి అన్నం తిని చాలా రోజులయిందమ్మా నీ చేతి వంకాయ కూర గురించి కూర్మయ్యకి చెప్పి ఊరిస్తూంటాను'' అంది ఆండాళ్ళు.

''దానికేం? ఇవాళ వండిపెడుతుంది మనందరికీ'' అన్నాడు తిరుమల తడువుకోకుండా.

''రేపు'' అంది వరదమ్మ.

తన బిడ్డలిద్దరూ రెండు కారణాలకి పంక్తి బాహ్యులు. ఒకరు ఆచారాన్ని తప్పినవారు, మరొకరు సంప్రదాయాన్నే తప్పినవారు. ఉదయమే లేచి అభ్యంగనస్నానం చేసి, ముగ్గురికీ అద్భుతంగా వంట చేసింది. మామిడికాయ పప్పు, వంకాయ మెంతికూర, పులిహోర, కొబ్బరి పచ్చడీ, నిమ్మరసం చారు ముగ్గురికీ వసారాలో విస్తళ్ళు వేసి వడ్డించింది.

శ్రీ భాష్యంలో రామానుజులు గర్వం అభిమాన అహంకారాల్ని చండాలునితో పోల్చారు. ఆ దుర్గుణాలు ఈ ముగ్గురిలోనూ లేవు. వారికి వండి వడ్డించడం నీతి బాహ్యమేమో గాని, ధర్మ విరుద్ధం కాదు. ముగ్గురూ సుష్టుగా భోజనం చేయడాన్ని గుమ్మం దగ్గరే కూర్చుని గమనించింది వరదమ్మ. ఆమె కడుపు ఆనందంతో నిండిపోయింది. అపరాహ్ణానికి మళ్ళీ స్నానం చేసి, ఇంత అత్తెసరు పెట్టుకుని స్వామి కైంకర్యాన్ని ఆరగించింది.

అలా పదిరోజులు. ఆ పదిరోజులూ ఆ ముగ్గురికీ పెద్ద పండగలు. ఆ పదిరోజులూ ఆ తల్లికి అపూర్వమైన జ్ఞాపికలు. పదిరోజుల్లోనే ఎంతో కళకళలాడుతూ తేరుకున్నట్టనిపించింది ఆండాళ్ళుకీ, తిరుమలకీ.

పదకొండోరోజున డిట్రాయిట్ నుంచి ఫోన్. అతని అవసరం వెంటనే ఉన్నదని. అమెరికా వెళ్ళింది లగాయతు తల్లిదండ్రులకు దూరమైన ఒక్క కారణం వినా, మరేదీ మాతృదేశంవైపు తిరుమలని ఆకర్షించలేదు. ఇప్పుడు ఈ పదిరోజుల ఆనందమూ అతన్ని కట్టి పడేసింది. అయినా వెళ్ళాలి. ప్రతి ఆనందానికి ఓ ముగింపు ఉంది. ఈ ఆనందం ఇప్పటికి ఇక్కడ నిలిచిపోవాలి.

కారు కదులుతూంటే ఆండాళ్ళు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కానీ వరదమ్మ కళ్ళల్లో నీళ్ళు కదలలేదు. ఆండాళ్ళు కడుపు తడివి, ''నీ కడుపులో ఒక్క కాయ కాయాలి. వాడికి కులశేఖరుడని పేరు పెట్టు. బతికుంటే వచ్చి పెరుమాళ్ తిరుమొళిలో రెండు పాశురాలయినా నేర్పిస్తాను. ఇన్న ముదం ఊట్టుగేన్ ఇంగే వా పైంకేళియే'' అంటూనే కారెక్కింది. మిగతా పాశురం గాలిలో లాక్కుపోయాయి.

ఆండాళ్ళుని అంత పవిత్రమైన కుటుంబంనుంచి దూరం చేసినందుకు వెయ్యోసారి బాధపడ్డాడు కూర్మయ్య. అమ్మ బతికుండేలోగానే కులశేఖరుడు పుట్టాలనే కోరిక ఆ క్షణంలోనే ఉద్బుద్ధమయింది. కూర్మయ్య చేయి ఆర్ద్రంగా పట్టుకుంది ఆండాళ్ళు.

ఈసారి మొదటిసారిగా ఇండియా వదిలి వెళ్తున్నందుకు గిలగిలలాడిపోయాడు తిరుమల.

తల్లిదండ్రులిద్దరికీ పాదాభివందనం చేశాడు. తల్లిని దగ్గరకు తీసుకుని, ''నువ్వెప్పుడు పిలిచినా వచ్చి వాలుతానమ్మా'' అన్నాడు. వరదమ్మ కరిగి నీరయి కొడుకుని కావలించుకుంది.

ఎందుకన్నాడామాట? ఒక్క వేదవ్యాసుడు, ఆది శంకరులే ఆ మాటని నిజం చెయ్యగలిగారు. ఇద్దరూ సాక్షాత్తూ భగవత్స్వరూపులు కనుక. ఆ ఆలోచన చాలమందికి సామాన్యం కావచ్చు. కానీ ఆచరణలో ప్రాప్తాప్రాప్తాలున్నాయి. సంచిత కర్మపరిపాకం ఉంది. ఆ తల్లికీ పూర్వపుణ్య విశేషం కలిసిరావాలి. పోతే, రంగనాథుని సన్నిధిన కన్నుమూయాలి. లేదా కనీసం పుత్రుని సన్నిధిలో అన్నది నానుడి.

అది కోరికతో కలిసివచ్చేది కాదు. పుట్టినప్పటినుంచీ, లౌకిక జీవితం వేసే ఎన్ని లక్షల ముడులు తెగిపోవాలో ఆ సుకృతం కలిసిరావడానికి. ఆచార్య తిరువడి సన్నిధికి ప్రయాణం చేసే జీవికి పుత్రుని సన్నిధి పున్నామనరక విముక్తికి హామీ. ఇది ఈ జీవనానికీ, పరమార్థానికీ లంకె. అది తెగుతుందో. తెంచుకోవాలో ఆ క్షణం ఆసన్నమయ్యేవరకూ ఎవరికీ అర్థంకాదు.

30

ఆ తర్వాత బతికినంతకాలం ఆనందోత్సాహంతో, సంతృప్తితో జీవనం సాగించింది వరదమ్మ. నిజానికి ఆమె జీవితంలో మధురమైన దశ అదే దీపం కొడిగట్టేముందు మెరిసే ప్రకాశం కాదది. నిజమైన, నిండైన వెలుగు.

అనునిత్యం ఆమె తన బిడ్డలిద్దరికీ తిరుమల, ఆండాళ్ళుకీ సేవలు చేస్తూనే గడిపింది. వారిద్దరికీ కావలిసినవన్నీ సమకూర్చింది. వారికి వండి వడ్డించింది. అందుకు చాలా ఖర్చయ్యేది సుభద్రాచార్యులవారికి. ఆయనకి ఆ మాత్రం డబ్బుంది. దానికి అంతకంటే అవసరమూ లేదు. ఆమె ఏ చర్యనీ ఆయన కాదనలేదు. అభ్యంతర పరచలేదు. దానిని పిచ్చిగా భావించలేదు. వికారంగా వారించలేదు.

ఆమె ఆచరణలో బిడ్డల్ని ఆదుకుంటోంది. ఆయన ఆలోచనలో ఆ పని చేశాడు. మరొక విచిత్రమైన స్థాయిలో ఆ దంపతులిద్దరూ ఆ కలని పంచుకున్నారు.

ఇప్పుడిప్పుడు స్నానం చేస్తే శరీరం ఎదురు తిరుగుతోంది వరదమ్మకి. ఆ తర్వాత గంటలకొద్దీ ఊపిరి అందక ఓ రకమైన ఉబ్బసంతో విలవిలలాడేది. ఆ బాధనుంచి విముక్తికి ఆమె పడే ఆత్రుతల్లా మరోసారి స్నానం చేసి సాయంకాలం వంటకి అందుకోవడమే. తాగుడు వల్ల వచ్చే అనారోగ్యన్నుంచి విముక్తికి రెండు మార్గాలున్నాయి. ఒకటి ఆ అలవాటుని మానుకోవడం. రెండు అదే అలవాటుతోనే ఆ రోగాన్ని ఉపశమనపరచడం. ఇది తెలిసి చేసుకునే ఆత్మహత్య.

వరదమ్మ అలా భావించలేదు. కానీ, సాయంకాలం స్నానానికి రాత్రంతా ఆమె పడే బాధ చాలా దయనీయంగా, చూడడానికే భరించరానిదిగా ఉండేది. "తిరుమల దగ్గరికి వెళ్ళిపోదామా, వరదా?" అన్నారు ఆచార్యులగారు ఓసారి. అదేదో అపభ్రంశపు మాటలాగా తుళ్ళిపడింది వరదమ్మ.

"వద్దండి వాడు ఇక్కడే కదా ఉన్నాడు, మనం వెళ్ళడం ఎందుకు?" అన్నది.

ఆండాళ్ళుని చూస్తావా అని ఆచార్యులవారు అడగలేదు. ఆమె జబ్బుని అలా ఇరవై ఎనిమిది నెలలు పోషించారు సుభదాచార్యులు.

ఆమె వండి వార్చలేని రోజుల్లో తనే చెయ్యి కాల్చుకునేవారు. పొద్దున్నే స్నానం ముగించుకుని కైంకర్యాన్ని సిద్ధం చేసి ఆరాధనకి ఉపక్రమించేవారు. భోజనాన్ని భార్యనోటికి అందించేటప్పుడు వరదమ్మ ఊపిరి కూడదీసుకుని "పిల్లలకి పెట్టారా?" అనేది నవ్వుతూ. తల ఊపేవారు సుభద్రాచార్యులు.

ఆమె మనస్సులోని కలని అపురూపంగా పోషిస్తూ వచ్చారు. ఆమె మరీ మంచం మీంచి లేవలేని సందర్భాల్లో తనే కూతురయి, తడిగుడ్డతో ఒళ్ళంతా తుడిచి, మళ్ళీ ఉతికిన చీర కట్టేవారు. ఆమె మూత్రపురీషాల్ని మంచం దగ్గరే పట్టి బయట పారపోసి వచ్చేవారు. ఆ సందర్భాలలో ఆమె కళ్ళు నిస్సహాయంగా జలపాతాలయ్యేవి.

"నాకోసం - మీకు - మరో జన్మ ఎత్తి మీ రుణం తీర్చుకుంటాను" అని చేతులు జోడించేది.

మరి ఏనాడయినా ఆ మాత్రం చెయ్యడానికి ఆయన కరచరణాలు ఆడకపోతే? అయిదు పిడికిళ్ళ అటుకులు నీళ్ళల్లో వేసి అందులో ఇంత చక్కెర కలిపి ఆమె నోటికి అందించేవారు. తనూ ఇంత చప్పరించేవారు.

రెండు వారాలు ఫోన్ చెయ్యడానికి రాకపోతే పోలా పైడితల్లినాయుడు ఇంటి ప్రాంగణంలోకి వచ్చాడు. పైన చొక్కా తీసి, ఉత్తరీయం నడుంకి చుట్టుకుని దేవాలయంలోకి అడుగు పెట్టినట్టు భక్తిగా వచ్చాడు. ఆచార్యులవారూ, వరదమ్మ ఇద్దరూ రెండు మంచాల మీద పడుకుని ఉన్నారు. ఇద్దరికీ లేచే ఓపిక లేదు. ఇద్దరికీ జ్వరం.

"అయ్యవారూ! అబ్బాయిగారు తమ గురించి రెండు సార్లు ఫోన్ చేశారు" అన్నాడు నాయుడు.

"చూసింది చెప్పకు" అన్నారు ఆచార్యులవారు.

నాయుడికి కళ్ళు తిరిగాయి. "తమకి ఇక్కడేమయినా అయిపోతే అబ్బాయి బెంగెట్టుకుంటారు బాబూ" అన్నాడు.

నవ్వారు ఆచార్లుగారు. "మేం పోతే, ప్రపంచం ఆగిపోదు. ఓపిక ఉన్నప్పుడు వచ్చి మాట్లాడతాను"

అది మొదలు ప్రతిరోజూ అర్ధశేరు గుమ్మపాలు స్వయంగా వచ్చి గుమ్మంలో ఉంచి వెళ్ళేవాడు పోలా పైడి తల్లినాయుడు. ఒక్కోరోజు పెట్టిన పాలు పెట్టినట్టుగానే ఉండిపోయేవి. ఒక్కోరోజు పిల్లి తాగిపోయేది. అక్కడ రోజూ పాలుంటాయని పిల్లి గ్రహించడాన్ని, తాగిపోవడాన్ని నవ్వుతూ గమనించేవారు సుభద్రాచార్యులు.

అలా ఎన్నాళ్ళు? కాలచక్రం ఆ ఇంట్లో ఆగిపోయినట్లనిపించేది. ఆ రెండు శరీరాల్లో ప్రాణం ఉన్నంతకాలం ఆ ఇంటి ప్రాంగణంలో ఘనీభవించినట్టే.

వరదమ్మ ఆయాసంతోనే కూర్చుని బల్లమీద తలపెట్టుకుంటే కాస్త ఉపశమనం కలుగుతున్నట్టు గ్రహించింది.

ఓ రోజు ఆచార్యులవారు లేచేసరికి స్నానంచేసి వంట చేస్తూనే మండుతున్న పొయ్యి ముందు సొమ్మసిల్లిపోయి ఉంది వరదమ్మ.

డాక్టర్ని పిలవడం, మందు తీసుకోవడం ఆచార్యులవారికి ఇష్టంలేదు. ఈ రోగానికి కారణం తమకి తెలుసు. తిరుమల, ఆండాళ్ళు ఈ ఇంట్లో మళ్ళీ తిరగాలి. అమ్మని పలకరించాలి. ఆమె చేతి భోజనాన్ని ఆరగించాలి. అవన్నీ జరిగే పనులు కావు. అందుకనే ఈ రోగం మందులకి లొంగేది కాదు.

ఇప్పుడిప్పుడు తనకి చెప్పలేకుండానే బట్టల్లోనే మూత్రాన్ని చేసేసుకుంటుంది వరదమ్మ. మెల్లగా చీర తప్పించిం పసుపు నీళ్ళతో ఒళ్ళు తుడిచేవాడు. వరదమ్మ ఏడ్చేది.

"వరదా! లేని కొడుకుని నీ కళ్ళముందు కూర్చోబెట్టుకుంటున్నావు. పరమాత్ముని సేవని ఈ సేవలో నేను ఊహించుకోలేనా?" పాపనాశం శివన్ పాటని ఏనాడో బొంగురు పోయిన గొంతుతో అన్నారు.

"ఈ రేడు భువనంగళ్ పడయిత్తవనై
కయివేంది శీరాటి పాలూత్తి తారాట్ట నీ ఎన్నతపం శయదనై!"

(ఏడేడు భవనాల్ని కడుపులో దాచుకున్న గోపాలుడి ఒళ్ళు కడిగి పాలు పట్టి సాకడానికి యశోద ఏం తపం చేసిందో)

వరదమ్మకి ఒళ్ళు బాగాలేదని తెలియగానే ఉవ్వెత్తున వీచే తరంగాలలాగా హితులంతా గుమి కూడారు. జగన్నాథస్వామి ధర్మకర్త బంగార్రాజుగారు ఆవిడని ఆసుపత్రిలో చేరుస్తానంటూ వచ్చారు. పోలా పైడి తల్లినాయుడు ఇంటిముందు కారుని నిలిపి వరండాలో కూర్చున్నాడు. జయవాణి, ఆఖరికి వరహాల శెట్టిగారు కూడా వచ్చారు. పద్మనాభం కబురు వెళ్ళింది. కారు చేయించుకుని వచ్చారు. భీమిలి ఎమ్మెల్యే భూపతిరాజుగారు వచ్చారు.

ఒక్క క్షణం సుభద్రాచార్యులవారు బిత్తరపోయారు. అవసరానికి ఇంతమంది సహాయ సానుభూతులు లభిస్తాయని ఆయన కలలో కూడా ఊహించలేదు.

కె.జి.హెచ్.లో నాలుగురోజులు ఉంచారు వరదమ్మని. ఐ.సి.యులో మంచినీళ్ళు తప్ప ఏమీ ముట్టలేదు వరదమ్మ. ఆవిడని ఏం తీసుకోమని ఒప్పించలేక సెలైన్ పెట్టి, ఆక్సిజన్ ఇచ్చి అప్పటికి ఆయాస్మ నుంచి, గండం నుంచీ తప్పించి ఇంటికి పంపేశారు డాక్టర్లు. ఆ నాలుగయిదు రోజులూ భార్యతోపాటు ఆచార్యులవారు కూడా లంఖణాలు చేశారు. అప్పుడయినా ఆ విషయం తిరుమలకి చెప్పడానికి ఆచార్యులవారు కూడా అంగీకరించలేదు. మరొకరితో అయితే ఆయన్ని సంప్రదించకుండానే ఆ పని చేసేవారేమో కానీ సుభద్రాచార్యుల విషయంలో పైడితల్లినాయుడు కానీ, జయవాణి కానీ ఆ సాహసం చెయ్యలేక పోయారు.

ఓ సాయంకాలం రిక్షా దిగి వీధి గుమ్మంలో నిలబడింది ఆండాళ్ళు. అప్పుడూ కూర్మయ్య రావడానికి సాహసించలేదు. గుమ్మం బయట కూతుర్ని చూశారు సుభద్రాచార్యులు. ఆమె చిన్నతనంలో గుండెలమీద కూర్చుని ఆడుకున్న తులసిమాల వణికింది. దానికిందనున్న గుండె ఆ ఆర్ధ్రతని తట్టుకోలేకపోయింది.

"అమ్మ ఎలా ఉంది నాన్నా?" అంది గుమ్మం బయట కూర్చునే.

ఆ పిలుపుకి కళ్ళిప్పింది వరదమ్మ. ఆయాసంతో కళ్ళల్లోకి తన్నిన రక్తం మరింత ఎరుపయి వాటిముందు నీటి తెరలు అవ్యాహతంగా జాలువారాయి.

సుభద్రాచార్యులు మొదటిసారిగా తండ్రి అయిపోయాడు. మొదటిసారిగా తరతరాల సంప్రదాయ పటిమ కన్నతండ్రి ప్రేమని జయించలేకపోయింది. "రా అమ్మా, అమ్మ దగ్గర కూర్చో" అన్నాడు.

వరదమ్మ కళ్ళల్లో వెంటనే భయం కనిపించింది. ఇది తరతరాల సంప్రదాయపు అలవాటుని జయించలేని కన్నతల్లి పిరికితనం.

ఇద్దరినీ తెలుసు అండాళ్ళుకి. "వద్దు నాన్నా! అమ్మని చూసిపోవాలని వచ్చాను. అన్నయ్యకి ఫోన్ చేయించండి. ఈ సమయంలో అన్నయ్యయినా ఇక్కడ ఉండాలి. మీరయినా అన్నయ్య దగ్గర ఉండాలి" అంది.

ఎక్కువసేపు ఉన్నకొద్దీ వాళ్ళలో బాధనే రేపగలుగుతుంది. నల్ల ద్రాక్షపళ్ళ పొట్లాన్ని ఇంటి గుమ్మంలోకి తోసి వెళ్ళిపోయింది ఆండాళ్ళు.

ఆచార్యులవారు స్వయంగా ద్రాక్షపళ్ళు అందుకున్నారు. రెండు ద్రాక్షపళ్ళు నోట్లో వేసుకున్నారు. పరంపరాగతంగా వచ్చిన సంప్రదాయ సంక్షోభానికి ఆ రెండు ద్రాక్షపళ్ళూ ముగింపు. అవి ఎంత రుచో.

ఆ రోజంతా ఆ ద్రాక్షపళ్ళనే తిన్నది. ఏ సెలైనూ చెయ్యలేని పని ఆ తల్లి ఆరోగ్యానికి ఆ పళ్ళు ఊతాన్నిచ్చాయి.

వరదమ్మ ఆఖరి ఘడియలు చాలా విచిత్రంగా సాగాయి. రాత్రి ఫలహారాన్ని సుభద్రాచార్యులు తినిపిస్తుంటే బల్లమీద తలపెట్టుకుని ఆయాస పడుతున్న వరదమ్మ మెడలో వేలాడుతున్న మంగళసూత్రాన్ని చూసుకుంది.

"నేను పోయాక వీటిని చెరిపించి నా మనవరాలికి ఉంగరం చేయించండి" అంది.

సుభద్రాచార్యులు నవ్వుకున్నారు.

"మిగతా నగలన్నీ ఎవరికిస్తావు?" అన్నారు నవ్వుతూనే.

"ఇంకెవరికి తిరుమలకే. ఈ పగడాల దండని ఎప్పుడూ కోరికేది ఆండాళ్ళు. దానికి పంపించండి" అంది వరదమ్మ.

చనిపోయేముందు కొందరికి ఏదో సూచన పలికిస్తుందేమో. ఇది చాలా సందర్భాలలో, చాలామంది విషయంలో నిజం.

తెల్లారితే పుష్యబహుళ ఏకాదశి. అంటే వైకుంఠ ఏకాదశి. పోయిన వారంతా శ్రీవారి సన్నిధికే సరాసరి పోవడానికి స్వర్గద్వారాలు తెరుచుకుంటాయంటారు. వరదమ్మ సంకల్ప బలమో, పుణ్య బలమో తెలీదు. ఉదయం 4గంటల 43 నిముషాలకి ఏకాదశి ఘడియలు ప్రవేశిస్తూండగానే మంచం మీదే పువ్వులాగా లేచిపోయింది.

అంతకన్నా విచిత్రమైన విషయం ఆ క్షణంలో తిరుమల పెళ్ళినాటి పట్టుపంచెని ఎప్పుడు లేచి కట్టుకున్నదో కట్టుకుని ఉంది. తిరుమల లాల్చీ తొడుక్కుని ఉంది. అలనాటి పట్టు ఉత్తరీయం ఆమె మెడచుట్టూ ఉంది. నుదుటిన బొట్టూ, జుత్తూ చూస్తే తప్ప పోలికలోనూ, ఆహార్యంలోనూ తిరుమల నిద్రపోతున్నట్టే కనిపించింది. కన్నబిడ్డతో త్వమేవాహం అని భావించిన తర్వాతనే మృత్యువుతో ఆ మాట అనగలిగి ఉంటుంది ఆ తల్లి. అంతవరకూ మృత్యువు కూడా గడగడలాడుతూ ఆ ప్రాంగణంలో నిలబడే ఉంటుంది.

ఆనాడు స్వర్గద్వారాల దగ్గరికి చేరిన మొదటి పుణ్యాత్మురాలు వరదమ్మ.

ఊరు ఊరంతా పేరు పేరునా వచ్చి ఆమె పాదాలకి నమస్కారం చేసి వెళ్ళారు. ఆమె ముఖానికి పసుపూ, కుంకుమా రాసి తరించారు. సుభద్రాచార్యులగారు స్థాణువులాగా బల్లమీద కూర్చుండిపోయారు. దాదాపు 55 సంవత్సరాల స్నేహితురాలు తనని విడిచి పవిత్రంగా, గర్వంగా, ఠీవిగా సెలవు తీసుకుంది.

ఎక్కడో టెలిఫోన్ తీగలు ఈ వార్తని డిట్రాయెట్ దాకా మోసుకుపోతున్నాయి. కాకినాడ నుంచి ఆండాళ్ళు అప్పుడే కారులో బయలుదేరింది.

31

మృత్యువు కొందరికి విముక్తి, కొందరికి విజయం, కొందరికి ముగింపు, కొందరికి అవకాశం. వరదమ్మకి మృత్యువు ఒక స్టేట్‌మెంట్. కొడుకుమీద ఆమె ప్రేమ పరాకాష్ఠ. అది సంకేతం మాత్రం. ఆ తర్వాత ఎన్నో సంవత్సరాలు గడిచినా ఆ మృత్యువు ఒక జ్ఞాపకాలే. అంతకన్నా మరే అవకాశంలేదు. అది ఒక నిర్దుష్టమైన స్టేట్‌మెంట్.

ఆ తల్లి కొడుకుని ఎంతగా ప్రేమిస్తోంది? చెప్పగలిగినంత భాష, భావనా పటిమ ఆమె దగ్గరలేదు. నిజానికి అవసరంలేదు. మృత్యువుని ఓ పండగలా ఆహ్వానించేంత ప్రేమిస్తుంది ఆ తల్లి.

కానీ ఆ కొడుకు ఎక్కడ? పిట్స్‌బర్గ్‌లో కాన్ఫరెన్స్ నుంచి హోటల్ గదికి వచ్చి నిద్రపట్టక నానాయాతనా పడుతున్న తిరుమలకి ఫోన్‌లో పాడ్ చెప్పింది. తిరుమలకి వెయ్యివోల్టుల షాక్ తగిలినట్టు తుళ్ళిపడి కూర్చున్నాడు. ఇప్పటికి రాత్రి పదకొండు. కిటికీలోంచి బయటికి చూశాడు. సెప్టెంబరు చలి గజగజలాడిస్తోంది వెంటనే ఎయిర్‌పోర్టుకి ఫోన్ చేశాడు. ఉదయమే అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం ఆరుగంటలకి ఉంది న్యూయార్క్ చేరడానికి. అప్పటికప్పుడు ఫోన్‌లోనే అన్ని ఏర్పాట్లు చేసేసుకున్నాడు ప్రయాణానికి.

పాడ్ వస్తుందా? ప్రస్తుతం రాలేదు. రెండో సెమిస్టరు పరీక్షలున్నాయి నాన్సీకి.

తనకి తెలీని దశలో పుట్టిన మొదటి క్షణాలలో కాదు ఇప్పుడు శాశ్వతంగా అంబెలికల్ కార్డ్ తెగిపోయినట్టనిపించింది. పన్నెండు, ఒకటి, రెండు, మూడు గంటలు లెక్కపెడుతున్నాడు. మంచుకురిసే పల్చటి తెలివెన్నెలలో పసితనమంతా టెలీఫిలింలాగా తిరిగింది.

ఎక్కడ శ్రీకూర్మం, ఎక్కడ పద్మనాభం, ఎక్కడ పిట్స్‌బర్గ్. జ్ఞాపకాల దారాలు ఎంత పొడుగు ఆత్మీయతల పీటముళ్ళు ఎంత బలమైనవి. ఆ తల్లి సమక్షంలో ఆ క్షణంలో వాలిపోవడానికి మనస్సు పడే యాతన. హోటల్ కిటికీలో కూర్చుని "అమ్మా!" అంటూ భోరుమన్నాడు. ఓదార్చడానికి ఎవరూ లేరు. బంగారపు జీవితాన్ని దాదాపు 30 సంవత్సరాలపాటు పంచి ఇచ్చిన అమెరికా ఆ ఒక్క

విలువయిన క్షణాన్నీ ఇవ్వలేకపోతోంది. ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళడానికి క్షణాలు లెక్కపెట్టాడు. మూడు గంటలకే సూట్ వేసుకున్నాడు. తను బయలుదేరి వస్తున్నట్టు పోలా పైడితల్లి నాయుడు ఫోన్‌కి సమాచారం అందింది. ఒక్కసారి తండ్రితో మాట్లాడగలిగితే?

సుభద్రాచార్యుల వారెక్కడ?

భార్యపక్కనే కూర్చుని వరదమ్మ చెవిలో తిరుమంగై ఆళ్వారుల దివ్యసూక్తి శ్రీ మాలికా స్తుతి చదువుతున్నారు. శెలవు తీసుకున్న జీవుని తరింపజేయడానికి చైతన్యమూర్తి అయిన జీవుడు పడే వేదన అది.

ఫోన్ దగ్గరికి పిలవడానికి సాహసించలేకపోయాడు తిరుమల. గంట ముందే హోటల్ మెట్లు దిగిపోయాడు తిరుమల. అప్పటికి అతనికి అర్థమైన విషయం రాత్రి కురిసిన మంచుకు కార్లన్నీ కదపడానికి వీలులేకుండా బిగుసుకుపోయాయి. పెట్రోలు కదలలేదు. ఇంజను పలకలేదు. కంగారు పడిపోయాడు. ఆ సమయంలో బయట పిట్ట మనిషికూడా లేరు. ఎవరి సహాయమూ అడిగే అవకాశం లేదు. సమయం గడిచిపోతోంది. కారు కింద న్యూస్ పేపరు చింపి మంట పెట్టాడు. ఇంజను వేడెక్కితే కదిలితే తేలిగ్గా 45 నిముషాల ప్రయాణం. ఏం చేసినా కారులో చలనం లేదు. హోటల్‌లోకి పరిగెత్తి సెంట్రీని పిలిచాడు. ఏదో అడవులనుంచి తప్పించుకున్న మనిషిని చూసినట్టు చూశాడు తిరుమలని. ఈ సమయంలో ఎవరూ బయటికి రావాలని ప్రయత్నం చెయ్యరు. సెంట్రీ అడగలేదు. అయినా అమ్మ పోయిందని చెప్పాడు. సెంట్రీ జాలిపడ్డాడు. కానీ కాలు కదపలేదు. హోటల్ కౌంటర్ దగ్గరకి పరిగెత్తి నైట్‌డ్యూటీ అసిస్టెంటు నల్లపిల్ల లిజా మీద కేకలు వేశాడు. వెంటనే మెకానిక్ కావాలన్నాడు. "పోనీ మరో కారు దొరుకుతుందా? ఎంత డబ్బయినా ఇస్తాను" ఇక్కడ 30 సంవత్సరాలు అమెరికాలో గడిపిన జీవితాన్నంతటినీ ఇస్తాను. పూర్ ఫెలో. ఆ అవకాశం ఏనాడో మించిపోయింది. ఈ ప్రయాణంలో విలువ. ఆ సమయంలో తల్లి చచ్చిపోయిన నిస్సహాయత అతన్ని పిచ్చివాడిని చేసింది. కారుని కాలుతో తన్నాడు. కనిపించిన వాళ్ళందరినీ తిట్టాడు. అందరూ అతన్ని అర్థం చేసుకుని అతని తిట్లని భరించారు. అతని తల్లి చచ్చిపోయింది. ఆమె సమక్షానికి తీసుకెళ్ళే విమానం తప్పిపోయింది.

కారు మధ్యాహ్నం పదకొండు గంటలకు కదిలింది. అంతవరకు కప్పు కాఫీకూడా తాగలేదు. కారులో దూకి ఎయిర్‌పోర్టుకి దూసుకుపోయాడు. అక్కడ తెలిసిన విషయం విచిత్రంగా పిట్స్‌బర్గ్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఆ రోజు బయలుదేరగలిగిన ఆఖరి విమానం తిరుమల ఎక్కవలసిందే ఆ తరువాత మంచు వర్షంలో ఎయిర్‌పోర్ట్ రన్‌వే కూరుకుపోయింది.

ఎప్పుడు విమానాలు వెళ్తాయి?

ఏమో? ఎవరికీ తెలియదు.

ఇండియాలో ఈ ముప్పై ఏళ్ళలో అతను రాకపోతే ఆగిపోయేది ఈ ఒక్కపనే. మిగతా ఏ పనీ ఆగదు. తల్లికి సంస్కారం కొడుకు చెయ్యాలి. అది హక్కు. అది శాస్త్రం. అది యోగం. అది సుకృతం. ఆచార్యులవారికి ఆ హక్కు లేదు. పుత్రుడు చేయగా పురుషుడు చూడాలి. అంతే. మృత్యువు సమవర్తి. ఎవరి విషయంలోనూ ఏ పక్షపాతం చూపదు. బ్రతికుండగా మనుషుల్ని దూరంగా నిలిపిన ఆచారాలు, సంప్రదాయాలూ, ఆంక్షలూ అన్నిటినీ మృత్యువు జయిస్తుంది.

శ్మశానంలో వెట్టివాడే పవిత్రమైన అగ్నిసంస్కారానికి సమిధను అందించేది. మృత్యువు విముక్తి. ఆండాళ్ళు మొదటిసారిగా స్వేచ్ఛగా తల్లి శవం మీద పడి భోరుమంది. పెళ్ళి చేసుకున్న క్షణంలోనే తల్లి ఆదరణనీ, స్పర్శని, పలకరింతనీ, కావల్సినంత ఆశించింది ఆ పిల్ల. ప్రాణముండగా తల్లి ఇవ్వలేని ఆ అదృష్టాన్ని మృత్యువు యిచ్చింది. మృత్యువు ప్రేమమూర్తి. ఏడుస్తున్న కొద్దీ ఆండాళ్ళు మనసు తేలికయింది. ఇప్పుడే తల్లికి మరింత దగ్గరైనట్టు అనిపించింది.

మధ్యాహ్నానికి మళ్ళీ టెలిఫోన్‌లో తీగలు కదిలాయి. అమెరికానుంచి తిరుమల రావడం లేదు. మరో నలభై గంటల్లో ఏ పరిస్థితుల్లోనూ రాలేడు. ఆచార్యులవారు నవ్వారు. "వరదా! ఇంత పుణ్యాత్మురాలువి, కొడుకు చేతులమీదుగా వెళ్ళిపోయే ఆ కాస్త పుణ్యం చేసుకోలేదా?" అన్నారు భార్య చెవిలో.

కర్మకాండ ప్రారంభమైంది. ఆచార్యులవారు స్నానం చేసి తడిబట్టతో కూర్చున్నారు. ఎన్నిసార్లు నదిలో తనతో స్నానాలు చేశాడు? ఎక్కడ, తిరుమల? ఆ నాటి కర్మకాండ అంతా తిరుమలది. తను ఆ కొడుక్కి ప్రత్యామ్నాయం. అంతవరకు దగ్గరగా ఉన్న ఆండాళ్ళుని దూరంగా తీసుకుపోయాడు కూర్మయ్య.

ఆ వీధిలో అమ్మవారి ఊరేగింపు కూడా అంత వైభవంగా జరిగివుండదు. అంత ఘనంగా ఏర్పాట్లు చేయించారు పోలా పైడితల్లినాయుడు. ఆ తల్లికి ఎంతమంది ఋణపడిపోయారో. ఇందరి ఋణాన్ని ఆమె ముందు ముందు ఎలా తీర్చుకుంటుందో?

బుల్లిరాజుగారు, బుచ్చియ్యమ్మ, జయవాణి, కైకవశి, నవనీతం, పద్మనాభం ఊరంతా ఆ వీధిలో ఉంది. కానీ అంతమంది మధ్యా సుభద్రాచార్యులవారు ఒంటరి. ఆయన పక్కన ఆ క్షణంలో ఉండాల్సిన ఒకే ఒక వ్యక్తి లేడు. తిరుమల ఏం చేస్తున్నాడు? పిట్స్‌బర్గ్ ఎయిర్‌పోర్టులో ఓ మూల కూర్చుని తల్లిని గుర్తుచేసుకుని ఏడుస్తున్నాడు పసిపిల్లాడిలాగ.

జీవితంలో చాలా అదృష్టాలు ప్రపంచంలో ఎక్కడ వెదుక్కున్నా దొరుకుతాయి. జర్మనీలో, ఇంగ్లండులో, అమెరికాలో, సింగపూర్‌లో ఎక్కడయినా సరే. కానీ జీవితంలో విలువైన బాంధవ్యాల గుర్తులు కావాలంటే మనం మళ్ళీ ఆ రూట్స్ దగ్గరకే పోవాలి.

ప్రఖ్యాత షెహనాయ్ విద్వాంసుడు బిస్మిల్లాఖాన్ కాశీవాసి. ఆయన్ని అమెరికాలో నివాసం ఏర్పరచుకోవడానికి ఆహ్వానించారట. అన్నీ సమకూరుస్తామన్నారట. "అన్నీ యిస్తారు సరే, అక్కడ గంగానదిని ఇవ్వగలరా?" అన్నారట ఆయన.

అమెరికాలో అన్నీ దొరుకుతాయి. దూరమైన తల్లి ఆఖరిచూపు దొరకదు. మనసారా భోరుమనడానికి దుఃఖమనే ఐశ్వర్యం దొరకదు. ఇవి పోగొట్టుకున్నప్పుడే గుర్తుకొచ్చే విషయాలు కాశీ విశ్వేశ్వరుడికి కూతవేటు దూరంలో బతికే మహా సంగీత విద్వాంసుడికి గంగమ్మ తల్లి - మరి దేనితోనూ సరితూచలేని అలౌకికమైన అనుభూతి. ఆయన ఇప్పటికీ ఓ మారుమూల గల్లీలో నులకమంచం మీద కూర్చుని 'రామ్‌కలీ' పాడుకుంటూనే ఉన్నాడు ఆనందంగా. ఆ ఆనందాన్ని క్లింటన్ దొరగారి వైట్‌హౌస్ జీవితం ఇవ్వదు.

మరో 48 గంటల తర్వాత న్యూయార్క్ చేరాడు తిరుమల. ఈ 48 గంటలూ పిచ్చివాడిలాగా ఇండియా ఎలా చేరాలి? అన్న ఒక్క ప్రశ్ననీ పార్కింగ్ అసిస్టెంట్ దగ్గర్నుంచీ, లుఫ్తాంసా జనరల్ మేనేజర్ దాకా అడిగాడు. ఏభైసార్లు ఇండియా మాట్లాడాడు. వందసార్లు పాడ్‌ని పలకరించాడు. ఇక్కడ జరిగిందంతా రాఘువాచారిగారు చెప్తూనే ఉన్నారు.

ఇండియా ఎలా చేరాలని తిరుమల ఎవరినైనా అడగడం మరిచిపోయాడు. వాక్యం చివరికి వచ్చేసరికి భోరుమంటున్నాడు. అందరూ షాక్ అయారు. తిరుమల విచిత్రమైన 'డిలీరియం'లో పడిపోయాడు. చివరికి నైగేరియన్ ఎయిర్‌లైన్స్‌లో ఆఫ్రికా వచ్చి ఎమిరేట్స్ విమానంలో ఢిల్లీ చేరాడు. అక్కడినుంచి హైదరాబాదు. అక్కడినుంచి విశాఖపట్నానికి ఆ రోజు విమానంలేదు. టాక్సీ మాట్లాడుకుని అందులో కూలబడిపోయాడు.

సుభద్రాచార్యులవారు నాలుగోరోజు కర్మకాండకి వెళ్ళినప్పుడు వచ్చాడు తిరుమల. వరదమ్మకి సరైన ఫోటో ఏనాడూ ఎవరూ తీయలేదు. తను అమెరికానుంచి వచ్చిన కొత్తలో ఆండాళ్ళుని ఎత్తుకున్న ఫోటో ఒకటి తీశాడు. దాన్ని గుమ్మంలో చూడగానే కుప్పలాగా కూలిపోయాడు. ఆచార్యులవారు ఇంట్లో లేరప్పుడు. నవనీతం ఉన్నది. మాసిన గెడ్డంతో ఇరవైరోజులు జబ్బు, లంఖణాలు చేసిన మనిషి ఎలా ఉంటాడు?

తిరుమలని చూడగానే కంగారు పడిపోయింది నవనీతం. "చినబాబూ" అంది.

ఊబిలో కూరుకుపోతున్న వాడికి ఊతం దొరికినట్టు ఆమెను పొదివిపట్టుకుని పసిబిడ్డలాగా బావురుమన్నాడు.

ఆచార్యులవారు మరో గంటకి తడిబట్టలతో వచ్చారు. వరండాలో తిరుమలని చూశారు. మొదటిసారిగా ఆయన గుండె వణికింది. "ఆఖరి క్షణాల్లో అమ్మ నువ్వే వెళ్ళిపోయిందిరా, చిన్నా!" అన్నారు. అలానే స్థంభానికి చేరబడి దుఃఖం లోంచి బయటపడడానికి ద్వయమంత్రాన్ని ఆసరా చేసుకున్నారు ఆచార్లుగారు.

మిగతా అయిదురోజులూ శ్రాద్ధ విధిని కొడుకుతో జరిపించారు సుభద్రాచార్యులు. ఇద్దరూ కలిసి వెళ్ళి గోదావరిలో వరదమ్మ అస్థికల్ని నిమజ్జనం చేశారు. సపైండీకరణం పూర్తయింది. దానాలు ఘనంగా ఘనాతి ఘనంగా చేశాడు తిరుమల. అమ్మ పేరు చెప్పి గోమాతని లేదూడని సుబ్రహ్మణ్యుడి చేతిలో పెడుతుంటే "మీ అమ్మ పున్నామనరకం సుగమంగా దాటుతుంది బాబూ" అన్నాడు ఆశీర్వదిస్తూ. అదేమిటో తిరుమలకి తెలియదు. అమ్మ ఇంకా దూరమైపోతోంది. కళ్ళముందు తెరలు కట్టాయి.

ఓ రోజు ఉదయమే బయలుదేరి పద్మనాభం వెళ్ళి తండ్రితో స్నానం చేసి గోస్తనీతీరం, కుంతీమాధవస్వామి ఆలయం, ప్రస్తుతం పాడుపడిన పాత ఇల్లు చూశాడు. ఇంటిముందు కుంకుడు చెట్టు నీడలో కూర్చుని చిన్నపాటి జ్ఞాపకాలన్నీ వల్లెవేసుకున్నాడు.

వైకుంఠ సమారాధనకి దూరమైన వాళ్ళ పంక్తుల్ని వేరు చేసి అధరువుల్లో ఏలోటూ చెయ్యకుండా విందు చేశారు.

అయినా ఆ తల్లికి ఏం తక్కువ? మిగిలిన లోటల్లా కొడుక్కే. మరొకసారి జీవించే అవకాశం ఇచ్చి నాలుగుసార్లు డిట్రాయిట్‌లో లక్షల ఉద్యోగం ఇస్తే సమయానికి తల్లి సమక్షంలో ఉండగలిగే ఆ తృప్తినీ, ఆ క్షణాల్నీ నష్టపోతాడా?

ఏమో? ఈ ప్రశ్నకి తిరుమలనీ, తిరుమలలాంటి ఏ నేరమూ చెయ్యని వేలాదిమందినీ అడగాలి.

## 32

భార్య అర్ధాంగి. శరీరంలో సగభాగం. జీవితంలో అయితే ఇంకా ఎక్కువ భాగమే. అర్ధనారీశ్వరుడి భావనకి మూలం ఇదే భార్యలేని జీవితం సంపూర్ణం కాదు. మగాడు ఏ పనికైనా అనర్హుడే మోడులాగా జీవించడానికి తప్ప. ప్రజాభిప్రాయానికి తలవంచి భార్యని అడవులకి పంపిన శ్రీరామచంద్రుడి వంటి ఏకపత్నీవ్రతుడు కూడా పాత పెళ్ళాన్ని ఏదో రూపంలో పునరుద్దరించుకోవలసి వచ్చింది. కాంచన సీతని పక్కన ఉంచుకునే అశ్వమేధం చేశాడు. లేకపోతే పురుషుడికి ఆ అధికారం లేదు.

లౌకిక, సామాజిక కర్మకాండకే కాదు, పారమార్థిక సాధనకు సహధర్మచారిణి అగత్యం ఉంది. భార్యలేనిదే ఏ పితృకర్మకైనా పురుషుడు అనర్హుడు. అందుకనే శారీరకమైన లౌక్యం కోసం కాక, ధర్మార్థ పరిరక్షణకే పురుషుడు పూర్వపు రోజుల్లో రెండో పెళ్ళికి సిద్ధపడింది.

వరదమ్మ లేకపోయాక సుభద్రాచార్యులవారి కథకి కాళ్ళూ చేతులు లేవు. ఏనాడూ అమెరికాకి వెళ్ళడం ఆయనకి ఇష్టంలేదు. ఇప్పుడిక దృష్టి కూడా అటు పోలేదు. రమ్మన్నాడు తిరుమల.

ఆచార్యులవారు నవ్వారు. "ఈ కట్టె లీలావిభూతిని విడిచి నిత్య విభూతిని చేరాలి. దానికి అమెరికా అయినా ఒక్కటే, అయోధ్య అయినా ఒకటే. నీ దారి నా దారీ కలవదు. నన్నిలా ఉండనియ్యి" అన్నారు.

అమ్మ పోవడంతో చాలా బంధాలు తెగిపోయినట్టనిపించింది తిరుమలకి. రెండు తరల్ అమధ్య అందమైన వంతెనె స్త్రీమూర్తి. తండ్రిని ఒప్పించడం తిరుమలకి తెలీదు. నిరాశతోనే విమానం ఎక్కాడు. ఎక్కేముందు పరోక్షంగా వందమందికి నాన్నగారిని అప్పగించాడు. అందులో పోలా పైడితల్లి నాయుడు, బుల్లిరాజు, కైకవశి అంతా ఉన్నారు.

పెళ్ళిలో ఆడపిల్లని మెట్టినింటికి అప్పగిస్తూ ఇంట్లో పరిచారికల చేతులకీ పాలు రాసి పిల్ల చేతిని ఉంచుతారు. కొత్త ప్రపంచంలో ఏ ప్రాణి అవసరం ఆమెని ఓదారుస్తుందో, సేద తీరుస్తుందో అని కన్నవారి తపన. అది మెట్టినింటికి వెళ్ళాల్సిన ఆడపిల్ల విషయంలో. ఇక్కడ తిరుమల మెట్టినిల్లు అమెరికా. అక్కడినుంచి తిరిగి వచ్చే అవకాశం లేదు కనుక ఇక్కడ అంపకాల అగత్యం తప్పలేదు.

ఆచార్యులవారికి పెరుమాళ్ళ ఆరాధనకి కైంకర్యాన్ని సిద్ధం చేసుకోవడం కొత్తకాదు. మడిబట్ట ఆరవేసుకోవడం కొత్త. నళినాక్షమాల పెరిగిపోతే నల్లదారంతో అతుకులు వేసుకోవడం కొత్త. తీర్థవటిని చేబూని "వరదా!" అని ఈ ఏభై ఏళ్ళు అలవాటైన పిలుపు పిలిస్తే వరద రాకపోవడం కొత్త.

కొడుకూ, కూతురూ దూరమైనప్పుడు ఆయన జీవితంలో తడుముకోలేదు. మనస్సులో వాళ్ళ ఆత్మీయతను వెదుక్కున్నారు. కానీ ఇప్పుడు ప్రతీ క్షణం ఇల్లాలి జ్ఞాపకాలు అడ్డం పడుతున్నాయి. అలవాటుగా కాల్చిన మూడో రొట్టెకూడా నా సంగతేమిటని అడుగుతోంది. నవ్వుకున్నారు ఆచార్యుల వారు.

జీవితంలో సాయంకాలమూ గడిచిపోయింది. ఇప్పుడిప్పుడు మసకచీకటి ఆవహిస్తోంది. రెండుసార్లు కళ్ళు కనిపించక వసారా తలుపుకి నుదురు కొట్టుకున్నారు. ఒక్కో రోజు ద్వయమంత్రం పఠిస్తూ ఆకలిని మరిచిపోతున్నారు. ఆకలి అవసరాన్ని గుర్తుచేసే సందర్భంలో వంట చేయడం మరిచిన విషయం గుర్తుకొస్తోంది. మంచినీళ్ళు గటగటా తాగి, మళ్ళీ పెరుమాళ్ళ ధ్యానంలో నిమగ్నమవుతున్నారు.

జీవితం లయ తప్పింది. భార్యపోయాక భర్త తన సొంత ఇంట్లోనే పరాయివాడు. తన అవసరాన్ని గుర్తుపెట్టే స్నేహితురాలు లేదు. బయటికి చెప్పలేకపోయినా సుభద్రాచార్యులవారు మరింత అంతర్ముఖులైపోయారు. కొడుకు పలకరింతలకి ఎదురుచూడడం మరిచిపోయారు. చూపుతోపాటు శ్రవణ శక్తి కూడా తగ్గింది ఇప్పుడిప్పుడు. ఆచార్యులవారితో ఆహారాన్ని పంచుకునే ప్రాణి మరొకటి ఆ ఇంట్లో తోడయింది. అది ఓ పిల్లి. ఎక్కువ సందర్భాలలో ఇప్పుడిప్పుడు దాని కడుపే నిండుతోంది. చూసేవారికి ఆయన మంచి చెడ్డలు పరిశీలించే రాఘవాచార్యుల వంటి వారికి ఖాళీగా ఉన్న పాలగ్లాసు, శుభ్రంగా కడిగినట్టున్న రొట్టె పళ్ళెం తృప్తిని కలిగించేవి.

ఇలా ఎంతకాలం? తిరుమల, ఆండాళ్ళు చివరగా వరదమ్మా పోయాక సుభద్రాచార్యులవారు విశాఖపట్నంలో ఏం చేస్తున్నట్టు? ఏం చెయ్యాలో, ఏం చేస్తే తన బాల్య మిత్రుని మనస్సుకి ఉపశమనం కలుగుతుందో తెలీని బుల్లిరాజుగారికి ఈ ప్రశ్నకి సమాధానం తట్టింది. తట్టినదే తడవుగా విశాఖపట్నం పరుగున వచ్చారు. తనతోపాటు ఇన్స్పెక్టరు వడ్లమాని కామేశ్వరరావుని తీసుకొచ్చారు. కామేశ్వరరావు ఎందుకు? విషయాన్ని అరటిపండులా ఒలిచినట్టు చెప్పే సామర్థ్యం కలవాడూ, ఏ సమస్యకైనా అతి సున్నితమైన పరిష్కారాన్ని చూపగలిగినవాడూ కనుక, పైగా ఆచార్యులవారిని ఒప్పించే భాష తన దగ్గర లేదు.

"విశాఖపట్నం వచ్చి చాలా దూరం చేసుకున్నారు మీరు. పిల్లల్నీ భార్యనీ. ప్రయత్నించినా వాళ్ళు ముగ్గురూ తిరిగి రారని మీ మనస్సు ఒప్పుకోవడంలేదు. తిరిగి వస్తారేమోనన్న ఆలోచన ఇక్కడ బలవత్తరంగా ఉంటుంది. పద్మనాభం పోదాం పదండి" అన్నారు బుల్లిరాజుగారు.

నవ్వారు ఆచార్లుగారు "అక్కడ మాత్రం ఏం ఉంది?"

"మీ చిన్నతనం ఉంది. ఆనాటి జ్ఞాపకాలున్నాయి. అంతకు మించి కుంతీ మాధవస్వామి ఉన్నాడు."

స్వామి పేరు వినగానే సుభద్రాచార్యులవారికి కళ్ళనిండా నీళ్ళు నిండాయి. "స్వామికి సేవలు బాగా జరుగుతున్నాయా?" అని పలవరించారు.

"లేదు. మీరు వెళ్ళాక నేనూ అటు వెళ్ళడం మానుకున్నాను. ఇప్పుడున్న అర్చకుడు ఆపద్ధర్మంగా చేస్తున్నాడు. ఓ కుంటుంబాన్ని వీధిన పారెయ్యడం ఇష్టంలేక నేనూ కళ్ళు మూసుకున్నాను" అన్నారు రాజుగారు.

"మీకు చెప్పవలసినవాడిని కాను. జీవితమంతా ఒకేలాగా సాగదు. మనస్సు మథనపడే సమయంలో మనస్సుకి ఉపశమనపరిచే గతంలోకి పారిపోవాలి. ముందుకాలం తక్కువ కనుక" అన్నాడు కామేశ్వరరావు.

నిజాన్ని ఎంత నర్మగర్భంగా చెప్పాడు. సాయంకాలంకూడా దాటిపోతోంది ఈ జీవితానికి. మిగిలిన ఆ కాస్త జీవితం పక్కవాడికీ, తనకి సమస్య కాకుండా చూసుకు వెళ్ళిపోవాలి. చూడాల్సిన వ్యక్తి, ధైర్యాన్నిచ్చే వ్యక్తి ఈ దేశంలో లేడు. మనిషి జీవితాన్ని అతని వానప్రస్థం చెప్తుంది. మధ్య వయస్సులోనే తల్లితండ్రుల్ని ఆఖరి వయస్సుకి నెట్టేసే సంతతి పెరుగుతోంది. నిట్టూర్చారు ఆచార్యులవారు. "పున్నామ నరకం, కొడుకు అవసరం మన పెద్దలు నిర్దేశించింది ఎందుకో తెలుసా రాజుగారూ ఈ కట్టెలోంచి ప్రాణం లేచిపోయాక ఈ కట్టెవల్ల సమాజానికి జరిగే హాని ఎక్కువగా ఉంది. పోయినవాడు చేసుకోలేనిది ఒకే ఒక్కటి మిగిలిపోతోంది. ప్రాణంలేని తన శరీరానికి సంస్కారం. అది అదృష్టం కాదు. బాధ్యత. సమాజం పట్ల బాధ్యత. పోయాక ఏ విధంగానూ చేసుకోలేని ఈ పని ఎవరు చెయ్యగలరు? జన్మనిచ్చిన కొడుకు. దానికి కర్మ సిద్ధాంతంతో వేసిన అందమైన పీటముడి పున్నామనరకం. పోయేవారికి తను పోయాక తనని పెట్టి పోషించిన ఈ గడ్డకి తనవల్ల ఏ కీడూ జరగదన్న నమ్మకం కొడుకు సమక్షం"

అదెలాగూ దక్కని వ్యక్తికి గొప్ప స్నేహితుడికంటే ముఖ్యులు ఎవరున్నారు? ఇప్పుడు అడగందే కళ్ళనిండా నీళ్ళు తిరుగుతున్నాయి ఆచార్యులుగారికి. రాబోయే అంతిమకాలంలో తనకా నమ్మకాన్ని కలిగించగల ఆప్తుడు. తమ ఊరికి ఆహ్వానిస్తున్నాడు. పోయాక జరగాల్సిన సంస్కారం కూడా బతికున్నప్పుడు మనిషి చూడాల్సిన సామాజిక బాధ్యతే.

"వస్తాను రాజుగారూ కానీ పద్మనాభం రాను. ఉండి స్వామిని సేవించుకోలేని స్థితి. పూవులు పూయని చెట్టని తెలిసికూడా పెరట్లో పెంచకండి" అన్నాడు.

మరోమాట మాట్లాడకుండా ఎగిరి గెంతేసి మాయమైపోయారు బుల్లిరాజుగారు. పోగొట్టుకున్న వస్తువు మళ్ళీ దొరికినంత ఆనందపడిపోయారు. ఆ వస్తువుని దక్కించుకునే ప్రయత్నం చెయ్యాలి.

పద్మనాభం ప్రాంతమంతా క్షత్రియులపుట్ట. ఆదరించడంలో ఆశ్రయం ఇవ్వడంలో జన్మతః సంస్కారాన్ని అనూచనంగా అందుకున్న కుటుంబాలు. మాట చెప్పిందే తడవుగా మేమంటే మేమని అంతా ముందుకొచ్చారు. ఆచార్యులవారిపట్ల ఇంత గౌరవ ప్రపత్తులు ఇంతమంది కున్నాయా అని ఆశ్చర్యపోయారు బుల్లిరాజుగారు.

ఆచార్యులవారు ప్రస్తుతం తన పని తను చేసుకునే స్థితిలో ఉన్నారు. అలా ఎక్కువ కాలం ఉండరు. ఆ దశలో ఆయనకన్నీ జరగాలి. జరిపించే పెద్దరికం, దక్షత ఉన్న కుటుంబాలు కావాలి. పాండ్రంగి సాగి మహదేవరాజుగారికి కబురు పంపించారు. విషయం నాలుగు ఊళ్ళలో పాక్కింది. కబురు రాగానే విజయ గర్వంతో బండి కట్టించుకుని పద్మనాభం వచ్చేశారు మహదేవరాజుగారు. తనతోపాటు కరణం గుడిమెళ్ళ సత్యనారాయణగారిని వెంటబెట్టుకు వచ్చారు.

"మీ ఊళ్ళో ఆచార్లుగారిని ఉంచుకోవాలి" అని ఆదేశించారు బుల్లిరాజుగారు.

ఊరిలో మూలవిరాట్టుని ప్రతిష్ట చేసినంతగా పొంగిపోయారు మహదేవరాజుగారు. మరి ఆచార్లుగారి అనుపానులన్నీ ఎవరు చూస్తారు?

"అదిగో వాడు" అన్నారు రాజుగారు గర్వంగా గుమ్మం వైపు చూపిస్తూ.

వెనక మండుతున్న ఎండలో సాతాని గురయ్య ముఖం స్పష్టంగా తెలియలేదు. గురయ్య అయిదున్నర అడుగుల మనిషి. సన్నగా, పంచెకట్టుతో వెలుగుమధ్య కలుపు చారలాగా మరో ప్రపంచం నుంచి వచ్చిన వాడిలాగా కనిపించాడు.

"వీడి ముత్తాతలెప్పుడో మునివారిపేట వచ్చి స్థిరపడ్డారు. నిజానికి మా ముత్తాతగారు దేవుడు రాజుగారు వీళ్ళకి చిన్న ఇనాం ఇచ్చి ఆదరించారని నాన్నగారు చెప్పేవారు. దేవుడు రాజుగారిని పొలంలో పాము కరిస్తే వీడితాత వైద్యం చేసి బతికించాడు. వీడినాన్న ఆ ఇనాంని తగలెట్టేశాడు. వీడు చక్కని మాలిష్ చేస్తాడు. వొంటికి నూనె పట్టించి నదిలో కూర్చోపెట్టి కుంకుళ్ళతో స్నానం చేయిస్తాడు. ములుకుట్ల సదాశివదాసు పాటలు, ఆధ్యాత్మ రామాయణం పాడతాడు. ఏదైనా పని చెపితే అది చెయ్యందే మంచినీళ్ళయినా ముట్టుకోడు. ఆజన్మ బ్రహ్మచారి. అయ్యవారి కాళ్ళదగ్గరే పడి ఉంటాడు" అన్నారు.

లోపలికి వచ్చి సాతాని గురయ్య బుల్లిరాజుగారికి సాష్టాంగ పడిపోయాడు. స్ఫోటకం మచ్చలూ, నుదుట ఎర్రటి నామం, ముందు రెండు పళ్ళు ఊడిపోయాయి. ఏభయ్యో పడిలో ఉన్నాడు. ఎప్పుడూ నవ్వుతూండే ముఖం.

"ఇప్పుడు నమ్మకం కుదిరింది. ఆచార్లుగారిని మీ ఊరిలో ఉంచుతాను. బ్రాహ్మణ వీథిలో మంచి ఇల్లు చూడండి" అన్నారు రాజుగారు.

"ఆ పనీ చేసుకొచ్చాను. యనమండ్ర బుచ్చిరాముడు గారని పంచాయితీ స్కూల్లో తెలుగు పాఠాలు చెప్తారు. ఆయనకి సంతానంలేదు. తాతలు ఇచ్చిన మండువాలోగిలి ఆచార్లుగారికిస్తామన్నారు."

ఆ సాయంకాలమే బుల్లిరాజుగారు, సాగి మహదేవరాజునీ, సాతాని గురయ్యనీ వెంటబెట్టుకుని విశాఖపట్నం బయలుదేరారు. సుభద్రాచార్యులవారిని చాలా సంవత్సరాల క్రిందట కుంతీమాధవస్వామి కార్తీక బహుళ అమావాస్య దీపోత్సవానికి చూశారు మహదేవరాజుగారు. అప్పుడు రాజుగారికి పద్దెనిమిదేళ్ళ వయస్సు. ఆచార్యులవారిని చూసి తండ్రి వీపుమీద చరిస్తే మొదటిసారిగా నమస్కారం చేశారు.

"దారి ఇవ్వండి" అని ఎవరైనా అంటే ఆ రోజుల్లో ఛెళ్ళున చెంప పగలగొట్టే పొగరు ఆయనది.

ఆయన నడిచాకే ఆ దారిన ఎవరైనా నడవాలి. రజోగుణాన్ని నడినెత్తి వరకు కిరీటంలా ధరించిన మనిషి మహదేవరాజు. వయస్సు, అనుభవం సత్వాన్నిచ్చింది. ఇప్పుడు 'రామ' అంటే ఆయనకు కళ్ళు చెమ్మగిల్లుతాయి. కేవలం ఎనిమిదేళ్ళు కాపురం చేసి పూసపాటిరేగ ఆడపడుచు, తన భార్య 'రామ' కేన్సర్‌తో కన్నుమూసింది.

ఆచార్యులవారి రెండు చేతులూ పట్టుకున్నారు మహదేవరాజుగారు. "పోగొట్టుకున్న రాములవారిని మళ్ళీ ఇంటికి తెచ్చుకున్న త్యాగరాజస్వామి ఆనందంలాంటిది నా ఆనందం ఆచార్లుగారూ. మా బుల్లిరాజుని చూసి ఎప్పుడూ ఈర్ష్యపడేవాడిని, ఇద్దరు దేవుళ్ళ రాజు అని. కుంతీ మాధవస్వామినీ, సుభద్రాచార్యుల వారినీ ఊరున నిలుపుకున్నాడాయన ఇన్నాళ్ళకి నాకో దేవుణ్ణి ఇచ్చారు. రండి. మా గుండెల మీద పెట్టుకు మీకు సేవలు చేస్తాము"ంటూ గురయ్యని వారి పాదాల దగ్గర పడేసి "వీడు మీ గరుత్మంతుడు. మీరేం చెప్పినా, ఏం చెయ్యమన్నా 'గగనానికీ, ఇలకూ దూరం' అనడం తెలీని సేవకుడు" అన్నారు మరోసారి త్యాగరాజస్వామిని గుర్తుచేసుకుంటూ .

ఇంత ఆప్యాయత ఏనాటి ఋణం? ఆచార్లుగారు కరిగిపోయారు.

కైకవశి, నవనీతం, సంజీవి, జయవాణి, విక్టోరియా, పోలా పైడితల్లినాయుడు, రాఘవాచార్యులు, గరుడా బంగార్రాజు అంతా రథోత్సవంలో జగన్నాథుడికి అంపకం పెట్టినట్టు బారులు తీరి నిలబడగా వడ్లమాని కామేశ్వరరావు జీపులో ఆఖరి మజిలీకి ఆచార్యులుగారు పయనమయ్యారు.

33

**పాండ్రంగి** బ్రిటిష్‌వారి కాలం నుంచీ మొకాసా గ్రామం. దాదాపు 2000 గడప. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు మాతామహుల గ్రామం. సీతారామ రాజు అక్కడే జన్మించాడు. ఆ రోజుల్లో ఇనాం క్రింద పాండ్రంగి క్షత్రియులకిచ్చారు. సాగి సీతారామరాజు గారి దివాన్గిరీలో మాట అది. 1961 దాకా ఇది ప్రభుత్వం ఆధీనం కాకుండా ఆపారు. 1974లో సెటిల్మెంటు అయింది. ఏనుగుపాలెం, సామాయవలస, మునివాని పేట, పురాపల్లి, బర్లపేట ఈ అయిదు గ్రామాలలో వెయ్యి గడప ఒక ప్రాంతమైంది.

గ్రామం ముందు నుంచి వచ్చినవారికి పాదప్రక్షాళనం చేస్తున్నట్టు గోస్తనీనది. అంతటా మామిడి తోపులు. ఊరిలో ఎక్కడ చీమ చిటుక్కుమన్నా ఊరంతా వినిపిస్తుంది. ఊర్లోకి అడుగుపెట్టగానే ఎడమవేపు బ్రాహ్మలవీధి. ఎనిమిది బ్రాహ్మణ కుటుంబాలు. వేద పఠనం, స్మార్తం చెప్పుకున్న కుటుంబాలు మూడు, మిగతా అయిదు కుటుంబాలు ఉద్యోగాలవారు. నౌడూరివారు, చావలివారు, యనమండ్ర, ధూర్జటి కుటుంబాలు. అందులో యనమండ్ర బుచ్చిరాముడు గారిది తొలినాటి నుంచీ ఉన్న కుటుంబం.

వీధిలో నడుస్తున్నా పరిసరాల బ్రాహ్మణ్యం కొట్టవచ్చినట్టు తెలుస్తూంటుంది. సుభద్రాచార్యులవారిని ఊరిపెద్దలు గోస్తని వరకు వచ్చి పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. ముత్తయిదువలు అయ్యవారికి పాదప్రక్షాళనం చేసి సన్నాయిమేళం ముందు నడవగా బ్రాహ్మణవీథికి నడిపించుకువచ్చారు.

అలనాడు దేశంలో దుర్భిక్షం ముదురుతున్నదంటే ఓ మహానుభావుడి కాలు ఆ దేశంలో మోపితే ఆ దోషం పోతుందని ఋష్యశృంగ మహర్షిని ప్రార్థించి తెచ్చుకున్న సంస్కృతి ఇంకా చచ్చిపోలేదు. ఓ మహానుభావుడి ఆగమనం వ్యవస్థకు మేలు చేస్తుందని నమ్మే చిన్న సమాజం ఆ మూలన ఇంకా ఉన్నది.

వార్ధక్యంలో ఉన్న ఒక్క వ్యక్తి జీవితం అంత కష్టం కానక్కరలేదు. కాని సుభద్రాచార్యుల వంటి ఆచారపరాయణులకు అవి గడ్డురోజులు. అందునా సహధర్మచారిణి దూరమై కన్నవారు కలిసిరాక మనసు గాయపడిన దశ అది.

ఎవరు చెప్పినా వినకుండా తన వంట తనే చేసుకుని జీవనం ప్రారంభించారు. అంతకన్నా సహకరించే మార్గము ఆ గ్రామీణులకు కనిపించలేదు. వారు ఊళ్ళో ఉండటమే పదివేలు. బుల్లిరాజుగారు మధ్యాహ్నం రెండు గంటలకు నిద్రలేచి పద్మనాభం నుంచి బండి కట్టించుకుని పాండ్రంగి వస్తారు. పదిమంది పెద్దలు కూడలిలో మర్రిచెట్టు గట్టుమీద చేరతారు. ఆచార్యులవారు వస్తారు. ఆ రోజు వారేం మాట్లాడితే అదే మహాప్రసాదంగా స్వీకరిస్తారు. మళ్ళీ అయిదు గంటలకు తిరుగుప్రయాణం ఆరున్నరకి భోజనం ముగించి నిద్రకు ఉపక్రమిస్తారు బుల్లిరాజుగారు. ఇప్పటికీ ఆ ప్రాంతాలలో ఏడు గంటలకి ఊరంతా నిద్రపోతుంది. ఎనిమిది గంటలకి రోడ్డుమీద కనిపించేవాడు తిరుగుబోతు క్రిందలెక్క.

ఆ ఊళ్ళో రాజుగారింట్లోనే ఫోనుంది. ఆదివారంలో ఆరురోజులు పనిచెయ్యదు. మిగతా సమయంలో సరిగా వినిపించదు. ఆ రోజుల్లో అమెరికా ఫోన్‌కాల్‌ని పాండ్రంగి దాకా రప్పించగల మొనగాడు డిపార్ట్‌మెంటులో లేడు. అలా గొంతు వినిపిస్తే అదొక అదృష్టంగా భావించాలి.

పాండ్రంగి వచ్చాక తిరుమల పలకరింతలు సాధ్యంకాక తగ్గిపోయాయి. పదిహేను రోజులకొకసారయినా రాఘవాచారిగారు వచ్చి క్షేమసమాచారాలు కనుక్కుని వెళ్తున్నారు.

తర్వాత జరిగిన పద్నాలుగునెలల్లో కనీసం రెండుసార్లయినా ఇండియాకు రావాలని ప్రయత్నించాడు తిరుమల. కానీ రెండుసార్లూ ఆఫీసు పనుల కారణంగా రాలేకపోయాడు. తల్లిపోయాక చాలా బలమయిన ముడి ఇండియాతో తెగిపోయినట్టనిపించింది. అలాగని

తండ్రిమీద ప్రేమ తక్కువని కాదు. ఆచార్యులవారి స్థితప్రజ్ఞత్వం, నిర్లిప్తత ఆయనచుట్టూ ఏదో గిరి గీశాయి. ఆయన పట్ల అమితమయిన గౌరవం, తల్లి పట్ల ప్రేమతో సరితూగదు. నాన్నగారు ఎలా ఉన్నారు? ఈ ప్రశ్నకి సమాధానాలు రకరకాల మనుషులు చెపుతున్నారు. సంజీవి, రాఘవాచారి, బుల్లిరాజు, ఆఖరికి కూర్మయ్యకూడా. దగ్గరగా ఉండి తండ్రిని సాకాల్సిన వయస్సులో దూరంగా ఉంటూ ఏం చెయ్యాలో తెలీని అవ్యవస్థలో పడిపోయాడు.

ఉన్నట్టుండి బుల్లిరాజుగారికి గుండెపోటు వచ్చింది. ఆరోగ్యాన్ని దెబ్బతీయలేదు గానీ సాయంకాలం వేళలో పాండ్రంగి ప్రయాణానికి అంతరాయం ఏర్పడింది. ఇప్పుడిప్పుడు ఆచార్యులుగారు ఇంటికే పరిమితమైపోయారు. వంట చేసుకోడానికి ఓపిక చాలని రోజుల్లో మంచినీళ్ళు తాగి నిద్రపోతున్నారు. ఇల్లు తుడిచి, కళ్ళాపుజల్లి, పాలు తెచ్చే గురయ్యకూడా పూటల తరబడి భోజనం లేకుండానే ఆచార్లుగారు గడిపెయ్యడం గమనించాడు. సాగి మహాదేవరాజుగారికి ఈ విషయం విన్నవించాడు గురయ్య. ఎంత ఆలోచించినా ఈ సమస్యని ఎలా పరిష్కరించాలో పెద్దలకి బోధపడలేదు. భోజనం చెయ్యలేని పరిస్థితి రోగం. భోజనం చెయ్యని పరిస్థితి మూర్ఖం. భోజనం చెయ్యకూడని పరిస్థితి ఆచారం. కాగా వృద్ధాప్యం, అనాసక్తి, ఆశక్తత అన్నీ ఆచార్యులవారిని క్రుంగదీస్తున్నాయి.

ఎవరయినా ఆయనకి భక్తిగా భోజనం ఏర్పాటు చెయ్యగలరు. కానీ చేసి, ఆయనచేత తినిపించే ధైర్యం ఎవరికీ లేదు.

ఈలోగా సమస్యకి పరిష్కారం అనుకోకుండా కనిపించింది. తగరపు వలస పోస్టాఫీసుకి పోస్టుమాస్టరుగా పనిచేసే ఓ పేద శ్రీ వైష్ణవుల కుటుంబం పాండ్రంగిలో కాపురం పెట్టారని తెలిసింది. పాండ్రంగిలో ఎందుకు? ఆ పోస్టుమాస్టరుగారికి ఆదాయం చాలక. ఆ రోజుల్లో ఇళ్ళని అద్దెకిచ్చుకోవడం పెద్ద అలవాటుగా కాని, అవసరంగా కానీ లేని రోజులు కాగా ఎవరయినా అలా అద్దెకిస్తే అన్నాన్ని అమ్ముకునేవాడిని చూసినట్టు చిన్నచూపు చూసేవారు. పాంథుడికి చల్లనివ్వడం, అవసరానికి ఆశ్రయం ఇవ్వడం ప్రతిఫలాపేక్షతో జరపని రోజులవి. అయితే నౌడూరివారి దొడ్లసావిడికి పెరటి వేపు రెండు గదులు వేరేగా ఉన్నాయి. అవి ఎవరూ ఉండని కారణాన పాడుపడి డిప్ప పెంకు విరిగి జారిపోతోంది. ఆ మాట ఎవరో పోస్టుమాస్టరు పెరియసామికి చెప్పారు. పెరియసామికి సరిగ్గా పదినెలల క్రిందట పెళ్ళయింది.

నాంచారు కాపరానికి వచ్చిన అయిదోనెలలోనే రణస్థలం నుంచి బదిలీ అయింది. అతనికి అంతా కలిపి 52 రూపాయల జీతం.

పాండ్రంగిలో విషయం తెలియగానే పరుగున వచ్చాడు నౌడూరి వారింటికి. నౌడూరి లక్ష్మణస్వామిగారు తమ ఇంట్లో గదుల విషయం తగరపు వలసదాకా పాక్కినందున ఆశ్చర్యపోయారు. పైగా ఆయన షాక్ అయిన విషయం పెరియసామి ఆ గదులకి అద్దె ఇస్తాననడం. అడిగిందే తడవుగా ఇచ్చేద్దామనుకున్నాడాయన. తీరా ఎనిమిది రూపాయలు ఇస్తాననగానే దిమ్మెరపోయాడు.

ఆ విధంగా పెరియసామి మకాం పాండ్రంగిలో కుదిరింది. కొత్త పెళ్ళాంతో గొడ్లచావిడి పక్కన కాపురం పెట్టాడు. రోజూ పాండ్రంగి నుంచి కాలినడకన తగరపు వలస వచ్చిపోయేవాడు.

ఈ విషయం తెలిసిన సాగి మహదేవరాజుగారు మరో ముగ్గురు పెద్దల్ని వెంటబెట్టుకుని నౌడూరివారి పెరడుకి వచ్చారు. అందర్నీ చూసి నివ్వెరపోయారు పెరియస్వామి, నాంచారు. వారిద్దరూ సుభద్రాచార్యులవారి గురించి విన్నారు. నిజానికి కాపురం పెట్టిన మర్నాడే ఇద్దరూ వెళ్ళి ఆచార్లవారికి సాష్టాంగపడి వచ్చారు.

"ఆచార్లుగారు తన పని తాను చేసుకోలేకపోతున్నారు. పై పనులు మా గురయ్య చేస్తాడు. మాకు చేతకానిదీ, చేసినా చెల్లనిదీ ఒకటుంది. వారి భోజనం. అది మీరు ఏర్పాటు చెయ్యాలి" అన్నారు మహదేవరాజుగారు చెప్పలేక చెప్పలేక.

మహదానందపడిపోయారు దంపతులిద్దరూ. అంతా కలిసి ఆచార్యులవారి దగ్గరికి వచ్చారు.

పెరియసామి పంచె ధోవతి కట్టి, నాంచారు మడిసార పట్టుచీర కట్టుకుని ఆచార్యులవారికి ప్రణామం చేశారు. పెరియస్వామి శ్రీ వేదాన దేశికుల న్యాసతిలకంలోని శ్లోకాలు వచ్చిన మేరకు చదివాడు. ఆచార్యులవారి ముఖంలో ఆనందం తాండవించింది. ఆ విధంగా పరిక్షలో ఆ దంపతులిద్దరూ మార్కులు కొట్టేశారు.

"స్వామీ ఈ తల్లి మడిబట్టతో తమకు వంటచేసి భోజనం పంపుతుంది. దాన్ని స్వీకరించి మమ్మల్ని అనుగ్రహించండి" అన్నారు మహదేవరాజుగారు.

నాంచారు ముక్కుపచ్చలారని పిల్ల. మెడలో ఎర్రటి పూసలదండ తప్ప ఏమీ లేదు. పేదరికంలో మేలిమి వజ్రంలాగా మెరుస్తోంది. పచ్చటి పసుపుతో మెరిసే ఆమె కళ్ళను చూస్తూ "నీ పేరేమిటి?" అనడిగారు.

"నాంచారు" అంది.

దగ్గరికి పిలిచారు. తలగడ కిందనుంచి వరదమ్మ పగడాల దండ తీసి ఆ పిల్ల మెడలో వేశారు. ఆ పిల్ల బుగ్గలు తడివి "నాకేం చేసి పెడతావు?" అనడిగారు.

నాంచారు ఆనందంతో వణికిపోయింది. "మీరేం కోరినా చేస్తాను సామీ" అంది కాళ్ళమీద పడి.

"వంకాయ కాల్చి పులుసు పచ్చడి చేసి పట్టుకురా. నీ చేత్తో పెడితే తింటాను" అన్నారు.

అక్కడున్న అందరి కళ్ళూ ఆనందంతో చెమర్చాయి. ఆచార్లుగారికి ఆ పిల్ల నిలబడిన చోట వందమంది ఆండాళ్ళు కనిపించారు. కంటతడికి అంత శక్తి ఉంది.

అది మొదలు మరో పదినెలలపాటు అయ్యవారికి ఆరగింపు నాంచారు చేతులమీదుగానే. ఉదయమే సూర్యోదయాత్పూర్వం ఆచార్లుగారింటికి పెరియసామి, నాంచారు వస్తారు. ఇద్దరూ స్నానం చేస్తారు. పెరియసామి తిరుప్పల్లాండు చదువుతాడు. ఆరున్నర అయేసరికి వంట పూర్తిచేసి ఇద్దరూ సెలవు తీసుకుంటారు.

మూడోరోజుకి విశాఖపట్నం నుంచి మంచి ర్యాలీ సైకిలు తెప్పించారు మహదేవరాజుగారు. గురయ్య పోస్టుమాస్టరుగారి ఇంటిముందుంచాడు. "రాజుగారు ఇచ్చి రమ్మన్నారు" అన్నాడు. ఆ విధంగా పాండ్రంగి నుంచి తగరపు వలసకి పెరియసామి ప్రయాణాన్ని సుగమం చేశారు.

పది నెలల తర్వాత ఏముంది? నాంచారు నీళ్ళుపోసుకుంది. రోజు రోజుకీ బరువెక్కే నాంచారుని గమనించారు సుభద్రాచార్యులవారు. ఈ పదినెలల్లో ఆయన ఆరోగ్యం మెరుగయింది. రోజూ ఆ దంపతుల రాకకు ఎదురుచూసేవారు. ఈ దశలో జడ భరతుడికి లేడిపిల్ల మీదలాంటి మమకారం ఆ దంపతుల మీద ఏర్పడింది వారికి.

రానురానూ ఈడిగిలపడుతున్న నాంచారుని చూసి "నీకెవరూ లేరా తల్లీ?" అన్నారు.

"ముఖలింగంలో మేనమామ ఉన్నాడు."

"అమ్మాయిని దింపిరా రేపట్నుంచి నాకు భోజనం వద్దు" అన్నారు ఆచార్యులవారు.

ఆయన ఆజ్ఞని శిరోధార్యంగా భావించాడు పెరియసామి. పురిటికి వెళ్తూ సుభద్రాచార్యులవారికి ప్రణామం చేసింది నాంచారు.

"కొడుకుని ఎత్తుకురా అమ్మా" అని పెరియసామి వేపు తిరిగి "కొడుక్కి ఏం పేరు పెడతావు?" అన్నారు.

"సుభద్రాచార్యులు."

నవ్వారు.

"మా తాతగారు పరమనిష్ఠాగరిష్ఠులు. ఆయన పేరు కుంతీనాథాచార్యులు" జ్ఞాపకాల తెర కళ్ళముందు జారింది.

మమకారం పెద్ద కారాగారం. ఆకలి తీరడానికి అన్నం పెట్టడం పెద్ద ఋణం. పుట్టబోయే బిడ్డకీ, పూర్వీకుల పెద్దరికానికీ పీటముడులు వేస్తోంది మమకారం. నాంచారు పురిటికి వెళ్ళిపోయింది.

భార్యని పుట్టింట్లో విడిచి మూడోరోజునే తిరిగి వచ్చాడు పెరియసామి. యథాప్రకారం ఉదయమే వచ్చి స్వయంగా వంటచేసి ఆచార్యులవారికి నమస్కరించి సెలవు తీసుకునేవాడు. మళ్ళీ నిరాసక్తులయారు ఆచార్లుగారు. ఈ దశలో నాంచారు పాత్ర మరో బంగారు కలని మిగిల్చిపోయింది. ఆ తర్వాత భోజనం మీదా, పెరియసామి మీదా ఎక్కువ ఆసక్తి చూపలేదు. ఉన్నరోజున తినేవారు. లేనిరోజున అలానే పడుకునేవారు.

పెరియసామీ, ఊరిపెద్దలూ నాంచారు పురుడు పోసుకుని తిరిగి వచ్చే రోజు కోసం ఆతృతగా ఎదురు చూశారు.

అయితే ఆ రోజు రాలేదు. నాంచారు చక్కని కొడుకుని ప్రసవించింది. పెరియసామి పరుగున వెళ్ళి పదకొండోరోజునే అబ్బాయి పుట్టకముందే పెట్టుకున్న పేరుని బియ్యంలో ఖాయం చేసి వచ్చాడు - కుంతీనాథాచార్యులు.

ఆచార్లుగారు ఆనందించారు. మరో మూడునెలలకే నాంచారు పాండ్రంగి రావాలి. నెలకి ఓ రోజు తక్కువ చేసి పంపెయ్యమన్నాడు పెరియసామి. రావడానికి సిద్దపడింది నాంచారు. బిడ్డని ఆచార్లుగారి పాదాల దగ్గర ఉంచి ఆశీర్వాదం తీసుకోవాలని ఆమె ఆతృత.

ఉన్నట్టుండి గరివిడిలో పెద్ద పోస్టాఫీసుకి ప్రమోషన్ మీద బదిలీ చేశారు పెరియసామిని. ఇంత త్వరగా ప్రమోషన్ రావడం ఆశ్చర్యం. వచ్చింది. కాదనలేకపోయాడు. మూటా ముల్లె సర్దుకున్నాడు. ర్యాలీ సైకిలు మహదేవ రాజుగారి ముంగిట్లో స్టాండు వేసి నిలబెట్టాడు.

నవ్వారు రాజుగారు. "నువ్వు మాకు చేసిన ఉపకారానికి అది బహుమతి పంతులూ. మా ఊరి కొడుకుని ఓసారి తీసుకొచ్చి చూపించు. నీ పెళ్ళానికీ, కొడుక్కీ బట్టలు పెట్టి పండగ చేస్తాం" అన్నారు.

ఆచార్లుగారి దగ్గరా సెలవు తీసుకున్నాడు. త్వరలోనే భార్య, కొడుకుతో వస్తానని చెప్పి బయలుదేరాడు పెరియసామి. అంతే. మళ్ళీ జీవితంలో ఒక్కసారైనా ఆచార్లుగారిని చూడడానికి రావడం పడలేదు.

తిరుపతిలో లక్షమంది ఉంటారు. అందులో 90 శాతమైనా ఏడుకొండలవాడిని సేవిస్తూ ఉండివుంటారు. అందులో ఇద్దరైనా జీవితంలో తిరుమలకి వెళ్ళనివారూ, వెళ్ళలేనివారూ, వెళ్ళడం కుదరనివారూ ఉంటారు. ఎందుకని? మనస్సు లేకనా భక్తిలేకనా? అవకాశం రాకనా? ఢిల్లీనుంచి రాలేకపోవచ్చు. కానీ తిరుపతి నుంచి తిరుమలకు వెళ్ళడం?

జీవితమంతా సుభద్రాచార్యులవారు ఆ దంపతులకు జ్ఞాపకం వస్తూనే ఉన్నారు. కొడుకుని 'కుంతీ' అని పిలుచుకుంటున్నారు కనక. కానీ రెండు వందల మైళ్ళ ప్రయాణాన్ని రాబోయే రెండేళ్ళలో చెయ్యలేకపోయారు. రెండేళ్ళ తర్వాత? ఆ అవకాశం దానంతటదే చెయ్యిజారిపోయింది.

అది దైవికం. అంతే. అంతకన్నా మరో కారణం కనిపించదు.

సుభద్రాచార్యుల వారి సమస్య మళ్ళీ మొదటికొచ్చింది. ఆపద్ధర్మంగా అవలంబించినా తప్పులేని శుక్రనీతి ఒకటి ఉంది. ఒక ప్రాణాన్ని నిలబెట్టాల్సిన తరుణంలో మానవతా దృక్పథంతో ఆ సమస్యని పరిష్కరించినా తప్పులేదు. ఆచారాన్ని ఆ మాత్రం వెనక్కి నెట్టవచ్చు.

పాండ్రంగిలో ఎవరైనా లేక అందరూ ఆనందంగా ఆచార్యులవారికి ఆ మాత్రం ఆహారాన్ని సమకూర్చగలరు.

ఆచార్యులవారు ఇప్పుడిప్పుడు ఎక్కువసేపు మగతలో ఉంటున్నారు. మాటకూడా బలహీనమైంది. క్రమంగా శరీరం ఆర్చుకుపోతోంది. జీవలక్షణాన్ని కోల్పోయిన చెట్టు క్రమంగా ఎండుకొచ్చినట్టు ఆ కట్టె ఆర్చుకుపోతోంది. ఇప్పట్లో కావలసిన ఆహారం కూడా అంతంతమాత్రం.

ఒక జీవితకాలం అలవాటుని పెదాలు పదే పదే వల్లెవేస్తున్నాయి. శ్రీమన్నారాయణుడు ఆయన పెదాలమీద అనునిత్యం కొలువు తీర్చాడు.

''అబ్బాయితో మాట్లాడతారా ఆచార్లుగారూ?'' అని అడిగారు మహదేవరాజుగారు.

తల అడ్డంగా తిప్పారు.

''కొడుకు దగ్గరికి పంపించమంటారా?''

నవ్వారు ఆచార్లుగారు.

''బాబుగారిని పిలిపించమంటారా?''

మళ్ళీ తల అడ్డంగా తిప్పారు. ఏమయినా బుల్లిరాజుగారు తిరుమలతో ఒసారి మాట్లాడారు. స్టాక్ హోంలో కొత్త ప్లాంటు ప్రారంభానికి ఎక్కువగా ఆ దేశానికి వెళ్ళివస్తున్నాడు తిరుమల. ఆయన ఫోన్ నంబర్లు, అడ్రసు అన్నీ మారిపోయాయి.

''నాన్నగారు బాగున్నారా?'' ఆతృతగా అడిగాడు.

భూగోళానికి అటుపక్క ఉన్న వ్యక్తికి ఎప్పుడూ ఈ ప్రశ్నకి సమాధానం అబద్ధమే అవుతుంది.

''నన్నిప్పుడు రమ్మంటారా?''

ఈ ప్రశ్నకి ఎప్పుడూ సమాధానం దొరకదు ఎవరికీ.

జ్వరం వచ్చింది. ఏ రాజమండ్రి నుంచో ఏలూరు నుంచో అయితే రావాలి ఎంతో కొంత ఉపకారం జరుగుతుంది కనక. కాలిఫోర్నియా నుంచయితే? టైఫాయిడ్ ముదిరింది. నెలరోజులయినా రోగికి సహాయం అవసరం. అనకాపల్లి నుంచయితే పరవాలేదు. ఆమ్‌స్టర్‌డామ్ నుంచయితే? రోగం వచ్చిన వెంటనే ఎవరు రాగలరు? నెలరోజుల సెలవుకి పదినెలలనుంచి ఏర్పాట్లు ప్రారంభించాలి. పక్షవాతం వచ్చింది. అయినా ప్రాణం ఉంది. మనిషి బాగున్నట్టా? బాగోలేనట్టా? చికాగో నుంచి కొడుకు రావాలా? వచ్చి ఏం చేస్తాడు? ఇక్కడ డాక్టర్లున్నారు కదా. ఏదో చికిత్స జరుగుతోంది కదా.

మమకారం బాధ్యతగా తర్జుమా అయి దూరం ప్రతి బంధకమయి రాలేని నిస్సహాయత నలభై టెలిఫోన్ కాల్స్‌గా మారి ఉపశమిస్తుంది. ఈలోగా రోగి బాగుపడితే నిట్టూర్పు. రోగం జయిస్తే నిర్వేదం.

పితృ ఋణానికి పిట్స్‌బర్గ్‌లో ఉద్యోగానికీ చుక్కెదురు. ఏదో ఒకటే దక్కుతుంది. పితృఋణం తీర్చుకోలేకపోయినా తల్లిదండ్రులు సెలవు తీసుకుంటారు. ముగియబోయే రెండు జీవితాల కోసం ముందు తరాల అవకాశాన్ని ఫణంగా పెట్టాలా? అది మనిషిని బట్టి ఉంటుంది. ఆయా వ్యక్తుల విలువల్ని బట్టి ఉంటుంది.

పేదరికంలో చార్లీచాప్లిన్ తన తల్లికి కప్పు టీ ఇవ్వలేకపోయాడు. మతి చలించి, స్థిమితాన్ని కోల్పోయిన తల్లికి ప్రపంచంలో ఎవరూ ఇవ్వలేని ఖరీదయిన నర్సింగ్ హోంలో చికిత్స చేయించాడు. ఆమె పోయాక దురదృష్టవంతుడయిన కొడుకు ఖరీదయిన అంత్యక్రియలు మాత్రం చెయ్యగలిగాడు.

సాతాని గురయ్య మహదేవరాజుగారి ముందు చేతులు జోడించాడు. ''అయ్యా! తమకి అభ్యంతరం లేకపోతే అయ్యవారికి నా చేతుల్తో వంట చేసిపెడతాను''

మహాదేవరాజుగారు ఒక్క క్షణమే తటపటాయించారు. వెంటనే నిర్ణయం తీసుకున్నారు.

''మా పెరటి వేపు గదిలో వంట చెయ్యి. ఎవరు చేస్తున్నారని ఆచార్యులవారు అడిగితే చెప్పకు. ఆ పాపమేదయినా ఉంటే నేను భరిస్తాను'' అన్నారు. ఆయన మాటల్లో పెద్దాయన్ని బతికించుకోవాలన్న తాపత్రయమే ఎక్కువగా ఉంది.

అది మొదలు సాతాని గురయ్య బీడీ కాల్చడం మానేశాడు. ఆకూ వక్కా మానుకున్నాడు. ఏకరాత్రం ప్రారంభించాడు. కనీసం గంటసేపయినా తనకి చేతనయిన భాషలోనే దేవుడిని అర్చించాడు. నదిలో నిండారా మునిగి తడిబట్టతోనే వచ్చి నుదుట తిరుచూర్ణం దిద్దుకున్నాడు. ఆ తడిబట్టలతోనే మనస్సులో సుభద్రాచార్యులవారికి నమస్కారం చేసుకుని అత్తెసరు పెట్టాడు.

భక్తిగా అయ్యవారి గదిలో కేరేజీ, పళ్ళెం, నీళ్ళు అమర్చి గుమ్మం బయట కూర్చునేవాడు. తిన్నరోజున ఆచార్లువారు తిన్నారు. లేని రోజున ఆ కేరేజిని అలాగే పక్షులకీ, జంతువులకీ పంచేవాడు.

తిన్నడు మాంసాన్ని పెడితే ఆరగించి ఆశీర్వదించాడు స్వామి. శబరి ఎంగిలిపళ్ళు ఇస్తే పరమ ప్రసాదంగా స్వీకరించి ఆమెని తరింపజేశారు స్వామి. జీవితమంతా శ్రీరంగనాథుడికి చేసిన సేవాతత్పరతకి ఏ మాత్రమూ తీసిపోని శ్రద్ధాసక్తుల్ని సాతాని గురయ్య తన కర్తవ్య నిర్వహణలో చూపించాడు.

అలా 18నెలలు సేవించాడు ఆచార్యులవారిని. ఇన్ని నెలలూ తిరుమల ఇండియాకి రావడం కుదరలేదు.

''నాన్నగారు బాగులేరు బాబూ''

''ఏమయింది?''

ఆ మాట కొడుకుని పరాయివాళ్ళు అడగాలి. ప్రస్తుతం కొడుకు పరాయివాళ్ళని అడుగుతున్నాడు.

''అపస్మారంలో ఉంటున్నారు.''

ఆఖరి ప్రశ్న: ''ప్రాణానికేం ప్రమాదం లేదు కద?''

ఎవరు చెప్తారు సమాధానం ఆ ప్రశ్నకి. దేవుడు తప్ప.

తండ్రి బ్రతికి ఉండడం, తన బాధ్యతని మరి కొన్నాళ్ళు వాయిదా వేసుకోడానికి సాకు. ''ఇదిగో మరో రెండు నెలల్లో వస్తాను''

సమృద్ధిగా ఇండియాకు డాలర్లు వచ్చాయి. విరివిగా ఫోన్లు వచ్చాయి. కారణం తిరుమల చాలా బిజీగా ఉన్నాడు. ఈసారి టోక్యోలో కొత్త ప్లాంటు రెడీ అవుతోంది.

సుభద్రాచార్యులవారు లేచి కూడా కూచోలేకపోతున్నారు. ఆయన తలని వొళ్ళో పెట్టుకుని చెంచాతో బార్లీ నీళ్ళు పట్టాడు గురయ్య. చల్లని పోశాడు. నిమీలితాలయిన కళ్ళని గురయ్య వేపు తిప్పి నిశ్శబ్దంగానే కృతజ్ఞత చెప్పుకున్నారు ఆచార్లుగారు. వందలసార్లు.

పవిత్రంగా దేవతార్చనలో సాలగ్రామానికి అభిషేకం చేసినట్టు ఆచార్లుగారి శరీరాన్ని శుభ్రంచేసి బట్ట కట్టేవాడు. మూత్రాన్ని రెండు చేతుల్తో డబ్బా పట్టుకుపోయించాడు. పంచెలోనే విరేచనం అయిపోతే శరీరాన్ని కడిగి పౌడరు జల్లాడు. పంచెని ఉతికి ఆరేశాడు.

బుల్లిరాజుగారు కూర్మయ్యకి కబురు పెట్టాడు. అదాటుగా ఆండాళ్ళు, కూర్మయ్య పరుగున వచ్చారు. ఎముకలగూడయి మంచానికి అంటుకుపోయిన ఆచార్లుగారిని చూసి ఆండాళ్ళు భోరుమంది. పవిత్రంగా అతి పవిత్రంగా సాతాని గురయ్య సిద్ధం చేసిన బార్లీ జావని రెండు పెదాలు చప్పరించడం చూసింది.

''నాన్నా!'' అన్న పిలుపుని ఆ రెండు కళ్ళూ గుర్తుపట్టాయి. పక్కన నిలబడిన కూర్మయ్యనీ గమనించాయి. దూరం నుంచే సాష్టాంగపడ్డారు కూర్మయ్య.

''అన్నయ్యని పిలిపించమంటారా నాన్నా?'' అంది మంచానికి ఎడంగా నిలబడి.

"వచ్చి వాడేం చేస్తాడు - ఇక్కడ దేవుడు ఉండగా?" అన్నాయి కళ్ళు. పదిరోజులు అక్కడే ఉండి గురయ్యకి ప్రేమగా వంటచేసి పెట్టింది.

"అమ్మా తమరు నాకోసం?" వణికిపోయాడు గురయ్య.

"నువ్వు మా నాన్నని సేవిస్తున్న అదృష్టవంతుడివి. నాకా అదృష్టంలేదు. కనీసం నేను నీకు చేసిపెడితే నాకు తృప్తి."

కూర్మయ్య పదిసార్లయినా అమెరికా ఫోన్ చేసి ఉంటాడు. ఇంటి ఫోన్‌కి బదులు లేదు. ఆఫీసు ఫోన్‌లో అమెరికా గొంతు సమాధానం. "ప్రస్తుతం జర్మనీలో ఉన్నాడు. సమాచారం అందజేస్తాం"

కైకవశి, జయవాణి, రాఘవాచారిగారు అంతా వచ్చిపోతున్నారు. ఎవ్వరూ చెయ్యని, చెయ్యలేని పనిని యజ్ఞంలాగా చేసుకుపోతున్నాడు గురయ్య. ఎప్పుడయినా విచ్చుకునే ఆ పెదాలకి నీళ్ళ తడిని అందిస్తున్నాడు. క్రమంగా మూత్రపురీషాలు నిలిచిపోయాయి.

ప్రాణి ముముక్షువయినా ఆ లోకంతో పూర్తి ఋణం తీరిపోవాలి. అంతకుమించి ఆ కట్టెకు ఈ లోకంలో ఉన్న అందరి ఋణం తీరాలి.

ఆఖరి క్షణాలు కాకపోయినా ఆచార్యులవారి ఆఖరిరోజులు దగ్గరవుతున్నాయని అందరికీ అర్థమయింది. దొరికిన ఫోన్ నంబర్లు పట్టుకుని కనీసం అమెరికాలో ఆరేడు స్థలాలకి సమాచారం అందించారు. రాఘవాచారి కూడా ప్రయత్నం చేశాడు.

అన్నిటికీ మించి ఆఖరి క్షణాలలో కొడుకు సమక్షంలో కన్ను మూయడం తండ్రి ప్రాప్తం. పితృఋణం తీర్చుకోగలగడం యోగం. ఇవి రెండూ ప్రయత్నిస్తే దక్కేవి కావు.

బుల్లిరాజుగారు విశాఖపట్నం నుంచి సద్బ్రాహ్మణులను రప్పించారు. సుభద్రాచార్యుల చెవికి సోకేటట్టుగా శ్రీ కులశేఖరాళ్వారుల దివ్యపాశురగానం చేయించారు. "వేంగడత్తు కోనేరి వాళుం కురుగాయ్ పిరప్పేనే" శ్రీ కులశేఖరాళ్వారులు పరమయోగి. స్వామివారి కోనేటిలో కొంగగానయినా జన్మనియ్యి అని కోరుకున్నారు. తిరుమల గర్భగుడిలో స్వామివారి ముందు గడపని 'కులశేఖరప్పడి' అంటారు. స్వామి దర్శనానికి వచ్చే ప్రతీ భక్తుడి దివ్యపాదరేణువులు తాకితే తన జన్మ తరిస్తుందంటారు శ్రీ కులశేఖరులు.

"అహం కదంబో భూయాసం కుందోవా యమునాతటే" భాగవతంలో ఉద్ధవుడి ఆర్తి. స్వామిసేవకై కడిమిచెట్టుగా ఉండగలిగితే చాలు అని.

ఆచార్లువారి కనురెప్పలు పాశురగానానికి కాస్సేపు రెపరెపలాడాయి. ఒక జీవితకాలం పునీతం చేసిన సంస్కారం ఆ మాత్రం చైతన్యాన్ని ఆ కట్టెలో కలిగించింది.

చైత్ర శుద్ధి విదియ పరాశర భట్టర్ జన్మదినం. అనూరాధా నక్షత్రం. ప్రదోషకాలంలో ఆచార్లవారి శరీరం జలదరించింది ఒక్కసారి. గది బయట కూర్చున్నవాళ్ళంతా తుళ్ళిపడ్డారు. గురయ్య పరుగున వెళ్ళి ఆచార్లుగారి తలని వొడిలో పెట్టుకుని ఆరిపోయిన పెదాలకు తులసినీళ్ళు అద్దాడు. చెమ్మ నోటిలోకి వెళ్ళిందో లేదో కానీ ఆర్ధ్రత ఆ ప్రాణి హృదయం వరకు విద్యుత్తులాగా ప్రవహించి ఉంటుంది.

జన్మనిచ్చిన కొడుకు సమక్షంలో పోని దురదృష్టం సుభద్రాచార్యులవారికి మిగిలిపోయిందేమో కానీ ఏ జన్మలోనో చేసుకున్న సుకృతఫలంగా ఆ పుణ్యపురుషుని ఆఖరి క్షణాలకు తన ఒడిని పట్టే అదృష్టాన్నిచ్చిన ఓ సాతాని కులస్థుని చేతిలో సుభద్రాచార్యులవారి ఆత్మ లీలావిభూతిని చేరుకుంది, దైహికమయిన ఉపాధిని విడిచిపెట్టి.

గురయ్య భోరుమన్నాడు. అందరి కళ్ళూ అశ్రుపూరితాలయ్యాయి. ఆండాళ్ళు గదిలోకి వచ్చి తండ్రికి ప్రణమిల్లే ముందు సాతాని గురయ్య పాదాలకి నమస్కారం చేసింది కృతజ్ఞతతో.

"అయ్యవారి అపరకర్మ అంతా పద్మనాభంలోనే జరగాలి" అన్నారు బుల్లిరాజుగారు ఆవేశంగా. చిన్ననాటినుంచీ కలిసి పెరిగిన చిరకాలమిత్రునికి ఆయన సమర్పించగల శ్రద్ధాంజలి అది.

ఎప్పుడూ మోగని టెలిఫోను ఆ రోజు పాండ్రంగిలో మోగింది. మరో రెండు రోజుల్లో చిన తిరుమలాచార్యులు డెట్రాయిట్ నుంచి ఇండియాకు బయలుదేరుతున్నారని వార్త.

అంత గంభీరమయిన క్షణంలోనూ పక్కున నవ్వేశారు బుల్లిరాజుగారు.

ఎక్కడి ఋణమో? సుభద్రాచార్యులవారికి వియ్యంకుడు రాఘువాచారి తలకొరివి పెట్టారు.

"పన్నెండోరోజుకి పద్మనాభం చుట్టుపక్కల ఊళ్ళన్నీ ఏకమయిపోవాలి. ఆ రోజు ఏ ఇంట్లోనూ పొయ్యి రాజేయకూడదు" అని ఆజ్ఞ ఇచ్చారు బుల్లి రాజుగారు.

1

ఆరోజు పద్మనాభం ఊరు ఊరంతా ఆ ఇంటిముందే ఉంది. పెన్మెత్స వీర నరసింహరాజుగారు తెల్లారకుండానే గోస్తనీనదిలో పాలేళ్ళచేత కుంకుళ్ళతో తలస్నానం చేయించుకుని ఆ ఇంటిముందు కుర్చీ వేయించుకుని కూర్చున్నారు.

ఇవాళ తిరువధ్యయనం.

కథ ప్రారంభం....